శ్రీ

శ్రీకృష్ణాయ నమః.

# ఆంధ్రచరిత్రవిమర్శము.

(నామాంతరము)

# వీరభద్రీయఖండనము.

శ్రీజటప్రోలుసంస్థానము విద్వాంసు అగు

వెల్లాల సదాశివశాస్త్రిగారిచే

వ్రాయఁబడినది.

శారదాంబావిలాస ముద్రాయంత్రమునందు

ముద్రింపఁబడినది.

1913.

చెన్నపురి.

University of Hyderabad
LIBRARY
Acc. No. 29292
Dated 11.9.87
Hyderabad - 500 134.

# విషయసూచిక.


| విషయసంఖ్య. | విషయములు. | పుటసంఖ్య. |
|---|---|---|
| 1. | చేతిరెడ్డి జ్యేష్ఠుండనుట సరిగాదు. | 5–8 |
| 2. | గణపతిదేవునిరాజ్యకాలములో చేతిరెడ్డిమరణించియున్నాఁడనుట తప్పు. | 8–20 |
| 3. | చేతిరెడ్డినిగూర్చి బట్టులసత్యములైనయనేకగాథలు కల్పించినారనుట పొరపాటు. | 20–25 |
| 4. | వెలుగోటివారివంశచరిత్రమునఁ జెవిరెడ్డి వేంకటగిరి ... సంస్థానాధిపతులకు మూలపురుషుఁడని వ్రాయుట సరికాదనునాక్షేప మసంబద్ధము. | 25–32 |
| 5. | చేతిరెడ్డియె బేతాళనాయఁడనుటనుగూర్చి పద్మనాయకచరిత్రాదులలో వ్రాసిన హేతువులు పరస్పరవిరుద్ధము లనుట భ్రమమూలము. | 32–34 |
| 6. | చేతిరెడ్డికిఁ జెవిరెడ్డియని నామములేదనుట నిరాధారము. | 34 |
| 7. | చేతిరెడ్డి పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁడైనబేతాళనాయఁడు కాఁడనుటవ్యర్థప్రతిజ్ఞ. | 35 |
| 8. | దీనిపై వ్రాసినహేతుసప్తకముయొక్క ఖండనము. | 36–81 |
| 9. | చేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడనుట నిర్హేతుకము. | 81–84 |
| 10. | దీనికై వ్రాసినవి హేత్వాభాసంబులేకాని హేతువులు కావు. | 84–96 |
| 11. | పల్నాటియుద్ధము 1182 లో జరిగినదనుట యపసిద్ధాన్తము. | 96–156 |
| 12. | ఆక్షేపసమాధానసంగ్రహము. | 156–160 |
| 13. | వెలమశబ్దార్థనిర్వచనము సరి గాదు. | 161–168 |
| 14. | వెలమలు మిశ్రజాతివారనుట తప్పు. | 163–173 |

| విషయసంఖ్య. | విషయములు. | పుటసంఖ్య. |
| --- | --- | --- |
| 15. | వెలమవారు పల్లవు లనుట సరిగాదు. | 173–176 |
| 16. | వెలమవారు తెలికె తెగలోఁ జేరినా రనుట భ్రమము. | 176–178 |
| 17. | పద్మనాయకులు వెలమలలోనుండి యేర్పడిన వారు కా రనుట తప్పు. | 178–191 |
| 18. | వెలుగోటివారియు రావువారియు వంశచరిత్రములు రావుగారు స్వపక్షసాధకము లని తలంచుట పొరపాటు. | 191–198 |
| 19. | పద్మనాయకచరిత్రములోని పద్యములు రావుగారు స్వసిద్ధాంతమున కనుకూలము లని వ్రాయుట సరిగాదు. | 198–205 |
| 20. | పద్మనాయకులను వర్ణించుట వ్యాహతం బనుట తప్పు. | 205–208 |
| 21. | పద్మజ పద్మనాయక పద్మనాయకకుల శబ్దార్థము రావుగారెఱుంగమి. | 208–214 |
| 22. | పద్మనాయకులు క్షత్త్రియు లని చెప్పుకొన్నా రని దూఱుట సరిగాదు. | 214–216 |
| 23. | కాకతివారు శూద్రు లనుట తప్పు. | 216–227 |
| 24. | పద్మనాయకులు రెడ్లకుఁ బ్రతిఘటించి లేనికులమును సంపాదించుకొన్నా రనుట యనుచితము. | 228–233 |
| 25. | హైహయులు గొల్లవా రని చెప్పఁబడిన ఖండించుట తప్పు. | 233–235 |
| 26. | వల్లభాదత్యాదిబిరుదములు గలవారు తత్తత్కులములుగలవా రనునది స్వకపోలకల్పితము. | 235–240 |
| 27. | దామానాయకాదిచరిత్రములు సందర్భానుసారముగఁ గూర్పఁబడ లేదనుట తప్పు. | 240–253 |
| 28. | ఆక్షేపసమాధానసంగ్రహము. | 253–256 |

శ్రీ ర స్తు.

# వి జ్ఞా ప న ము.

మహాశయులారా! "మానాధీనా మేయసిద్ధిః" అనుటను బట్టి ప్రమేయసిద్ధి ప్రమాణాధీనమైన దనియుఁ బ్రమాణవిరుద్ధంబైన ప్రమేయకల్పనము నిలుచునది కాదనియు మీర లెఱింగినవారలే కదా! ఇట్లుండ నిమధ్యను జిలుకూరువీరభద్రరావుగారు తమయాంధ్రుల చరిత్రమునఁ బ్రమాణవిరుద్ధంబులైన పెక్కువిషయములఁ బ్రకటించియున్నారు. అయ్యవి సామాన్యముగ నెంతవారలకైనను యథార్థములుగఁ దోఁచును. ఇట్టిచరిత్రగ్రంథములను విమర్శించి వాస్తవము నరయువారలు తక్కువ. కాఁబట్టి జనసామాన్యమున కదియే నిజమని నమ్మకము గలుగును. అందువలన సత్యము మఱుఁగుపడును. కావున నిట్టివిషయములలోఁ బ్రతివిధానము సేయుట ముఖ్యమైనపనిగా నున్నది. వారు వ్రాసినప్రతివిషయము నిందుఁ జూపుట సాధ్యపడదు. కాఁబట్టి దిఙ్మాత్రముగఁ జూపుచున్నాఁడను.

మనయాంధ్రదేశములోఁ గలనాలవవర్ణములో వెలమ కమ్మ కాఁపు అను తెగలవా రుత్తమశూద్రులు గనుండువారనుట యెల్లవార లెఱుంగుదురు. ఈతెగలవారు శూద్రులలోఁగల తక్కిన తెగలవారలకు సేవ్యులై యే యుండఁగలవారలు గాని యెంతసామాన్యస్థితిలో నుండినను దైన్యమునువహించి యొకరియొద్ద సేవకులై యుండరు. ఇదిప్రత్యక్షప్రమాణగోచరము గాఁబట్టి వివరణంబు నపేక్షింపదు మఱియు నీశాఖలవారు నాలవజాతిలో నుత్తములుగాఁ బేర్కొనఁబడుచుండిరని శాసనగ్రంథాదులు చాటుచున్నవి. శ్రీనాథమహాకవి తన భీమఖండంబున

" ఉ. కైటభదైత్యవైరిపద ♦ కంజమునం దుదయంబునొందె మి
న్నేటికి భూతధాత్రికిని ♦ నెంతయు నచ్చిన తోడఁబుట్టువై
హాటకగర్భముఖ్యనిఖి ♦ లామరవరాళిమహామణిప్రభా
పాటలవర్ణమైన యొక ♦ పావనవర్ణ ముదీర్ణసంపదన్.

వ. అప్పుణ్యవంశంబు కంసాసురవిధ్వంసిచరణపల్లవంబు దనకుఁ బుట్టినిల్లుగావునఁ గారణగుణసంక్రమంబునం బోలెఁ జామరతోమరచ్ఛత్రధనుఃఖడ్గాదిచిహ్నోపశోభితంబై, చదలేటినీటివలని సోదరీయస్నేహలబ్ధంబులుం బోని పావనత్వ శుచిత్వ గాంభీర్య మాధుర్యంబులు చరితమనస్స్వభావవచనంబుల ధరియించి సైదోడుం బాదివి విశ్వవిశ్వంభరాక్రీడనంబు దనకువిదిర్చిన పరమశాంతి యంతరంగంబున నంతరించి నిఖిలప్రపంచంబునకు నాధారంబై ప్రవర్తిల్లె. అందుఁ బద్మనాయకు లనువెలమలనఁ గమ్మలన సరిసర్లన వంటర్లన బహుప్రకార శాఖోపశాఖాభిన్నంబులై. "

అని వ్రాసియున్నాఁడు. ఇందునకు సంవాదంబులు పెక్కులు గలవు. ఇట్టిమూఁడుతెగలవారిపూర్వులు స్థాపించినశిలాశాసనములు వీ రుత్తమశూద్రులుగా నుండిరని యుద్ఘోషించుచున్నవి.

" ఈశాదేశా త్సరసిజభువః కుర్వతి స్సర్వసర్గం
నిత్యస్తుత్యా చ్చరణకమలా ద్దేవవిద్భి ర్మహద్భిః
తుర్యం వర్యం సమజని కులమ్
విష్ణో స్తచ్చరణా ద్విజిష్ణు రుదభూ ద్వర్ణో గుణార్ణోనిధిః "

ఇత్యాదిశాసనములు గ్రంథమున వెల్లడి చేయఁగలను. కాఁబట్టి పై మూఁడుశాఖలవారు శూద్రులలో నుత్తములుగా నెన్నఁబడుచున్న వారనుటకు శాబ్దప్రమాణము గూడఁ జూపట్టుచున్నది. ఇట్లు ప్రత్యక్షప్రమాణముచేతను శాబ్దప్రమాణముచేతను సిద్ధం బగుచున్న యర్థము

నవలపించి వీరభద్రరావుగారీయాంధ్రులచరిత్రముయొక్క ద్వితీయ భాగమధ్యయుగమునఁ బదవప్రకరణమున వెలమ కమ్మ కాఁపు తెగలవారు మిశ్రజాతివారనియు గొల్లజాతివారియుఁ బల్లెజాతివారియు సమ్మేళనమున నుదయించినారనియు నేమియేమియో ప్రమాణదూరంబైనవిషయమును యథార్థ మనునట్లు వ్రాసి యున్నారు. ఆవిషయము నుపేక్షించినచోఁ బై చెప్పినరీతిగ సత్యము మఱుఁగుపడును. కాఁబట్టి దానినిజము తెలుపుటకై యత్నించుట యావశ్యకమై యున్నది.

ఇదిగాక పై మధ్యయుగమున 6 వ ప్రకరణమున నావ్రాసిన వెలుగోటివారివంశచరిత్రములోనివిషయములు కొన్నిసరియైనవి కావని వీరభద్రరావుగారు నిరాకరించి యున్నారు. ఇట్లగునపుడు

“కృతేచ ప్రతికర్తవ్య మేష ధర్మ స్సనాతనః”

అనున్యాయమున నేను బ్రతివిధానము చేయుట కర్తవ్యంబుగా నున్నది.

ఇంతేకాదు. తద్గ్రంథభూమికయందు కే. వి. లక్ష్మణరావు ఎం. ఏ. గారు “వీరియభిప్రాయములు (వీరభద్రరావుగారి యభిప్రాయములు) కొందఱకు సమ్మతములు గాక పోవచ్చును. కొన్నిసందర్భముల నయ్యవి ప్రమాదజనితంబు లయినను గావచ్చును. కాని ఏవిషయమును గుఱించి యైనను, నుపక్రమించువారు సంపూర్ణముగఁ దమహృదయంబును విప్పి చెప్పినం గాని చర్చనీయాంశంబులు వెల్లడియగుట లేదు. అందువలన వారికిఁ గొంతస్వాతంత్ర్యం బిచ్చుట ధర్మ మని తలంచి మేము మీగ్రంథకర్తగారియభిప్రాయముల విషయమున జోక్యము గలుగఁ జేసికొనినవారము గాము. సహృదయు లగు చదువరు లిందు సంస్కారంబు లవశ్యము లని తోచినచో మాకును గ్రంథకర్తగారికిని దెలిపినఁ గృతజ్ఞులమై యుండఁ గలము” అని మాబోఁటిచదు

వరులయందు నిరవగ్రహానుగ్రహాభరంబునఁ గొంత స్వాతంత్ర్యము గలుగఁ జేసి యున్నారు.

గ్రంథకర్తగారు అవతారికయొక్క 14 వ పేజీలో « వెలుగోటివారి వంశచరిత్రముయొక్క ప్రతి నొక్కదానిని దయఁ చేయఁగా ...స్వీకరించి యథామూలాగ్రము పఠించితిని. అందు చరిత్రబద్ధములు గానివిషయము లనేకము లుండుటచేత నాయభిప్రాయభేదమును తెలుపవలసి వచ్చినది. అందులకు మిక్కిలి చింతించుచున్నాను. చరిత్రమునందు వారివంశవిషయమై నేఁ జేసినసిద్ధాంతములను సహేతుకముగా దోషము లని నిరూపించినయెడల వానిని దీనికనుబంధముగాఁ బ్రకటింతును " అని ప్రతివిధానమున కనుమతిప్రదానంబు చేసి యున్నారు.

ఇవన్నియు మదీయాంతరంగంబునఁ జేరి యుత్సాహమునుప్పొంగఁ జేయ నే నీపనికిఁ బూనుచున్నాఁడను.

సదయహృదయులు సారాసారవివేకచతురులునగు సహృదయశిరోమణులు రాయంచలు నీరక్షీరవివేకంబు చేయుభంగి నేతద్గ్రంథద్వయగతంబు లైనవిషయంబుల యుక్తాయుక్తంబులు పరిశీలింప మిక్కిలి యభ్యర్థింపఁబడుచున్నారు.

ఇట్లు విద్వద్విధేయుఁడు

వె - సదాశివశాస్త్రి.

---

ఈపుస్తకము వలయువారు నెల్లూరుజిల్లా వేంకటగిరిటౌను నివాసులగు శి. జగన్నాథముగారికి వ్రాసికొనిన నుచితముగ లభించును.

శ్రీ ర స్తు.

శ్రీగణేశాయ నమః.

# ఆంధ్రచరిత్రవిమర్శము.

శ్లో. ప్రత్యూహాప్యూహశమనం ప్రణిపత్య గజాననమ్
అకాణ్డతాణ్డవః కో౽పి యథామతి నివార్యతే. ౧
పరహృదయాహరణైకప్రవీణతాదృగ్వచస్సమాకృష్టాః
అపి మత్ప్రియాస మేనం సఫలీకుర్వంతు సర్వథా సుధియః.

శ్రీచిలుకూరు వీరభద్రరావుగారు 1912 వ సంవత్సరము మే నెల 30 తేదిని, విజ్ఞానచంద్రికాగ్రంథమాలలోఁ బ్రకటింపఁబడిన తమ యాంధ్రచరిత్ర ద్వితీయభాగమధ్యయుగము నాలవప్రకరణమున 178 వ పేజీలో "రేచర్ల బేతిరెడ్డి రేచర్ల నామిరెడ్డి" అని యుపక్రమించి 181 వ పేజీ తుదివఱకు బేతిరెడ్డి నామిరెడ్డి కన్నదైనట్లును గాకతిగణపతిరాజ్యకాలమువఱకు జీవించియుండనట్లును వ్రాసియున్నారు. అయ్యది క్రిందివిధముగ నున్నది.—

"వీర లిఱువురును (బేతిరెడ్డి నామిరెడ్డి) సోదరులు, అయిన నిం దెతడు పెద్దయో ఎతడు పిన్నయో నిశ్చయింప నాకరము గానరాకయున్నది......రేచర్లనామిరెడ్డి క్రీ. శ. 1195 వ సంవత్సరమునఁ బిల్లలమఱ్ఱిగ్రామమున..........శాసనము వ్రాయించెను. ..............ఈశాసనమందుఁ దనతల్లిదండ్రులనామములను మాత్రమే పేర్కొనియెను గాని, తనవంశము వర్ణించి యుండ లేదు. తా నెచ్చటివాఁడో తనకుఁ గలబిరుదావళు లెట్టివో వానినిసయితము చెప్పుకొనియుండ లేదు. అయినను క్రీ. శ. 1202 సంవత్సరమునఁ

బిల్లలమఱ్ఱిగ్రామమునందు............మరియొకశాసనము వ్రాయించెను, ఆశాసనములోఁ దనవంశమును దనకు గలబిరుదావళులను జేర్కొనెను........ఇతనిశాసనములో నెచ్చటను బేతిరెడ్డినామము గానంబడదు. సకలగుణగణాలంకార, అమనగంటిపురవరేశ్వర, వీరలక్ష్మీనిజేశ్వర, దోర్బలభీమ, రణరంగరామ, వితరణకర్ణ, శౌర్యసంపన్న, పతిహితాంజనేయ, శౌచగాంగేయ, సత్యరత్నాకర, దుష్టజనభీకర, మనుమకులాదిత్య, సుభటసంస్తుత్య అనుబిరుదము లీతనికిఁ గలిగి యున్నట్లుగా నీశాసనమునం జేర్కొనఁబడియెను. క్రీ. శ. 1208 సంవత్సరములో బేతిరెడ్డిభార్య యెఱ్ఱకసానమ్మశాసనములో నామిరెడ్డిశాసనములోని వంశావళియే సరిగాఁ జెప్పఁబడినది...........నామిరెడ్డి పేరెత్త లేదు. మఱియును నామిరెడ్డిశాసనములో నామిరెడ్డికిం గలబిరుదావళులె బేతిరెడ్డికిని జెప్పంబడియెను. ఇంతియ గాక ఎఱ్ఱకసానమ్మ శాసనమునాటికి బేతిరెడ్డి బ్రతికియున్నట్టు గన్పట్టను. అదియునుంగాక యీశాసనములో ఎఱ్ఱకసానికి బేతిరెడ్డివలన మల్లారెడ్డి యనుకుమారుఁడు జనించె నని చెప్పఁబడుటయె గాక యాతనిగుణవిశేషాదులును పౌరుషపరాక్రమములును వర్ణింపఁబడినవి. ............ఈశాసనములు మూఁడింటిని బరిశీలింపగా నీక్రిందివిధమునఁ దోఁచుచున్నది. క్రీ. శ. 1195 సంవత్సరమున బేతిరెడ్డి యామనగల్లుదుర్గమున కధిపతియై పరిపాలనముఁ జేయుచు ఎఱ్ఱకసానిశాసనములో నుదాహరింపబడినబిరుదావళులను వహించి యుండె ననియు, ఆకారణముచేత నతనితమ్ముఁడైననామిరెడ్డి అప్పటికాబిరుదములను వహించియుండ లేదనియు, క్రీ. శ. 1202 సంవత్సరమునాటికి నామిరెడ్డి యాబిరుదములను వహించుటచేత నప్పటికి బేతిరెడ్డి మృతినొంది యుండె ననియు, అతని మరణానంతరము తమ్ముఁడాబిరుదములనే వహించి యామనగల్లుదుర్గ

మున కధిపతియై యుండెననియు దేటపడుచున్నది. క్రీ. శ. 1208 సంవత్సరమునాటికి బేతిరెడ్డి బ్రతికియున్న యెడల క్రీ. శ. 1202 సంవత్సరమున నతనితమ్ముఁడైన నామిరెడ్డి అన్నగారిబిరుదములను వహింపఁ జాలఁడు. తనకు తనసోదరునకు నట్టిభేదభావమే లేనియెడల క్రీ. శ. 1195 సంవత్సరమున నట్టిబిరుదావళులు ధరింప కుండుట తటస్థింపదు. కాబట్టి రేచర్ల బేతిరెడ్డి మొదటిప్రతాపరుద్రుని కాలములోనే యుండెను గాని గణపతిచక్రవర్తికాలములో లేఁడని చెప్పవలసి వచ్చుచున్నది » అని.

దీనిసాంగత్యాసాంగత్యములు తేటపఱచుటకు మున్ను గ్రంథకర్తగారు వ్రాసిన పైవిషయములలోని కొన్నియంశములు విమర్శించి గ్రంథస్వభావమును దేటపఱచుచున్నాను.

అవధరింపుఁడు. తొలుత, «వీర లిఱువురును సోదరులు, అయిన నిం దెవఁడు పెద్దయో ఎవఁడు పిన్నయో నిశ్చయింప నాకరము గాన రాక యున్నది." అని వ్రాసి తరువాత నామిరెడ్డి శాసనస్వరూపము నుపన్యసించునపుడు « ఇతనిశాసనములలో నెచ్చటను బేతిరెడ్డి నామము గానంబడదు » అనియు ఎఱ్ఱకసానమ్మ శాసనస్వరూపము నుపన్యసించునపుడు « నామిరెడ్డిపే రెత్త లేదు " అనియు పైసంశయమునే దృఢపఱచి వారల జ్యైష్ఠ్యకానిష్ఠ్యనిర్ణయం బెచటను జేయకయే, తుదకు « అతనితమ్ముఁడైననామిరెడ్డి '' అని మొదలుగా నామిరెడ్డి కనిష్ఠుఁడైనట్లును బేతిరెడ్డి జ్యేష్ఠుఁడైనట్లును నిశ్చయమును దెలిపి యున్నారు. తరువాతిగ్రంథమున నైన బేతిరెడ్డి జీవన మరణకాలములనే యన్వయవ్యతిరేకంబులతో నిర్ధారించిరి గాని యీవిషయము నెత్తికొన రైరి. ఇందువలనఁ బూర్వాపరస్వగ్రంథవిరోధంబు నవధరింపలే దని యేర్పడుచున్నది. ఈవిషయము ముందు సవిస్తరముగ వ్రాయఁబడును.

మఱియు "నామిరెడ్డిశాసనములో నామిరెడ్డికిం గల బిరుదావళులే బేతిరెడ్డికిని జెప్పంబడియెను" అనియు "అతనిమరణానంతరము తమ్ముఁడాబిరుదములనే వహించి" అనియు నిర్ధారణముగ వ్రాసియున్నారు. అట్లు వ్రాయుట గ్రంథకర్తగారి పొరపాటును జాటుచున్నది. నామిరెడ్డికిం గల బిరుదావళులె బేతిరెడ్డికిని జెప్పంబడియెను అనుటవలన నాబిరుదములుమాత్రమే చెప్పఁబడినవి కాని తదరిక్తంబు లగు బిరుదములు చెప్పఁబడలేదని యర్థమగుచున్నది కదా! ఎఱ్ఱకొక్కస్థానమ్ము శాసనములో బేతిరెడ్డికి "స్వామిద్రోహరగండ బేతనదండ" అను రెండుబిరుదములు, నామిరెడ్డికి లేనట్టివి చెప్పఁబడియుండినను, ఈయాంధ్రచరిత్రమున నామిరెడ్డికిఁ బరనారీదూర అనుబిరుదము గానరాక యుండినను, వీరభద్రరావుగారు నామిరెడ్డికిం గల బిరుదావళులె బేతిరెడ్డికిని జెప్పఁబడియెను అని వ్రాయుట ఏవకారార్థం బరయమిని గలిగినపొరపాటని తేటపడకమానదు. ఇట్లు "అతనిమరణానంతరము తమ్ముఁడాబిరుదములే వహించి" అని వ్రాయుటయుఁ బైయర్థమును బలపఱచుచున్నది. తమ్ముని బిరుదములలోఁ బైనూఁడుబిరుదములు లేనపుడు అన్నబిరుదములే తమ్ముఁడు వహించినవాఁ డెట్లగును? గ్రంథకర్తగారు రాయాశిలాశాసనములను దాము స్వయముగఁ జూచినవారు గాకున్నను, నీపట్టునఁ దమ గ్రంథమునకు మాతృకమైన వెలుగోటివారివంశచరిత్రములో వెల్లడిపఱుపఁబడిన శాసనములను దుదివఱకుఁ జదివికొనినయెన వ్రాయుట యుచితంబై యుండెఁ. అట్లు వ్రాయమిచేఁ బైదోషములు ప్రసక్తించుటయే కాక యీయాంధ్రులచరిత్రముయొక్క యుపోద్ఘాతమున 24 వ పేజీలో "వెలుగోటివారివంశచరిత్రము నామూలాగ్రముగాఁ బఠించితిని" అని వ్రాయుట యనృతం బనుటయుఁ బ్రసక్తించుచున్నది.

ఇదిగాక, మూఁడవశాసనముయొక్క స్వరూపము నుపన్యసించుచు నడుమ నకాండతాండవముగ "ఇంతియగాక ఎఱ్ఱుక్కసాని శాసనమునాటికి బేతిరెడ్డి బ్రతికియున్నట్టు గన్పట్టదు" అని స్వాభిప్రాయము నావిష్కరించినారు. శాసనస్వరూపమును వివరించుచు నది తుదిముట్టనిదే నడుమ నిట్లు స్వాభిప్రాయము నుగ్గడించుట యసంబద్ధముగాఁ జూపట్టెడిని. "ఈశాసనములను మూఁడింటిని బరిశీలింపగా నీక్రిందివిధమునఁ దోఁచుచున్నది" అనువాక్యముక్రిందిస్వాభిప్రాయ ప్రకటనగ్రంథముననే యీవాక్యము వ్రాయఁదగి యుండెను.

ఇట్టిదోషముల కీగ్రంథము పుట్టినయిల్లగుటచే వాని నెల్ల నెత్తి చూపుట గ్రంథవిస్తరముఁ జేయు నని స్థాలీపులాకన్యాయమున నింత మాత్రముఁ జూపి ప్రకృతము ననుసరించుచున్నాఁడను. చూడుఁడు.

తొలుత "ఇందెవఁడు పెద్దయో ఎవఁడు పిన్నయో నిశ్చయింప నాకరము గానరాక యున్న" దని వ్రాసిన వీరభద్రరావుగారు బేతిరెడ్డి యన్న యనియు నామిరెడ్డి తమ్ముఁ డనియు నిశ్చయించి వ్రాయుట పరస్పరవిరుద్ధముగ నున్న దని వెనుక వ్రాసి యుంటిని. ఆవిషయములో నొకవేళ 180 పేజీలో వీరభద్రరావుగారు శాసనత్రయఫలితార్థమును వ్రాయునపుడు "ఈశాసనములను మూఁడింటిని పరిశీలింపగా నీక్రిందివిధముగఁ దోఁచుచున్నది. క్రీ. శ. 1195 సంవత్సరమున బేతిరెడ్డి యామనగల్లుదుర్గమున కధిపతియై పరిపాలనము జేయుచు నెఱ్ఱుక్కసానిశాసనములో నుదాహరింపబడిన బిరుదావళులను వహించి యుండె ననియు ఆకారణముచేత తమ్ముఁడయిననామిరెడ్డి యప్పటి కాబిరుదములను వహించి యుండలే దనియు" అనిమొదలుగా వ్రాయుటచేత బేతిరెడ్డి యన్న యనుటకు నారాజు 1195 సంవత్సరమున బరిపాలనముఁ జేయుచు...బిరుదావళులను వహిం

చుట కారణ మనియు, నామిరెడ్డి తమ్ముఁ డనుటకు నతం డప్పటి కాబిరు దములను వహింప కుండుట కారణ మనియు వారిభావ మేర్పడుచు న్నది కదా! అని యన్నచో దాని న్విమర్శించెదను.

ఇయ్యది నిష్ప్రమాణ మయినకల్పనంబు. ఎందు కనిన. ఆసంవ త్సరమున బేతిరెడ్డి యామనగల్లురాష్ట్రము నేలుచు బిరుదములు వహించి యుండె ననుట సర్వప్రమాణములకు దూరం బైనయది. బేతి రెడ్డి యట్లు సేయుచుండె ననునది మనము చూచినవారము కాము కదా! కాఁబట్టి యది ప్రత్యక్షసిద్ధ మనుటకు వీలు లేదు. అట్లు చేసి యుండవచ్చు నని యూహించుటకు సరియైనకారణము గానరాదు. అప్పటికి నామి రెడ్డి బిరుదములు వహింపకుండుటయె కారణ మన్నచో నన్యోన్యాశ్రయ దోషము ప్రసక్తించును. 1195 సంవత్సరమున బేతిరెడ్డి పరిపాలనముఁ జేయుచు బిరుదములను వహించియుండినకారణముచేతఁ దమ్ముఁడగు నామిరెడ్డి యప్పటి కాబిరుదములను వహించి యుండ లే దని వ్రాసిన వీరభద్రరావుగారు నామిరెడ్డి బిరుదములను వహింప కుండినకారణము చేత బేతిరెడ్డి వహించి యుండె నని యూహించినచో నన్యోన్యాశ్రయ దోషము ప్రసక్తింపక మానదు కదా! ఒకవేళ నాకారణముచేతఁ దమ్ముఁ డగునామిరెడ్డి యనువాక్యమును వ్రాయుట తప్పని యొప్పి శాసన ప్రమాణసిద్ధం బయిననామిరెడ్డియొక్క బిరుదవహనాభావ రూపకార్య ముచేత బేతిరెడ్డి బిరుదములను వహించియుండె ననుకారణము నూహిం చెద మన్నచోఁ గార్యముచేఁ గారణానుమానము శాస్త్రసిద్ధ మయినను నామిరెడ్డి బిరుదములు వహింపమికిని బేతిరెడ్డి వహించుటకును గార్యకా రణభావము స్పష్టము కాదు. కారణం బనఁగాఁ గార్యనియతపూర్వవృత్తి యగునది. ఏది లేనందున నేకార్య ముదయింపదో అది దానికిఁ గారణ మగును. దండచక్రకులాలాదులు లేక ఘటము జనింపదు గాన ఘట

ములకు దండాదులు కారణముగా నున్నవి. అట్లు చేతిరెడ్డి బిరుదవహనము లేనిచో నామిరెడ్డిబిరుదవహనాభావము సంభవింపని యెడల నారెంటికిఁ గార్యకారణభావము క్లిష్టమని చెప్ప నొప్పును. అట్లు లేదు. బిరుదములను వహించుటయు మానుటయు, ఎల్లవారలును బూర్వులబిరుదములను వహించియే తీరవలయు ననునిర్బంధముయొక్క కలిమిలేముల యధీనములు కావు. ఈవిషయము సప్రమాణముగ ముందు నిరూపింపఁగలను. కాఁబట్టి పై రెంటికిఁ గార్యకారణభావము క్లిష్టము కాదు. అది కానపుడు నామిరెడ్డి వహింపమిచే చేతిరెడ్డి వహించి యుండెనని యూహించుట కలవి కాదు.

ఒకవేళ సీగ్రంథకర్తగారియభీష్టప్రకారము పై రెంటికిఁ గార్యకారణభావ మంగీకరించి చూచినను నామిరెడ్డిబిరుదములను వహింపకుండుటచేత చేతిరెడ్డి వహించియుండెనని యూహించుట సాధ్యపడదు. ఎందు కనిన, నామిరెడ్డిబిరుదములను వహింప కుండుటకు, చేతిరెడ్డి వహించుచుండుటయే కాక కారణాంతరములు గూడఁ బెక్కు లుండ వచ్చును. తండ్రియో మఱియొక జ్యేష్ఠభ్రాతయో పితృవ్యాదులో రాజ్యము చేయుచుండినను వీరిమతమున నామిరెడ్డి బిరుదములు వహింపక యుండ వచ్చును గదా! ఇట్టిస్థితిలో, నామిరెడ్డి బిరుదవహనాభావరూప మైనకార్యముచేత చేతిరెడ్డియొక్క బిరుదవహనపరిపాలనములే యెట్లూహింపఁ దగును? ఇదిగాక 1195 వ సంవత్సరమునాఁటినామిరెడ్డిశాసనములో, నాయన బిరుదములు వహింపనట్లు మాత్రమే యగపడుచున్నది గాని, పరిపాలింపక యుండిన ట్లగపడదు. ఇట్లు శాసనమున నున్న కేవల బిరుదవహనాభావముచేత నామిరెడ్డి యప్పటికి రాజ్యము చేయుచుండలేదనియు, నందువలన మఱియొకఁడు రాజ్యము చేయుచుండిన నుండ వచ్చుననియు మాత్రమే

పే రూహింపవచ్చును గాని బేతిరెడ్డి బిరుదవహనపరిపాలనములనే యేటి లూహింపవచ్చును? పై యూహయుఁ బూర్వుల బిరుదములను బ్రతి పురుషుఁడును వహించియే తీరవలె ననియు నన్న యుండఁగాఁ దమ్ముఁడు వహింపఁ గూడ దనియు నిర్బంధము లున్ననే సిద్ధించును. అట్టి నిర్బంధములు లే వని ముందు సప్రమాణముగ నిరూపింపఁగలను. అవి లేనపు డైచ్ఛికము లైన బిరుదవహనతదభావములచేఁ జేయఁబడిన పైయూహలు నిరాధారములై సికతాకూపములవలెఁ దమంతనే కూలిపోవు నని వ్రాయంబని లేదు. ఇందువలన బేతిరెడ్డి బిరుదములు వహించి పరిపాలనము సేయుచుండె ననుట యనుమానప్రమాణసిద్ధంబును గా నేరదు.

ఉపమానం బతిప్రసక్తం బనుట సుప్రసిద్ధంబు. ఇఁక నీవిషయములో శాబ్దప్రమాణము గగనకుసుమమునకన్న దుర్లభంబు. నాఁటికి బేతిరెడ్డి పై విధముగ నుండె నని బోధించు శాసనములు గాని గ్రంథములు గాని లేవు గదా! అవి లేనపుడు 1195 సంవత్సరము నాఁటికి బేతిరెడ్డి రాజ్యము నేలుచు బిరుదములను వహించియుండె నని చెప్పుట నిర్మూలంబు గాక మానదు. ఇట్లు ప్రత్యక్షాదిప్రమాణదూరంబై నిర్మూలమైన బేతిరెడ్డి బిరుదవహనముచేత, నాయన యన్నయై యుండెననియు, నాకారణముచేత నామిరెడ్డి తమ్ముఁడై యుండె ననియు నూహించుట గాని, శాసనదృష్టం బగు నామిరెడ్డి బిరుదవహనాభావముచేత నతండు తమ్ముఁడై యుండె ననియు, నాకారణముచేత బేతిరెడ్డి యన్నయై యుండె ననియు నూహించుట గాని సాహసైకశరణం బనుట నిర్వివాదాంశంబు.

ఇఁక, ఎఱ్ఱకసానమ్మశాసనము నాఁటికిఁ బేతిరెడ్డి బ్రతికి యున్నట్టు గన్పట్ట దని నిర్ణయించుటకు గ్రంథకర్తగారు హేతువు లెవ్వి యని యెంచిరో వానివిమర్శ మిపు డవశ్య కర్తవ్యంబు. వెనుక

నుదాహరింపఁబడిన వారిగ్రంథమును జూడ క్రీ. శ. 1195 వ సంవత్సరమున నామిరెడ్డి బిరుదములను వహింపకుండి క్రీ. శ. 1202 వ సంవత్సరమున వహించి యుండుట యిందుకు ముఖ్యహేతువుగా వారు దలంచినట్లు గానంబడియెడి. ఇందులో నామిరెడ్డి బిరుదములను వహింప కుండుట బేతిరెడ్డిజీవనమునకును, వహించుట మరణమునకును హేతువుగా నెంచి యుండవలెను. అయిన నివి హేతువులు కాఁజాలవు. ఎందు కనిన. నామిరెడ్డి బిరుదములు వహింపకుండుట బేతిరెడ్డిజీవించుట వలననే కాక కారణాంతరమునఁ గూడఁ గలుగ వచ్చును. మఱియొక జ్యేష్ఠభ్రాతయుండినను పితృవ్యాదిరాజ్యార్హు లుండినను గూడఁ గలుగ వచ్చును గదా! నామిరెడ్డికి బేతిరెడ్డి తక్క నింక సోదరులు గాని, పితృవ్యాదులుగాని లేరని మన మెట్లు చెప్పవచ్చును? ఈయాంధ్రచరిత్రముయొక్క 207 పేజీలో “గణపతిచక్రవర్తికి రుద్రాంబిక యనునొక్కకూఁతురుమాత్రమే గల దని చెప్పుటకు సాధ్యపడదు. గణపాంబ యనుకొమార్త మఱియొకతె గల దని ధాన్యకటకశాసనమునఁ జెప్పఁబడియుండ లేదా? ఇంకను గూఁతులు లేరని యెట్లు సిద్ధాంతీకరింప వచ్చును?” అని వీరభద్రరావుగారు కూడ వ్రాసినవారే గదా!

ఇట్లు నామిరెడ్డి బిరుదములను వహించుట బేతిరెడ్డిమరణమువలననే గాక యితరులమరణమువలనఁ గూడఁ గలుగ వచ్చును. తనకన్న నితరులు రాజ్యార్హులైనవారు లేకయే కదా నామిరెడ్డి రాజ్యమునకు వచ్చి యుండవలె. లేదా, అన్న జీవించియుండినను రాజ్యవిభాగము చేసికొనియుండినచో బిరుదములను వహించుట సులభము. కాఁబట్టి నామిరెడ్డి బిరుదవహనాభావముచేత బేతిరెడ్డిబ్రతుకును, అతనిబిరుదవహనముచేత బేతిరెడ్డిమరణమును నూహింప వలనుపడదు.

మఱియుఁ బ్రతిపురుషుఁడు దమపూర్వులబిరుదములు వహించియే తీర వలెననియు, అన్నయుండఁగాఁ దమ్ముఁడు బిరుదములు

వహింపఁ గూడ దనియు నిర్బంధము లుండిననే కాని యీయూహ స్థిరపడఁజాలదు. అయ్యవి దుర్లభంబులు. పూర్వులబిరుదములను వహింపకయే యుండువారును, అన్నయున్నను వహించువారును, నెందఱో యగపడుచున్నారు గదా! ఈ వెలుగోటివారివంశములో 8 వ తరము మాధవరావు శా. శ. 1349 సంవత్సరమున స్థాపించిన శిలాశాసనములోఁ దమపూర్వులబిరుదములను వేనిని దాను వహించినట్లు వ్రాయింపలేదు. ఇప్పటివా రెవరును ప్రాచీనులబిరుదములను దఱుచుగ వహింప రనుట సర్వానుభవసిద్ధంబు. కావున బిరుదవహన మైచ్ఛికమే కాని నియతము కాదు. 6 వ తరము మాదానాయఁడు తమయన్నయైన యనపోతానాయఁడు రాజ్యధురంధరుఁడై యుండఁగనే తనచే నుమామహేశ్వరములో స్థాపింపఁబడిన శిలాశాసనములో "స్వస్తి శ్రీమత్ మహామండలేశ్వర రాయగాయగోవాళ గజదళవిఫాల భుజబలభీమ ఖడ్గనారాయణ సోమకులపరశురామేత్యాదిగా బిరుదములను వహించినట్లు వ్రాయించినాఁడు. ఈశాసనము శా. శ. 1298 సంవత్సరమున వ్రాయఁబడినది. అప్పుడు వీరి యన్నయగు ననపోతానాయఁడు రాజ్యము చేయుచుండె ననుట వారిశాసనములవలన స్పష్టము కాఁగలదు. కాఁబట్టి అన్న యుండఁగాఁ దమ్ముఁడు బిరుదములను వహింపఁ గూడ దనునియమము దుర్ఘటము.

ఇదిగాక బేతిరెడ్డియొక్క జీవనమరణములను గూర్చి వీరభద్రరావుగారుచేసిన యూహలకు మొదట బేతిరెడ్డి యన్నయే కాని తమ్ముఁడు గాఁ డనియు క్రీ. శ. 1195 సంవత్సరమునాఁటికి బిరుదములను వహించియే యుండెఁ గాని వహింపకుండ లే దనియు రెండు నిశ్చయము లుండి తీరవలయు. అట్లుప్రమాణముచేతను గ్రంథకర్తగారు నిర్ణయించియుండినవారు కారు. ఇంతమాత్రమే కాక "ఇం తఁడు పెద్దవాఁ డితఁడు పిన్నవాఁ డని నిశ్చయింప నాకరము గాన

రాక యున్న " దని వ్రాసినారు. ఇందువలన బేతిరెడ్డి పెద్దయయి యుండె ననియు బిరుదములను వహించియే యుండె ననియు నిశ్చయము లే దనుట స్పష్టము. ఇది వెనుక విస్తరముగ వ్రాయంబడియె. ఆనిశ్చయము లేనపు డీహేతువులు బేతిరెడ్డి జీవనమరణముల నెట్లు సాధింపఁ గల్గునో ? కాఁబట్టి ఈయవి దుష్టహేతువులయి గ్రంథకర్త గారియభీష్టమును సాధింపఁ జాల వని తెలియంగునది.

ఇవి దప్ప మఱి యొకహేతువు వ్రాయంబడలేదు. ఎట్టిక్కసానమ్మశాసనస్వరూపోపన్యాసమధ్యమున నాకస్మికముగ « ఇంతియ కాక ఎట్టిక్కసానమ్మశాసనమునాటికి బేతిరెడ్డి బ్రతికియున్నట్టు గన్పట్టదు » అని రావుగారు వ్రాసినందున నాశాసనమున నెద్దియో వీరి యభీష్టమును సాధింపఁగలిగిన బలవత్తర మైనయాధార ముండి యిట్లు వ్రాయుటకు వీరిని దొందరపెట్టి యుండు నందు లేని చూతము. అందు బేతిరెడ్డి మృతి నొందినట్లో ఎట్టిక్కసానమ్మ వైధవ్యచిహ్నములను వహించినట్లో యేమని యాధారలేశం బగపట్టు నేమో.

ఆశాసనమున బేతిరెడ్డివర్ణనప్రస్తావమున.

« శ్లో. య స్తత్కాలశిక్షీయతే స నయతి క్రోడేన సర్వం క్షయమ్.

బహువిధై ర్భవై ర్గుణై ర్భాభిజితో

యః ప్రీత్యాదదతే ఽర్థితం వసు భృశం యస్మా ద్ద్విజా స్సాధవః.

అనుశ్లోకములలో శిక్షీయతే నయతి ఆదదతే అని వర్తమానక్రియలు ప్రయోగింపఁబడినవి, శిక్షీయతే నయతి ఆదదతే అనునవి శిక్షణీజ్ దాధాతువులపై లట్ప్రత్యయమున నిష్పన్నంబులైన వనియు వర్తమానే లట్ అను సూత్రమువలన లట్ప్రత్యయము వర్తమానార్థమునఁ బ్రయోగింపఁబడుననియు వర్తమానత్వము ప్రారబ్ధాపరిసమాప్త క్రియాశ్రయత్వరూపమనియు శాస్త్రప్రసిద్ధంబే కదా.

ఇందువలన శాసనస్థాపనమునాఁటికి బేతిరెడ్డి జీవించియే యుండె ననుట నిర్వివాదము.

ఇఁక నెఱ్ఱక్కసానమ్మవర్ణనప్రస్తావంబునఁ జూతము. అందు

"శ్లో. సర్వేషు ధర్మేషు పతివ్రతాత్వ ధర్మే ఽధికప్రీతిసమన్వితాయాః
వైవా ఽఖిలాశాః పరిపూరయంత్యాః ప్రీణాతిచిత్తం శివవల్లభాయాః
గౌరీపదాంభోరుహయుగ్మ భూరిభక్తిప్రభావార్జితభవ్యభాగ్యా
యా కల్పవల్లీసదృశీ శ్రితానాం సంపత్సమృద్ధిస్సతతంజనానామ్"

అనుశ్లోకము లగపడుచున్నవి. వీని యర్థము:—సర్వధర్మములలోఁ బతివ్రతాత్వధర్మమునందు నెక్కుడుప్రీతి గలదియు, సమస్తము లైనయాశలను, లేదా, యెల్లరయాశలనుబరిపూరించునదియు, నగుశివప్రియ యైన గౌరీదేవియొక్క చిత్తమును యేమె సంతసింపఁ జేయుచున్నదో యనియు, గౌరీపదామ్బుజయుగ్మమునం దధిక మైనభక్తిప్రభావముచేత మించినమనోజ్ఞ మైనభాగ్యము గలదియు, ఆశ్రితులకుఁ గల్పలతాసదృశియు జనుల కెల్లపుడు సంపత్సమృద్ధిరూపయు నేమెయో యని యగుచున్నది. ఇందు ప్రీణాతి యనువర్తమానక్రియను బట్టి శాసనస్థాపనము నాఁటికి ఎఱ్ఱక్కసానమ్మ గౌరీపూజ నొనర్చుచుండె ననుట స్పష్టము. వివాహదినము మొదలు నిత్యము గౌరీపూజ నొనరించుట సువాసినీ ధర్మంబే కాని విధవాధర్మంబు కాదు. అప్పటి కామె విధవయయి యుండె నేని మెనుకటిసువాసినీధర్మంబు లప్పుడు వర్ణించుట కరం బసమంజసం బని వ్రాయ నక్కఱ లేదు.

ఇ ల్లెఱ్ఱక్కసానమ్మ శాసనం బాసతో విప్పి చూచిన శాసనస్థాపనమునాఁటి కెఱ్ఱక్కసానమ్మ సౌభాగ్యచిహ్నములు వహించియుండి నట్లు చెప్పికొనుటవలనను భర్త యగు బేతిరెడ్డిని వర్ణించునపుడు వర్తమానక్రియలను బ్రయోగించుటవలనను శాసనస్థాపనమునాఁటికి బేతి

రెడ్డి జీవించియే యుండె ననుట ప్రస్ఫుటం బగుచున్నది. ఇదంతయుఁ జూడఁగా « భక్ష్యాశయాహి మంజూషాం దష్ట్వా ఖు స్తేన భక్షితః» అనున్యాయమున గ్రంథకర్తగారి కిష్టసిద్ధి గాక పోవుటయేఁ గాక పైఁగా ననిష్టముగూడ ఘటిల్లుచున్నది.

ఇందువలన వీరభద్రరావుగారు 180 వ పేజీలో « ఈశాసనములను మూఁడింటిని బరిశీలింపఁగా అనిమొదలుకొని « గణపతిచక్రవర్తికాలములో శేతిరెడ్డి లేఁడని చెప్పవలసియున్నది ” అనువఱకు వ్రాసినగ్రంథము సుదూరనిరస్తం బగుటయె గాక 181 పేజీలో « రేచర్ల బేతిరెడ్డిని గూర్చి శాసనములవలన గ్రహింపవలసినచరిత్రం బిద్దియె. బేతిరెడ్డి క్రీ. శ. 1195 సంవత్సరమునకుఁ దర్వాత మృతి నొందియుండవలయును. క్రీ. శ. 1196 సంవత్సరము మొదలుకొని మొదటిప్రతాపరుద్రునిసోదరుఁ డగుమహాదేవరాజు క్రీ. శ. 1199 సంవత్సరమువఱకు బరిపాలనము జేసి ఆసంవత్సరమున దేవగిరిరాజైన జైత్రపాలునితో జరిగినయుద్ధమునందు మృతి నొందెను. ఆమనగంటిప్రభు వైనబేతిరెడ్డి గూడ మహాదేవరాజుతో యుద్ధమునకుఁ బోయి మరణము నొంది యుండవలయును » అని వ్రాసినగ్రంథముఁగూడ నిరస్తం బగుచున్నది.

«శ్లో. ఆపరితోషాద్విదుషాంనసాధుమన్యేప్రయోగవిజ్ఞానమ్। బలవదపిశిక్షితానామాత్మన్యప్రత్యయంచేతః ” అని వక్కాణించుమహాకవి కాళిదాసునకే తనపాండిత్యమునందు నమ్మకము లేక యుండఁగా వీరభద్రరావుగారికి స్వపాండిత్యమునం దెంత దృఢమైన నమ్మకమో ! బేతిరెడ్డి మరణమునే గాక మరణస్థానమునుగూడ నిర్ధారించుచున్నారు !

ఇఁక నిట్లు వీరు చేసినవ్యవస్థ నంగీకరింపక క్రీ. శ. 1208 సంవత్సరమువఱకు బేతిరెడ్డి జీవించియె యుండె నని నిశ్చయించినచో నామిరెడ్డి క్రీ. శ. 1195 సంవత్సరమున బిరుదములు వహింపమికిఁ గారణం

చే మని యున వత్తు రేమో! అది పొసఁగదు. ప్రతిపురుషుఁడును బై వారిబిరుదములను వహించియే తీర వలయు నని నియమము లే దని వెనుక వ్రాయంబడియెఁ గదా! ఒకవేళ వారియభీష్టప్రకారము క్రీ. శ. 1199వ సంవత్సరమున బేతిరెడ్డి మృతి నొందినందునఁ దమ్ముఁ డైన నామిరెడ్డి రాజ్యమునకు వచ్చి యన్నగారిబిరుదములను వహించె నని యొప్పికొన్నను మఱియొక యాక్షేపము రాక తీఱదు. ఏమనిన.—— అన్నగారు గతించినతర్వాత నామిరెడ్డి వారిసకలబిరుదములను వహింపఁ దగి యుండఁగా స్వామిద్రోహరగండ, బేతనదండ అను రెండుబిరుదములను మానుట కేమి కారణం బని.

దీనికై యన్న గతించునప్పుడా రెండుబిరుదములను వెంటఁ గొని పోయి యుండు నని యూహించెద రా? మహానుభావులు గదా!

ఇట్లు నామిరెడ్డి బిరుదములు వహింపమికిఁ గారణము నూహించినవారు నామిరెడ్డియొక్క క్రీ. శ. 1195 వ సంవత్సరమునాఁటి శాసనము స్వరూపమును వివరించునప్పుడు "ఈశాసనమందుఁ దనతల్లిదండ్రులనామములను మాత్రమే పేర్కొనియెను గాని తనవంశము నభివర్ణించి యుండ లేదు. తా నెచ్చటివాఁడో తనకుఁ గలబిరుదావళు లెట్టివో వానినైతము పేర్కొని యుండ లేదు." అని యాశాసనమునందు మూఁడులోపములను జూపియుండియు నొకబిరుదావళులు వహింపమికే కారణము నూహించిరి కాని వంశము నభివర్ణింపమికి నునికిపట్టు తెలుపమికి నేల కారణము లూహింపక వదలిపెట్టిరో తోఁపదయ్యె. అన్న యుండఁగాఁ దలిదండ్రులనామములు తక్కఁ బితామహప్రపితామహాదిప్రాచీనులనామములు, ఉనికిపట్టులు తెలుపుట కర్తవ్యత యుండ దని యూహించి యుందు రేమో!

వీ రొకసారి శాసనములకడకుఁ జని వానిం బాఱఁజూచినం గాని యీసంశయములు దీఱవు. నామిరెడ్డిశాసనద్వయమునకుఁ గాలభేద మున్నట్లు స్థలభేదముండు నని వీరుతలంచి యుందురు. అట్లుగాదు. ఒక శిలా స్తంభమునందే శాసనద్వయము వ్రాయింపఁబడినది. అదియు నొకటేవిధమైన యక్షరములు గలిగి యుండుట మొదలగు వానిచే నేకకాలమందే వ్రాయింపఁబడిన దని తేలపడుచున్నది. దేవతాప్రతిష్ఠలు వేర్వేఱుకాలములందు జరిగియుండినను, నాయాకాలములను దెలుపుచు నొకకాలమునందే శాసనములు వ్రాయించుట సంభవించును గదా! అం దొకదానియందు వంశక్రమము బిరుదములు వ్రాయించి దానిచేతనే గతార్థంబగు నని యెంచియో రెంటిలో వ్రాయించుట కాశిలయం దవకాశము లేమినో యొకదానియందు మాత్రమే వ్రాయించి మఱియొకదానియందు వ్రాయింపక మానినట్లు గాన్పించెడిని.

ఇఁకఁ బైగారణములను బట్టి వ్రాయక మానియున్నచో రెండవదానియందే మాన వచ్చును గదా యని శంక యుదయించును. అట్లగునేని రెండవశాసనమునాఁటికి నామిరెడ్డికి రాజ్యభ్రంశము గలిగి బిరుదములు వ్రాయించినవాఁడు కాఁ డని యిట్టి పండితు లూహింపఁ గలుగుదురు గదా! కాన నిది యంతయు వీరభద్రరావుగారు స్వయముగ నాశాసనములను జూడకయు నందలిశ్లోకములయర్థమును గమనింపకయుఁ బోవుటచేఁ గలిగినదోసము దక్క వేఱొండుగాఁ గన్పట్టదు.

ఇందువలన 189 వ పేజీలో « వెలుగోటివంశచరిత్రకారులు నామిరెడ్డి బేతిరెడ్డి కన్న యని యూహించుచున్నారు కాఁబట్టి పై కార్యములకు బిరుదములకు నెట్టిసంబంధము లేదు. నామిరెడ్డినామము బేతిరెడ్డికి నామాంతర మని చెప్పుటకును వలను కాదు. నామిరెడ్డి భార్య మైతాంబ యని చెప్పఁబడినది గాని యెఱ్ఱక్క యని చెప్పఁబడి

యుండ లేదు. వాదమునకొఱకు నామిరెడ్డి బేతిరెడ్డి కన్న యని యొప్పు కొందము. అతఁడు వహించిన బిరుదములచేతను జ్యేష్ఠుఁడగుటచేతను క్రీ. శ. 1202 సంవత్సరమున నామనగల్లు ప్రాంతదేశము నతఁడే పరిపాలించుచుండెనని చెప్పక తప్పదు. అన్న పరిపాలనము చేయుచుండఁ దమ్మునికిఁ గిరీటము నిచ్చె ననుట యసందర్భము గాదా! వాస్తవముచేత నామనగంటిప్రభువులు కిరీటాధిపతులు గారు. కిరీటాధిపతులని యొకవేళ నంగీకరించినను జ్యేష్ఠుండు పరిపాలనముఁ జేయుచుండఁగాఁ గిరీటము నొసంగె ననుట ధర్మవిరుద్ధము" అని మొదలుగా వీరభద్రరావుగారు పేజీలు పేజీలు వ్రాసిన దంతయు, 190 పేజీలో "ఎట్టిక్కసానమ్మ శాసనము నాఁటికి బేతిరెడ్డి మరణము నొందియుండుటచేతనే యామె తన యత్తింటివారియొక్కయుఁ బుట్టింటివారియొక్కయు వంశాభివర్ణనము గావించి తనధర్మమును గూర్చి చెప్పుకొనుట తటస్థించినది" అని వ్రాసిన దంతయు సముద్రఘోషమువలె నిరర్థకం బని తేటపడక మానదు.

బేతిరెడ్డి తమ్ముండని యెంచినపుడు క్రీ. శ. 1202 వ సంవత్సరమున నామిరెడ్డి రాజ్యము నేలుచు బిరుదములు వహించియుండె ననుటయుండుఁ గాని, తర్వాత క్రీ. శ. 1208 సంవత్సరములోపల బేతిరెడ్డి రాజ్యమునకు వచ్చి పూర్వబిరుదములే గాక స్వామిద్రోహరగండ బేతసదండ అను రెండుబిరుదముల నార్జించి యుండె ననుట యుండుఁ గాని, ఆమనగంటిప్రభువులు కిరీటాధిపతులుగా రని యనుకొన్నను గణపతిచక్రవర్తి యనుగ్రహించి బేతిరెడ్డికిఁ దణ్డాధిపత్యము నొసంగి యుండు ననుటయుండుఁ గాని విరోధ మెద్దియుఁ గానరాదు గదా!

ఈకిరీటశాస్త్రార్థమును గూర్చి ముందు విస్తరముగ వ్రాయఁబడును. ఇపు డింతదూరము లేనిపోనికిరీటవాదమును బెంచిన వీరభద్రరావుగారిని గూర్చి యొకటి విచారింపవలసి యున్నది.

వెలుగోటివారివంశచరిత్రములోనియనుబంధమున వ్రాయఁబడిన నామిరెడ్డి శాసనద్వయమును వీరు చక్కఁగఁ జదివి యుందు రనుటకు సందియము లేదు గదా! ఇంత యేల? ఈయాంధ్రులచరిత్రముయొక్క యుపోద్ఘాతమున వీరు వెలుగోటివారివంశచరిత్రము నామూలాగ్రముగఁ బఠించితి నని వ్రాసియే యున్నారు. ఇట్టివారు నామిరెడ్డియొక్క 1195 వ సంవత్సరమునాఁటిశాసనములోని

"శ్లో. నానాభోగయుజో ద్విజేశ్వరభృతో విద్విట్పురచ్ఛేదిన
శ్శ్రీవాగీశ్వరసంస్తుతస్య విబుధై స్సేవ్యస్య భక్త్యాఽఖిలైః
ఆర్యాభీష్టవిధానసక్తమనసో యో భక్తియుక్త స్సదా
రుద్రస్యేవ పదారవిందయుగళే రుద్రస్య ధాత్రీపతేః.

సింహావ్యాఘ్రాయితభటమనోగంధవాహాయితాశ్వ
శ్లాఘ్యభృన్నాఘాయితగజగణో జృంభితే భీమధామ్ని
లీలామాత్రద్రుతధుతసమానీతనానానరేంద్రే
యః ప్రఖ్యాతః పృథుభుజబలో రుద్రదేవస్య సైన్యే.

తస్య ప్రసాదా దాత్తశ్రీ శ్శ్రీమతో రుద్రభూపతేః
నామః కామాత్మజ స్సర్వగుణధామా కృతీష్టదః.

శాకాబ్దే శైలతారాపతిభవగణితే వత్సరే రాక్షసాఖ్యే
వైశాఖే శుక్లపక్షే కుసుమశరతిథౌ వాసరే భాస్కరస్య
లింగాని త్రీణి సోయం త్రిపురవిజయిన స్సంప్రతిష్ఠాప్య వృత్తీః
ప్రాదా త్తత్పూజనార్థం సుకృతవితతయే స్వస్య మాతుః పితుశ్చ.

అనుశ్లోకములను జదివి నామిరెడ్డి రుద్రసముఁ డగురుద్రభూపతి

యొక్క పాదారవిందయుగళమందు భక్తియుక్తుండై యుండె ననియు నా రుద్రదేవుని యొక్క సైన్యమందు సుప్రసిద్ధుఁడై యుండె ననియు నా రుద్రదేవుని యనుగ్రహమున సంపద నొంది యుండె ననియు నానా సార్వభౌముఁడు భూమండలము నేలుచుండ శివలింగత్రయమును బ్రతిష్ఠించి తత్పూజనమునకై యనేకవృత్తు లొసంగెననియుఁ దదర్థములను తెలిసికొని యున్నవారే కదా.

వీరిమతమున నామిరెడ్డి యిట్టి ఘనకృత్యము లొనర్చునప్పు డతని యన్నయై బేతిరెడ్డి యామనగంటిరాజ్య మేలుచు బిరుదములను వహించి కాకతిరాయసేనానాయకులలో మిన్నయై యున్నవాఁడని వ్రాయంబని లేదుకదా! అన్న యిట్టియున్నతస్థితిలో నుండఁగాఁ దమ్ముఁ డగు నామిరెడ్డి యన్న నించుకైనం బ్రశంసింపక యాతని పేరైన నెత్తక తన్నుఁ బొగడుకొనుటయు, నేను రుద్రదేవునిపరమానుగ్రహపాత్రుండై తత్సైన్యమునఁ బ్రఖ్యాతుండ నయి యామహారాజువలన సంపద నొంది దలిదండ్రులపేరను నాపేరను దేవతాప్రతిష్ఠలు చేసి స్థిరవృత్తు లొసంగితి నని మొదలుగా నిజౌన్నత్యమును స్వాతంత్ర్యమును గూర్చి వ్రాయించుకొనుటయు సంభవింపదని యీవీరభద్రరావుగారేల యూహింపరైరి? అని.

నామిరెడ్డి యొకవేళ విక్రమాధికుం డయినను, అన్న రాజ్యము చేయుచుండఁగాఁ దాను సేనాపతియై యుండెడు. వీరిరాజ్యము సైనాపత్యమూలకమే కాన వీరిలో రాజ్యము చేయుచున్నవారే సేనాపతులయి యుందురు. ఇంతియ కాక, అన్న రాజ్యము సేయుచుండఁగాఁ దాను బ్రతాపరుద్రునివలన సంపద నొందినవాఁడ నని చెప్పుకొనెడు. ఇచ్చట సంపద రాజ్యరూపమే కాని వస్త్రాభరణాదిసత్కారరూపముగా నోపదు. అట్లైనచో రుద్రునిచే సత్కరింపఁబడినవాఁడ ననియె చెప్పు

కొనును గాని “ఆత్తశ్రీః” యని చెప్పకొనఁడు. వీరిమతమున బేతిరెడ్డి యన్నయై యున్నాఁడు కాఁబట్టి, అట్టి రాజ్యరూపసంపదకు స్వతంత్రుఁడైనయన్నయే యర్హుం డగును గాని యస్వతంత్రుఁడై యున్న తమ్ముఁ డర్హుండు గాఁ జాలఁడు. విభక్తుఁడై యుండినచో రాజ్యముతోఁ గూడ బిరుదములు సైతము వచ్చియుండును. ఇది గాక సర్వాధిపతి యైన యన్న యుండఁగా నిజకీర్తివ్యాప్తికై తమ్ముండు బహుళధనవ్యయము చేసి మహోన్నతదేవాయతననిర్మాణాదు లొనర్చి స్థిరవృత్తు లొసంగుట సంప్రదాయవిరుద్ధంబు ధర్మవిరుద్ధంబును గాదా? మఱియు గయలో నాత్మపిండము వెట్టుటయుఁ దనపేర దేవతాప్రతిష్ఠ చేయుటయు ముందు తన్నుఁ గూర్చి యట్లొనరించుపుత్రుండు లేక వయస్సు గడచినందునఁ బుత్రోత్పత్తిసంభావనయు లేక శమోన్ముఖులైనవారిధర్మముగా నున్నది గాని యల్పవయస్సున నుండి పుత్రప్రాప్తి కర్హత గలిగి రాజ్యాదిభోగములను గన నున్న యస్వతంత్రులధర్మముగా లోకమునఁ గన్పట్టదు. నూటికిఁ గోటికి నొకం డట్లు సేయుపురుషుం డుండిన నతండు తప్పక దనయన్నను గొనియాడును. తనయన్న యున్నతస్థితిలో నుండఁగా నాయనప్రశంసచేయక దనప్రశంసయే చేసికొనుట కట్టి సత్పురుషుం డొప్పఁడు కదా! ఈ వెలుగోటివారివంశమున నాఱవతరము మాదానాయఁ డుమామహేశ్వరమునఁ బ్రతిష్ఠించినశాసనమున

“శ్లో. అనుజో మనుజేంద్రస్య దనుజారాతిసంపదః
అన్నపోతమహీశస్య సన్నతారాతిభూభుజః”

అని యన్నను గొనియాడియున్నాఁడు. నామిరెడ్డి యట్లొనరింపక పోవుటయే కాక పై కార్యముల నొనరించుటను బట్టి తమ్ముఁడు కాఁ డని యూహింపఁ దగును.

"క్రీస్తుశకము 1208 సంవత్సరమునాఁటికి బేతిరెడ్డి బ్రతికియున్న యెడల 1202 వ సంవత్సరమునఁ దమ్ముఁడైన నామిరెడ్డి యన్నగారిబిరుదములు వహింపఁ జాలఁడు. తనకు తనసోదరున కట్టిభేదభావమే లేనియెడల 1195 సంవత్సరమున నట్టిబిరుదావళులు వహింప కుండుట తటస్థింపదు" అని వారే వ్రాసియున్నారు కారా? కాఁబట్టి రాజ్యస్వతంత్రుఁడైనయన్న యుండఁగా నామిరెడ్డి యాయనపై రెత్తక దన్నుఁ బొగడుకొనుటయు స్వతంత్రులయట్లు స్థిరవృత్తులొసంగుటయు వయోధికులై కృతకృత్యులైనవారివలె శాశ్వతదేవతాప్రతిష్ఠాదిధర్మములాచరించుటయు నొప్పునేమో వీరభద్రరావుగారే యాలోచించి చెప్పవచ్చును.

ఇదంతయుఁ బరిశీలించినపండితులు నామిరెడ్డి తమ్ముఁడనుట ప్రమాణబాహ్యంబనియు బేతిరెడ్డి గణపతిదేవుని రాజ్యమువఱకు జీవించియుండలేదని వ్రాయుట సాహసైకశరణంబనియుఁ గిరీటవాదము మొదలగునవాంతరవిషయములు విచారసహమ్ములుగావనియుఁ దెలిసికొనఁగలరు.

ఇట్లు బేతిరెడ్డియొక్క జ్యేష్ఠతను గూర్చియు, జీవనమును గూర్చియు వ్రాసి యిపుడు 181 పేజీ కడపటిభాగము మొదలుకొని యీయాఱవప్రకరణము ముగియువఱకు, బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యనునామము లేనట్లును, బేతిరెడ్డి వేంకటగిరి, మైలవరము, పిఠాపురము, బొబ్బిలిసంస్థానాధిపతులకు మూలపురుషుఁడగు బేతాళనాయఁడు కానట్లును, బేతిరెడ్డి బేతాళుని నెదిరించి కాకతిగణపతిచక్రవర్తివలన గౌరవింపఁబడెననుట మొదలగువిషయములు విశ్వాసపాత్రములు కానట్లును వ్రాయ నుపక్రమించి, తత్పూర్వరంగముగ వాక్యచతుష్టయమును వ్రాయుచున్నారు. అందు మొదటివాక్యమిటులున్నది.—

« ఈ బేతిరెడ్డినిగూర్చి యనేకగాథలు బట్టులచేఁ గల్పింపఁబడి పాటలు పద్యములు అల్లఁబడి బేతాళనాయనివంశీయుల మని చెప్పుకొనెడువారిచే గ్రంథస్థములు గావింపఁబడి సర్వత్ర వ్యాప్తి చేయింపఁబడి సత్యమైనచరిత్రాంశములను గప్పి పెట్టుచున్నవి. » అని.

దీనివలన బేతిరెడ్డినిగూర్చి పెక్కుగాథ లున్నట్లును వానిలోఁ గొన్ని సత్యములయ్యుఁ గొన్ని యసత్యములయ్యు నున్నట్లును, అందు నసత్యములచే సత్యములు గప్పిపెట్టఁబడుచున్నట్లును వారియాశయము దెలియవచ్చుచున్నది గాని సత్యము లెవ్వియో అసత్యము లెవ్వియో వానియొక్క సత్యత్వాసత్యత్వములకుఁ గారణంబు లెవ్వియో దెలియరాకయున్నది. అట్లు తెలియవచ్చువఱకు నీవాక్యము నుపేక్షించుటయే కర్తవ్యంబుగాఁ గనుపట్టెను.

అయినను « బట్టులచేఁ గల్పింపఁబడి'' యను సాభిప్రాయవిశేషణముచే బట్టులు కల్పించినగాథ లసత్యములనియు, తదన్యములు సత్యములనియుఁ దెలియుటకుఁ గొంచె మవకాశము దొరకుచున్నది. కాఁబట్టి బట్టులచేఁ గల్పింపఁబడకుండుట సత్యతకును, వారలచేఁ గల్పింపఁబడుట యసత్యతకును గారణ మని యర్థసిద్ధ మగుచున్నది. ఇట్టిస్థితిలో బేతిరెడ్డినిగూర్చి బట్టులచేఁ గల్పింపఁబడినగాథ లెవ్వి? తదన్యము లెవ్వి? యని విచారింపఁగా, పద్మనాయకచరిత్రము వేంకటగిరివారివంశచరిత్రము మొద లగునవి బట్టురాజులచే వ్రాయఁబడినవి కావున వానిలో బేతిరెడ్డినిగూర్చి వ్రాయఁబడినగాథలు, అనఁగా, « బేతిరెడ్డి బేతాళుని నెదిరించి వరము లొంది గణపతిచక్రవర్తివలన మిగుల గౌరవింపఁబడెను. బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యనునామము గలదు. ఈరాజు పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁడు'' ఇత్యాదు లసత్యము లనియు, తదితరములు, అనఁగా, వీరభద్రరావుగారిచే గనిపెట్టఁబడినవి « బేతిరెడ్డి

గణపతిదేవునిరాజ్యకాలమువఱకు జీవించి యుండ లేదు, అతనివలన గౌరవింపఁబడి యుండ లేదు, బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యనునామము లేదు, ఆరాజు వేంకటగిరిసంస్థానాధిపతులు మొదలగువారికి మూల పురుషుఁడు గాఁడు" ఇత్యాదులు సత్యము లనియుఁ జెప్పుచు న్నది. ఈయభిప్రాయమును 183 వ పేజీలో నీవాక్యచతుష్టయము తరువాత "కాఁబట్టి బేతిరెడ్డికి చెవిరెడ్డి యనునామము లే దనియు, బేతిరెడ్డి వేంకటగిరి...సంస్థానాధిపతులకు మూలపురుషుఁడు కాఁ డనియు సహేతుకముగ నిరూపింపఁబోవుచున్నాను" అనులేఖన ముచే గ్రంథకర్తగారే యావిష్కరించియున్నారు. బట్టులచేఁ గల్పిం పఁబడిన వసత్యము లెట్లో వీరిచేఁ గల్పింపఁబడినవి సత్యంబు లెట్లో, తన్నిరూపణం బశక్యం బని యగ్రిమ విమర్శమువలనఁ దేటపడఁ గలదు.

ఏది యెట్లు లున్నను నిదంతయు నభిత్తిచిత్రకర్మముగా నున్నది. ఎందు కనఁగాఁ బేతిరెడ్డినిగూర్చి బట్టులచేతఁ జిత్రముగఁ గాని విచిత్ర ముగఁ గాని యొకగాథ యైనను గల్పింపఁబడ లేదు, ఇంత యేల? ఆపేరే వారెత్తలేదు. ఇట్లుండఁగ నాగాథలు (లేనట్టిగాథలు) పాటలు పద్యములు అల్లఁబడి గ్రంథస్థములు గావింపఁబడి సర్వత్ర వ్యాప్తి చేయఁబడి సత్యమైనచరిత్రాంశములను గప్పిపెట్టుచున్న వనుట యభిత్తిచిత్రకర్మము గాక వేఱొం డేమి యగును?

దీనిపై వీరభద్రరావుగారు, బేతిరెడ్డినిగూర్చి యనేకగాథ లేబ ట్టులచేతఁ జిత్రవిచిత్రముగఁ గల్పింపఁబడి శాఖోపశాఖలుగాఁ బ్రబలి సత్యమైనచరిత్రాంశములను మఱుఁగుపఱచుచున్నవో యగపఱచుట యావశ్యకంబై యున్నది. కానిచో నిదంతయు నున్మత్తప్రలపితంబు వోలె నుపహాసనీయంబు గాక పోదు.

ఒకవేళ, పద్మనాయకచరిత్రము వేంకటగిరివారివంశచరిత్రము మొదలగు గ్రంథములలో, బేతిరెడ్డి లోకోత్తరశౌర్యధైర్యసాహసములతో బేతాళుని నాదరించె ననియు నా బేతాళుఁ డా రాజుయొక్క శౌర్యాదులకు మెచ్చి కొన్ని వరము లొసంగె ననియు నావృత్తాంత మప్పు డోరుగల్లురాజ్యధురంధరుఁ డగు గణపతిచక్రవర్తి చారులవలన విని యీ రెడ్డిని రావించి మిగుల గౌరవించె ననియు నేమేమో చిత్రవిచిత్రముగ బట్టులు కల్పించి వ్రాసినారు కారా? యని యందు రేమో. వానిలో గాథలు బేతిరెడ్డినిగూర్చి వ్రాయఁబడియున్నవో చెవిరెడ్డిని గూర్చి వ్రాయఁబడియున్నవో వీరభద్రరావుగారింకొకపరి గొంచె మా గ్రంథములను గటాక్షించి చెప్పవలసి యుండును.

ఇఁక నిక్కమైనఁ జెప్ప వత్తు రేమో.—ఆ గ్రంథములలో నెచ్చటను బేతిరెడ్డిపేరు లేకున్నను, చెవిరెడ్డియనియు బేతాళనాయఁడనియు నామము లున్నవి కాఁబట్టి యాచరిత్రము బేతిరెడ్డినిగూర్చియె వ్రాయఁబడిన దనుట కెంతమాత్రము సందియము లేదు. బేతిరెడ్డి యనియు బేతినాయఁ డనియు బేతాళరెడ్డి యనియు బేతాళనాయఁ డనియుఁ జెవిరెడ్డికి నామాంతరములే కాని వేఱుకాదు. అని.

ఇయ్యది మా కభిప్రేతం బగుదారియే. అయినను, వీరు పైశబ్దముల కక్షరభేదమె కాని యర్థభేదము లే దనువిషయము నంగీకరింతురా? అంగీకరింపరా? యని విచారించి తెలిసికొనఁ దగి యున్నది. అంగీకరింతు రన్నచో స్వమతహానము పరమతప్రవేశము అనుదూషణములు ప్రసక్తించును. అగ్రిమగ్రంథమున "కాఁబట్టి బేతిరెడ్డికి చెవిరెడ్డి యనునామము లే దనియు బేతిరెడ్డి వేంకటగిరి...సంస్థానాధీశ్వరులకు మూలపురుషుఁ డని చెప్పఁబడెడు బేతాళనాయఁడు కాఁ డనియు నహేతుకముగ నిరూపింపఁబోవుచున్నాను" అని వ్రాసి యచ్చటచ్చట

సాయుర్థమునే బలపఱచుట మొదలగువానిచే వీరిమతమునఁ బైనామములు వేర్వేఱుపురుషులనే బోధించు నన్నభావము తేటపడుచున్నది కదా. అట్టిమతకర్తలభేదవాదము నంగీకరించినచోఁ బైదోషములు ప్రసక్తింపకమాన వని వ్రాయ నక్కఱలేదు. ఇఁకఁ బైనామములకు శబ్దభేదమె కాని యర్థభేదము లేదన్నవిషయము నంగీకరింప రన్నచో 178 వ పేజీలో « బేతిరెడ్డి నామిరెడ్డి'' యని యుపక్రమించి బేతిరెడ్డి జ్యేష్ఠుం డనియు, గణపతిరాజ్యకాలమువఱకు జీవించి యుండ లేదనియు, బేతిరెడ్డినిగూర్చి బట్టులచేననేకగాథలు కల్పింపఁబడినవనియు, బేతిరెడ్డి పై సంస్థానాధిపతులకు మూలపురుషుఁడు కాఁ డనియు మున్నుగా వ్రాయుట యసంగతం బగును. బేతిరెడ్డియుఁ జెవిరెడ్డియు వేర్వేఱు పురుషులైనపుడు బేతిరెడ్డి పెద్దయైన నేమి ? పిన్నయైన నేమి ? గణపతిరాజ్యమునాఁటికి జీవించిన నేమి ? మరణించిన నేమి ?

ఒకనిగుణములచే మఱియొకఁడు గుణి యగుటయు నొకని దోషములచే మఱియొకఁడు దోషి యగుటయుఁ గానము గదా! కాఁబట్టి భేదవాదులు చెవిరెడ్డిపేరుతో నున్నచరిత్రములలో నెంతమాత్రము సంబంధము లేనట్టిబేతిరెడ్డిచరిత్రములను దెచ్చి పెట్టి దూఱుట యసంగతంబు గాక మానదు.

ఒకవేళ, బట్టు లట్లు వారల నిరువుర నేకపురుషునిగా వ్రాసి యున్నారు, అట్టి వారిమతమునఁ జెవిరెడ్డిగాథలే బేతిరెడ్డిగాథలు బేతిరెడ్డిగాథలే చెవిరెడ్డిగాథలు కావచ్చును గదా ! ఆపక్షము నభ్యుపేత్యవాదముగ నెత్తికొని యటులు వ్రాయఁబడిన దన వత్తు రేమో. అట్లనవచ్చును గాని, ఆపక్షమునసైనఁ జెవిరెడ్డియొక్క నిజమైనచరిత్రమును నిందించుట ధర్మము గాదు. చెవిరెడ్డికి బేతిరెడ్డికి భేద మున్నను అభేద మున్నను చెవిరెడ్డి మూలపురుషుఁ డను నిజమైనయంశమునకు

క్షతి యుండదు కదా! ఈవిషయము ముందు విస్తరముగ వ్రాయఁబడును. ఇట్లగునప్పుడు పై వాక్యమున, "బేతాళనాయనివంశీయులమని చెప్పుకొనెడువారిచేత గ్రంథస్థములు గావింపఁబడి" అనియు 183 వ పేజీలో "వేంకటగిరి...సంస్థానాధిపతులకు మూలపురుషుఁ డని చెప్పఁబడు బేతాళనాయఁడు కాఁ డని సహేతుకముగ నిరూపింపబోవుచున్నాను" అనియు బేతాళనాయకవంశీయత్వాదులయం దయాథార్థ్యసూచక మగుమాటలు వ్రాయుట యేమి ధర్మంబు? బేతిరెడ్డి పైవారికి మూలపురుషుఁడు గాఁ డని నమ్మక మున్నవారు బేతిరెడ్డివంశీయులమని చెప్పుకొనెడు వారిచేత అనియు, పై సంస్థానాధిపతులకు మూలపురుషుఁ డని చెప్పఁబడుబేతిరెడ్డి యనియు వ్రాసి పైవారు బేతిరెడ్డి వంశజులు కా నట్లును, బేతిరెడ్డి వారికి మూలపురుషుఁడు కానట్లును, స్వకీయదృఢవిశ్వాసమును సూచించినను సూచింప వచ్చును గాని నిజమైనచెవిరెడ్డివంశీయత్వము పై వారియందు లేనట్లు సూచించుట తగదు కదా!

ఒకవేళ సింగభూపాలీయమునందును అనపోతమాదానాయకుల శాసనములయందును వెన్నమనాయనినుండియే తమవంశము నభివర్ణించి నందున నంతకుఁ బూర్వుం డగునీచెవిరెడ్డి వారికి మూలపురుషుఁడు గాఁ డని తత్ప్రకరణాంతమున వ్రాయఁబోవుచున్నారు, అందువలన నిట్లు వ్రాసిరా రని యందు రేమో. అయ్యది యవిమర్శపూర్వకలేఖనమని సప్రమాణముగ నచ్చటనే వ్రాయఁబోవుచున్నాను.

ఇఁక ద్వితీయవాక్య మిటు లున్నది. "ఈబేతిరెడ్డినిగూర్చి శ్రీ వెలుగోటివారివంశచరిత్రమునం దీక్రిందివిధముగ వ్రాయఁబడినది.—వీరికి మూలపురుషుఁడు బేతాళనాయఁ డని ప్రఖ్యాతి గాంచినచెవ్విరెడ్డి యను రాజు. ఆరాజు ఘనత గాంచిన కాకతిగణపతిదేవుని రాజ్యకాలమున

శౌర్యధైర్యాదిలోకోత్తరగుణగణపరిపూర్ణుఁడై యామహారాజువలన మిగుల మన్ననగాంచుటయే కాక యనేకబిరుదములను మఱికొంత రాజ్యమును గాంచినవాఁడు. ఈఘనుఁడు వర్తమానవేంకటగిరిసంస్థానాధిపతు లగుశ్రీశ్రీరాజగోపాలకృష్ణయాచేంద్రబహదుర్ కే. సి. ఐ. ఇ. వారికినిరువదియొనిమిదవతరమువాఁడు. ఈరాజశిఖామణియీ వెలుగోటిశాఖకు మాత్రమె కాక జటప్రోలు బొబ్బిలి పిఠాపురము మైలవరము మొదలగు సంస్థానాధిపతులకు మూలపురుషుఁడు—ఇయ్యది బట్టులు వ్రాసినవ్రాఁతలనునమ్మి యవిచారపూర్వకముగా వ్రాయఁబడినవ్రాఁతవలెఁ గాన్పించుచున్నది గాని సహేతుకమైనప్రమాణములతోఁ గూడినదిగఁ గానంబడదు » అని.

ఇది యంతయు నిర్హేతుకనిందయై యున్నది. వెలుగోటివారి వంశచరిత్రమునఁ జెవిరెడ్డి మూలపురుషుఁ డని మొదలుగ వ్రాయుట యేకారణమునుబట్టి యవిచారసిద్ధమో నిరూపింపకయే నిందించుట నిర్హేతుకనింద గాక పోదు గదా! దీనికి సమాధాన మున్మత్తలేఖనంబును బోలె నుపేక్షించుటయె. దీసికన్న రెట్టిగఁ దిట్టుటయు సమాధానమే కాని యయిన నది పండితధర్మంబు గాక పామరధర్మం బగుచున్నది. కాన దీని నుపేక్షించుటయే యుచితంబుగా నున్నది. ఇదిగాక, పూర్వవాక్యనిరాసమువలననె యిదియు నిరస్తప్రాయం బగుచున్నది. అయినను విచ్ఛిత్తివిశేషాదరమున నించుక వ్రాయ నెంచుచున్నాను. వీరి నాలుగువాక్యములలో వ్రాసినవిషయములనే చర్విత చర్వణముగ వ్రాసియున్నారు కాఁబట్టి వాని ఖండనము గూడ « యక్షానురూపోబలిః ” అనున్యాయము ననుసరించి యట్లె వ్రాయవలసియుండును. అభిజ్ఞులు మన్నింతురు గాక.

వీరభద్రరావుగారు « చేతిరెడ్డిని గూర్చి యీక్రిందివిధముగ వ్రాయఁబడిన ” దని నుడువుచు, చెవిరెడ్డి మూలపురుషుఁ డని వ్రా

సినవ్రాఁతను దెచ్చి చూపుట యసంబద్ధముగ నున్నది. బేతిరెడ్డి మూలపురుషుఁ డనివ్రాసినవ్రాఁతను దెచ్చి చూపుటయే కదా పైవాక్యమున కనుగుణం బగును. వెలుగోటివారివంశచరిత్రస్థములై వీరిచే నిచ్చట వ్రాయఁబడినయీవాక్యములలో బేతిరెడ్డివార్తయే లేదు కద! అది లేనపుడు బేతిరెడ్డినిగూర్చి క్రిందివిధముగ నున్న దని దేనింబట్టి వ్రాయఁగలిగిరో వింతగా నున్నది. ఒకవేళ బేతిరెడ్డి యనియు, చెవిరెడ్డి యనియు నామభేదమే కాని యర్థభేదము లే దనువాదము సంగీకరించి యిట్లు వ్రాసితి మందు రేమో. ఆయభేదపక్షమున నైనఁ జెవిరెడ్డిమూలపురుషుఁ డనుటయందు బాధ లేదు. ఒకవేళ, అట్లనుట వలన బేతిరెడ్డి మూలపురుషుఁ డని చెప్పిన ట్లగు ననియు నయ్యది నిలువఁ జాల దనియు అందువలన చెవిరెడ్డి మూలపురుషతకు భంగము వచ్చు ననియు నందు రేమో. అట్లనఁ దగదు వారి కిరువుర కభేద మనునంశ మప్రామాణిక మైనను, చెవిరెడ్డి మూలపురుషుఁ డనుట యప్రామాణికము గాఁజాలదు. బేతిరెడ్డియె చెవిరెడ్డి యనుకొనుట భ్రమమూల మైనపుడు చెవిరెడ్డియందు బేతిరెడ్డిత్వము తద్గతధర్మవిశేషములు లేక పోయినను నిజ మైనచెవిరెడ్డిత్వము తద్గతధర్మములు నుండక పోవుఁ గద! కాఁబట్టి చెవిరెడ్డి మూలపురుషుఁ డనుట యప్రామాణికము గానోపదు. ఈవిషయ మింకను ముందు వివరింపఁబడును.

ఇదిగాక, వీరభద్రరావుగారు పిల్లలమఱ్ఱి బేతిరెడ్డియనియు పల్నాటిబేతినాయఁ డనియు బేతాళనాయఁ డనినామాంతరము గల చెవిరెడ్డి యనియు వేర్వేఱుపురుషులనుగా నీడఁ దీసి యున్నారు. ఈ విషయము నీప్రకరణమున నచ్చటచ్చట వ్యక్తపఱచుటయే కాక 10 వ ప్రకరణములో 286 పేజీలో «పిల్లలమఱ్ఱిబేతిరెడ్డియు పల్నాటివీరుఁ డైన ......బేతినాయఁడును చెవ్విరెడ్డియని నామాంతరము గలపిల్లలమఱ్ఱి

బేతాళనాయఁడే యని శ్రీవెలుగోటివారివంశచరిత్రమునందు వక్కాణింపఁబడిన హేతువులు పరస్పరవిరుద్ధములై పొందిక లేక యున్న వని యాఱవప్రకరణమున సవిస్తరముగఁ జర్చించి యున్నాను" అని వ్రాయుటచే వ్యక్తపఱచినారు.

ఇంతియ కాక, వల్నాటిబేతినాయఁడు బ్రహ్మనాయని వంశము వారికి మూలపురుషుఁ డనియు, పిల్లలమఱ్ఱిబేతిరెడ్డి మల్లారెడ్డివంశజులకు మూలపురుషుఁ డనియు స్వాశయమును వెల్లడిపఱచి, చెవిరెడ్డి పలానావారికి మూలపురుషుఁ డని వ్రాయక మానుకొన్నారు. అట్లు వీరు మానుకొన్న చెవిరెడ్డి పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁ డని వెలుగోటివారివంశచరిత్రములో వ్రాయుట, వీరి కేమి విపరీతముగఁ దోఁచి యుండునో తెలియ రాక యున్నది. పై ముప్వురిలో నెవ్వఁడును పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁడు కాఁగూడ దని వారి సంకల్పమున్నచో నుండవచ్చును గాని దానికిఁ బ్రమాణం బెద్దియో యగపఱచుటయు, అట్టిపురుషుఁడు మఱియెవఁడో నిర్ధారించుటయు, జెవిరెడ్డి మూలపురుషుఁ డని బోధించెడు పూర్వులు వ్రాసినగ్రంథము లప్రామాణికము లనిస్థాపించుటయు, మొదలగునవి యత్యంతావశ్యకములు.

ఒకవేళ నాగ్రంథములలోఁ బరస్పరవిరోధములు మెండుగా నుండుటనుబట్టి వానిలో వ్రాయఁబడిన చెవిరెడ్డిమూలపురుషత్వాది విషయము లప్రామాణికములని చెప్పఁగల రన్నచో నట్లనఁ దగదు. ఎందు కనఁగ, చరిత్రకారులు వారివారికి దొరకినయాధారములనుబట్టి కొన్నివిషయములను భిన్నభిన్నరీతిగా వ్రాసినను, చెవిరెడ్డి మూలపురుషుఁ డనునంశము నందఱు నైకకంఠ్యముగ నొండొంటికి విరోధలేశము లేకుండ వ్రాసియున్నారు కాన నయ్యది యప్రామాణికం బన నొప్పదు. ఏ విషయమందు గ్రంథములు పరస్పరవిరుద్ధములుగ నుండునో

ఆవిషయముయొక్క ప్రామాణ్యము సందిగ్ధము కావచ్చును గాని యేవిరోధము లేక యేకరూపముగ నందఱిచే వ్రాయఁబడినవిషయముయొక్క ప్రామాణ్యము సందిగ్ధ మెటులు గానోపును? అట్లగుచో లోకమునందున్న చరిత్రము లన్నియు యత్కించిద్విరోధమును బురస్కరించుకొని యప్రామాణికములు గావలసి వచ్చును? పురాణేతిహాసాదులయందుఁగూడ నెన్నియో విరోధములున్నట్లు తోఁచుచున్నవి అంత మాత్రమున నవియు నప్రామాణికములు గావలసి వచ్చును. శాసనములు గూడఁ బరస్పరవిరోధోద్భావనముచే నగ్రాహ్యములు కావలసి వచ్చును. వీరభద్రరావుగారు మొన్న దొరకిన గుండయదండనాథుని భార్యయొక్కయొడ్డమానిశాసనములోఁ గాకతివారు శూద్రులని వ్రాసినా రనుటనుబట్టి గణపతిచక్రవర్తి స్వయముగ వ్రాయించిన శాసనములను సిరసించి కాకతివారు శూద్రు లని స్థాపించినారు కారా? కాఁబట్టి శుష్కతర్కముల కెవ్వియు నిలువ నోపక ప్రమేయసిద్ధియే దుర్లభం బగును.

ఇఁక నగ్రిమగ్రంథమున "సోమదేవరాజీయమునందును, పద్మనాయకచరిత్రమునందును ... పిల్లలమఱ్ఱిశాసనములో నుదాహరింపఁబడినబేతిరెడ్డియే పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁ డైనబేతాళనాయఁ డని చూపించినహేతువులు పరస్పరవిరుద్ధములై ...యున్నవి" అని వ్రాసి యున్నారు గావున బేతాళనాయఁడు పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁ డనుటయందు వారియాక్షేప మేమియుఁ గానరాదు గదా యన్నచో, మఱి యేల "ఇయ్యది బట్టులు వ్రాసినవ్రాఁతలను నమ్మి యవిచారపూర్వకముగ వ్రాసినవ్రాఁత" యని మొదలుగా నోటికి వచ్చినట్టు దూఱుచున్నారు, కారణము లేక దూఱుట వెట్టిపానిధర్మంబు కదా!

ఇఁక నేమైన వెలుగోటివారివంశచరిత్రములోనిపై వాక్యములో, బేతిరెడ్డి వెలుగోటివారికి మూలపురుషుఁ డనియు, గణపతిదేవునికాలమున నుండె ననియు, నాయనవలన గౌరవింపఁబడె ననియు, వేంకటగిరిప్రస్తుతప్రభువరులకు నిరువదియొనిమిదవతరమువాఁ డనియు, జటప్రోలు మొదలగుసంస్థానాధిపతులకుఁ గూడ మూలపురుషుఁ డనియుఁ గానంబడుచున్న యైదువిషయములలో నెద్దియో వసవీరభద్రరావుగారికి సమ్మతము గాక యుండి యిట్లు నిందించుచున్నారో యేమో. అయ్యది విమర్శించి చూతము.

పైవిషయములలో మొదటి దగు బేతాళనాయుఁ డనినామాంతరము గలచెవిరెడ్డి వెలుగోటివారికి మూలపురుషుఁ డనువిషయమును వెనుక నేను గనుపఱిచినయుక్తులచేతను, తమయొక్కయంగీకారము సూచించునట్టి "పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁ డయినబేతాళనాయుఁడు" అనువాక్యముచేతను, వీరభద్రరావుగా రంగీకరించినవారే కదా! ఇందువలననే యితరసంస్థానాధిపతులకు మూలపురుషుఁ డనువిషయముగూడ వీరిచే నంగీకృతప్రాయంబు గాక మానదు. ఇఁక శ్రీవేంకటగిరిప్రస్తుతప్రభువరులకుఁ జెవిరెడ్డి యిరువదియొనిమిదవతరమువాఁడనునది వీరికి సమ్మత మేమో అనుకొనుటకువీలులేదు. అట్లగునప్పుడు వంశావళిలో నిప్పుడు గానవచ్చుచున్న పురుషులను గొందఱను ద్రోసివేయుట యైనను గొందఱను జేర్చుటయైనను గర్తవ్యం బగును. అయ్యది సప్రమాణముగ నుండనిచో నప్రయోజకం బగును కావున దాని నెత్తికొనఁ బనిలేదు. ఇట్లు చూడఁగా గణపతిదేవునికాలమునఁ జెవిరెడ్డి యుండె ననియు నామహారాజవలన సమ్మానింపఁబడె ననియు నీరెండువిషయములే శేషించి యున్నవి. వెనుక నావిషయములను రెంటినె వీరు నిరసించినారు కాఁబట్టి యావిషయములే వీరి కసమ్మతంబులు గానోపును, అయినను అది నిలువఁ జాలదు. ఎందు కనఁగ, వెనుక వ్రాయఁబడినదెల్ల

బేతిరెడ్డినిగూర్చి వ్రాయఁబడిన విషయము, ఈవాక్యములో వ్రాయఁబడిన దెల్లఁ జెవిరెడ్డినిగూర్చి వ్రాయఁబడినవిషయము గాన విషయభేదమునుబట్టి యట్లనుకొనుటకు వీలు లేదు. ఆతండే యీతం డనివారొప్పరెరి. కాఁబట్టి బేతిరెడ్డి మరణమువలనఁ జెవిరెడ్డిజీవనమున కేమియు భంగము లేదు. అట్లగుటంజేసి గణపతిదేవునివలనఁ జెవిరెడ్డి సమ్మానింపఁబడుటకు విరోధ మేమియుఁ గాన రాదు. ఇఁక, చెవిరెడ్డి జీవించియుండి సమ్మానింపఁ బడెననుటయందుఁ బ్రమాణ మెద్దియు లేదన్నచో, వీరభద్రరావుగారు వ్రాసినవ్రాఁతయందే ప్రమాణము లే దనియు వెలుగోటివారివంశచరిత్రకారులు వ్రాసినవ్రాఁతయందుఁ బెక్కుపూర్వగ్రంథములు శాసనాదులు ప్రమాణములున్నవనియు ననఁగలను. ఆవిషయము తరువాతిగ్రంథములో వెల్లడి చేయఁబడును. కాఁబట్టి చెవిరెడ్డి గణపతిదేవునివలన సమ్మానింపఁబడెననుట నిరాకరింప నర్హంబు గాదు.

ఒకవేళ, బేతిరెడ్డియుఁ జెవిరెడ్డియు వేఱు కా రనుపక్షమునఁ బైదోషములు రాక మానవు, ఎందుకనిన, వెనుక వీరభద్రరావుగారు సిద్ధాంతీకరించినదానింబట్టిచూడఁగా గణపతిదేవునినాఁటికి బేతిరెడ్డిమరణించియున్నవాఁడే కదా! బేతిరెడ్డియె చెవిరెడ్డి యైనపుడు చెవిరెడ్డియు నాఁటికి మృతి నొందినవాఁడె యన వలయు, అట్లు మృతి నొందినవాఁడు గణపతిదేవునివలన నెటులు సమ్మానింపఁబడి యుండ వచ్చును. అని యాక్షేపింతురేమో. వారిసిద్ధాంతము సరియైనది కా దని యనేకభంగుల నిరసించి గణపతిదేవునినాఁటికి బేతిరెడ్డి జీవించియె యుండెనని వెనుక సవిస్తరముగ వ్రాసి యున్నా నని సమాధానము చెప్పఁగలను. కావున మామతమున గణపతిదేవుని రాజ్యమునాఁటికి జీవించియేయున్న బేతిరెడ్డి యనుచెవిరెడ్డి గణపతివలన సమ్మానింపఁబడుటకు విరోధ మేమియు లేదు. వారిరువుర కభేదము భ్రమమూల మని యెంచినను చెవిరెడ్డి సమ్మానింపఁబడినాఁ డనుటకు భంగము కలుగదు.

"నహి రజతత్వభ్రమప్రయుక్తా ప్రవృత్తిశ్శుక్తిన్నగోచరయతి" అను న్యాయమున, శుక్తి రజత మనుకొనుట భ్రమమూలమైనను రజత మను బుద్ధితోఁ జని పుచ్చుకొన్నపుడు నిజమైనశుక్తియె విషయ మగునట్లు అభేదబుద్ధితో బేతిరెడ్డి సమ్మానింపఁబడె ననునపుడు అందుకు నిజమైన చెవిరెడ్డి సమ్మానమె విషయ మగుచున్నది.

ఇఁక మూఁడవవాక్యము విమర్శింపఁబడును. అయ్యది క్రిందివిధముగ నున్నది. "సోమదేవరాజీయమునందును, పద్మనాయకచరిత్రమునందును, వేంకటగిరివారివంశావళిగ్రంథమునందును, రావువంశీయులచరిత్రమునందును, వీని నన్నింటిని బరిశీలించి సంస్కరణము గావించి నూతనముగా బ్రకటింపఁబడిన వేంకటగిరిరాజులవంశచరిత్రమునందును, పిల్లలమఱ్ఱిశాసనములో నుదాహరింపఁబడిన బేతిరెడ్డియె పైసంస్థానాధిపతుల మూలపురుషుఁ డైనబేతాళనాయఁ డని చూపించిన హేతువులు పరస్పర విరుద్ధములై యుక్తికిని సత్యమునకును దూరములై యున్నవి" అని.

ఇది, శ్లో "ఏష వంధ్యాసుతో యాతి శశశృంగధనుర్ధరః। మృగతృష్ణాంభసి స్నాతః ఖపుష్పధృతశేఖరః॥" అనున ట్లొప్పి యున్నది. ఎందు కనిన, పైగ్రంథములలోఁ బిల్లలమఱ్ఱిబేతిరెడ్డియె పై వారిమూలపురుషుఁ డగుబేతాళనాయఁడు అని ప్రతిజ్ఞావాక్యము వ్రాసి, తత్సాధనంబునకై కొన్ని హేతువులు వ్రాసి యుండిననే కదా వీరు వ్రాసినయీవాక్య ముపపన్నం బగును. వానిలో వీరు వ్రాసినవిషయమే లేదు. ఇంతయేల? వెలుగోటివారివంశచరిత్ర మనునూతనగ్రంథమునఁ దక్క నితరములయందు బేతిరెడ్డియనునామపూర్వియే గానంబడదు. ఆగ్రంథకర్తలకు బేతిరెడ్డి బేతాళనాయఁడు అగునా? కాఁడా? యని సంశయమున్ననే కదా వారు బేతిరెడ్డి బేతాళనాయఁడని స్థాపించుటకుఁ బ్రయాసపడుదురు. వారి కాసంశయము లేదు. వా రట్లు వ్రాసినవారును గారు.

సోమదేవరాజీయములో నేమియున్నట్లు భావించి యిందు దాని పేరువ్రాసి
రో ఇంకొకపరి వారే యాగ్రంథమును బఠించి మెలంగవలయు. ఇట్లా
గ్రంథములలో లేనివిషయములు వానిలో నుండినట్లును వానిస్థాపన
మునకై యాగ్రంథకారులు గొన్ని హేతువుల నగపఱచినట్లును
ఆహేతువుల కొండొంటికి విరోధ ముండినట్లును వ్రాయుట పైశ్లోక
ములోఁ జెప్పఁబడినవిషయము ననుకరించుచున్నదనుట కెంతమాత్రము
సంశయము గాన రాదు. ఇది గాక పైగ్రంథములలో నీహేతువులు
వ్రాయఁబడిన వనియు, వానిలో నొండొంటికి నిట్లు విరోధము వచ్చు
చున్న దనియు పీ ఠిగ్రంథములో నెచ్చటను నిరూపింపకయే యిట్లు
దూషించుట నిర్హేతుకదూషణం బగుటం జేసి వెనుక వ్రాసినరీతిగా
నున్న త్తలేఖనంబునుబోలె దీని నుపేక్షించుటయే యుచితంబు.

ఒకవేళ 186 న పేజీ మొదలుకొని 191 వ పేజీవఱకుఁ గల గ్రంథ
ములో రావుగారు బేతిరెడ్డియె బేతాళనాయఁడు అని స్థాపించుటకుఁ బై
గ్రంథకర్తలు చూపినహేతువుల నె యుపన్యసించి వానిలోఁ గలపరస్పర
విరోధములను దేటపఱచి "యీగాధల నన్నింటిని విడిచి పెట్టి...చూచి
నను బేతిరెడ్డి పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁ డనుసిద్ధాంతము
నిలువఁ జాల" దనియు "బేతిరెడ్డియె బేతాళనాయఁ డని హేత్వా
భాసములతో నిరూపించినారు" అనియు, బేతిరెడ్డియొక్క మూలపురు
షతను గూర్చి పైగ్రంథకారులు వ్రాసినహేతువులనే తుదివఱకు
విమర్శించినారు కాఁబట్టి యీ గ్రంథములో నెచ్చటను నిరూపింపకయే
యిట్లు దూఱుట నిర్హేతుకదూషణం బనుట తగ దని యందురేమో.

దాని న్విమర్శించెదను 186 మొదలు 191 పేజీవఱకుఁ వా రీ
క్రిందివిధముగఁ బూర్వగ్రంథములలో వ్రాయఁబడిన విషయములకుఁ
బరస్పరవిరోధాదుల నగపఱచినారు "వెలుగోటివారివంశచరిత్రకారులు

పూర్వగ్రంథములకుఁ బ్రత్యక్షవిరుద్ధముగఁ జెవిరెడ్డిగాథను గల్పించినారు. హేమాద్రిరెడ్డిపేరు పూర్వగ్రంథములలోఁ నెచ్చటను లేకయుండఁగా నూతనగ్రంథకారులు హేమాద్రిరెడ్డిపేరును వ్రాసినారు. రేచని కిచ్చిన వరములు మూఁడనియు నాల్గనియుఁ బ్రాచీనగ్రంథములలో నుండఁగా వీరొకవరమనియే వ్రాసినారు. కవీంద్రులు వేడుకతోఁ జెవిరెడ్డిని బేతాళుఁడని పిలుచుచు వచ్చిరని ప్రాచీనగ్రంథములలో నుండఁగా నూతనగ్రంథములో గణపతిదేవుఁడు చెవిరెడ్డికి బేతాళనాయఁడని పౌరుషనామము నిచ్చినాఁడని వ్రాసినారు. అనియీమొదలైనవిరోధము లగపఱచినారు.

ఇయ్యవి బేతిరెడ్డియే బేతాళనాయఁడని స్థాపించుటకు «పైగ్రంథకారులచే వ్రాయఁబడినహేతువులు గావు. ఎంతమందబుద్ధినైనను జెవిరెడ్డికిట్టిగాథ లుండుటవలన బేతిరెడ్డియే బేతాళనాయఁడని తలంపఁడు గద. ఇట్టిస్థితిలో నీగాథలు పైవిషయమును సమర్థించుటకు వ్రాయఁబడినహేతువులుగా వా రెటులు తలంచిరో వింతగా నున్నది. ఒకవేళ, వారు హేతుపదార్థ మిట్టిదే యని నమ్మి వీనికే హేతువులని నామకరణము చేసి యున్నారు కాఁబట్టియే పై గ్రంథకారులు చూపినహేతువులు పరస్పరవిరుద్ధములై యున్న వనియు హేత్వాభాసములతో నిరూపించినా రనియు మొదలుగ నీప్రకరణమున బహుభంగుల వ్రాయుటయే కాక పదవప్రకరణమునను «శ్రీవెలుగోటివారివంశచరిత్రమున వక్కాణింపఁబడినహేతువులు పరస్పరవిరుద్ధములై పొందికలేక యున్నవి» అని వీనినే నిర్దేశించి యున్నా రనినచో, సంతసించుచున్నాఁడను. హేతువు లనగాఁ జెవిరెడ్డినిగూర్చి పైగ్రంథములలో వ్రాయఁబడినచరిత్రములనియు, హేత్వాభాసములనఁగా వానిలోఁ గల పరస్పరవిరోధములనియు, వీరభద్రరావుగారు నమ్మియున్నచో నంత

కన్న సంతసింపఁదగిన దేది యుండఁ గలదు? ఈవిషయము ముందు విస్త
రముగ విమర్శింపఁబడును.

ఇఁక నాలవవాక్యము శేషించి యున్నది. అయ్యది క్రిందివిధ
ముగ నున్నది. "మఱియు నీగ్రంథములలో నసత్యము లైనట్టియు నసం
దర్భములైనట్టియు విషయము లెన్నో యవిమర్శపూర్వకముగఁ జొప్పిం
పఁబడినవి. వానిని జక్కఁగ విమర్శించి యథార్థ మిట్టి దని లోకమునకు
వెల్లడిచేయ కుండినయెడల జనసామాన్య మాగ్రంథములోని గాథలనే
పరమప్రమాణములుగా శిరమున వహింతురు అందువలన సత్య మైన
చరిత్రవ్యాపనకుఁ బ్రతిబంధకము గలుగును" అని.

ఈవాక్యము పై మూఁడు వాక్యములయర్థము నామ్రేడితము
చేయుచున్నది. ప్రథమవాక్యములో "బట్టులచేఁ గల్పింపఁబడిన
గాథలు" అనుటచే నయథార్థము లగుగాథలు అనునర్థము తేటపడు
చున్నది గద! బట్టుపద మయథార్థవక్త లనునర్థమును బోధించు నని
గ్రంథకర్తగారి యభిప్రాయము. కల్పితపద మయథార్థ మనునర్థమును
బోధించు నని లోక మెఱుంగును. ఇదిగాక "సత్య మైనచరిత్రాంశము
లను" అనుటచేఁ బూర్వోక్తము లగు గాథలసత్యము లైన వని వెల్లడి
యగుచున్నది. ద్వితీయవాక్యమందు "ఇయ్యది బట్టులపొగడ్తలను
నమ్మివ్రాసినవ్రాత" అనుటచేతను, తృతీయవాక్యమున "సత్యమునకు
దూరములై యున్న" వనుటచేతను, బై యర్థమె చెప్పఁబడిన దనుట
నిర్వివాదాంశము. కాఁబట్టి యీనాలవవాక్యము పై మూఁడింటియర్థ
మునే యామ్రేడితముగఁ జేయుచున్నది. ఇందువలనఁ బై వానియొక్క
నిరాసగ్రంథమె దీనినిరాసమునకుఁ జాలియున్న దని యెంచి దీనినివదలి
ముందు వీరు నిరూపింపఁ బోవు సిద్ధాంతమున కవతారిక యైనవాక్య
మును, అనఁగా "కాఁబట్టి యీబేతిరెడ్డికి చెవిరెడ్డి యనునామము

లేదనియు, బేతిరెడ్డి వేంకటగిరి...సంస్థానాధిపతులకు మూలపురుషుఁడగు బేతాళనాయుఁడు కాఁడనియు సహేతుకముగ నిరూపింపఁబోవుచున్నాను » అనుదాసిని విమర్శించుచున్నాను.

ఈవాక్యమున « సహేతుకముగ » అనునది, సత్యముగ సప్రమాణముగ గ్రంథాంతర విరోధరహితముగ, సయుక్తికముగ, సందర్భసహితముగ అనువాని కుపలక్షణముగ నున్నది. కానిచోఁ బై గ్రంథములలో వ్రాయఁబడిన విషయములకును వీరభద్రరావుగారు నూతనముగఁ గనిపెట్టి వ్రాయఁబోవువిషయములకును భేదము లేకపోవును. అట్లగునపుడు వానిని దూఱుట యనుచిత మగును. కాఁబట్టి పైవాని కీపద ముపలక్షక మని యొప్పి తీర వలయు. ఒకవేళ నిందు « సహేతుకముగ నిరూపింపఁబోవుచున్నాను '' అనుటవలన వీరు నిరూపింపఁబోవు విషయములు సహేతుకము లనియు, బైగ్రంథములలో వ్రాయఁబడిన విషయములు సహేతుకములు గా వనియు నేర్పడును కాఁబట్టి పైవానికి వీనికి సహేతుకత్వ నిర్హేతుకత్వములు వ్యావర్తకము లని చెప్పెద మందు రేమో. అట్లనఁ దగదు. ఎందు కనఁగా, ద్వితీయవాక్యమున « సహేతుకము లైనప్రమాణములతోఁ గూడినవిగాఁ గనుపట్టవు '' అనుటచేతను, తృతీయవాక్యమున « హేతువులు పరస్పరవిరుద్ధములై యున్నవి » అనుటచేతను, పై గ్రంథములలో వ్రాయఁబడినవిషయములు సైతము ప్రమాణవంతములు హేతుమంతములునై యున్న వని తేటపడుచున్నది కదా! కాఁబట్టి యట్లనఁ దగదు. ఇఁక నా ప్రమాణములు సహేతుమంతములు గా వనియు నా హేతువులు పరస్పరవిరుద్ధములై యున్న వనియుఁ బై వాక్యములచేత నే బోధిత మగుచున్నది కావున నవి సప్రమాణములు సహేతుకములు కానేర వన్నచో నది నిలువఁ జాలదు, ఎందు కనిన, పైగ్రంథములలో

వ్రాయఁబడినవిషయములలో హేతువులు ప్రమాణములు లేవనియుఁ దాము వ్రాసిన విషయములలో నవి గలవనియు, వీరభద్రరావుగారి సిద్ధాంతము నిలువఁ జాలదని నిరూపింపఁ బోవుచున్నాను. కాఁబట్టి పై వానికిని వీరు వ్రాయు విషయములకును సహేతుకత్వనిర్హేతుకత్వములు గాని, సప్రమాణత్వాప్రమాణత్వములు గాని వ్యావర్తకములు గాఁజాలవు. ఇఁక సత్యత్వాసత్యత్వములు వ్యావర్తకము లగు నన్నచో నవియుఁ గావు. వారు మాత్రవాసిన వ్రాఁతలు సత్యములు, పరులు వ్రాసిన వ్రాఁత లసత్యములు, అని ప్రతిజ్ఞచేసినంతమాత్రమున నవి సిద్ధించున వి కావు. వారివాక్యములు వేదములవలె స్వతఃప్రమాణములు గావు. వారాప్తులును (యథార్థవక్తలును) గారు. భ్రమప్రమాదములలో మెలఁగి రాగద్వేషాదిపరిపూర్ణులైనయస్మదాదులాప్తులు కా రనియు, మన్వాదిమహర్షులే అట్టివా రనియు, శాస్త్రకర్తలు నిరూపించి యున్నారు. ఇదిగాక “కవీనా ముచ్ఛ్రియ సౌందర్యగుణా మృషోద్యాః, కవే రాహార్యవర్ణనమ్” అని మొద లగు వచనములచే బట్టులు మాత్రమె కాక, కవులందఱు వర్ణనప్రస్తావమున నయథార్థవాదులే యగుచున్నారు కాఁబట్టి బట్టు లయథార్థవాదులు, వీరభద్రరావుగారు యథార్థవాదులు అని వక్కాణించుటకు వీలు లేదు.

ఇందువలన, సోమదేవరాజీయము పద్మనాయకచరిత్రము మొదలగు గ్రంథములలోఁ జెవిరెడ్డినిగూర్చి వ్రాసినగాథ లసత్యము లనియు, తాము వ్రాయఁబోవువిషయములు, అనఁగా బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యను నామము లేదు, బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁ డనునవి సత్యము లనియు వీరభద్రరావుగారు వ్రాసికొన్నవిషయము విశ్వసింపఁదగినది కాదు. దీనివలననె, పై గ్రంథకారులు వ్రాసినచరిత్రలు, నిర్హేతుకములు, అప్రమాణములు, పరస్పరవిరుద్ధములు, నిర్యుక్తికములు,

తాము వ్రాయువిషయములు సహేతుకములు సప్రమాణములు విరోధరహితములు, సయుక్తికములు అని మొదలుగఁ బొగడుకొనుట విశ్వాసపాత్రము గా దని తేటపడక పోదు.

ఇది గాక, పూర్వగ్రంథకారులు వ్రాసిన హేతువులు పరస్పరవిరుద్ధము లని చెప్పినవారి సిద్ధువిచారించెదను. పైవారిలో నొకరిచే వ్రాయఁబడినవిషయములకు మఱియొకరిచే వ్రాయఁబడినవిషయములు విరుద్ధము లనుపక్షమున, ఆవిషయములకు మీచే వ్రాయఁబడిన విషయములుగూడ విరుద్ధము లేల కాక పోవును? ఆగ్రంథకారు లెవ్వరును బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యనునామము లే దనియు, బేతిరెడ్డి పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁ డగు బేతాళనాయఁడు కాఁ డనియు, వ్రాసి తత్సాధనమునకై మీరు వ్రాసిన హేతువులను వ్రాసినవారు కారు కద! వా రొకవిధముగ వ్రాసియుండఁగ మీరు మఱియొకవిధముగ వ్రాయుట వానికిఁ బ్రత్యక్షవిరుద్ధము కాక మాన దని వ్రాయఁ బని లేదు. కాఁబట్టి పూర్వగ్రంథకారులు వ్రాసిన హేతువులు పరస్పరవిరుద్ధములు మేము వ్రాసినవి యట్టివి కా వని వ్రాసికొనుట యుచితంబుగాదు. అని.

ఇకఁ, బూర్వగ్రంథములలోని హేతువులు నిర్యుక్తికములు, తాము వ్రాసినవి సయుక్తికములు, అని వీ రే యాధారములచేత స్థాపింపఁగలరో వానిచేతనే వీరు వ్రాసిన హేతువులు నిర్యుక్తికములు, పైవారు వ్రాసినవి సయుక్తికములు అని స్థాపింప వచ్చును.

బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యనునామము లే దనుటయు, బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁ డనుటయు సందర్భసహితం బెట్లో బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యనునామము కలదు బేతిరెడ్డి బేతాళనాయఁ డగును అనుట యసందర్భం బెట్లో వా రే యూహింపవలయు.

ఒకవేళ నీవిషయములు గాక మఱికొన్ని పూర్వగ్రంథములలో నసందర్భముగ నున్న వని గ్రంథకర్తయభిప్రాయ మందు రేమో. అట్లగుచో “కాఁబట్టి...నిరూపింపఁబోవుచున్నాను” అని వ్రాయుట యసంబద్ధమగును. పూర్వు లట్లు వ్రాసినారు అందువలన లోకులు వానినే నమ్మఁగలరు కాబట్టి నిరూపింపఁ బోవుచున్నాను అని వ్రాయుటవలన నిరూపణీయాంశము పూర్వగ్రంథములయం దగపడి చిన దోషములకు నిసర్తకమయ్యె తీరవలయును గదా! అసందర్భములు నిరూపణీయములు వేర్వే రగునపు డది యెట్లు ఘటిల్లును?

ఇదంతయుఁ బరిశీలింపఁగాఁ జెవిరెడ్డినిగూర్చి పూర్వగ్రంథములలో వ్రాయఁబడినచరిత్రములయందు వానిసాధనమునకై యగపడిచినహేతువులయందు వీరభద్రరావుగా రేయేదోషముల నుద్భావించుచున్నారో ఆయాదోషము లన్నియుఁ దమచే వ్రాయఁబడునట్టి బేతిరెడ్డిచరిత్రములయందు వాని హేతువులయందు జాగరూకములై యుండఁగల వని తేటపడక పోదు. ఇట్లుండఁ బైవానిని నిందించి తమ వ్రాఁతను బొగడుకొనుట హాస్యాస్పదముగ నున్న దన్నమాట వివరింపఁ బనిలేదు.

ఇఁక నీవిచార మిటు లుంచి వీరిచే వ్రాయఁబడిన పైరెండువిషయములలో మొదటివిషయమును గూర్చి అనఁగా బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యనునామము లే దనుదానింగూర్చి వీరిచే వ్రాయఁబడిన(!)గుర్తుగల గ్రంథము విమర్శింపఁబడుచున్నది. అయ్యది క్రిందివిధముగ నున్నది.

“ఈ రేచర్ల బేతిరెడ్డికి బేతిరెడ్డి యనియే జన్మనామ ముండెను గాని చెవిరెడ్డి యనుజన్మనామ ముండలే దని బేతిరెడ్డిభార్య యగు నెఱ్ఱక్కసానమ్మ శాసనమున

“శ్లో. తస్మా త్తస్యాం సమజని మహాదేవపాదాబ్జభక్తః
ఖ్యాతో బేత స్తతవితరణప్రీణితప్రాణివర్గః

ఆశాచక్రే ప్రవితతశరచ్చంద్రసాంద్రాంశురమ్యా
య స్యాత్యర్థం జనసుఖసముత్పాదనీ భాతి కీర్తిః ”

అనిసంస్కృత మందును, “ శ్రీమతు రేచర్ల పిల్లలమఱ్ఱి బేతిరెడ్డి పెండ్లము ” అని తెనుఁగునందును బ్రయోగింపఁబడిన బేతిశబ్దముచేతనే స్పష్ట మగుచున్నది. కాఁబట్టి ప్రకృతము నైజాం రాజ్యమునకుఁ జేరి యున్న నల్లగొండ రాజ్యములోని యామనగల్లు రాజధానిలోను, ఆమనగంటి కుత్తరభాగమున రెండు క్రోశముల దూరములో నున్న పిల్లలమఱ్ఱి రాజధానిలోను వసించి యా దేశము నేలినవాఁడు బేతిరెడ్డియె కాని బేతాళనాయఁ డను నామాంతరము గల చెవిరెడ్డి మాత్రము కాఁడు ” అని.

దీనివిమర్శమునకన్న ముస్నీ విషయము తేటపఱచుట యావశ్యకమై యున్నది. ఈవాక్యములలో నొకదాని కొకటి సంబంధింపక యసంబద్ధంబులై యున్నవి. ఎందు కనిన, బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యనునామము లేదని ... నిరూపింపబోవుచున్నాను ” అను ప్రథమప్రతిజ్ఞా వాక్యముచేత, బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యనునామము బొత్తిగ నిషేధింపఁబడినట్లు తేటపడుచున్నది. “ బేతిరెడ్డికి బేతిరెడ్డి యనియే జన్మనామముండెను గాని చెవిరెడ్డియని జన్మనామముండ లే ” దను ద్వితీయ ప్రతిజ్ఞావాక్యముచేత బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యనునామము బొత్తిగ నిషేధింపఁబడక జన్మనామముగ నుండుటయే నిషేధింపఁబడినట్లును, అందువలన వ్యవహారనామముగ నుండ వచ్చు నని యంగీకరింపఁబడినట్లును దేటపడుచున్నది. “ కాఁబట్టి ప్రకృతము... చెవిరెడ్డి మాత్రము కాఁడు ” “ అనునిగమనవాక్యముచేత, బేతిరెడ్డియా ? చెవిరెడ్డియా ? ఆమనగల్లుపిల్లలమఱ్ఱిరాజధానులలో వసించి యాప్రాంతదేశము నేలుచుండినవాఁ డని సంశయ మున్నట్లును, ఎఱ్ఱకసానమ్మశాసనములోఁ బ్రైవితముగ బేతపదముఁ వ్రాయఁబడినందున నట్టివాఁడు బేతిరెడ్డియే కాని చెవిరెడ్డి కాఁ డని నిశ్చయ మైనట్లును దేటపడుచున్నది. తొలుత

"బేతిరెడ్డికి నాపేరే లే" దని వ్రాసిన చెవిరెడ్డినామముయొక్క సామాన్యనిషేధమునకును, "తరువాత నదిజన్మనామము కా" దని తన్నామముయొక్క విశేషనిషేధమునకును, ఆవల, "కాఁబట్టి యీమానగల్లుప్రాంతమునేలినవాఁడు బేతిరెడ్డియే కాని చెవిరెడ్డిమాత్రము కాఁ" డని నిగమనమునకును నెట్టిసంబంధము పొసఁగునో యిట్టి యవయవకల్పనం బే శాస్త్రమునకు సమ్మతంబో వారే యాలోచింపవచ్చును.

ఇఁక నేతత్ప్రతిజ్ఞాతాంశస్థాపనమునకై వీరగపఱచిన ప్రథమహేతువు విమర్శింపఁబడుచున్నది. ఎఱ్ఱక్కసాని శాసనములో బేతపదమును వ్రాయుట, బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యనునామము లే దనుటకుఁ గాని, అట్టి జన్మనామము లేదనుటకుఁగాని హేతువు గాఁజాలదు. ఎందుకన, అందు బేతిరెడ్డికిఁ బైనామము లే దని చెప్పలేదు. బేతిపద స్వారస్యమును బట్టి యి ట్లూహించెద మన్నచో నయ్యది శాసనగ్రంథాదులలో జన్మనామమే వ్రాయవలయు నని గాని దన కున్ననామము లన్నియు వ్రాయవలయు నని గాని నియమ ముండుచో నిర్వహించును. అట్టి నియమము దుర్లభము. ఎందు కనఁగ, అనేకశాసనములలో గ్రంథములలోఁ బురుషునకుఁ గల నామములలో నొకటి గాని బిరుదనామము గాని తఱచుగఁ గానంబడుచున్నది. అందు మొదటివిషయము సుప్రసిద్ధంబగుటచే రెండవవిషయమున కుదాహరణ మిచ్చుచున్నాను కనుఁడు. ఏకశిలానగరములోనిరుద్రదేవునిశాసనములో

"శ్రీమత్త్రిభువనమల్లో రాజా కాకత్యవంశసంభూతః
ప్రబలరిపువర్గనారీ వైధవ్యవిధాయకాచార్యః."

అను శ్లోకమునఁ గాకతిబేతరాజునకు బిరుదనామ మగు త్రిభువనమల్లశబ్దమే వ్రాయఁబడినది. ఇది బేతరాజునకు బిరుదనామమే కాని జన్మనామము కా దని యీయాంధ్రచరిత్రముయొక్క క

వ ప్రకరణమున 150 పేజీలో వీరభద్రరావుగారుకూడ "ఇతనికి త్రిభువనమల్ల బేతరాజు జనించెను, త్రిభువనమల్ల అనునది బేతరాజునకు బిరుదనామము" అని వ్రాసియున్నారు. సింగభూపాలీయములో సింగభూపతివర్ణనప్రస్తావమున

శ్లో. యుష్మాభిః ప్రతిగండభైరవరణే ప్రాణాః కథం రక్షితాః
ఇత్యంతఃపురపృచ్ఛయా యదరిషు ప్రాప్తేషు లజ్జావశమ్
శంసంత్యుత్తర మాననవ్యతికరవ్యాపారపారంగతా
మందాందోలితకర్ణకుండలహరిన్మాణిక్యవర్ణాఙ్కురాః."

అనుపద్యమునందు సింగభూపతికి బిరుదనామ మగు ప్రతిగండ భైరవపదమే వ్రాయఁబడినది. కాఁబట్టి శాసనగ్రంథాదులయందుఁ బురుషులకుఁ గలనామము లన్నియు వ్రాయవలయు నను నియమము గాని, జన్మనామమే వ్రాయవలయు నను నియమము గాని లేదు. అది లేనపు డెఱ్ఱక్కదేవిశాసనములో బేతపద ముండుటవలన నదియే జన్మనామ మని గాని, బేతపదము దక్క నితరనామ మారాజునకు లే దని గాని సిద్ధాంతము నిలువఁజాలదు. ఇందువలన "బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యని నామములేను" అనుదానికి ద్వితీయప్రతిజ్ఞావాక్యమును బట్టి జన్మనామము లే దనుటయుం దె పర్యవసాన మను కొని నిర్వహింపఁ జూచుటయు నిలువదు. శాసనములలో జన్మనామమే వ్రాయవలయు నను నియమ ముండిననే కదా అది యైనను నిలువఁ బోవును. అది లే దయ్యెను.

ఇదిగాక, వీరు 188 పేజీలో "చెవిరెడ్డికి బేతాళనాయఁడని పౌరుష నామమును గణపతిదేవుఁ డెప్పుడొసఁగెనో విమర్శించి తెలిసికొనుట యావశ్యకమై యున్నది. ఎఱ్ఱక్కసాని శాసనము నాఁటికి అనఁగా 1208 సంవత్సరము నాఁటికి ఎఱ్ఱక్కభర్త బేతిరెడ్డి యనియే చెప్పఁబడి

యుండుటచేత అంతకుఁ బూర్వమె యీవృత్తాంతము జరిగి యుండవలెఁ గదా! చెవిరెడ్డియొక్క యిట్టి ప్రసిద్ధకృత్యముల వేనిని ఎఱ్ఱక్క తనభర్తను వర్ణించుసందర్భమున వర్ణింప కుండుటకుఁ గారణ మేమి?" అని వ్రాసి యున్నారు. అందువలన శాసనములలో బిరుదనామము గూడ నుండవచ్చునని వీ రంగీకరించినట్లగుచున్నది. బేతపదము బేతాళనామమునకు బదులుగా వ్రాయఁబడినదనియు, బేతాళపదము పౌరుషనామ మగుటచే నిది గూడఁ బౌరుష నామ మేయనియు కదా దీనిపరమార్థముగాఁ జెప్పవలయును. కానిచో నీ యాక్షేపమున కవకాశమే లేక పోవును కాఁబట్టి యీ యాక్షేపము నిలుపుకొనుటకై పై విషయము నంగీకరింప వలయు. అట్లగునపుడు పైనియమమునకు భంగము గలుగుటయే కాక మఱియొక జన్మనామ మారాజునకుఁ గాన రానందునఁ జెవిరెడ్డి యనునదియే జన్మనామ మని పర్యవసాన మేర్పడుచున్నది. ఇ దంతయు నభ్యుపేత్యవాద మన్నచో దీని స్థితి యెటు లుండినను నుండుం గాక "విక్రీతే కరిణి కిమఙ్కుశే వివాదః" అను న్యాయమును బట్టి మా కింక నీవాద మనుపయుక్తము. ఎందు కనఁగా వెనుక బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యనునామమే బొత్తిగ లేదని నిరూపింప సమకట్టిన వారు దానినే గట్టిగఁ బట్టి సాధింపక యది జన్మనామము గాదు, (మధ్యను వచ్చిన వ్యవహారనామము) అని యొప్పుకొన్నపుడు కొంచెమునకై యిఁక వాదించుట పై న్యాయమునకు విరుద్ధంబ యగును గదా! కాఁబట్టి చెవిరెడ్డి యనునది జన్మనామమైననేమి? వ్యవహారనామ మైన నేమి? ఆరాజున కది యున్న దనుటయె ముఖ్యముగ మాయభిమతంబు.

ఇట్లు వీరు (1) గుర్తు గల గ్రంథముచే మొదటి విషయమును అనఁగా బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యను నామము లే దనుదానిని సహేతుకముగ సప్రమాణముగ సయుక్తికముగ ససంద

ర్ఘ్యముగ నితరావిరోధముగ నిరూపించి నత్లించి యిపుడు (2) గుర్తు గలగ్రంథముచే (184 పేజీ మొదలు కొని 191 పేజీ వఱకుఁ గల గ్రంథముచే) రెండవ విషయమును అనఁగా బేతిరెడ్డి పై సంస్థానాధిపతులకు మూలపురుషుఁ డగు బేతాళనాయఁడు కాఁ డనుదానిని సహేతుకముగ ... నిరూపింపఁ బోవుచున్నారు. దీని విమర్శ మిపుడు చేయఁబడుచున్నది.

ఇందొక సందేహము. తొలుత బేతిరెడ్డి పై సంస్థానాధిపతులకు మూలపురుషుఁ డగు బేతాళనాయఁడు కాఁ డని నిరూపించు నట్లు ప్రతిజ్ఞ చేసిరి. తరువాత 184 పేజీ మొదలు 191 పేజీ వఱకుఁ బ్రతిజ్ఞాతాంశమును స్థాపించుటకు హేతువు లని చెవిరెడ్డియొక్క చరిత్రములలోఁ గొందఱు గ్రంథకారులు వ్రాసిన కొన్ని విరోధాభాసము లగపఱచిరి. ఆవల వానిముగింపులో « ఈవిషయము లన్నింటిని జూచి విమర్శించి నపుడు చెవిరెడ్డిగాథ విశ్వాస పాత్రము గా దని ... బోధపడక మానదు. » అనియు, « ఈగాథల నన్నింటిని వదలిపెట్టి...చూచినను బేతిరెడ్డి పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁ డనుసిద్ధాంతము నిలువఁ జాలదు » అనియు వ్రాసిరి. ఇం దొకదాని కొకటి సంబంధించునట్లు లేదు. బేతిరెడ్డి బేతాళుఁడు కాఁ డని స్థాపించు వారు చెవిరెడ్డిగాథలలో విరోధములు చూపుటయుఁ జెవిరెడ్డిగాథ విశ్వాస పాత్రము గా దని వ్రాయుటయు బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁ డనుటయు నసంబద్ధములుగా నున్నవి కదా! ఇందువలన వీరు, బేతిరెడ్డికి బేతాళనామము లే దనియా? చెవిరెడ్డి గాథ విశ్వాసపాత్రము గా దనియా? బేతిరెడ్డి పై సంస్థానాధిపతులకు మూలపురుషుఁడు గాఁ డనియా? నిరూపింప నెంచినవారు. అని సంశయము కలుగుచున్నది. ఇది యెల్లరకు సులభముగఁ దెలియవచ్చునది గాన దీనిని వదలి (2) గుర్తు గల హేతుగ్రంథము విమర్శించుచున్నాను.

ఇచ్చటి హేతుపదార్థము వెనుక వ్రాయఁబడిన దైనను లోక మున కీపదార్థకల్పనము క్రొత్తది కాఁబట్టి పలుమాఱు వ్రాయవలసిన దేర్పడినది కాన సుఖబోధమునకై మరల వ్రాయుచున్నాను. వీరభద్ర రావుగారు వెనుక 183 వ పేజీలో « బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యను నామము లే దనియు బేతిరెడ్డి వేంకటగిరి ... సంస్థానాధిపతులకు మూలపురు షుఁడు గాఁ డనియు సహేతుకముగ నిరూపింపఁ బోవుచున్నాను" అని ప్రతిజ్ఞ చేసి వ్రాసిన (1) (2) గుర్తులు గల గ్రంథములలో నిది 2 వ గుర్తు గల గ్రంథము కాఁబట్టి యీ గ్రంథమే బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁ డను పై రెండవవిషయమును గూర్చి వారిచే వ్రాయఁబడిన హేతుగ్రంథముగాఁ జెప్పవలసి యున్నది. మఱియు నీగ్రంథము తుదకు 191 పేజీలో « ఈవిషయము లన్నింటిని విమర్శించినప్పుడు చెవిరెడ్డిగాథ విశ్వాసపాత్ర మైనది కా దని ... బోధపడక పోదు" అనియు « వీని నన్నింటిని వదలి పెట్టి ... చూచినను బేతిరెడ్డి మూలపురుషుఁ డను సిద్ధాంతము నిలువఁజాలదు » అనియు వ్రాసినందునఁ జెవిరెడ్డిగాథ విశ్వాసపాత్రంబు గా దనుటకును బేతిరెడ్డి మూలపురుషుఁడు గాఁ డను టకును నిదియే హేతుగ్రంథ మని తేటపడుచున్నది.

ఇట్లు 182 వ పేజీలో « సోమదేవరాజీయమునందును పద్మ నాయకచరిత్రమునందును ... బేతిరెడ్డియే పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁ డైన బేతాళనాయఁ డని చూపిన హేతువులు పరస్పర విరుద్ధములై ... యున్న" వనియు, 191 పేజీలో « బేతిరెడ్డియే బేతాళ నాయఁ డని హేత్వాభాసములతో నిరూపించినా" రనియు, పదవప్రక రణము 286 వ పేజీలో «పిల్లలమఱ్ఱి రేచర్ల బేతిరెడ్డియు ... పిల్లల మఱ్ఱి బేతాళనాయఁడే యని శ్రీవెలుగోటివారి వంశచరిత్రమందు పక్కాణింపఁ బడిన హేతువులు పరస్పరవిరుద్ధములై పొందిక లేక

యున్నవని యీఆఱవప్రకరణమున సవిస్తరముగఁ జర్చించి యున్నాను" అనియు వ్రాసిన వ్రాఁత కిదియే విషయంబై యున్నది. ఆగ్రంథములలో వ్రాయఁబడినహేతువు లెవ్వియో వానిలోఁ గలవిరోధము లెవ్వియో అయ్యవి హేత్వాభాసంబు లెటులో మఱి యెచ్చటను వ్రాయనందున గ్రంథసందర్భమును బట్టి చూడ నీ (2) గుర్తు గల గ్రంథమే పైవిషయమునకు హేతుగ్రంథ మని వీరభద్రరావుగారి యభిప్రాయముగాఁ దేటపడక పోదు గదా!

ఇట్లు చూడఁగా నీ (?) గుర్తు గలగ్రంథములో నుదాహరింపఁ బడిన చెవిరెడ్డి చరిత్రములు, జేతిరెడ్డియే బేతాళనాయఁ డనుటకును, వానిలోఁ గల విరోధములు, భేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁడు చెవిరెడ్డి గాథ విశ్వాసపాత్రంబు గాదు బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడు అను మూఁడువిషయములకును హేతువు లని వీరభద్రరావుగారి యభిప్రాయ మేర్పడుచున్నది. ఈహేతుహేతుమద్భావ కల్పనం బెట్టిదైన నిది వారు సంకల్పించినవిషయములను సాధింపఁ గలుగునా లేదా యను నంశము విమర్శించి చూడవలసి యున్నది.

ఈ 184 వ పేజి మొదటినుండి వెలుగోటివారి వంశచరిత్రములోనున్న దున్నట్లు చెవిరెడ్డిచరిత్రము వ్రాసి యనంతర మిట్లు వ్రాసియున్నారు.—

" ఇది వేంకటగిరి రాజుల వంశచరిత్రమును వ్రాసిన గ్రంథకర్తలయొక్క నవీనకల్పన మని ఘంటాపథముగఁ జెప్ప వచ్చును. ఇది వఱకుఁ బద్మనాయకచరిత్రమునందును వెలుగోటివారి వంశావళియందును వ్రాయఁబడిన గాథలకుఁ బ్రత్యక్ష విరుద్ధముగ నున్నది. ఆ గ్రంథములలోని యసందర్భములను జూచి వీ రిట్టి నవీనకల్పనమునకు కొనుదీయ రైరి " అని.

ఇందు నూతనముగఁ గల్పించుటయు నది పూర్వగ్రంథములకుఁ బ్రత్యక్షవిరుద్ధం బగుటయు నను రెండుతప్పులు పై వారియం దగపడుచుఁ బడినవి. వీనిలో బేతిరెడ్డి పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁ డైన బేతాళనాయఁడు కాఁ డనుట కెద్ది హేతు వగును? నవీనకల్పనమా? పూర్వగ్రంథ విరోధమా? రెండునా? రెండునన్నచో నవి బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁ డనుట నెటులుసాధింపఁగలుగును? ఆకథాకల్పనమునకు బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁ డనుటకు నేలాటిసంబంధములేదు గదా! ఇది గాక వీరు బేతిరెడ్డి వేఱు చెవిరెడ్డి వేఱు అనునిశ్చయముకలవారు. అట్లగునపుడు చెవిరెడ్డిగాధలలోఁ బై వారు కల్పించిన కల్పనమునకు బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁ డని వీరనుటకు నెంతమాత్రము సంబంధము గాన రాదు.

ఒకవేళఁ, బై గ్రంథకర్తలు పూర్వగ్రంథములకుఁ బ్రత్యక్ష విరుద్ధముగఁ గల్పించినారు కాఁబట్టి తన్మూలమునఁ జెవిరెడ్డిగాధ విశ్వాసపాత్రంబు గా దని చెప్పవచ్చును గదా! ఆ యంశమున కిది హేతు వగు నని వారి తాత్పర్య మనుకొందమన్న, నదియు ఘటిల్లునట్లు లేదు. పూర్వగ్రంథకారలేఖనమునకు విరుద్ధముగఁ బై గ్రంథకర్తలు నవీన కల్పనంబు చేసి యున్నచో వారు కల్పించిన చరిత్రము విశ్వాసపాత్రము గాక పోయినను గాక పోవచ్చును గానిఁ చెవిరెడ్డి గాధయే విశ్వాసపాత్రం బెటులు గాక పోవచ్చును? అప్రగల్భుం డగునొక కవి తప్పులకుప్పగా నొకచరిత్రము వ్రాసినచోఁ దన్మూలమున నాతండు వ్రాసినగ్రంథమే విశ్వాసపాత్రంబుగాక పోవును గాని తత్ప్రతిపాద్యులగు ప్రతాపరుద్రకృష్ణరాయాదుల చరిత్రములే విశ్వాసపాత్రములు గాక పోవుఁ గద! కాఁబట్టి వెలుగోటివారి వంశచరిత్రకారులు పూర్వగ్రంథస్థ విషయములకుఁ బ్రత్యక్షవిరుద్ధముగ వ్రాయుట చెవిరెడ్డిగాధ విశ్వాసపాత్రంబు గాదని మొదలగువానికి నిర్వాహకము గాదు.

ఇఁక « ఆగ్రంథములలోని యసందర్భము లైన గాథలను జూచి వీరిట్టి నవీనకల్పములకు వెనుదీయరైరి » అని వ్రాయుటచే నీ నవీన గ్రంథమునందే గాక ప్రాచీనగ్రంథములందును జెవిరెడ్డిగాథ వేర్వేఱు వితముగఁ వ్రాయఁబడిన దని తేటపడుచున్నది. అట్లు గ్రంథములలో వేర్వేఱువిధముగ నుండినందున నేది ప్రమాణమో యేది యప్రమాణమో నిశ్చయింపవలను లేక, వినిగమనావిరహమునఁ జెవిరెడ్డిగాథయె విశ్వాసపాత్రంబు గా దని తేటపడకపోదుగదా! యనినచో, ఇచ్చట వీరభద్రరావుగారికి ముఖ్యోద్దేశ్యం బెద్దియో తెలియఁ దగియున్నది. బేతిరెడ్డి పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁ డగు బేతాళనాయఁడు కాఁ డని యుపక్రమించి యుపసంహారమున « బేతిరెడ్డి వేంకటగిరి...సంస్థానాధిపతులకు మూలపురుషుం డనుసిద్ధాంతము నిలువఁజాలదు'' అని వ్రాయుటచే బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁ డనియుఁ బై సంస్థానాధిపతులకు మూలపురుషుఁడు కాఁ డనియు నిరూపించుటయే వీరి ముఖ్యోద్దేశ్యమని యేర్పడుచున్నది. ఇట్లగునపుడు చెవిరెడ్డిగాథ విశ్వాసపాత్రము గాదని ఫలితార్థము వ్రాయుట యేమిపని? దానివలనఁ బ్రతిజ్ఞాతాంశము స్థిరపడునా?

ఇదిగాక, గ్రంథకర్తలు వారివారికి దొరికినట్టియుఁ దోఁచినట్టియు విశేషములను బురస్కరించుకొని చరిత్రములను వ్రాయుట లోకప్రసిద్ధంబై యున్నది. అయ్యవి యగ్రాహ్యంబు లగుచో వీరభద్రరావుగారు కృష్ణదేవరాయఁడు దాసీపుత్రుఁ డను విషయమునందును గాకతివారికులవిషయమునందును రుద్రదేవి తండ్రివిషయమునందును వ్రాసిన విషయము పూర్వగ్రంథములకుఁ బ్రత్యక్షవిరుద్ధముగా నున్నదని యుపేక్షింపవలసి వచ్చును! కాఁబట్టి పూర్వులు వ్రాసినచరిత్రములకు భేదముగ నుండుటమాత్రము తప్పు గాదు. పై వానికన్న విశేష

ములు చూపుటకే గదా నూతనగ్రంథముల నారంభించుట. కానిచో వెనుకటిగ్రంథములవలననె గతార్థ మగుచుండ నవీనులయారంభములు విఫలంబు లగును. కాన, వెలుగోటివారివంశచరిత్రకారులు పూర్వగ్రంథములకుఁ బ్రత్యక్షవిరుద్ధముగ వ్రాసినా రని దూఱుట తగదు. దూఱినను "భక్షితేపి లశునే న శాంతో వ్యాధిః" అను న్యాయమున స్వేష్టసిద్ధి యైనం గాఁబోదు.

మఱియు వీరభద్రరావుగారు తమకృష్ణదేవరాయలచరిత్రము యొక్క మూఁడవప్రకరణమున 119 పేజీలో, "అయినను దోషవంతము లగు గ్రంథములు వ్రాయఁ బూనుటకన్న మిన్న కుండుట యుత్తమం బని యూర కుండ వచ్చునా? ఊరకుండ రా దని నేను దృఢముగాఁ జెప్పెదను. మన గ్రంథములలోని దోషములు మనతరువాతివారు సంస్కరింప వచ్చును. అట్టి యుద్దేశ్యముతోనె బ్రహ్మశ్రీ గురుజాడ శ్రీరామమూర్తిపంతులుగారు, రాయబహద్దరు కందుకూరి వీరేశలింగంపంతులుగారు కవులచరిత్రములను బ్రకటించినారు" అని వ్రాసియున్నారు. ఇందువలన గ్రంథకర్తల యుద్దేశ్యము వీరిచేఁ జక్కఁగఁ దేట పఱుపఁబడినది. ఇట్టి యభిప్రాయముననె కాఁబోలు పద్మనాయకచరిత్రాది పూర్వగ్రంథములయందుఁ దమకు దొరకినట్టియుఁ దోఁచినట్టియు విశేషములను బురస్కరించుకొని ఇప్పటివారికిఁ గొందఱికి దోషవంతములుగాఁ జూపట్టెడువిషయములను వ్రాసి యుండవలయు. వీని నన్నింటిని గమనించియే కొన్నిచోటుల నీవెలుగోటివారివంశచరిత్రకారులు పూర్వగ్రంథములను సంస్కరించి కొన్నివిశేషములు వ్రాసినారు. ఈయంశము వీరభద్రరావుగారే చక్కఁగఁ గనిపెట్టియున్నారు. ఎట్లన, ఆఱవప్రకరణముయొక్క 182 వ పేజీలో, "సోమదేవరాజీయమునందును, పద్మనాయకచరిత్రమునందును, వేంకటగిరివారి వంశావళియందును రావువంశీయచరిత్రమునందును వానినెల్లఁ

బరిశీలించి సంస్కరణము గావించి నవీనముగ వ్రాయఁబడిన వెలుగోటి వారి వంశచరిత్రమునందును " అని వ్రాయుటచేతను, ఆపేజీలోని పుట్నోటులోఁ బై గ్రంథములనామములు పేర్కొని « మొదలగు గ్రంథములలోఁ దమవంశమును గూర్చి యసందర్భము లయినవిషయములు గలవని యూహించి ............ వ్రాయించినది » అని వ్రాయుటచేతను, ఈ 186 పేజీలో « వానిలో నసందర్భములను జూచి " అని వ్రాయుటచేతను స్పష్టముగఁ దేటపఱచి యున్నారు. ఇంతదూరము తెలిసి (వెలుగోటివారివంశచరిత్రకారులు పూర్వ గ్రంథములకు విరుద్ధముగ వ్రాయుటకుఁ గారణము గనిపెట్టి) వ్రాసిన వీరభద్రరావుగారు, « ఇదివఱకు పద్మనాయకచరిత్రమునందు వెలుగోటివారివంశావళియందు రావువంశీయచరిత్రమునందు వ్రాయఁబడినగాథలకుఁ బ్రత్యక్షవిరుద్ధముగ నున్న దని వ్రాయవచ్చునా? « వానిలో నసందర్భములను జూచి " అను స్వకీయలేఖనముచే నిది విరోధించు నని యేల భావింపరైరో వింతగా నున్నది. ప్రాచీన గ్రంథములలో నసందర్భము లున్న వనియు, వెలుగోటివారివంశచరిత్రకారులు వానిని సంస్కరించి నూతనముగ వ్రాసినా రనియుఁ, దాము వ్రాసిన వ్రాఁతచేతనే ప్రాచీనగ్రంథస్థ విషయము లగ్రాహ్యంబు లనియు, నీనవీన గ్రంథస్థవిషయములు గ్రాహ్యంబు లనియుఁ దేటపడుటంజేసి « ఇదివఱకు... వ్రాయఁబడినగాథలకుఁ బ్రత్యక్షవిరుద్ధముగ నున్న " దని దీనియం దగ్రాహ్యత దోఁచునట్లు వ్రాయుట తమయొక్క లేఖనముచేతనే విరోధించును గదా!

ఇది గాక, పూర్వగ్రంథములలో వ్రాయఁబడినవిషయము లసందర్భములుగా నుండినట్లు వ్రాయుటవలన నవి యప్రమాణము లనియు నందువలన నవీనగ్రంథములోని విషయములు ప్రమాణవంతము లనియు

నేర్పడుచున్నది గాన వానికిఁ బరస్పరమును దేజస్తిమిరంబులకుఁ బోలెఁ బ్రత్యక్షవిరోధంబు సహజగుణముగా నుండ దానిని దోషముగా నెన్నుట యుచితంబు గాదు.

ఒకవేళ లోకమున నూతనముగ గ్రంథములు వ్రాయువారు ప్రాచీనగ్రంథస్థ విషయములకు విరుద్ధముగ వ్రాయవలసినపుడు ప్రామాణిక గ్రంథములనో, శాసనములనో అవలంబముగఁ జేసికొని వ్రాయుచున్నారు. అట్లీ వెలుగోటివారి వంశచరిత్రకారు లేప్రమాణముల నవలంబించియు వ్రాసినవారు కారు అని యాశంకింతు రేమో ?

దీనికి మొదటిసమాధానము.—వీరభద్రరావుగా రేప్రమాణములను బట్టి పూర్వగ్రంథము లసందర్భములుగ నున్నట్లును నీనవీనగ్రంథము తత్సంస్కరణ పురస్సరముగ వ్రాయఁబడినట్లును నుడివిరో అవియే ప్రమాణములుగా గ్రహించునది యని.

రెండవది.—నూతనముగ లభించిన బేతాళచరిత్ర మనుద్విపద కావ్యములో వ్రాయఁబడిన యనేకవిషయములను బద్మనాయకచరిత్రాదులలోను వారివారి వంశచరిత్రములలోను గల కొన్ని విషయములను బురస్కరించుకొని పై చరిత్రకారు లట్లు వ్రాసియున్నారు కాఁబట్టి యీయాక్షేపమున కవకాశము లేదు అని. ఈ విషయము వెలుగోటివారివంశచరిత్రముయొక్క యుపోద్ఘాతము 4 వ పేజీని దేటపడఁగలదు. ఇట్లు మొదటి హేతువు ముగిసినది.

రెండవ హేతు విటు లున్నది.—“హేమాద్రిరెడ్డి ధనమును బాఁతి పెట్టి శాసనమును వ్రాయించె నని వీరు కల్పించినారు......హేమాద్రిరెడ్డిప్రశంస లెవ రెత్తలేదు...పద్మనాయకచరిత్రములో మూలపురుషుఁడాదిజగన్నాథరా వని చెప్పి యుండఁగా హేమాద్రిరెడ్డి యని నూత్న గ్రంథమునఁ బేర్కొనియున్నారు...పోలిరెడ్డి ఆదిజగన్నాథరావు నాము

ములు గాని, హేమాద్రిరెడ్డి నామము గాని రేచర్లనామిరెడ్డి యెట్టి కృసానిశాసనములలోఁ గానరావు" అని.

ఇదియు వెలుగోటివారివంశచరిత్రముయొక్క యుపోద్ఘాతపు నాల్గవపేజీపరిశీలనమువలననే దత్తజలాంజలి గాక మానదు.

ఇంతమాత్రమే కాక వీరభద్రరావుగారీ యాంధ్రచరిత్రగ్రంథోపోద్ఘాతమున "వెలుగోటివారివంశచరిత్రము నామూలాగ్రముగాఁ బఠించితిని" అని వ్రాయుట చరిత్రకారులాయాగ్రంథములను జదివి వ్రాయు సంప్రదాయములను జూచి వ్రాసినవ్రాఁతయే కాని పై గ్రంథమును నిజముగఁ బఠించి వ్రాసినవ్రాఁత గాదని యేర్పడుచున్నది. వెలుగోటివారి వంశచరిత్రముయొక్క యుపోద్ఘాతపునాల్గవపేజీలో "పిల్లలమఱ్ఱిలో శివార్చకుం డగు రామలింగమునొద్దనుండిన బేతాళచరిత్ర మనుగ్రంథములో నీ బేతాళనాయని ప్రపితామహుఁ డగు ముంజరాజునకుఁ బూర్వము హేమాద్రిరెడ్డి విక్రమరెడ్డి వీరభద్రారెడ్డి మహీపతిరెడ్డి ముక్కంటిరెడ్డి రామలింగారెడ్డి యని యాఱుగురుపురుషులు వ్రాయఁబడి యున్నారు" అని వ్రాసి యాగ్రంథకర్త లచ్చటచ్చటఁ దచ్చరిత్రములోని హేమాద్రిరెడ్డివృత్తాంతముల నుపయోగించి యున్నారు గద! ఇట్లీచరిత్రముయొక్క నాల్గవపేజీలోనే యింతవ్యక్తముగ వ్రాయఁబడిన హేమాద్రిరెడ్డి పేరే చూడని యీవీరభద్రరావుగారా గ్రంథము "నామూలాగ్రముగాఁ బఠించితిని" అనివ్రాయుట పైవితముననే కాని నిజముగ దానిం జదివి కాదని యేర్పడుటయే కాక గ్రంథమునుజూడక గ్రంథకర్తలనుదూఱుట దుస్సాహసంబని మఱియొకటి యేర్పడుచున్నది.

దీనిస్థితి యెటు లుండినను బూర్వగ్రంథములలో లేనట్టి హేమాద్రిరెడ్డి నామమును నూత్నగ్రంథకారులు వ్రాయుట, బేతిరెడ్డికిఁ జెవిరెడ్డినామము లేదనుటకుఁ గాని బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడను

టకుఁ గాని చెవిరెడ్డిగాథ విశ్వాసపాత్రంబు గా దనుటకుఁ గాని కారణము గాఁ జాలదు. అట్లు కానపుడు

శ్లో. అనిర్లోడితకార్యస్య వాగ్జాలం వాగ్మినో వృథా.

అనున్యాయమున నీవాగ్జాలంబంతయు నిరర్థకంబ. ఇట్లు ప్రతిహేతువు నందును విద్వాంసులు పరిశీలింపఁ బ్రార్థింపఁబడుచున్నారు.

ఇఁకఁ దృతీయహేతువు విమర్శింపఁబడుచున్నది. అది క్రింది విధముగ నున్నది.—“ చేతిరెడ్డి బీదవాఁడై యోరుగంటిలో వీరభటుఁడై కొన్నిదినములు గడిపె నని పూర్వపుగాథలలోను వేంకటగిరివారి వంశావళిలో నింకొకరీతిగాను రావువంశీయచరితములో మఱియొకరీతిగాను... రేచనితోఁ జెవిరెడ్డి చెప్పినట్లు భేదముగా నున్నది ” అని.

ఇదంతయు వెనుక వ్రాసినగ్రంథము వలననే నిరస్తం బగుచున్నది. వాస్తవస్థితిలోఁ బూర్వగాథైక శరణంబు లగుచరిత్రగ్రంథములలోఁ బరస్పరవిరోధము లుండుట దప్పుగా నెన్నఁ దగదు. ఎందుకనిన, వారివారి కుపలబ్ధంబు లైన వృత్తాంతములను బురస్కరించుకొని వారు వా రట్లువ్రాసి యుందురు కాని వేఱు గాదు. యోగజ్ఞానసంపన్ను లైనమహర్షులు వ్రాసినరామాది చరితములయందే యెన్నెన్నో భేదములను జూచుచున్నారము. ఇటు లుఁడ నిప్పటివారు పూర్వులగాథలలో నిజము కనులఁ జూచినవారు గాని యార్షజ్ఞానసంపన్నులుగాని లేరు కాఁబట్టి దేశకాలములవిప్రకర్షమువలనను భ్రమప్రమాదాదిదోషములవలనను బరంపరగాగాథలుబహుశాఖలైయుండక తీరవు. వాని ననుసరించినయిప్పటిచరిత్రములు భిన్నభిన్నప్రకారములై యుండు ననుట చెప్పఁబని లేదు. ఎటులైననిదివా రభిలషించినపైమూఁడు విషయములకు హేతువు గాఁజాలదు. కాన నీలేఖనము వారియుద్దేశ్యమును నిర్వహింపక నిష్ఫలం బగుచున్న దని తెలియునది.

ఇఁక నాల్గవ హేతువు విమర్శింపఁబడును. తద్విధంబు క్రిందిరీతిగఁ జూపఁబడెను —« రేచఁడు మూఁడువరములు గోరినట్లు పద్మనాయక చరిత్రమునందును నాల్గువరము లిచ్చినట్లు వేంకటగిరివారివంశావళియందును జెప్పియుండఁగా వెలుగోటివారివంశచరిత్ర మను నీనూతనగ్రంథమున నొక్కవరమే పేర్కొనఁబడినది. » అని.

వీరు పలుమాఱుఁ బ్రసక్తమైనవిషయమును వదలి యప్రసక్తమైనవిషయములకుఁ బరువిడుట యనుచితంబుగా నున్నది. చేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁడనియు మూలపురుషుఁడు కాఁడనియుఁ జెవిరెడ్డిగాథ విశ్వాసపాత్రము గాదనియు నిర్వహించుట గదా యిప్పుడు ప్రసక్తము. దానికి నూతనగ్రంథకారులు ప్రాచీనగ్రంథవిరోధముగా వ్రాసినా రని కనఁబఱచుట యేమి నిర్వాహకము కాఁ గలదు. స్వపక్షము నిర్వహింపకయే పరపక్షనిరాకరణము తగ దని యేల తలంపరైరో వింతగా నున్నది.

ఒకవేళ నూతనగ్రంథకారులం దూఱుటయే వీరిపరమోద్దేశ్యమనుకొన్న నది యాశామోదకభక్షణంబే కాని నిర్వహించునది కాదు. ఎందు కనిన, పూర్వగ్రంథముల విరోధము మూలమునఁ గదా నూతనగ్రంథములను దద్గ్రంథకర్తలను దూఱుచున్నారు. ఆవిరోధము నిరూపింపఁ జాల రనియు నెట్లో పొసఁగింత మన్న నది స్వప్రతిజ్ఞాతములను నిర్వహింపదనియు వెనుకఁ బలుభంగుల వ్రాయఁబడుటయే కాక ముందును వ్రాయఁబడును గద. ఇది గాక, « తాతస్య కూపో ఽయ మితి బ్రువాణాః క్షారం జలం కాపురుషాః పిబంతి » అనున్యాయమునుబట్టి ప్రాచీనులు వ్రాసినా రన్నమాత్రమునఁ జరిత్రములు విశ్వసింపఁబడవు శాసనాదిప్రమాణంబులు దొరకక యెట్లో వ్రాసినప్రాచీనగ్రంథముల నాదరింపవలయు నని నియమ ముంచుకొన్నచో నవీనగ్రం

థములకుఁ బ్రసక్తియే లేకపోవును. సత్యము మఱుఁగుపడును. కాఁబట్టి యది యంగీకరింప వలనుపడదు.

మఱి యేమనిన, శాసనాదిప్రమాణములు లభించినపుడు వానిమూలమునఁ బ్రాచీనలేఖనముల నుపేక్షింపవచ్చును. ఇట్లు తలంచియె పైగ్రంథకారులు స్వప్రమాణముగ నొకవరమునే స్థాపించి యున్నారు. ఈవరముల విషయములోఁ బైనూతనగ్రంథకారులే కాక శ్రీయుత అక్కిరాజు ఉమాకాంతముగారు కూడఁ బల్నాటివీరచరిత్రోపోద్ఘాతమునఁ గ్రిందివిధముగ వ్రాసియున్నారు.—“ వాని (రేచని) యభీష్టప్రకారము చెవిరెడ్డి తనగోత్రనామము రేచర్లగామార్చెననియుఁ దచ్చరిత్రమునందు వ్రాయఁబడి యున్నది. బేతిరెడ్డి కాకతీయగణపతికాలములో నున్నవాఁ డైన ట్లాసంస్థానాధిపతులచరిత్రమువలనఁ దెలియఁ గలదు. గణపతిదేవుఁడు 13 వ శతాబ్దమున నుండినవాఁడు కనుక వేంకటగిరిసంస్థానాధిపతులు 13 వ శతాబ్దమునుండియే రేచర్లగోత్రమువారై రని దీనిచేఁ దేలును. వెలమయు రేచర్లగోత్రమువాఁడు నైన బ్రహ్మనాయుఁడు 13 వ శతాబ్దమునకుఁ బూర్వమందే యుండుటచేతఁ బైఁ జెప్పఁబడినబేతిరెడ్డికథయొక్క యాథార్థ్యమును సంశయింపవలసియున్నది. వెలుగోటివారు బ్రహ్మనాయునివంశమువారై యుందురు. వీరిగోత్రమునకు రేచర్లనామము బేతిరెడ్డినుండి గాక అంతకుఁ బూర్వమునుండి వచ్చుచున్న దని నమ్మవలయును. రేచర్ల యనుగ్రామమువలన గోత్రమున కాపేరు వచ్చి యుండును ” అని.

కాఁబట్టి ప్రమాణమునకును యుక్తికిని విరుద్ధములైన ప్రాచీనగ్రంథలిఖితవిషయములను త్యజించుట తప్పు గాదు. అది పూర్వగ్రంథవిరుద్ధంబుగా నెన్నఁ దగినదియుఁ గాదు.

ఆయిదవహేతు విటు లున్నది.—“ ఇదియునుం గాక గణపతిదేవుఁడు చెవిరెడ్డిని సన్మానించినతరువాత

క. నాఁ డాదిగ సుకవీంద్రులు
వేడుక బేతాళుఁ డనుచు వేమఱు దిసలన్
బోఁడిమి నుతింప విమతుల
కోడక యవ్విభుఁడు ధాత్రి నొగిఁ జెలు వొందెన్.

అని చెప్పఁబడియుండఁగా, నూతనగ్రంథమున గణపతిదేవుఁడు బేతాళ నాయఁ డని పౌరుషనామ మిచ్చె నని చెప్పఁబడినది. ఇట్టిగ్రంథము లందుఁ బరస్పరవిరుద్ధము లైన విషయము లనేకములు గలవు" అని.

ఇది యేమో కాని వీరు మాటిమాటికి స్వప్రతిజ్ఞాతాంశమును బాడుపఱచి పరదూషణమునకే పాటుపడుచున్నారు. ఇందువలన నేను విధిలేక వ్రాసినవిషయమునె వ్రాయవలసి వచ్చుచున్నది. నూతనగ్రంథమునఁ బూర్వగ్రంథవిరోధము లున్నయెడల నాగ్రంథ మగ్రాహ్యం బని యేర్పడిన నేర్పడవచ్చును గాని బేతిరెడ్డికిఁ జెవిరెడ్డియనుపేరు లేదనియు నారెడ్డి మూలపురుషుఁడు కాఁ డనియుఁ జెవిరెడ్డిగాథ విశ్వాసపాత్రంబు గా దనియు నెటు లేర్పడఁ గలదు?

ఇదిగాక, వీరు వ్రాసిన "నాఁడాదిగ సుకవీంద్రులు" అను పద్యము పద్మనాయకచరిత్రములోను, వేంకటగిరివారివంశావళీపద్యకావ్యములోను, రావువంశీయచరిత్రములోను గానవచ్చుచున్నది గాన వీనిలో నొకదానిం జూచి వ్రాసియుందు రని చెప్పక తప్పదు. ఇట్లగు నపుడు దీనిపూర్వోత్తరసందర్భములు వీరు చూచినవారు కా రని చెప్పవలసియున్నది. ఎందుకనిన, దీనికిఁ బూర్వమందు —

ఉ. దేశము లిచ్చి వేడుక నుతింప సభాసదు లెల్ల మెచ్చఁగా
వాసిగఁ బేరొసంగి కులవర్ధనుఁ డీ ఘనుఁ డంచుఁ బల్మఱున్
గాశికరూశలాటకురుకన్నడకొంకణసింధుమాగధా
ధీశులలోనఁ బెంపు గను ధీరత నీ వని యెంచి పంచినన్.

అనుపద్యమును, దీనికిఁ బరమందు

సీ. నాగభైరవున కా♦నందంబు దళుకొత్త
  నరబలి గావించి ♦ సిరి వహించెఁ
బరఁగ బంచమునకు ♦ వర మిచ్చి కేచర్ల
  గోత్రుఁడై కీర్తి చే♦కొని మెలంగెఁ
బిల్లలమఱ్ఱిపైఁ ♦ బిడుగు వడ్డఁ గడంగ
  గదఁ బూని యుద్ధతిఁ ♦ గదిసి వ్రేసె
బేతాళుఁ డరుదెంచి ♦ భీకరస్థితి నిల్వ
  వెఱవక మాటాడి ♦ వరము లందెఁ
గాకతీశ్వరుఁ డెలమిఁ బ్ర♦కాశముగను
ధరణిఁ బిల్లలమఱ్ఱి బే♦తాళుఁ డనుచుఁ
బిలువ ధాత్రీశు లెఱుఁగఁగఁ ♦ బేరు గాంచె
నతనివిమలప్రభావ మెం ♦ తని నుతింతు.

అను పద్యమును, పై గ్రంథములలో వ్రాయఁబడినది. వీనిలో.— "వాసిగఁ బేరొసంగి కుల♦వర్ధనుఁడీఘనుఁ డంచు" అనియు "కాకతీశ్వరుఁ డెలమిఁ బ్ర♦కాశముగను; ధరణి బిల్లలమఱ్ఱి బే♦తాళుఁడనుచుఁ, బిలువధాత్రీశు లెఱుగఁగఁ♦బేరుగాంచె" అనియుఁ జెప్పఁబడుటచేఁ జెవిరెడ్డికిఁ గాకతీశ్వరుండు పిల్లలమఱ్ఱిబేతాళుఁ డనుబిరుదనామము నొసంగె నని యేర్పడుచున్నది. దీనింబట్టి యేతత్పద్యద్వయమధ్యమున నున్న "నాఁడాదిగ" అనుదానికి గణపతిదేవుఁడు సమ్మానించి పిల్లలమఱ్ఱిబేతాళుఁ డని పేరొసంగిననాఁటినుండి యని యర్థము కాఁ దగియున్నదనుట తెల్లము. "వాసిగఁ బేరొసంగి...పంచినన్. నాఁడాదిగ" అనుగ్రంథసందర్భమును జూచిన నెట్టివానికైన నీయర్థము కాకపోదు కదా!

ఇట్లుండఁగా రావుగారు "గణపతిదేవుఁడు చెవిరెడ్డిని సమ్మానించినతరువాత, నాఁడాదిగ............చెలువొందెన్. అని చెప్పఁ

బడియుండఁగా నూతనగ్రంథమునందు బేతాళనాయఁ డని గణపతిదేవుఁడు పౌరుషనామ మొసంగె నని చెప్పఁబడి యున్నది. " అని వ్రాయుట, యేతత్పూర్వోత్తరపద్యార్థసందర్భములు చూడనిదోష మని దేటపడుచున్నది. కవులు బేతాళుఁ డనుచు నుతించుటకు గణపతిసమ్మానము హేతువు కావలయుఁ గదా! అయ్యది నామప్రదానగర్భంబు గానిచో నేలాటిసంబంధము లేక హేతువు గాకపోవు ననుట వ్రాయఁ బనిలేదు. ఇంత సువ్యక్తముగా నవ్యవహితపూర్వోత్తరపద్యములు గణపతిదేవుఁడు చెవిరెడ్డికిఁ బిల్లలమఱ్ఱి బేతాళనాయఁ డని పౌరుషనామ మిచ్చె నని చాటుచుండినను దానిం గనక వీ రిట్లు విరోధోద్భావనము సేయుట యెట్టిదో వారే యాలోచింప వచ్చును.

ఒకవేళ «గణపతిదేవుఁడు బేతాళుఁ» డనియే పే రొసంగి యుండఁగా బేతాళనాయఁ డని పౌరుషనామ మిచ్చినట్లు వ్రాయుట విరుద్ధము గదా! అని యందురేమో. వాస్తవస్థితిలో గణపతిదేవుఁడు పిల్లలమఱ్ఱి బేతాళుఁడనియె నామ మొసంగినందునఁ బిల్లలమఱ్ఱిశబ్దమును వదలి ప్రయోగింపఁబడునట్టి బేతాళనాయఁడు బేతినాయఁడు బేతాళరెడ్డి బేతిరెడ్డి అని మొదలుగాఁ గల వన్నియు నట్టి వనియే (గణపతిదేవదత్త పౌరుషనామవిరుద్ధము లనియె) నుడువవచ్చును. అయినను, కవులు గ్రంథములలో నిమిడ్చునపుడు సందర్భానుసారముగఁ బిల్లలమఱ్ఱిశబ్దము లేకయు, నాయక రెడ్డిశబ్దములను జేర్చియుఁ బ్రయోగించుచున్నందునను లోకమునఁ దదనుసారముగ వ్యవహరించుటవలనను ని వన్నియు బేతాళపదమునుబట్టి యించుక న్యూనాధికాక్షరములతో నేర్పడి యర్థభేదము లేనిశబ్దము లగుటవలనను వెలుగోటివారివంశచరిత్రములో బేతాళనాయఁ డని పౌరుషనామ మిచ్చినట్లు వ్రాయఁబడినది కాని వేఱు కాదు. ఒకవేళ సార్వభౌముఁడు ప్రీతితోఁ బిల్లలమఱ్ఱి బేతాళుఁ డనియె పిలిచినను లోకులు రాజును బిలుచునపుడు నాయక

పదము రెడ్డిపదము మొదలగు గౌరవవాచకములను జేర్చియె కదా పిలుతురు. కాన నిది దోషముగాఁ గనుపట్టదు.

ఇఁక నేమైన నిట్లందు రేమో. రావుగారు బేతాళనాయఁడనునది యె పౌరుషనామము కాదని వాదించుచుండఁగాఁ బిల్లలమఱ్ఱిశబ్దముతోఁ గూడినదిసైతము పౌరుషనామ మని నుడువుచున్నా రిది యెంతో వింతగానున్న దని. అట్లు తలంపరాదు. ప్రమాణసిద్ధం బైనదానిని వట్టిమాటలతో నిరసించుట పౌసంగదు గదా! దీనికిఁ బైఁ బేర్కొనంబడిన గ్రంథములలోఁ జెవిరెడ్డికి గణపతిదేవుఁడు « పిల్లలమఱ్ఱి బేతాళుఁడు '' అనిపౌరుషనామము నొసంగె నని వ్రాసియుండుటప్రమాణం బగుటయే గాక యిది పౌరుషనామము కా దని వాదించువారి కేమాధారము లేకుండుటయు ననఁగా బ్రతికూలప్రమాణంబు లేకుండుటయు నొక ప్రమాణముగ నెన్నందగును గదా!

పై గ్రంథములు వీరలను గూర్చియే వ్రాయఁబడిన వని గాని, వీరలప్రేరణముననే వ్రాయఁబడిన వని గాని, భట్టులపొగడ్త లని గాని, తీసివేయుట యుచితంబు గాదు. గ్రంథము లెవ్వరిచేత నేవిధముగ వ్రాయఁబడినవైనను వానిలోనివిషయములు సప్రమాణంబు లైనపుడు నిరాకరింప నర్హంబులు గావు గద! ఇది గాక పద్మనాయకచరిత్రములోనిపద్యములను గొన్నిఁటిని దామె వీరభద్రరావుగారు పదవప్రకరణమునఁ బ్రమాణములుగా నెత్తికొన్నారు. ఆగ్రంథము లప్రమాణము లని బొత్తిగఁ దీసివేసినచో వానిలోఁ గలపద్యములను బ్రమాణములుగా నెత్తికొనుట తగదు కదా! కాఁబట్టి ప్రమాణవంతంబు లైనవిషయములను గ్రహించుటయందు గ్రంథకర్తలయొక్క దోషములు ప్రతికూలభావము నొందనోపవు. మఱి యేమనిన, వారలచే వ్రాయఁబడినవిషయములు ప్రబలప్రమాణ విరుద్ధంబు లైనచో నగ్రాహ్యం

ములు కాఁగలవు. కావుననే "శూరుల జన్మస్థానము" అని మొదలుగా వీరభద్రరావుగారు పదవప్రకరణమున వ్రాసినపద్యములు ప్రబలప్రమాణవిరుద్ధము లని చూపి తద్విమర్శమున నిరసింపఁగలను. అట్లు చెవిరెడ్డి కిది పౌరుషనామమే కా దని ప్రబలప్రమాణము చూపినచో నిదియు నగ్రాహ్యంబే యగును. అ శ్లేచ్ఛటను గానరానందునను, ప్రాచీనగ్రంథములలో నిది పౌరుషనామ మని వ్రాయఁబడినందునను నిది ప్రమాణసిద్ధంబై యున్న దనుటకు సందియము లేదు.

ఇంతియుకాదు. దీనికి నెల్లుట్ల సానమ్మశాసనమే ప్రబలప్రమాణంబని చెప్పుచున్నాను. ఎందుకనిన, దానిలో "శ్రీమతు రేచర్లపిల్లలమఱ్ఱి బేతిరెడ్డిపెండ్లము" అని వ్రాయఁబడినదికదా. ఇది 183 వ పేజీలో రావుగారిచేఁ గూడ వ్రాయంబడినది. ఆశాసనమున, రేచర్ల బేతిరెడ్డి యని వ్రాయవలసి యుండఁగా రేచర్లపిల్లలమఱ్ఱి బేతిరెడ్డి యని వ్రాయుట "పిల్లలమఱ్ఱిబేతాఖ్యుఁడు" అని గణపతిదేవుఁడు చెవిరెడ్డికిఁ బౌరుషనామ మిచ్చి యుండె ననుటకుఁ బ్రబలనిదర్శనమై యున్నది. ఇది గృహనామమై యుండినచో, నామిరెడ్డికిఁ గూడ నుండవలయు. వారిశాసనద్వయమునందును రేచర్లనామిరెడ్డి యని మాత్రమే వ్రాయఁబడినది కాని పిల్లలమఱ్ఱిశబ్దము వ్రాయఁబడలేదు. వీరలిరువురు సహోదరు లని వారె వ్రాసియుండుటనుబట్టి వేర్వేఱుగృహనామములు గలవా రనుటకు వీలు లేదు. కాఁబట్టి యిది బేతిరెడ్డికి బిరుదనామ మని యంగీకరింపక దప్పదు. వెనుక వ్రాసినగ్రంథములు గూడ దీనికి సహకారు లగుచున్నవి. కాన బిరుదనామ మనుటకిది ప్రబలప్రమాణమై యున్నది. బేతిరెడ్డి పిల్లలమఱ్ఱిలో వసించినందునఁ గలిగిన వాడుకనుబట్టి యట్లు వ్రాసియుందు రనుకొనుటకు వీలు లేదు. గ్రామాంతరములలోఁ బిల్లలమఱ్ఱిబేతిరెడ్డి యని వ్యవహారముండినను బిల్లలమఱ్ఱిలో నావ్యవహార ముండదు కద! కాఁబట్టి

వాడుక ననుసరించి వ్రాసి యుందు రనుకొనుటయు నొప్పదు. ఎవ్వరైనను స్వగ్రామములో నాగ్రామనామము వ్రాయుట లేదు. దీనింబట్టియే నామిరెడ్డి వ్రాయలేదు. కాఁబట్టి చెవిరెడ్డికి గణపతిదేవుఁడు పిల్లలమఱ్ఱిబేతాళుఁడు అని పౌరుషనామము నిచ్చినాఁ డనియు, దానింబట్టి శాసనములో "రేచర్ల పిల్లలమఱ్ఱిబేతిరెడ్డి" యని వ్రాయఁబడిన దనియు, నందువలన బేతిరెడ్డి బేతాళరెడ్డి బేతినాయఁడు బేతాళనాయఁడు అనునామములు వాడఁబడుచున్న వనియు నెఱుంగునది.

ఇంతియ కాదు. గణపతిదేవుఁడు చెవిరెడ్డి కీపౌరుషనామ మిచ్చినాఁ డనువిషయమును ఆశాసనస్థ మగు "తస్మా త్తస్యా" మ్మను శ్లోకములోని "ఖ్యాతో బేతః" అనునది కూడ వెల్లడిపఱచుచున్నది. బేతఁ డని ఖ్యాతుఁ డైనవాఁ డని దీని యర్థము. గణపతి పేరొసంగిన యప్పటినుండి కవీంద్రులు మున్నగువారు వేడుకతో నీనామమే వాడుచుండుటను బట్టి బేతఁ డని ఖ్యాతి నందినవాఁ డని దీనియభిప్రాయ మేర్పడుచున్నది. ఇం కొకవిశేషము. చెవిరెడ్డికి గణపతిదేవుఁడు పౌరుషనామ మొసంగుటకుఁ గారణం బగు బేతాళవృత్తాంతము సంక్షేపముగ నీశాసనములో సూచింపఁబడినది చూడుఁడు. ఇందు "బేతనదండ" అని నూతనబిరుదము వ్రాయఁబడినది. ఇయ్యది బేతనను (బేతాళుని) దండించినవాఁడు (ఎదిరించినవాఁడు) అనునర్థమును జెప్పుచున్నది. ఇది బేతాళవృత్తాంత సూచకమైన సూత్రముగా నున్నది. బేతన బేతన్న బేతఁడు బేతాళుఁడు మొదలగువాని కంతగా భేదము లే దని వ్రాయంబని లేదు కాఁబట్టి యాశాసనమున ఖ్యాతో బేతః అనియు రేచర్ల పిల్లలమఱ్ఱిబేతిరెడ్డి అనియు బేతనదండ అనియుఁ జెప్పుటవలననే బేతాళునివృత్తాంతము అనఁగాఁ జెవిరెడ్డి బేతాళు నెదిరించినందున మెచ్చి గణపతిదేవుఁడు పిల్లలమఱ్ఱి బేతాళుఁ డని పౌరుషనామ మిచ్చె ననువృత్తాంతము సంక్షేపముగఁ దెలియవచ్చుచున్న దనియు నదియే

బేతాళచరితము మొదలగువానిలోఁ గొంచెమువివరముగఁ జెప్పఁబడిన దనియుఁ బద్మనాయకచరిత్రాదులలో నింకఁగొంత వెల్లడిగా వ్రాయఁ బడినదనియు వీని నన్నింటిని సవరించి వెలుగోటివారివంశచరిత్రమునఁ బై విధముగ వ్రాయఁ బడినదనియుఁ దెలియం దగియున్నది. ఒకవేళఁ జరిత్రములు వ్రాయువారు కొన్నియంశములను యథాశ్రుతముగ వివరించి యుందురుగాక, కొన్ని ప్రశంసావాదము లుండిన నుండుంగాక, ఇంతమాత్రమునఁ జరిత్రాప్రామాణ్యము రాఁ బోదు గదా. ఇట్లుండ నూతనగ్రంథమునఁ బౌరుషనామ మని విరుద్ధముగ వ్రాసినా రనియు, నవీనకల్పనమునకు వెనుదీయరై రనియు, చెవిరెడ్డిగాథయె విశ్వాస పాత్రంబు గాదనియు మున్నగు కోలాహలం బంతయు నవిమర్శ సిద్ధంబ కాని వేఱు గాఁబోదు.

188 పేజీలో రావుగారు «బేతసదండనాథుఁడు" అని వ్రాయుటవలన బేతసదండ అనుదానికి వా రా యర్థమును జేసినారనియు, నందువలనఁ బై యర్థము కా దనియుఁ దలంపరాదు. వారు 178 పేజీలో «వీ రిరువురు కాకతి ప్రతాపరుద్ర గణపతిచక్రవర్తులకు భృత్యులై" యని మొదలుగా బేతిరెడ్డి ప్రతాపరుద్రగణపతుల భృత్యుఁడై యుండినట్లు వెనుక వ్రాసి కూడ బేతసక్రింద దండనాయకుఁ డని యెట్లు వ్రాయఁగలరు? బేతన అనువాఁ డెవఁడు? ఎచట వ్రాయఁబడినవాఁడు? కాకతీయుఁడా? అన్యుఁడా? కాకతిబేతరాజైనచోఁ గాలము మిక్కిలి దూర మగును గదా! ఈ బేతరాజుపదునొకండవశతాబ్దమునంతమునను జెవిరెడ్డి పదిరెండవశతాబ్దమునంతమునను నున్నవారు. వీరభద్రరావుగారు కూడ నీయాంధ్రచరిత్రముయొక్క మైదవప్రకరణములో 150 వ పేజీలోఁ « బేతరాజు పదునొకండవశతాబ్దాంతమునందు నాంధ్రదేశములోని సబ్బిసాయిరమండలమును బరిపాలించెను» అని వ్రాసినారు. అన్యుఁ డగుచో స్వోక్త మైనకాక

తీయభృత్యత్వము భంగపడకపోదు. ఆపేరిటివాఁడు కాకతీయభృత్యులలో నొకఁడుండి, వానికి దండనాయకుఁడు గా నుండెనని చెప్పుట నిరాధారంబు. మఱియు దండశబ్దమునకు దండనాథుఁడను నర్థము లేదు. దండనాథుఁడనఁగా సేనానాథుండు కదా! దండపదము చతురంగసేనాబోధకమైనందునఁ దన్నాథుఁ డని యర్థము గలుగుచున్నది. ఇట్లు పదద్వయముతోఁ రాఁదగినయర్థ మొకదండశబ్దముచేతనే యెటులు వచ్చును? అట్లగునపుడు జనపదము జననాథుని బోధింపవలసి వచ్చును, అది యెచ్చటను గానరాదు. దండశబ్దమునకు శక్తిచే నాయర్థము రాకపోయినను లక్షణావృత్తిచేనాయర్థమువచ్చునని యాశపడుటయు వృథయే. అయ్యది ముఖ్యార్థబాధాదులవలనఁ జెప్పఁదగియుండును. దండశబ్దమునకు లగుడము శిక్ష మొదలగునవియు అచ్ప్రత్యయాంతమైనపుడు దండపంతుఁడు దండకర్త యముఁడు మొదలగునవియు నర్థములు కోశారూఢములై యున్నవి. వీనిలో బేతనకు దండకర్త యనుకొన్నను యముని వంటివాఁడనుకొన్నను ముఖ్యార్థ మువపన్నం బగుచున్నది. ఇట్లుండఁగా లేనిముఖ్యార్థబాధను విననినాథపదార్థమును దండపదమునందుఁ దెచ్చిపెట్టి పద్మనాయకచరిత్రాదిగ్రంథానుకూల్యమును బోనాడి స్వోక్తివ్యాహతిని గనక యూఁగను బేగను లేనిబేతనకు దండనాథుఁ డని వ్రాయుట సాహసమాత్రం బగును కదా! కాన వా రాయర్థమును జేసినట్లు తలంప రాదు.

ఇఁక నాఱవహేతు విటులు చూపట్టుచున్నది—"పద్మనాయకచరిత్రములో మూలపురుషుఁ డాదిజగన్నాథరా వని వ్రాసి యుండఁగా నూత్నగ్రంథములో హేమాద్రిరెడ్డి యని వ్రాసియున్నారు. ఆదిజగన్నాథరావు ప్రోలిరెడ్డి నామములు గాని హేమాద్రిరెడ్డినామము గాని నామిరెడ్డి యొక్కశాసనములలోఁ గానరావు" అని.

ఇత్యాది నేను వెనుక వ్రాసిన గ్రంథముచే దత్తోత్తరము గాక పోదు. ఇదిగాక వీరిట్లు వ్రాయుటవలన చెతిరెడ్డి బేతాళనాయఁడు కాఁడు, చెతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడు, చెవిరెడ్డిగాథ విశ్వాసపాత్రంబుగాదు అనుట యెటులు సిద్ధింపఁగలదని యెంచియుందురో తెలియరాక యున్నది.

ఒకవేళ దీనివలనఁ జెవిరెడ్డి మూలపురుషుఁ డనుటకు భంగము వచ్చునని యెంచి యుందురేమో అదియు నిలువఁజాలదు. ఎందుకనఁగా, పద్మనాయకచరిత్రమునందుఁ జెవిరెడ్డికిఁ బూర్వము ఆదిజగన్నాథరావు ప్రోలిరెడ్డి యుండిరనియే వ్రాయఁబడినదికాని చెవిరెడ్డి పేరెత్తక ఆ పేరునకు బదులుగాఁ పై వారిని మూలపురుషులుగా వ్రాయలేదు. ఇట్లు బేతాళచరిత్రమునందు, బేతాళనాయనికిఁ బూర్వము పదవతరమువాఁడు హేమాద్రిరెడ్డియుండెననియే వ్రాయఁబడినదిగాని చెవిరెడ్డిని బోధించెడు బేతాళనామము వదలి యాస్థానమున హేమాద్రిరెడ్డి యనునామము వ్రాయఁబడలేదు. అట్లు వ్రాసియున్నచో గ్రంథకారులు మూలపురుష విషయములో భిన్నభిన్ననామములు వ్రాసినారు కాఁబట్టి చెవిరెడ్డియే మూలపురుషుఁ డనుట సంశయింపవలసి యున్నదని వీరు వ్రాయవచ్చును. అట్లెవరును వ్రాయలేదు. ఒకవేళఁ జెవిరెడ్డికిఁ బూర్వులు కొందఱుండఁగా నితఁడే మూలపురుషుఁ డని వ్రాయుట తగదని యందురేని, మూలపురుషుఁడనఁగా నయోనిసంభవుఁడని యా? ఒక కుటుంబమునకు మొదటివాఁడని యా? మీ యభిప్రాయ మేమని వీరభద్రరావుగారి నడుగవలసి యున్నది. మొదటిపక్షమున జగదీశ్వరుండు దక్క మఱియొకండు మూలపురుషుం డనువాఁడే దొరకఁడు. ప్రతిపురుషునకును జనకుం డొకం డుండక మానఁడు కదా? రెండవపక్షమునఁ జెవిరెడ్డి మూలపురుషుఁ డనుటయందు బాధకంబెద్దియుఁ గానరాదు. ఇదిగాక, ప్రాచీనగ్రంథకారులు కొందఱు చరిత్రములు వ్రాయు

నపుడు తమకు లభించిన ప్రమాణములను బట్టియో మఱి యేకారణమునన్నో తత్తద్వంశములలో నేనాఁడో ప్రసిద్ధులైనవారిని దెచ్చి యీవలివారినిగా వర్ణించుట గలదు. అంతమాత్రమున నొకనియొక్క నిజమైన మూలపురుషతకు భంగము కలుగ నేరదుగదా! కాకతివారివంశక్రమము విచారించునపుడీయాంధ్రులచరిత్రముయొక్క యైదవప్రకరణపు 19 పేజీలో « ఇంతియగాక గణపతిదేవునికిఁ బూర్వపు శాసనములలో దుర్జయుఁడు వారిపూర్వులలోనివాఁడుగాఁ జెప్పఁబడి యుండలేదు ............ కాకతీయులచరిత్రమునందు మొట్ట మొదటఁ బేర్కొనంబడినవాఁడు త్రిభువనమల్ల కాకతి బేతరాజు, గుంటూరుమండలములోఁ జేబ్రోలు శాసనముల నొకదానిలో బేతరాజు దుర్జయునితరువాతఁ బేర్కొనంబడియెను. నైజాము రాష్ట్రములోని పాఖాల శాసనములో దుర్జయుఁడు ప్రోలురాజు తండ్రి యని వ్రాయఁబడినది............గణపతిదేవునియొక్క గుంటూరుమండలములోని మోటుపల్లి శాసనములో, సూర్యుఁడు మొదలుకొని గణపతిదేవునివఱకుఁ గలరాజులు పేర్కొనంబడి దుర్జయునకును త్రిభువనమల్ల బేతరాజునకును నడుమ మొదటిప్రోలరాజని యొకక్రొత్తనామము గూడ నీయఁబడినది" అనిమొదలుగా నెన్నెన్నియో భేదములగపఱచి తుదకు «ఇవన్నియుఁ బరిశీలింపఁగా నీక్రిందివిధముగాఁ గాకతీయులవంశావళి పేర్కొనవచ్చును» అని సమన్వయించిరి కాని పరస్పర విరుద్ధముగ వ్రాయఁబడినదని తీసివేయ లేదు. అట్లీ రాజులవంశమునందు భిన్నభిన్నప్రకారములుగ నగపడెడివారి నెల్లఁ జూపి వెలుగోటివారి వంశచరిత్రోపోద్ఘాతము 4-5 పేజీలలో నాగ్రంథకారులు సమన్వయించియే యున్నారు. దానిం జూచియుఁ గాకతివారివిషయములోఁ దాము వ్రాసినదెల్ల స్మరించియు రావుగారు సమాధానపడుట మేలు.

ఇఁక నేడవహేతువు.—« చెవిరెడ్డికి బేతాళనాయఁ డని పౌరుషనామమును గణపతిదేవుఁ డెప్పు డొసంగెనో విమర్శించి తెలిసి

కొనుట యావశ్యకమై యున్నది. ఎఱ్ఱక్కసానిశాసనమునాఁటికి... ఎఱ్ఱక్కభర్త చేతిరెడ్డి యనియే చెప్పఁబడి యుండుటచేత నంతకుఁ బూర్వమే యీవృత్తాంతము జరిగియుండవలయును గదా. చెవిరెడ్డి యొక్క యిట్టిప్రసిద్ధకృత్యముల చేసిని ఎఱ్ఱక్క తనభర్తను వర్ణించు సందర్భమున వర్ణింప కుండుటకుఁ గారణ మేమి? మఱియు వితరణ కర్ణ శౌచగాంగేయ...బిరుదములు చేతిరెడ్డి వహించు చుండె నని యీమెశాసనమును బట్టి తెలియవచ్చుచున్నది కదా. ఇట్టి వితరణ కర్ణుండు...తా నైశ్వర్యసంపన్నుఁడై యుఁడియు, ప్రభువై యుండి యుఁ దుచ్ఛధనమునకై తనయందు భక్తివిశ్వాసములు గలిగి...రేచఁ డనువానిని క్షుద్రదేవతల ప్రీతికై సంహరించె ననుమాట విశ్వసించుట కెంతమాత్రము నొప్పి యుండ లేదు" అని మొదలుగా నున్నది.

ఇందువలన శాసనమునం దుదాహరింపమిచే నీవృత్తాంత మంతకుఁ బూర్వము జరిగిన దనుటకును, నట్టి ఘనుఁడైన చేతిరెడ్డి తుచ్ఛధనమునకై రేచని సంహరించినాఁ డనుట విశ్వాసపాత్రంబు గామిచే నంతకుఁ దరువాత జరిగిన దనుటకును, వీలు లేదని దీనియభిప్రాయముగా నున్నది. ఇందు మొదటిదానికిఁ బూర్వహేతువిమర్శగ్రంథము వలననె సమాధానము రాఁగలదు. ఆశాసనములో "ఖ్యాతో చేతః పిల్లలమఱ్ఱిచేతిరెడ్డి చేతనదండ" అనువానిచే గణపతిసమ్రాట్ప్రయోజకంబగు చెవిరెడ్డి వృత్తాంతము సంక్షేపముగ వ్రాయఁబడిన దని వెనుకటి హేతువు విమర్శములో వివరింపఁబడినది కదా! ఇది గాక, ప్రతివిషయమును శాసనములలో వ్రాసియే తీర వలయు ననియు, వ్రాయనిచో నగ్రాహ్యం బగు ననియు నియమములు నిలువఁ జాల వని వెనుక వ్రాయఁబడుటయే కాక ముందును వెన్నోచోటుల వ్రాయంబడుచున్నది. కాఁబట్టి యీప్రథమాక్షేపము నిలుచునది గాదు.

ఇఁక రెండవయాక్షేపముగూడ నిట్టిదే. వెలుగోటివారి వంశచరిత్రమున 5వ పేజీలోఁ జెవిరెడ్డిచరిత్రము వ్రాయునప్పుడిందునకు సమాధానము వ్రాయఁబడినది. దానిం జదివియున్న నీయాక్షేపమే చేయకుందురు. ఇదిగాక,

శ్లో. అసంతుష్టో ద్విజో నష్ట స్సంతుష్ట ఇవ పార్థివః
సలజ్జా గణికా నష్టా నిర్లజ్జేవ కులాంగనా
తృప్తియోగః పరేణాపి న మహిమ్నా మహీయసామ్
పూర్ణశ్చంద్రోదయాకాంక్షీ దృష్టాంతోఽత్ర మహార్ణవః
సంపదా సుస్థిరమ్మన్యో భవతి స్వల్పయాపి యః
కృతకృత్యో విధి ర్మన్యే న వర్ధయతి తస్య తామ్.

ఇత్యాదినీతివాక్యములు రాజుసంపదవిషయములో సంతుష్టుండగుట తగదని మొదలుగాఁ జెప్పుచున్నవి. రాజులు సంపదకై తమపుత్రమిత్రాదులను యుద్ధములందు బలిపెట్టి తామాసంపదతో నానందించుచుండుట సుప్రసిద్ధంబ.

ఇంతియ కాదు. సత్కులీనుఁడు ప్రభువునై యుండిన ముంజరాజు తనయన్నచే నప్పగింపఁబడి బాలుండైన భోజనరేంద్రుని జాతకప్రభావము చూచి తుచ్ఛరాజ్యలోభమున నాతనిని జంప నాజ్ఞాపించుటయు, ధనమునకై శునశ్శేఫునిఁ దలిదండ్రులు యజ్ఞపశువుగా నిచ్చుటయు, సుప్రసిద్ధములు. రాజ్యమునకై కొందఱు చక్రవర్తులు సైతము పితృపుత్రభ్రాత్రాదులను గూడ వధించినట్లు చరిత్రములు చాటుచున్నవి. ఇట్లుండ బేతాళుఁడు నరబలి యిచ్చి ధనము గొనిన నీకు మిగుల శ్రేయోభివృద్ధి యగునని నుడువుటయు దేవతావిషయమైన భక్తివిశ్వాసములు విశేషించి యుండినకాల మగుటయు రేచఁ డొప్పుకొనుచుండుటయు ఘటిల్లినపుడు దేవతాప్రీతిని నమ్మి చెవిరెడ్డి రేచని వధించుట యాక్షేపణీయముగాఁ గన్పట్టదు.

ఇందువలననే దీని తరువాతి గ్రంథముగూడ అనఁగా

"ఎఱ్ఱక్క-శాసనమునాఁటికి గణపతిపరిపాలనము ప్రారంభమై పదిసంవత్సరము లయ్యెను. అలోపలనె చెవిరెడ్డి యను బేతాళనాయనికి గణపతిదేవునివలన సమ్మానము గలిగి పై బిరుదములు వహించుట తటస్థమయ్యెనని చెప్పవచ్చునేమో? అదియు విమర్శింతము. క్రీ. శ. 1208 సంవత్సరమున బేతిరెడ్డి కలంకరింపఁబడినబిరుదములు క్రీ. శ. 1202 సంవత్సరమున నామిరెడ్డి గూడ వహించి యుండెను. వెలుగోటివారివంశ చరిత్రకారులు బేతిరెడ్డి నామిరెడ్డి కన్న యని యూహించుచున్నారు. కాఁబట్టి పైకార్యములకు బిరుదములకు నెట్టి సంబంధము లేదు"

అని మొదలగుగ్రంథము గూడ దత్తోత్తరంబు గాక మానదు. ఇదిగాక పై కార్యములకు బిరుదములకు నిట్టిసంబంధ మున్న దని మేము చెప్పలేదు. సమ్మానమునకుఁ బూర్వము బిరుదములు వహింపఁ గూడ దని గాని అన్న యుండఁగాఁ దమ్ముఁడు వహింపఁ గూడ దని గాని, నిలువఁ జాలనినియమములను మేమంతగాఁ బాటింపము గదా! సమ్మానమునకుఁ బూర్వము బిరుదములు వహించి యున్నచో పితరణ కర్ణాది బిరుదములు గలవాఁడు తుచ్ఛధనమునకుఁ బోష్యుఁ డగువానిని సంహరించుట విశ్వసనీయము గా దనుట దత్తోత్తరం బయ్యెను. కాఁబట్టి యీయాక్షేపము సరియైనది గాదు.

మఱియు నిం దొక యసందర్భము గాన వచ్చుచున్నది. "క్రీ. శ. 1208 సంవత్సరమున బేతిరెడ్డి కలంకరింపఁబడిన బిరుదములు క్రీ. శ. 1202 సంవత్సరమున నామిరెడ్డిగూడ వహించియుండెను" అని వ్రాసినారు. వీరియభిప్రాయ మేమి యుండవచ్చును? నామిరెడ్డి బేతిరెడ్డికన్న యని యూహించువారిమతమున క్రీ. శ. 1202సంవత్సరమున నన్న యగునామిరెడ్డి బిరుదములు వహించుటకును దరువాత క్రీ. శ.

1208 సంవత్సరమున అనఁగా నైదుసంవత్సరములు మధ్యను గడచిన వెనుకఁ దమ్ముఁ డగు బేతిరెడ్డి బిరుదములు వహించుటకును, ఏమియు విరోధము గాన రాదు. ఏల « పైకార్యములకు బిరుదములకు నేలాటి సంబంధము లేదు » అని వ్రాసి యుందురు ? ఒకవేళ బేతిరెడ్డి బిరుదములు వహించుట సంభవించినను జేతాఘుని నెదిరించుటయు గణపతి దేవునివలన సమ్మానింపఁబడుటయు మొదలగు కార్యములు సంభవింపవని యందు రేమో. ఈ యైదుసంవత్సరములలో నెందఱినో యెదిరించి యెన్నియో సమ్మానముల నొందవచ్చును గదా !

ఇంకఁ దరువాతి గ్రంథమున, « అప్పటికి నామిరెడ్డి మృతినొంది యుండ వచ్చునని చెప్ప సాహసింపవచ్చును » అని వ్రాయుటచే క్రీ. శ. 1203 సంవత్సరమువఱకు నామిరెడ్డి జీవించియుండ నని వీరభద్రరావుగా రూహించినట్లు గాన వచ్చుచున్నది. అందువలన జ్యేష్ఠుండు బిరుదములు వహించి పరిపాలనము చేయుచుండఁగాఁ గనిష్ఠుండు పై కార్యముల నొనరించుటకును బిరుదములు వహించుటకును వలనుపడదు గదా యని యాశంకించుకొనియుందురు కాఁబోలు దీనివిమర్శమునకు ముందిది విచారింప వలసియున్నది. వీరు క్రీ. శ. 1195 సంవత్సరమున నామిరెడ్డి బిరుదములు వహింపక క్రీ. శ. 1202 సంవత్సరమున వహించినందున, మధ్యకాలములో క్రీ. శ. 1199 సంవత్సరమున బేతిరెడ్డి మరణమును నిర్ధారించియున్నారు. అది న్యాయ్యం బెట్లో మేము క్రీ. శ. 1208 సంవత్సరమున బేతిరెడ్డి బిరుదములు వహించుటచే నన్న మృతి నొంది యుండవచ్చునని యొకవేళ నూహించినచో నది సాహసం బెట్లో మధ్యస్థు లాలోచింపవలయు. వీ రైన నామిరెడ్డి బిరుదములు వహించుటచేతనే గదా, బేతిరెడ్డి మరణము నూహించినారు. మేము గూడ నాకారణమునే పురస్కరించుకొని క్రీ. శ.

1208 సంవత్సరమునఱకు నామిరెడ్డి మృతి నూహించుచో, నది యెట్లు సాహస మనఁదగును? అని.

వాస్తవస్థితిలో నింతమాత్రమున నామిరెడ్డి మరణమును మేమూహింపవలసినంత పని లేదు. అన్న యగు నామిరెడ్డి వృద్ధుండయియో, విభక్తుండయియో యుండినను దమ్ముఁడు బేతిరెడ్డి క్రీ. శ. 1208 సంవత్సరమునకు రాజ్యమునకు వచ్చి బిరుదములు వహించి యుండవచ్చును గదా. అన్న జీవించి యుండుట రాజ్యప్రాప్తికి బిరుదవహనమునకుఁ బ్రతిబంధకము గాఁజాలదు. ఒకవేళ సంతతునుండైన యన్న జీవించి యుండఁగాఁ దమ్ముఁడు పైకార్యముల నొనరించుటకును సార్వభౌముని వలన సమ్మానింపఁబడుటకును సందర్భ ముండదు గదా యందురేమో. నామిరెడ్డి తమ్ముఁ డనువారు, క్రీ. శ. 1195 సంవత్సరమున అన్న యైన బేతిరెడ్డి బిరుదములు వహించి పరిపాలనము చేయుచుండఁగాఁ దమ్ముఁడు నామిరెడ్డి రుద్రదేవుని సైన్యములో భుజబలముచేతఁ బ్రఖ్యాతి గాంచి వారివలన సంపదవడసి మహోన్నతము లైనగుళ్లు గోపురములు గట్టించి స్థిరవృత్తిస్వాస్థ్యములను గల్పించెననుటకు సందర్భ ముండఁగలదేమో? కొంచె మాలోచింపుఁడు. కాఁబట్టి "పైకార్యములకు బిరుదములకు నెట్టిసందర్భము లేదనుట్రాఁత హృదయశూన్యం బైనవ్రాఁత యకాని వేఱుగాఁ గనుపట్టదు.

దీనిపైని వా రొక గొప్ప యాక్షేపము చేసినారు. ఎట్టిదియన, "వాదముకొఱకు నామిరెడ్డి బేతిరెడ్డి కన్నయే యని యొప్పుకొందము. అతఁడు వహించినబిరుదములచేతను జ్యేష్ఠుం డగుటచేతను, క్రీ. శ. 1202 సంవత్సరమున నామనగల్లు ప్రాంతదేశము నతఁడే పరిపాలించుచుండె నని చెప్పక దప్పదు. అన్న పరిపాలన చేయుచుండఁగాఁ దమ్మునికిఁ గిరీట మిచ్చె ననుట యసందర్భము కాదా? వాస్తవ

ముచేత నామనగంటిప్రభువులు కిరీటాధిపతులు గారు. కిరీటాధిపతు లని యొకవేళ నంగీకరించినను జ్యేష్ఠుఁడు పరిపాలన సేయుచుండఁగాఁ గిరీట మొసంగె ననుట ధర్మవిరుద్ధము. అప్పటికి నామిరెడ్డి కూడ మృతి నొంది యుండ వచ్చు నని చెప్ప సాహసింపవచ్చును. అట్లయిన జ్యేష్ఠునిరాజ్యముతోఁ గూడఁ గిరీటాదిరాజచిహ్నములుగూడఁ దమ్ము నికి సంక్రమింపక మానవు. అట్టి కిరీటాదిరాజచిహ్నములను వహించి యుండఁగా మరలఁ గిరీటము నొసంగ నవసరము లేదు. ఎక్కడ-సాన మ శాసనమునఁ, దనభర్త కిరీటాధిపతి యని వర్ణించియుండలేదు ” అని.

దీని నిరాసప్రకారం బిది—నామిరెడ్డి క్రీ. శ. 1202 సంవత్సర మునకు సరియైన దుందుభిసంవత్సరము చైత్రశుక్లచతుర్దశీ శనివారము నాఁడు శాసనము స్థాపించి నట్లున్నది. కాఁబట్టి యప్పటివఱకుఁ నామి రెడ్డి బిరుదములు వహించి పిల్లలమఱ్ఱిలో నుండెనని యొప్పక దప్ప దన్న సంగతి మాకును దెలియును తరువాత నేరీతిగ జరిగినదో ఆసంగతి వీరభద్రరావుగారికిఁ దెలియదు. మాకును దెలియదు. నాఁటికే బేతి రెడ్డి పైకార్యములను జేసి బిరుదములు వహించి యుండె నని మేము చెప్పినారము కాము. కాఁబట్టి “అన్న పరిపాలనము చేయుచుం డఁగాఁ దమ్మునికిఁ గిరీట మిచ్చె ననుట యసందర్భము కాదా?” యను నాక్షేపమున కవకాశము కలుగఁబోదు. వాస్తవస్థితిలో నామనగంటిప్రభువులు కిరీటాధిపతులు గా రని బోధించెడుశిలాశాన నము రావుగారికి దొరకియున్నను వీర్యవిజయాదులకు సంతసించి సార్వ భౌముఁడు నూతనముగఁ గిరీటము నొసంగి యుండు ననుకొనుటయం దేమియు బాధకముగాన రాదు. కిరీటాధిపతు లని లోకమునఁ బ్రసిద్ధి గన్నవా రైనను, బుట్టుకతోనే కిరీటాధిపతులయి కవచకుండ లములతోఁ గర్ణుండు పుట్టినట్లు పుట్టి యుండరు కదా! మఱి యే మునిన నెవరిచే నైన నొసంగఁబడినకిరీటము దాల్చియే కిరీటాధిపతు

లగుచున్నారు కాఁబట్టి యామనగంటి వారంతకు లోపలఁ గిరీటాధిపతులుగా రనుకొన్నను సార్వభౌముం డనుగ్రహించి జేతిరెడ్డికిఁ గిరీట మిచ్చినాఁ డనుటయుం దేమియు విరోధము గాన రాదు.

ఇది గాక, నామిరెడ్డి మొదటిశాసనములో

« నానావనీనాథకిరీటకోటిరత్నాంశుభి శ్చుంబిత పాదపీఠే »

అనియు రెండవశాసనములో

« భూభృచ్చూడామణి రుచిసముద్భాసితాంఘ్రిద్వయమ్ "

అనియు వ్రాయించియున్నాఁడు. ఎఱ్ఱక్కదేవి శాసనములో

« శ్లో. రాజత్కీర్తే ర్గణపతినృప స్యాఖిలోర్వీశచూడా
రత్నవ్రాతద్యుతితతిసముద్భాసితాంఘ్రిద్వయస్య »

అనివ్రాయించినది. వీనిలో మొదటిరెంటివలనఁ బ్రథమప్రతాపరుద్రుండు గణపతిదేవుండు ననేక రాజులకిరీటరత్న కాంతులచే నీరాజితమగు చరణయుగళము గలవారై యుండి రని తేటపడుచున్నది. ఎఱ్ఱక్కదేవిశాసనమువలన గణపతి దేవుఁడు సకలపృథివీపతి కిరీటరత్నద్యుతితతిసముద్భాసితాంఘ్రిద్వయుఁడై యుండె నని తేటపడుచున్నది. వారివశంవదులైన రాజులుఁ గిరీటధారు లయిననే యీవర్ణనము చెల్లును. ప్రశంసావాద మనుకొన్నచో నెవరును గిరీటాధిపతులే లేన న్లేర్పడును. కొందఱు గల రన్నచో వా రెవరో, ఎచ్చటఁ జెప్పఁబడినారో, అక్కాలమునఁ గాకతివారిసామంతులలో నంతఘను లైన రేచర్లవారు కిరీటాధిపతు లేల కారైరో, అట్లెచ్చట వ్రాయఁబడినదో, నిరూపించుట వీరభద్రరావు గారికిఁ గర్తవ్యంబై యున్నది.

ఈపక్షమున «అన్న యనంతరము రాజ్యముతోఁగూడఁ గిరీటమును వచ్చియే యుండును గదా. మరలఁ గిరీట మిచ్చుట యసందర్భము గాదా " యనునాక్షేపము చేసినారు. కాని యది నిలువఁ

బోదు. ఎందుకనిన, ఇపుడు కిరీటమునకుఁ బ్రతినిధిగా సిరిఫేషును ధరించుట వాడుకలో నున్నది గద! ఇయ్యది నూతనముగ రాజ్యమునకు వచ్చు ప్రతినరపతికిని ఘనతఁజెందిన నిజాంసర్కారువా రిపుడొసంగుచునే యున్నారు. ఇదిగాక, పూర్వము దత్తకిరీటులైనరాజులకు విశేషసమయములందు మరలసిరిఫేషు ఖిల్లత్తు మొదలగునవి యొసంగుట గనుచున్నారము. ఇవన్నియుఁ బరిశీలించినచో మరలఁ గిరీటమిచ్చుట యసందర్భ మనునాక్షేపమున కవకాశము దొరకఁబోదు.

మఱియు బేతిరెడ్డికి గణపతిదేవుఁడు పూర్వ మున్నరాజ్యమున కన్న నింకఁ గొంత యధికముగ నిచ్చినట్లు వెనుక నుదాహరింపఁబడిన « దేశము లిచ్చి » అనుపద్యము బోధించుచున్నది. కాఁబట్టి తదాధిపత్యసూచకముగ మరలఁ గిరీటము నొసంగి యుండ వచ్చు నను కొన్నను రావుగారియాక్షేపమునకు సమాధానము రాఁ గలదు.

ఇఁకఁ బైశాసనమునఁ దనభర్తయొక్క కిరీటాధిపత్యము నెట్టిక్కొసానమ్మ వర్ణింపలేదు గాన నీవిషయము విశ్వాసపాత్రంబు గాఁ దనుట శేషించి యున్నది. అయ్యది పలుమాఱు నడ్డమువచ్చుచున్నది గావున నించుకఁబెంచి నిరసించుచున్నాను. ప్రతివిషయము శాసనములో వ్రాయించిననే ప్రమాణ మగు నని నిర్బంధ మున్నచో నిది నిలుచును. అట్టి నిర్బంధము గాన రాదు. ఈ వెలుగోటివారివంశమున ఆఱవతరము వా రగు ననపోతానాయఁడు మాదానాయఁడు స్థాపించిన శిలాశాసనములలోఁ దమ తాత యగు నెఱ్ఱదాచానాయనియొక్క సుప్రసిద్ధమైన పాండ్యరాజవిజయము పేర్కొని యుండ లేదు. ఎనిమిదవతరము మాదానాయఁడు స్థాపించిన శిలాశాసనమందుఁ దనతండ్రి యగు సర్వజ్ఞసింగమహీపతియొక్క రసార్ణవసుధాకరాది గ్రంథరచనమును గూర్చి యేమియు వర్ణింప లేదు. శాసనములలోఁ బేర్కొనఁబడనందున నివి

యవిశ్వసనీయములే యని చెప్పినచో దాచానాయనిం గూర్చి సింగ భూపాలీయమున

" శ్లో. యస్యాసిధారామార్గేణ దుర్గేణాపి రణాంగణే
పాండ్యరాజగజానీకా జ్జయలక్ష్మీ రుపాగతా "

అని వర్ణించుట మొదలగునది నిరాధారంబై చనును.

ఇది గాక యీయాంధ్రులచరిత్రముయొక్క 363-364 వ పేజీలలో వీరభద్రరావుగారు "పద్మనాయకవీరుండైన యెఱ్ఱదాచానాయనిం (ప్రతాపరుద్రుండు) పాండ్యులమీఁది కంపెను. ఎఱ్ఱదాచానాయుఁడు కాంచీపురసామీప్యమునఁ బాండ్యులతో ఘోరయుద్ధము చేసి వారలను జయించి గజతురగచ్ఛత్రచామరాందోళికాదులు పెక్కులు గ్రహించుటయ గాక శిరోభూషణ మగు నఱచేతివెడల్పు గలయొక గొప్పపచ్చను ఒకస్వర్ణమయసింహాసనమును దీసికొని వచ్చి తాను దెచ్చినధనకనకవస్తువాహనాదులు నమూల్యరత్నాదులును బ్రతాపరుద్రునకు సమర్పించెను. ప్రతాపరుద్రుఁడు మెచ్చి వానికి "పంచపాండ్యదళవిభాల, కంచికవాటచూరకార అనుబిరుదముల నొసంగెనఁట. ఇతఁడు పాండ్యరాజులను జయించినట్టు సింగభూపాలీయ మను గ్రంథమునందలి యీక్రిందిశ్లోకమువలనం గూడఁ దెలియుచున్నది.—

శ్లో. యస్యాసిధారా మార్గేణ దుర్గేణాపి రణాంగణే
పాండ్యరాజగజానీకా జ్జయలక్ష్మీ రుపాగతా
ఖడ్గనారాయణే తస్మి౯ భవతి శ్రీ రతిస్థిరా
భూ రభూ త్కారిణీ వశ్యా దుష్టరాజగజాంకుశే.

మఱియు, శ్రీవేంకటగిరివారివంశావళియందు,

చ. వెలయఁ బ్రతాపరుద్రవిభు♦వీరభటావళి చూడ నాజిలో
బలమునఁ గుంత మందుకొని ♦ చయ్యన వచ్చి గజంబు నోర్చి దో

29292
11.9.87
UNIVERSITY OF HYDERABAD LIBRARY

# ఆంధ్రచరిత్రవిమర్శము.

> ర్వుల మధికంబుగా నెగడఁ బైకొని తా జయలక్ష్మి చేకొనం
> గెలిచెను బాండ్యరాజగజకేసరి దాచయశౌరి పాండ్యులన్.

అని వ్రాయఁబడిన పద్యమువలనను రేచర్లదాచానాయఁడు పాండ్యులను జయించె ననుట ధ్రువపడుచున్నది." అని వ్రాసి యున్నారు.

ఈవిషయములు శాసనారూఢములు గావు. అట్లు కాకపోయినను జరిత్రగ్రంథారూఢము లైనట్టివీనిని బ్రమాణములనుగాఁ జేకొని "రేచర్లదాచానాయఁడు పాండ్యులను జయించె ననుట ధ్రువపడుచున్నది" అని ధ్రువపఱచిన వీరభద్రరావుగారు చరిత్రారూఢ మైన జేతిరెడ్డికిరీటాధిపత్యమును శాసనారూఢము కాదని నిరసించుట తగునేమో వారే యాలోచింప వచ్చును. ఇంక వీరిట్టివాని నెన్నింటినో విశ్వసించి చరిత్ర కుక్షిని నింపి యున్నారు. శాసనారూఢములు గావని వానినెల్లఁ దీసివేసినచో నది యెంతయుఁ గృశించును. కాఁబట్టి పైయాక్షేపమును వారు మానుకొనుట మేలు.

ఇంకొకవిశేషము.—వీరు మధ్యను "ప్రతాపరుద్రుఁడు మెచ్చి వానికిఁ బంచపాండ్యదళవిభాల కంచికవాటచూరకార అనుబిరుదముల నొసంగెనఁట" అని యవిశ్వాససూచకమైన అఁటశబ్దమును బ్రయోగించి యున్నారు. తొలుత "ప్రతాపరుద్రుఁ డెఱ్ఱదాచానాయనిఁ బాండ్యుల మీఁది కంపెను" అని యుద్ధకారణమును, దరువాత "పాండ్యులతో ఘోరయుద్ధము చేసి" అని యుద్ధకరణమును, ఆవల "జయించె ననుట ధ్రువపడుచున్నది" అని జయమును, నమ్మినవీరభద్రరావుగారు, యుద్ధమున కంపినప్రతాపరుద్రుఁడు, జయించి విలువ గల సింహాసనాదులను దెచ్చియిచ్చినవీరుఁ డైన దాచానాయని గౌరవించె ననుటను నమ్మకపోవుట

> " శ్లో. రక్షోగృహస్థితి ర్జ్వాల మగ్నిశుద్ధా త్వనిశ్చయః"

అనునట్లు అర్ధజరతీయన్యాయము ననుసరించుచున్నది కద. ఇది యెట్లు

యున నగుంగాక. పైవిమర్శమువలన శాసనములో లేనట్టికిరీటాధిపత్యము విశ్వసింపఁ దగ దనునాక్షేప మెంతమాత్రము నిలువఁజాలదని తేలినది.

దీనింబట్టియే వీరు 190 వ పేజీలో

« శ్లో. రాజత్యర్తే గ్గణపతినృప స్యాఖిలోర్వీశచూడా
రత్నవ్రాతద్యుతిలతితసముద్భాసితాంఘ్రిద్వయస్య
సన్మార్యాదాసిరతసిఖిలత్మాజనే వర్తమానే
రమ్యే రాజ్యే విపులసుఖదే ప్రోన్నతస్య ప్రహర్షైః.

సమస్తభూపతుల కిరీటరత్నకాంతులచేఁ బ్రకాశింపఁ జేయఁబడినపాద పద్మము గలిగి ప్రహర్షముచే నిండియున్నగణపతిదేవుని రాజ్యకాలమున అని మాత్రము చెప్పినతరువాత నామె దానధర్మమును గూర్చి మూచ్చటింపఁ బడియెను. ఇంతియ గాని తనభర్తయైన జేతిరెడ్డి గణపతిదేవచక్రవర్తి వలన విశేషరాజ్యవైభవములను, గిరీటమును, దక్కుంగలయాయుధవిశేషంబులను బడసినట్లు చెప్పఁబడలేదు. ఇంక, నామిరెడ్డి శాసనమున గణపతిదేవచక్రవర్తి వర్ణింపఁబడినవిమ్మట,

శ్లో. తస్య ప్రసాదా త్పృథువైభవస్య
పృథుప్రదానస్య విభోః పృథుశ్రీః
నామః కృతిస్తుత్యగుణాభిరామః
కాచాంబికాసూను రనూనసత్త్వః.

అని గణపతిదేవునియొక్క ప్రసాదముచేతనే యధికవైభవమును, అధిక సంపదయును మొద లగువానిం బడసినట్లు చెప్పఁబడియున్నది"

అని వ్రాసినదియు నిరస్తంబు గాక మానదు. శాసనములలో వ్రాయఁబడనివిషయము లవిశ్వసనీయము లనియుఁ, బ్రతివిషయము శాసనములలో వ్రాసియే తీరవలయు ననియు నియమనిర్బంధములు లే వని పైవిమర్శముచేత నిర్ధారింపఁబడినవు డీలేఖనము నిరస్తంబు గాక పోదు గదా!

ఇం కొకవింత.—వీరు « తస్య ప్రసాదాత్ » అను నీరెండవ శ్లోకముక్రింద « గణపతిదేవునియొక్క ప్రసాదముచేతనే అధికవైభవమును అధికసంపదయును మొదలగువానిం బడసినట్లు చెప్పఁబడినది » అని వ్రాసి యున్నారు. శ్లోకమున నున్న యేపదము లీయర్థమును అనఁగా నామిరెడ్డి గణపతిదేవునియొక్క ప్రసాదమున నధికవైభవమును అధికసంపదయును బడసినట్లు వీరిచే వ్రాయఁబడినయర్థమును బోధించుచున్నవో చూడవలసియున్నది. శ్లోకమున « నామః పృథువైభవస్య తస్య ప్రసాదాత్ పృథుశ్రీః » అనుపదము లాయర్థమును బోధించునట్లున్నను నామిరెడ్డి పైవానినొందినట్లు బోధింపవు. ఎందుకన, పృథువైభవస్య పృథుశ్రీః అనువానిలో నొకటి షష్ఠ్యంతము నొకటి ప్రథమాంతమునై యున్నది. విశేష్యవిశేషణవాచకపదములు సమానవిభక్తికములై యుండవలయు ననుట శాస్త్రప్రసిద్ధంబు గాన వీనివిశేష్యములు వేర్వేఱుగ షష్ఠ్యంతము ప్రథమాంతమునై యుండవలయును. ఇట్లుండ మనరావుగా రీరెంటికి « నామః " అను ప్రథమాంతపదమే విశేష్య మని యెంచినట్లగపడుచున్నది. కావుననే « గణపతియొక్క ప్రసాదముచేతనే...... (నామిరెడ్డి) బడసినట్లు చెప్పఁబడిన దని వ్రాసియున్నారు. ఇది నామపదము రెంటికిని విశేష్యమైననే చేకూఱును గాని వేఱు గాదు. పృథుశ్రీః అను ప్రథమాంతపదము వీరనుకొన్నట్లు నామః అను ప్రథమాంతమునకు విశేష్యం బయినను, పృథువైభవస్య అను షష్ఠ్యంతపదము తద్విశేషణము గాఁ జాలదు. కాఁబట్టి పృథువైభవస్య అనుదానికి షష్ఠ్యంత మగు నొకవిశేష్యపద ముండి తీరవలయు. పరిశీలింపఁగా నయ్యది గణపతిబోధక మగు విభోః అనుపదముగా నున్నది. పృథువైభవస్య పృథుప్రదానస్య తస్య విభోః ప్రసాదాత్ పృథుశ్రీః...నామః అని యన్వయము గాఁ దగియున్నది. పృథువై

భవుండు పృథుప్రదాతయు నగు గణపతిదేవునియొక్క యను గ్రహమునఁ బృథులసంపద గల నామిరెడ్డి యని యర్థమగుచున్నది. ఇట్లుండఁగా « గణపతిదేవునియొక్క ప్రసాదముచేతనే (నామిరెడ్డి) అధికవైభవమును అధికసంపదయును మొదలగువానిం బడసినట్లు చెప్పఁబడినది ” అని వ్రాయుట సంస్కృతవిభక్తిజ్ఞానము లేని దోషముగాఁ దేటపడుచున్నది.

నిజ మిట్లుండియు నీయాంధ్రులచరిత్రముయొక్కయుపోద్ఘాతపు 27 వ పేజీలో « బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రులవారు శాసనములలోని యనేకసందిగ్ధాంశములను దెలిపియు అపరిశుద్ధములై యున్న శ్లోకములను దిద్దఁ దగినపట్ల దిద్దియు ... గ్రంథము ముద్రింపఁజేసినందులకును ” అని వీరు వ్రాయుట ప్రాహుణికహస్తమున సర్పమారణన్యాయము ననుసరించుచున్నది. ప్రజ్ఞాధికులయి ప్రసిద్ధి గన్న శ్రీ వేంకటరాయశాస్త్రులవారవ్యుత్పన్నులు చెప్పఁ దగిన యిట్టియర్థమును జెప్పియుండరని యెట్టివాఁడైనను దలంపఁడు గదా!

తరువాత « ఏతత్ప్రసాదవైభవముచేతనే నామిరెడ్డి పిల్లలమఱ్ఱిగ్రామంబునఁ గట్టించిన కామేశ్వర కాచేశ్వర నామేశ్వరదేవాలయంబు లేకశిలానగరంబునఁ బ్రతాపరుద్రుండు నిర్మించినయాలయత్రయంబుచందంబున నత్యున్నతములై లోకోత్తరశిల్పంబుతోఁ గురువిందశిలామయములై వెలయుచున్నవి. » అనియు « ఎఱ్ఱక్కసానిశాసనమునాఁటికి బేతిరెడ్డి మరణము నొంది యుండుటచేతనే యామె తన యత్తింటివారియొక్కయుఁ బుట్టినింటివారియొక్కయు వంశాభివర్ణనము గావించి తనధర్మములను గూర్చి చెప్పుకొనుట తటస్థించినది ” అనియు వాక్యద్వయమును వ్రాసి యున్నారు. ఈద్వితీయవాక్యము వెనుక 16 వ పేజీలో « సముద్రఘోషమువలె నిరర్థకమని నిరసించి

యున్నాను. చేతిరెడ్డి గణపతిదేవునిరాజ్యమునాఁటికి జీవించియున్నట్లు బహుప్రమాణములచే సిద్ధించి జీవింపలే దను వ్రాఁత నిలువఁజాలనిదైనపు డిది నిరర్థకంబే కదా! విధవయే అత్తింటివారియుఁ బుట్టినింటివారియు వంశాభివర్ధనము గావింప నధికారము గల దనునియమము దుర్లభంబు కాఁబట్టి యిట్టివానివలన చేతిరెడ్డిమరణము నూహింప నెంచుట నిరర్థకం బనుట దెల్లంబు.

ఇఁకఁ బ్రథమవాక్యము నిస్సార మగుటచే నుపేక్షింపఁదగి యున్నను « వాదీ భద్రం న పశ్యతి » అనున్యాయము ననుసరించి విచారణీయముగ నున్నది. ఏతత్ప్రసాదవైభవముచేతనే అనుదానికి కట్టించిన అనుక్రియయం దన్వయమా? లేక వెలయుచున్న వనుక్రియయం దన్వయమా? మొదటిదానియం దన్వయం బన్నచోఁ బ్రమాణం బెద్దియుఁ గానరాదు. ఆ శాసనములలో నట్లు వ్రాయఁబడి యుండ లేదు. ఇతరప్రమాణములు శశవిషాణాయితములు. ఇదిగాక, « చెవిరెడ్డియొక్క యిట్టి ప్రసిద్ధకృత్యముల వేసిని ఎఱ్ఱక్క ... వర్ణింపమికిఁ గారణ మేమి? ఎఱ్ఱక్క శాసనమున నామెభర్త ... కిరీటాధిపతి యని యభివర్ణించి యుండ లేదు " అని వెనుకవ్రాసినవీరభద్రరావుగారు శాసనానుదాహృత మగునీవిషయము నెటులు విశ్వసించియుందురు? ఒకవేళ, పలాండుభక్షణము పురాణశ్రోతకె నిషిద్ధముగాని వక్తకుఁగా దనుధూర్తపౌరాణికవాక్యము నేమైన ననుసరించి యిట్లు వ్రాసిరో వారికే తెలియవలయును. ఇఁక నంతకు మున్ను వీరి కేమియు విభవము లేక యుండుటయె యీయాలయత్రయము ప్రతాపరుద్రప్రసాదవైభవముచేతనే కట్టింపఁబడిన దనుటకుఁ బ్రమాణ మగుచున్న దని యెంచి యుందు రేమో. అంతకు మున్ను వీరికి విభవమే లేక యుండుట యప్రామాణికం బగుటయే కాక స్వవచనవ్యా

హతంబు నగుచున్నది. వెనుక 179 వ పేజీలో నామిరెడ్డియొక్క రెండవశాసనమును వివరించునపుడు

"శ్లో. శ్రీమత్పద్మజపాదపద్మయుగళా ల్లోకత్రయాభ్యర్చితా
దుద్భూతే విపులే కులే నరవరో భీమాభిధానో భవత్
యః కాంచీనగరీకవాటహరణం కృత్వాప్రచండాహవ
క్రీడ శ్చోడనరాధిపస్య కృతవా న్మానద్రుమోన్మూలనమ్.

అనుశ్లోకమును దానియర్థమును వ్రాసి "ఈశ్లోకమును బట్టి యితని పూర్వులు రాజకీయాధికారపదవులయం దుండి యుద్ధములను జేసి ప్రసిద్ధి కెక్కినవా రనియే తలంపవలసి యున్నది." అని వీరు వ్రాసియున్నారు. నామిరెడ్డికిఁ బ్రతాపరుద్రుని యనుగ్రహమునకుఁ బూర్వము విభవమే లే దని యిచ్చట వ్రాసినచో నది వ్యాహతంబు గాక మానదు కద! పూర్వము భీమరాజునాఁ డున్న విభవము నశించిపోయి మరల నామిరెడ్డినాఁడు గలిగిన దని యూహించుటకు నేమియు నాధారము గాన రాదు. ప్రతాపరుద్రానుగ్రహలబ్ధ మైనవిభవముచేతనే నామిరెడ్డి దేవాయతననిర్మాణము గావించినట్లు శాసనమందు వ్రాయఁబడియున్నచో నీయూహకుఁ గొంత హస్తావలంబ మగును. ఇఁక "వెలయుచున్నవి" అనుక్రియయం దన్వయము చెప్పవలెను. అది ఘటిల్లదు. అనుగ్రహ మతీతము, వెలయుట వర్తమానము. ప్రతాపరుద్రుని యంతఃకరణవృత్తివిశేషరూపమగు ననుగ్రహ మాయనతోడనె పోయినది గదా! అతీతమునకు వర్తమానమునకుఁ గార్యకారణభావము దుర్ఘట మని మొదలుగా నిచ్చట నెంతయో వ్రాయవలసి యున్నది. వెలుగోటివారివంశచరిత్రము 8 వ పేజీలో "నామిరెడ్డి గట్టించిన యాలయంబు లేకశిలానగరంబునఁ బ్రతాపరుద్రుఁడు గట్టించినయాలయత్రయంబు పగిది నత్యున్నతములై లోకోత్తరశిల్పంబుతోఁ గురువిందశిలామయములై వెలయుచున్నవి." అని వ్రాయఁబడియున్నది. స్వక

పోలకల్పితము లెవ్వియు లేక దీని నున్నదాని నున్నట్లు వీరు వ్రాసి యున్నచో నీచిక్కులు ప్రసక్తింప కుండును.

ఇటులు బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁడనుటకు వీరభద్రరావుపంతులుగారు వ్రాసినహేతుగ్రంథము సుదూరనిరస్తం బైనది. ఏ తద్గ్రంథమధ్యమున సామాన్యశంక లెవ్వి యైన నిలిచి యుండిన నయ్యవి నావ్రాసినగ్రంథపరిశీలమున నే దత్తోత్తరంబులు కాఁ గల వని తలంచుచున్నాఁడను.

ఇఁక నీ (2) వ గుర్తు గలగ్రంథము యొక్క ముగింపువాక్య మిటు లున్నది « ఈవిషయము లన్నింటిని జూచి విమర్శించినప్పుడు చెవిరెడ్డి గాథ విశ్వాసపాత్ర మైనది గా దని నిష్పక్షపాతబుద్ధి గలవారికి బోధపడక పోదు. " అని.

ఇయ్యది యుపక్రమవిరుద్ధం బై యొప్పి యున్నది. « బేతిరెడ్డి............బేతాళనాయఁడు కాఁ డనియు సహేతుకముగ నిరూపింపఁబోవుచున్నాను " అని వెనుక 183 పేజీలో రెండవప్రతిజ్ఞావాక్య ముపక్రమింపఁబడినది కాఁబట్టి బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁడని నిరూపించుటయే యుపక్రాంతవిషయము. దానికి « ఈవిషయము లన్నిటిని జూచి విమర్శించినపుడు బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁ డని...బోధపడకపోదు » అని వ్రాయుటయే కదా యనుగుణంబు. అట్లు గాక చెవిరెడ్డి గాథ విశ్వాసపాత్రము గా దని వ్రాయుట యుపక్రమవిరుద్ధం బనుట ఘంటాఘోషంబు కాదా ?

ఇటులు 184 పేజీ మొదలు 190 పేజీవఱకు వ్రాయఁబడిన (2) గుర్తుగల గ్రంథముచే, బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁ డని సహేతుకముగ సప్రమాణముగ సయుక్తికముగ ససందర్భముగ నితరవిరోధరహితముగ నిరూపింపఁబడినట్లు గ్రంథకర్తగారు తలఁచి దీనివలన నే

చేతిరెడ్డి పైసంస్థానాధిపతులకు మూలపురుషుఁడు కాఁడని యేర్పడు చున్నట్లు నిర్దేశించుచుఁ బ్రకారాంతరమున చేతిరెడ్డి మూలపురుషుఁడు గాఁడని స్థాపించుట కవతరణిక నిట్లు వ్రాయుచున్నారు.

“ ఈగాథల నన్నింటిని విడిచి పెట్టి వెలుగోటివారివంశవృక్షమునం జెప్పఁబడినపురుషులయొక్క కాలనిర్ణయాదివిషయములను బట్టి చూచినను ఏతచ్చరిత్రములోనిపురుషులను గూర్చి వ్రాయంబడిన యసందర్భవాక్యములను బట్టి చూచినను చేతిరెడ్డి వేంకటగిరి...సంస్థానాధిపతులకు మూలపురుషుఁ డను సిద్ధాంతము నిలువఁజాలదు ” అని.

ఇందు “ ఈగాథల నన్నింటిని విడిచిపెట్టి ... చూచినను చేతిరెడ్డి మూలపురుషుఁ డనుసిద్ధాంతము నిలువఁజాలదు” అనులేఖనముచేత నీ (2) గుర్తు గలగ్రంథములోఁ దాము వ్రాసినచెవిరెడ్డిచరిత్రములలోని విరోధములవలన చేతిరెడ్డి మూలపురుషుఁడనుసిద్ధాంతము నిలువఁజాలక పోయినట్లును వీనిని వదలిపెట్టి మఱియొకరీతిగఁ జూచిన నీసిద్ధాంతము నిలువఁజాలనట్లును నభిప్రాయ మగుచున్నది కదా! దీనిని వెనుక, చెవిరెడ్డిగాథల పరస్పరవిరోధాదులు నిలువఁజాలవనియు, నిలిచినను వీరియభీష్టప్రకారము చేతిరెడ్డి బేతాళనాయఁడు గాఁడని మొదలగువిషయములను సాధింపఁజాలక యకించిత్కరంబులై యున్నవనియు విస్తరంబుగ నిరసించియే యున్నాను. కాన నేతదభిప్రాయ మాశామాత్రంబే కాని వేఱుగాదు. ఇదిగాక, చేతిరెడ్డియుఁ జెవిరెడ్డియు వేర్వేఱు పురుషు లనిదృఢనిశ్చయము గలవీరు స్వమతమున నేలాటి సంబంధము లేని చెవిరెడ్డియొక్కగాథలలోఁ గలవిరోధములవలన చేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడని భావించుట, పృష్ఠతాడనన్యాయము ననుసరించుచున్న దని వ్రాయం బని లేదు. వారి కిరువురకు నభేద మను నస్మత్పక్షమున నైనను బరస్పరవిరుద్ధములుగఁ దోఁచెడుచెవిరెడ్డి చరి

త్రములు కొన్ని యొకవేళ నవిశ్వసనీయము లనుకొన్నను నేవిరోధము లేక యందఱిచే నేకరూపముగ వ్రాయంబడిన చెవిరెడ్డిమూలపురుషత యవిశ్వసనీయంబు గాఁ జాల దని వెనుక వివరింపఁబడియెను గదా! ఇట్లు చెవిరెడ్డి మూలపురుషతకు భంగము లేనపుడీయభేదపక్షమునఁ దదభిన్నుం డగు బేతిరెడ్డియొక్క మూలపురుషతకును భంగము లే దని సిద్ధమగుచున్నది. కావునఁ బై వానివలన బేతిరెడ్డి మూలపురుషుఁ డనుసిద్ధాంతము నిలువ దనుకొనుట తప్పు.

ఇ దంతయుఁ బరిశీలింపక పై గ్రంథమువలన స్వేష్టసిద్ధి యైనట్లు నెఱనమ్మి "ఏతచ్చరిత్రములోనిపురుషులను గూర్చి వ్రాయంబడినయసందర్భవాక్యములను బట్టి చూచినను" అని సావష్టంభముగ లిఖించుట వ్యత్యయముగ వారియందే సమన్వయము నొందుచున్న దని చెప్పవలసియున్నది. చెవిరెడ్డిగాథలవలన బేతిరెడ్డి మూలపురుషుఁడు గాఁ డని వ్రాయుటకన్న నసందర్భవాక్యము లుండఁబోవుఁ గదా!

ఒకవేళ, బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁ డనునది 183 వ పేజీలో వ్రాయఁబడిన "బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁడు" అనుద్వితీయప్రతిజ్ఞావాక్యమున కర్థరూపమే కాని వేఱుగాదు. అట్లగునపుడు బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁ డన్నదానికి బేతాళనాయఁడు కాఁ డనియే యభిప్రాయమనినచోఁ గానిండు. అందువలన నేమి యగును? బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁ డని పర్యవసానము కాఁగల దన్నచో నప్పటికి బేతాళనాయఁ డనుచెవిరెడ్డి కిట్టిగాథ లున్నవి. కాఁబట్టి బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁ డనవలెను గదా! అయ్యది బేతిరెడ్డి సుప్రశస్తగాథలు గలవాఁ డనియుఁ జెవిరెడ్డి యప్రశస్తగాథలు గలవాఁడనియుఁ బ్రమాణమున్నచో నప్రశస్తగాథలు గలవాఁ డగుటచే నితఁడు చెవిరెడ్డియె కాని బేతిరెడ్డి కాఁ డని యేర్పడుటనుబట్టి చెప్ప నగును. ఎఱ్ఱక్కదేవిశాసనములో వ్రాయఁబడనందునఁ బైగాథలు చెవి

రెడ్డివే కాని బేతిరెడ్డివి కా వని ఘంటాఘోషమన్నచో, వీరు ప్రతి విషయము శాసనములలో వ్రాసియే తీరవలె ననియు వ్రాయనిచో నది యగ్రాహ్యం బనియు నిరూపించి, వెనుక నాచే నుదాహరింపఁబడిన సుప్రసిద్ధచరిత్రములు వారివారిశాసనములలో వ్రాయమికిని శాసనములలోఁ గానంబడనట్టిచరిత్రములు తాము వ్రాసినందునకును సమాధానము చెప్పవలసి యుండును.

ఇఁక దీని నింతతో నిలిపి బేతిరెడ్డి మూలపురుషుఁ డనుసిద్ధాంతము నిలువఁజాల దన్నందునకు రావుగా రేయేసాధకసామగ్రిని జూపఁగలరో దాని నెత్తి విమర్శించుచున్నాను. ఇప్పట్టున వారియుపక్రమగ్రంథం బిటు లున్నది.—

“ బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడు.— వెలుగోటివారివంశచరిత్రమునందుఁ బిల్లలమఱ్ఱి బేతాళనాయనికి దామానాయఁడు, ప్రసాదాదిత్యనాయఁడు, రుద్రనాయఁడు, అనుముగ్గురుకొడుకులు గల రనియు, వారిలో జ్యేష్ఠుఁ డైనదామానాయనికి 1 వెన్నమనాయఁడు, 2 సబ్బినాయఁడు, 3 పెద్దన్న, 4 బ్రహ్మనాయఁడు, 5 పేర్నీఁడు, 6 సూర్నీఁడు, 7 మల్లినీఁడు, అనుపుత్త్రులు గల రనియు నుదాహరింపఁబడియెను. శ్రీనాథకవిరాజప్రణీత మైనపల్నాటివీరచరిత్రమున బేతినాయనికి దొడ్డనాయఁడు, అతనికిఁ బెద్దన బ్రహ్మనాయఁడు పేర్నీఁడు సూర్నీఁడు మల్లినీఁడు అను నేవురు పుత్త్రులు గల రనియు, వ్రాయంబడియున్నది. రేచర్ల బేతినాయనినామమును గాంచి భ్రమించిరో, పల్నాటివీరులలో సుప్రసిద్ధుఁ డైనబ్రహ్మనాయఁడు వెలుగోటివారివంశములోనివాఁడై యుండు నన్న సంపూర్ణవిశ్వాసముచేతనో పల్నాటివీరుల కాలముం దెలిపెడుచరిత్రాంశము లెఱుంగమిచేతనో మఱియే కారణముచేతనో, పిల్లలమఱ్ఱి బేతాళనాయనివంశమును బల్నాటి బేతినాయని

వంశమును నొక్కటిగఁ జేసి బేతిరెడ్డియె బేతాళనాయఁడని హేత్వాభాసములతో సిద్ధాంతము చేసి యున్నారు » అని.

ఇందేమియుఁ విశేషము గానరాదు. ఒక్క విశేషము మాత్రము చూపట్టుచున్నది. 178 పేజీలో « బేతిరెడ్డి నామిరెడ్డి » అని మొదలు కొని, యీ 191 పేజీవఱకు నెఱ్ఱక్కదేవి భర్త యగు బేతిరెడ్డియే కదా విషయీకరింపఁబడినవాఁడు. ఇందువలన « బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడు'' అను సీప్రతిజ్ఞావాక్యమునఁగూడఁ బ్రస్తుతుఁడగు నెఱ్ఱక్క భర్తయే విషయమై యుండ వలయు. ఇట్లగునప్పుడు బేతిరెడ్డి మూల పురుషుఁడు కాఁడనుదానికి, నెఱ్ఱక్కదేవికి భర్తయగు బేతిరెడ్డి వేంకటగిరి...సంస్థానాధిపతులకు మూలపురుషుఁడగు బేతాళనాయఁడు కాఁడనియె యర్థమగును. అట్లగునప్పుడు వారిరువురు వేర్వేఱు పురుషులనుటకై వారితలిదండ్రులయొక్కయో, భార్యలయొక్కయో, సంతానముయొక్కయో, భేదము నగపఱచి తన్మూలమునఁ దత్సాధనంబు కర్తవ్యంబుగా నుండును. వెనుక వీరు 189 పేజీలో « నామిరెడ్డినామము చెవిరెడ్డికి నామాంతర మని చెప్పుటకు వలను గాదు. నామిరెడ్డిభార్య మైలాంబ యని చెప్పఁబడినది కాని యెఱ్ఱక్క యని చెప్పఁబడి యుండ లేదు » అని వ్రాసి బేతిరెడ్డికి నామిరెడ్డికి భేదము సాధించినవారు కారా? కాఁబట్టి బేతిరెడ్డికి బేతాళనాయనికి భేదము సాధింపనెంచినప్పుడు తత్సాధనమునకై వారిసంతానాదిభేదము లగపఱచుటయే తగును. ఇట్టి స్థితిలో వీరు బేతాళనాయనియొక్కయుఁ బల్నాటిబేతినాయనియొక్కయు సంతతులకు భేదమును నిరూపించినారు. ఇయ్యది పిల్లలమఱ్ఱిబేతాళనాయనికిఁ బల్నాటిబేతినాయనికి భేదము సాధించుట కొకవేళ సమర్థం బైనను బేతిరెడ్డికి బేతాళనాయనికి భేదము సాధించుటకు సమర్థము కాదు కదా! ఏపురుషద్వయమునకు సంతానాదిభేద ముండునో ఆపురుషద్వయము భిన్న మను

కొన్న ననుకొనవచ్చును గాని యెట్టి భేదము లేనిపురుషద్వయము భిన్న మని యెటు లనుకొనవచ్చును? వారికిని సంతానాదిభేద మున్నద న్నచో దానినే వ్రాయవలసి యుండెను. అట్లు గాక యుదాసీనుఁడగు పల్నాటిబేతినాయనిసంతానభేద మగపఱచుట యసంబద్ధంబు గాక మానదు. అని.

« ఇందువలన « రేచర్ల బేతినాయనినామమును గాంచి భ్రమిం చిరో... మఱి యేకారణముననో పిల్లలమఱ్ఱి బేతాళనాయనివంశ మును బల్నాటిబేతినాయనివంశమును నొక్కటిగఁ జేసి బేతిరెడ్డియే బేతాళనాయఁడని హేత్వాభాసములతో సిద్ధాంతము చేసియున్నారు" అని వ్రాయుట వ్యత్యయముగ వారియందె యన్వయించుచున్న దని చెప్పవలసియున్నది. సంబంధము లేనిబేతినాయనిసంతానమును బేతి రెడ్డిసంతాన మనుకొనుటకన్న నామభ్రాంతియు, బేతిరెడ్డికి బేతాళ నాయనికి భేదము సాధింపనెంచి తత్సాధకముగ వ్రాయఁబడిన బేతాళ నాయనియు బేతినాయనియు సంతానభేదమునకన్న హేత్వాభాసం బును నెద్ది యుండఁ గలదు? వీరు సహేతుకముగ నిరూపింపఁబోవు చున్నా నని యుపక్రమించి బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁ డనుటకు హేతువులు గానట్టి చెవిరెడ్డిచరిత్రములను హేతువులనుగా వ్రాయు టయు బేతిరెడ్డి బేతాళనాయఁ డనుటకు హేతువు లగువానిని హేత్వా భాసంబులనుగా వ్రాయుటయుఁ జూడఁగా నెచ్చటనో తర్కవిద్యా ర్థులు గ్రంథచింతనము చేయుచుండఁగాఁ జెవి సోఁకినహేతుహేత్వా భాసపదములను బ్రయోగించిన ట్లున్నది గాని వాని యర్థము దెలిసి ప్రయోగించినట్లు కాన రాదు.

ఇఁక నిటు లేమైననందు రేమో. బేతాళనాయనికి బేతిరెడ్డికి భేద మనియొ వీరిమతము గాని పల్నాటిబేతినాయనికి బేతిరెడ్డికి భేద మని కాదు. దీనం జేసి పల్నాటిబేతినాయనిసంతానమును వ్రాయుట తప్పు

గాదు. పల్నాటిబేతినాయఁడు నెల్లూర్కి భర్తయగు బేతిరెడ్డి యొకం డగునపుడు వారిలో నెవరిసంతానమును వ్రాసిన నొక్కటియే కదా! అని ఇట్లనఁ గూడదు. ఇది మొదలు ప్రకరణాంతమువఱకును బదవ ప్రకరణముఁను గంథోక్తముగఁ బల్నాటిబేతినాయఁడు వేఱు బేతి రెడ్డి వేఱు అని వ్రాసియున్నారు. కాఁబట్టి వారిరువురు నభిన్ను లగు టంజేసి రావుగారు పైవిధముగ వ్రాసినా రనుకొనుట సరి గాదు.

ఒకవేళ, బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁ డనుటకు నిది హేతు వని వారి యభిప్రాయముకాదు, మఱియేమనిన వేర్వేఱుసంతానములు గలిగి యుండుటచే వేర్వేఱు పురుషు లని మొల్లరచే నెన్నఁదగియున్న పైవారి సంతానము నొక్కటిగఁజేసి ... (వెలుగోటివారి వంశచరిత్ర కారులు) సిద్ధాంతీకరించినా రని వస్తుస్థితిప్రదర్శనమునకై యిటులు వ్రాయఁబడినది. ఇంతమాత్రమునఁ బై వికల్పముల కవకాశము దొర కదు అనినచో, నప్పటికి బేతిరెడ్డిసంతానమును గూడ నుదాహరించి « మువ్వురివంశముల నొక్కటిగఁ జేసి » యని వ్రాయవలసి యుండెను.

ఇఁక, బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁ డనుటకు వీ రేయే హేతువులను వ్రాసినారో పరిశీలించి వానివిమర్శము చేయఁదగి యున్నది. ఇదిమొదలు ప్రకరణాంతమువఱకుఁ గలగ్రంథమును జూడఁ గా నీవిషయము లగపడుచున్నవి.—

« వెలుగోటివారి వంశచరిత్రమున బేతినాయనికి దామానా యఁడు మున్నగు మూవురు పుత్రులు, దామానాయనికి పెద్దన్న లో నగు నేవురు పుత్రులు వ్రాయఁబడి యున్నారు. పల్నాటివీరచరిత్రమున బేతినాయనికి దొడ్డనాయఁడు, అతనికి పెద్దన్న మొదలగు నైదుగురు పుత్రులు వ్రాయఁబడినారు.

పల్నాటివీరచరితములో బ్రహ్మనాయనితండ్రి దొడ్డనాయఁ డని యుండుటచేతను, పిల్లలమఱ్ఱిబేతాళనాయని కుమారులలో దొడ్డనాయఁడు లేకుండుటచేతను సంబంధమునకుఁ జిక్కు గాఁగా బేతాళనాయని జ్యేష్ఠపుత్త్రుఁ డగు దామానాయనికి దొడ్డనాయఁడని నామాంతరముగ నూహించిరి. ఎఱ్ఱక్క శాసనములో బేతిరెడ్డికుమారుఁడు మల్లానాయఁ డని యుండఁగా నదియు నామాంతరముగఁ దలంచిరి.

గ్రంథకర్తల యభీష్టప్రకారము నామత్రయ మొకపురుషునినే బోధించు నని యొప్పుకొన్నను 1208 సంవత్సరమున ఎఱ్ఱక్క శాసనము నాఁటికి మల్లానాయఁ డనుదొడ్డనాయనికి సంతానము జనింప లేదు.

ఒకవేళఁ బుట్టినా రని యూహించినను శిశువులై యుండవల యును గద ! పల్నాటియుద్ధము, 1176-1182 సంవత్సరముల నడుమ జరగిన ట్లనేకచరిత్రాంశములను బట్టి తేలుచున్నది. ఆయుద్ధమున బేతినాయనిమనుమఁ డగు బ్రహ్మనాయఁడు ఆతనికుమారుఁ డైనబాల చంద్రనాయఁడు ఘనబాహువిక్రములై జయముగాంచినట్లున్నది. 1208 సంవత్సరమునాఁటికి దొడ్డనాయఁ డను మల్లానాయనికి సంతానమే లేక యుండఁగాఁ బ్రతాపరుద్రసమకాలికుఁడై తన తాతయైన బేతినాయనికి బ్రహ్మనాయఁ డెట్టులు సమకాలికుఁ డగును ?

పల్నాటియుద్ధమునాఁటికి దొడ్డనాయఁడు చనిపోయి యుండె నని యాచరిత్రమునఁ జెప్పఁబడినది. 1208సంవత్సరము ఎఱ్ఱక్కసానిశాసనములో వర్ణింపంబడి బ్రతికియున్న మల్లానాయఁ డనెడు దొడ్డనాయఁడు ముప్పదిసంవత్సరములకుఁ బూర్వమే మృతినొందవలసిన దురవస్థ పట్టి నది కదా !

వెలుగోటివారిపూర్వులైన అనపోతానాయఁడు మాధవనాయఁడు తమశాసనములలో వెన్నమనాయనినుండియే తమపూర్వులను

జెప్పికొనియున్నారు గాని పిల్లలమఱ్ఱి బేతిరెడ్డిని మూలపురుషునిగాఁ జెప్పికొనలేదు. సర్వజ్ఞసింగమనాయఁడు సైతము తనసింగభూపాలీయము న 4 గవతరములోనిదాచానాయనినుండి వంశమును వర్ణించెను గాని సుప్రసిద్ధులయిన బేతిరెడ్డి కొడుకు లగువారి నెవ్వరిని బేర్కొనలేదు. ఇప్పటివారికంటె వారు ప్రాచీనులు గనుక వారి కీగాధలపూర్వోత్తరసందర్భములు చక్కఁగాఁ దెలిసి యుండవలయును గదా ! వారేల తమశాసనములందును గ్రంథములందును సుప్రసిద్ధవంశజుల నభివర్ణింపక మౌనధారణము గలిగి యుందురు ? " అని.

గ్రంథకర్త యిచ్చినయి బేతిరెడ్డి మూలపురుషుఁడు గాఁ డను టకు హేతువు లనుకొనియుండినను వీనిలోఁ గొన్ని మాత్రము హేతువు లనుకొనియుండినను వీనికిఁ బ్రత్యేకము సమాధానము వ్రాయవలసి యున్నది.

ఇందుఁ గొన్ని పల్నాటివీరయుద్ధకాలాపేక్షములు కొన్ని తదన పేక్షములు గా నున్నవి. అందు బేతాళనాయునిసంతానము బేతినాయని సంతానము భిన్నముగ నున్న దనునదియు దామానాయనికి దొడ్డ నాయఁడు మల్లానాయఁడు అనునవి నామాంతరము లని కల్పించినారను నదియు నెల్లిక్కుశాసనమునాఁటికి మల్లానాయనికి సంతానము జనింపలే దను నదియు ననపోతానాయఁడు మాధవనాయఁడు సింగభూపతి దమ శాసనగ్రంథాదులందు వెన్నమనాయనికిఁ బూర్వుల వర్ణింపనందున వారు వీరిపూర్వులుగా రనియు నీనాలుగు యుద్ధకాలానపేక్షములు.

" ఒకవేళఁ బుట్టినారనుకొన్నను శిశువులై యుండవలయును గదా ... తాతమైన బేతినాయనికి బ్రహ్మానాయఁ డెట్లు సమకాలికుఁ డయ్యెను ? " అనునదియు, "పల్నాటియుద్ధమునాఁటికి దొడ్డనాయఁడు చనిపోయియుండె నని యాచరిత్రమున నున్నది ... దురవస్థ పట్టెను గదా ! " యనునదియు యుద్ధకాలాపేక్షములు.

వీనిలో బేతాళనాయునియు బేతినాయునియు సంతానములు భిన్నములు గా నున్న వనునది బేతిరెడ్డి మూలపురుషుఁడు గాఁ డనుటకు హేతువు గాదనియు నసంబద్ధంబు గా నున్న దనియుఁ బైవిమర్శమువలననే తేటపడఁగలదు. ఇఁక వాస్తవస్థితిలో బేతాళనాయనికి బేతినాయనికి బేతిరెడ్డికి భేదము లే దని యొప్పియున్న విూమతమున వారి సంతానభేదమునకు సమాధాన మేమి? అని యనరాదు. దామానాయనికి దొడ్డనాయఁడు మల్లానాయఁడు అనునామములలో నొక్కటి గౌణనామము (గుణమును బట్టి వచ్చిననామము) అనియు నొకటి నామాంతర మనియు నూహించి తత్పరిహారము వెలుగోటి వారి వంశచరిత్రమునఁ జేయఁబడిన దని రావుగారే యుపపాదించినారు కదా! ప్రమాణాంతరములచేఁ బురుషైక్యము సిద్ధించునపుడు తత్పుత్రాదులలోఁ గలనామభేదములు వారివారికి నామాంతరములుగానో బిరుదనామములుగానో కల్పించుట చరిత్రకారులకుఁ గులధర్మంబై యున్న దని వ్రాయఁ బని లేదు. చరిత్రములం దట్టియుదాహరణంబుల నెన్నింటినో చూపఁగలను. కాన నీనామమాత్రవివాదము నిలుచు నది కాదు. బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁ డనుటకు హేతువును గాఁ జాలదు. దామానాయనికి సహస్రనామములు కల్పించి యుంచిన నది బేతిరెడ్డియొక్క మూలపురుషతకు భంజకము గాఁజాలదు కదా! మఱి మూలపురుషతకు స్థాపకమే యగును. మూలపురుషుఁ డనఁగా నొకకుటుంబమునకు మొదటివాఁడు. బేతిరెడ్డి పుత్త్రపౌత్త్రాదుల కనేకనామము లున్నవన్నపుడు తత్పుత్త్రాదినిరూపిత మూలపురుషత యతనియందు స్థాపితమే యగును గదా!

ఒకవేళ, బేతిరెడ్డియొక్క మూలపురుషత ప్రమాణసిద్ధంబై యుండదేని నీకల్పనంబున కంతకు నవకాశము గలుగును, అదియే లేనపుడు తన్మూలకం బగునీకల్పనం బంతయు నిరాధారం బన వత్తురు.

దీనినిరాసమునకై మొద లిది విచారించెదను. చెవిరెడ్డి యని నామాంతరము గలపిల్లలమఱ్ఱి బేతాళనాయఁడు మూలపురుషుఁ డగు నని యంగీకరింతురా? అంగీకరింపరా? రెండవపక్షమునఁ బ్రమాణము లెవ్వియో చూపుటయు నట్టిపురుషుఁడు మఱియెవఁడో యెచ్చట వ్రాయఁబడినాఁడో యగపఱచుటయు, నారాజు మూలపురుషుఁ డని చాటుచున్న పద్మనాయకచరిత్రాదిపూర్వగ్రంథము లప్రమాణము లని స్థాపించుటయు, వీరికి ముఖ్యమై యుండును. ఇఁక ననపోతానాయఁడు మొద లగువారు వెన్నమనాయనినుండియే వంశవర్ణనము చేసినందున బేతాళనాయఁడు తత్పుత్త్రులు వీరిపూర్వులు గా రని యేర్పడును గదా! యన్నచో నది యవిచారసిద్ధాక్షేప మని తరువాత నిరసింపఁ బోవుచున్నాను. మఱి యెవ్వియు విరోధములు గాన రావయ్యెను. కాఁబట్టి బేతాళనాయఁడు మూలపురుషుఁడు కాఁ డని భావించుట నిలుచునది కాదు. ఇఁక మొదటిపక్షమున నారాజు మూలపురుషుఁడైనపుడు పిల్లలమఱ్ఱి బేతిరెడ్డి మూలపురుషుఁడని యిచ్చ లేనివాఁడైన నొప్పితీరవలయు. రావుగారు బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁ డనుటకు హేతువులుగా నెంచిన చెవిరెడ్డిచరిత్రములలోనివిరోధములు హేత్వాభాసాభాసంబులైనం గా వని వెనుక నావ్రాసినవిమర్శము వలనఁ దేటపడక పోదు. అవి గాక యింక నే హేతువులను నిదివఱకు రావుగారు వ్రాసినవారు కారు. ఇది మొదలు ప్రకరణాంతమువఱకుఁ బ్రకారాంతరమున సాధింపఁగల మనుచున్నారు గాని యిది వ్యర్థప్రతిజ్ఞ యని ముందు విమర్శమువలనఁ దేటపడఁగలదు.

ఇంకొకటి.—బేతిరెడ్డియు బేతాళనాయఁడు నిరువురు పిల్లలమఱ్ఱిశబ్ద మువపదముగాఁ గలవా రని రావుగా రొప్పుకొన్నారు. బేతిరెడ్డి గణపతినాఁ డుండినట్లు శాసనగ్రంథాదులవలన సిద్ధమగుటయుఁ జెవిరెడ్డి గణపతివలన సమ్మానింపఁబడినట్లు చరిత్రగ్రంథా

రూఢ మగుటయుఁ జూచుచున్నాము. ఇందువలన వారికి దేశ కాలైక్యము వచ్చినది. కులము గోత్రము నొక్కటనుట సుప్రసిద్ధము. బేతాళనాయఁడు బేతాళరెడ్డి బేతినాయఁడు బేతిరెడ్డి అనునవి పర్యాయపదము లని వెనుక వ్రాయంబడినది.

బేతిరెడ్డికిఁ బూర్వులు శాసనములందును గ్రంథములందును రెడ్డిబిరుదముతో వ్యవహరింపఁబడుచుండుట బాధకం బని తలంపరాదు. ఎఱ్ఱక్క శాసనములో నామెపితృవంశమును వర్ణించునపుడు «భీమాహ్వయో నాయక ఊర్జితౌజాః, ఎఱ్ఱమనాయకోఽభూత్, కామనాయక ఇత్యుదార కీర్తిః» అని యామె పిత్రాదులు వర్ణింపఁబడినందున బేతిరెడ్డిసంబంధులలో నాయకబిరుదము గూడ నాకాలమునుండినది కాఁబట్టి బేతిరెడ్డి గూడఁ బై రెంటుబిరుదములను వహించియుండెననియు నాయనపుత్త్రు లగు దామానాయఁడు మొద లగువారు కొందఱు కేవలనాయకబిరుదమె వహించుచుండి రనియు నీవలివారు కొందఱు నాయకబిరుదమును గొందఱు రావుబిరుదమును వహించుచున్నారనియు, శాసనగ్రంథానుభవములవలనఁ దేటపడుచున్నది కదా!

ఇట్లు దేశకాలకులగోత్రనామములవలననే కాక నెఱ్ఱక్కశాసనములో «ఖ్యాతో ఽతః, జేతనదండ, పిల్లలమఱ్ఱి బేతిరెడ్డి'' యని చెప్పియుండుటచేత నెఱ్ఱక్కభర్త బేతాళుని నెదిరించి గణపతివలన గౌరవింపఁబడినాఁ డని యేర్పడుటయుఁ బద్మనాయకచరిత్రాదులలోఁ జెవిరెడ్డి బేతాళుని నెదిరించి గణపతివలన సమ్మానింపఁబడియె నని వ్రాసియుండుటయు మొద లగువానింబట్టి చరిత్రైక్యము వచ్చుటవలనఁగూడ బేతిరెడ్డియు బేతాళనాయఁడును నొక్కరుండే కాని వేర్వేఱు పురుషులుగా రని విస్పష్టముగా నిశ్చిత మగుచున్నది. కాఁబట్టి బేతిరెడ్డియు బేతాళనాయఁడును భిన్నపురుషు లని భావింప వలను లేదు. ఇఁకఁ బల్నాటి

బేతినాయఁడు బేతిరెడ్డి యొకండే యనువిషయం బగ్రిమవిమర్శము వలనఁ దేటపడఁ గలదు.

ఇట్లు ప్రమాణాంతరములవలనఁ బురుషైక్యము సిద్ధించునపుడు వారి కుటుంబములోఁ గల పురుషులకుఁ జరిత్రములలోఁ జూపట్టు నామభేదములు పురుషభేదప్రయోజకములు గామివలన నామాంతరములుగానో బిరుదనామములుగానో యుండు నని సమన్వయించుట చరిత్రాంశముల కంత విరోధముగాఁ జూపట్టదు.

ఇంక నొకవేళ నాపేరిటివారు భార్యాంతరములందుఁ గలిగిన పుత్త్రిలయి యుండి చరిత్రకారుల కావిశేషములు దోఁపక యట్లు వ్రాసి యుండిన నుండ వచ్చును. « రాజానో బహువల్లభాః » అనున్యాయమున రాజులకు బహుభార్య లుండుట యరుదు కాదు. ఎట్రిక్క శాసనమున నామెపుత్త్రిం డగు మల్లానాయుని గూర్చి చెప్పునప్పుడు « యస్యాః పుత్త్రః » అని వ్రాసి యుండుట యీయూహకు హస్తావలంబము నిచ్చుచున్నది. « తస్మాత్తస్యాం సముజని, తయో రభూన్నిర్మలధర్మతేజాః'' ఇత్యాదులవలెఁ జెప్పవలసియుండఁగాఁ బురుషునిఁ జెప్పక « యస్యాః పుత్త్రః '' అని స్త్రీనిమాత్రము చెప్పుట సంప్రదాయవిరుద్ధం బగుటయే కాక « భవానీపతేః '' అనుచోటఁ గావ్యప్రకాశమునందు వ్రాయఁబడినరీతిగా ననుచితార్థమును గూడ స్ఫురింపఁజేయును గదా! కాఁబట్టి బేతిరెడ్డికి బహుభార్య లుండి రనియు నందు నెట్రిక్కకు మల్లానాయఁడు పుత్త్రిం డుండె ననియు నామె తన పుత్రుని మాత్రమె వర్ణించినది కాని సపత్నీ పుత్రులనామములు పేర్కొసినది కా దనియుఁ జెప్పి సమన్వయించిననే కాని పై దోషము ప్రసక్తింపక పోదు. కాఁబట్టియె యీయాఱవ ప్రకరణము 181 పేజీలో « రేచర్లబేతిరెడ్డికి ఎట్రిక్కసానియందు జనించిన మల్లారెడ్డినిగూర్చి'',

అని రావుగారిచే వ్రాయఁబడినది. వెలుగోటివారివంశవృక్షమునందు మల్లానాయఁడు దామానాయఁడు వేర్వేఱుగా వ్రాయంబడినవారు. ఈవిషయము ముం దింకను విశదీకరింపఁబడును. ఇందువలనఁ బ్రథమ ద్వితీయాక్షేపములు నిలుచునవి కావనియు బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడనుటను సాధించునవి కావనియుఁ దేలినది.

కాఁబట్టియే కాఁబోలు, రావుగారు వీనిని వదలి ఎఱ్ఱక్కశాసనమునాఁటికి మల్లానాయనికి సంతానమే జనింపలేదని యాక్షేపాంతరమునకుఁ బోయిరి. అదియు నిలుచునది కాదు. శాసనమున మల్లానాయఁ డెఱ్ఱక్కపుత్త్రుఁ డని వ్రాసినందున నామె కతం డొకండే పుత్త్రుఁ డని వీ రూహించుటకు వీ లున్నను మల్లానాయనికిఁ బుత్త్రులు లేరని యూహించుటకు వీలు లేదు, పుత్రప్రసక్తిలోఁ బుత్రాంతరవ్యావృత్తి యగునే కాని పౌత్రాదివ్యావృత్తి కాదు కదా! అప్పటికున్న సంతానము నంతయు వ్రాయుటకునామె ప్రతిజ్ఞ చేసియుండ లేదు. శాసనములలోఁ దనకుఁ గలకుటుంబము నంతయు వ్రాయవలయు నను నియమము కాన రాదు. ఒకవేళ వీ రట్టినవీననియమమును స్వీకరించినచో బేతిరెడ్డినామిరెడ్డిశాసనములలో నొండొరులనామములు వ్రాయఁబడలేదని వీరు వెనుక 178 పేజీలో వ్రాసి యున్నందువలన బేతిరెడ్డికి నామిరెడ్డియు నామిరెడ్డికి బేతిరెడ్డియు సహోదరులు కాకపో వలసివచ్చును. ఇష్టాపత్తి యన్నచో “వీర లిరువురు సహోదరులు” అను తత్రత్యస్వోక్తివిరోధము ప్రసక్తించును. 8 వ తరము అనపోతానాయఁడు తనపుత్త్రులు పౌత్త్రులు ప్రౌఢులై యుండఁగా వ్రాయించినశాసనములలో వారిపేరులు వ్రాయింపలేదు, తదభావము సిద్ధింపవలెఁ గదా! తఱచుగ శాసనాదులందు భార్యాపుత్త్రాదులను వ్రాయుట లేదు, తదభావము సిద్ధింపవలెను గదా! కావున

నీయాక్షేపము నిలుచునది కాదు. బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁ డనుటకు హేతువును గాఁజాలదు.

ఇఁక బేతిరెడ్డి తత్పుత్రులు ననపోత మాదానాయకుల శాసనములందును సింగభూపాలీయమునందును వ్రాయఁబడమిచే వారలు వేంకటగిరి...సంస్థానాధిపతులకు మూలపురుషులు గా రనునాక్షేపము నిలిచి యున్నది. ఇయ్యది ప్రకరణాంతమున రావుగారిచే సకలాక్షేపశిరోమణిగా వ్రాయఁబడినది కాన దీనిసమాధాన మచ్చటనె వ్రాయవలసి యున్నను గాలానపేక్షములలో నిది యొకటియై ప్రత్యాసన్నమైనది కాఁబట్టి యిపుడే యేతద్విమర్శము చేయఁబడుచున్నది. ఈయాక్షేప మవిచారసిద్ధములలో మొదటిదిగా నున్నది. పైవారిశాసనములందును గ్రంథములందును వ్రాయఁబడనందున బేతిరెడ్డియుఁ దత్పుత్రులును వేంకటగిరి...సంస్థానాధిపతులకుఁ బూర్వులు గా రని వాదించెడువీరభద్రరావుగారి నొక్కటి విచారింపవలసి యున్నది. 6 వతరము వాఁడైనయనపోతానాయఁడు మాదానాయఁడు స్థాపించిన శిలాశాసనములలో వర్ణింపఁబడి సుప్రసిద్ధుం డగు వెన్నమనాయని నేడవతరముసింగభూపతి వర్ణింపక వదలి దాచానాయనినుండి వంశాభివర్ణనము చేయుటకుఁ గారణం బేమి? ఒకవేళ వెన్నమనాయఁ డేమైన వీరి పూర్వుఁడు కాకపోయి యుండవచ్చునా? అని. దీనిసమాధానక్రమమును వారు దెలిసికొనినచో, నాలవతరమువారు బేతిరెడ్డిని తత్పుత్రులను నేల వ్రాయరైరో అంతమాత్రమున వారు పైసంస్థానాధిపతులకుఁ బూర్వులుగా రని నుడువుట యెంతశ్లాఘ్యం బగునో వారిమనస్సునకే రాఁగలదు. వాస్తవస్థితిలో శాసనములందుఁ గాని గ్రంథములందుఁ గాని పూర్వుల నందఱను వర్ణింపవలె ననియుఁ గొందఱను వర్ణింపవలె ననియుఁ బలానాతరమునుండి వర్ణింపవలె ననియు నియమములు లేవు కాఁబట్టి వారివారికిఁ దోఁచినపురుషునినుండి వర్ణించుట గలదు. తెలుచుగా బిట్టి

పితామహప్రపితామహత్రయమును బేర్కొనుట శాసనములందును గ్రంథములందును దానపత్రములందును జూచుచున్నారము. ఇట్లుండఁ బట్టియే 6 తరమువారు తమప్రపితామహుఁ డగు వెన్నమనాయని నుండియు నేడవతరమువారు తమప్రపితామహుం డగుదాచానాయని నుండియు వర్ణించినా రని ఘంటాపథముగాఁ దెలియఁ దగినవిషయము వీరభద్రరావుగా రెఱింగియున్నచో నిట్టి ప్రొద్దుపోనికుశంకలు చేయక మౌనధారణము కలిగి యుందురు. వెన్నమనాయఁ డనఘోనిసంభవుఁడు గామిచేఁ దత్పిత్రాదు లుండి తీరవలయు ననియు, నితరులు తత్పిత్రాదు లని యెచ్చటను వ్రాయఁబడనందునఁ బద్మనాయకచరిత్రాదులందుఁ దత్పిత్రాదు లని వ్రాయఁబడిన దామానాయకప్రభృతులు వెన్నమనాయనిపిత్రాదులు గా రని వట్టిమాటలతో నిరాకరించుట నిలువఁజాల దనియు వ్రాయం బని లేదు. ఇట్లు కాలానపేక్షము లగు హేతువులు నాలుగును ముగిసినవి.

ఇఁకఁ గాలాపేక్షములు విమర్శింపఁ దగియున్నవి. అయ్యవి పల్నాటియుద్ధకాలము నిర్ణయించినచో దండాపూపికాన్యాయమున దత్తోత్తరంబులు గాక మానవు. కాఁబట్టి యిపుడు పల్నాటివీరుల యుద్ధకాలనిర్ణయము ప్రాప్తావసరంబు. అయ్యది వీరభద్రరావుగారిచే నిటులు వ్రాయఁబడినది.——

« ఈయుద్ధము క్రీ. శ. 1176-1182 సంవత్సరముల నడుమ జరిగె నని యనేకచరిత్రాంశములను బట్టి నిర్ధారింపఁబడుచున్నది. పల్నాటివీరచరిత్రమునఁ బ్రతాపరుద్రుఁడు నలగామరాజునకు యుద్ధకాలమున వేయిగుఱ్ఱముల నంపె ననియు, ధరణికోటరా జైనభీమరాజునకు వర్తమాన మంపె ననియు, అతనికొడుకు రెండవ కేతరాజు రాయబారము వహించె ననియు, నలగామరాజునకు సాగిపోత

రాజు సాహాయ్యము చేసె ననియుఁ గల్యాణ పురబిజ్జలునికొడుకు వీరసోమేశ్వరుని కూఁతును మలిదేవరాజున కిచ్చి పెండ్లి చేయఁ బడె ననియుఁ జెప్పఁబడి యున్నది. హొయిసలరాజైన రెండవవీరభళ్ళా ణునినామమును వెలనాటిచోడగొంకరాజునామమును నుదాహరింపఁబడినవి. వీ రందఱును గొంచె మించుమించుగా సమకాలికులై యున్నారు. వీరిలోఁ గోటకేతరాజు 1182 వ సంవత్సరమునఁ బరిపాలనము వహించినాఁడు. కావునఁ బల్నాటివీరుల యుద్ధకాలమున నితనితండ్రిభీమరాజు ధరణికోటలోఁ బరిపాలనము సేయుచుండెను. కేతరాజు బ్రహ్మనాయనికడకు రాయబారము గొనిపోయెను. బిజ్జలుని కొడుకు వీరసోమేశ్వరుఁడు మృతినొందినతరువాతనె పల్నాటియుద్ధము జరగె నని చెప్పఁబడినందునను, వీరసోమేశ్వరుఁడు 1176 వ సంవత్సరమువఱకుఁ బరిపాలనము చేసినందునను, పల్నాటియుద్ధము 1176-1182 సంవత్సరముల నడుమ జరిగె ననుట కేసందేహము లేదు. ఇంతయేల? మొదటిప్రతాపరుద్రుఁడు నలగామరాజునకు సైన్య మంపె నని చెప్పఁబడియుండుటచేత 1196 వఱకుఁ బరిపాలనము చేసినప్రతాపరుద్రునితో బ్రహ్మనాయఁడు సమకాలికుఁ డనుట విస్పష్టము గదా! " అని.

దీనివిమర్శమునకు ముందీవిచారము కర్తవ్యంబుగా నున్నది. పల్నాటివీరచరితమున నొండె, గ్రంథాంతరమున నొండె, నీయుద్ధకాలము వ్రాయఁబడనందునను, పల్నాటియుద్ధములో నాయకప్రతినాయకు లగునలగామరాజు మలిదేవరాజు మొదల లగురాజులయొక్క-గాని వారిమంత్రు లగు బ్రహ్మనాయఁడు నాయకురాలు మొదలగువారలయొక్క-గాని కాలమును బోధించెడుశాసనాదిప్రమాణములు లేనందునను, నిదివఱకు వారు వారు తమకుఁ దోఁచినట్లు భిన్నభిన్నప్రకారములుగ నీపల్నాటివీరయుద్ధకాలనిర్ణయముచేసి యున్నారు. చూడుఁడు. విల్సన్‌దొరగారు 1080 మొదలు 1087 లోపల నీయుద్ధము జరిగిన దని

యు, కొయిలగు మొదలగువారు నాకాలముననే యీయుద్ధముజరిగిన దనియు సూయల్ దొరగారు లోకమునఁ గలవాడుకలోని

౬. గజనభగుణచంద్రాదుల
భజనుం డాషాఢశుద్ధపక్షము నందున్
విజయసమబాహు బలుఁడ
క్కజముగఁ బల్నాటివీరగజ మనిఁ బడియెన్.

అను పద్యమును బట్టి శా. శ. 1308 సంవత్సరమున నీయుద్ధము జరిగినదనియు నానాప్రకారములుగ నీయుద్ధకాలమును గూర్చి వారివారి యూహలు ప్రకటించియున్నారు. ఇట్లుండఁగా నిపుడు వీరభద్రరావుగారు "ప్రథమప్రతాపరుద్రుఁడు నలగామరాజునకు వేయిగుఱ్ఱముల నంపెను, రెండవకేతరాజు బ్రహ్మనాయనికి రాయబారము గొనిపోయెను, రెండవ వీరభల్లాణుని నామమును......నుదాహరింపఁబడినది" అని వ్రాయుచున్నారు. వీరు వ్రాసినట్లు పల్నాటివీరచరిత్రమునఁ బైనామములు పేర్కొనంబడియుండినచో నతిసులభముగ యుద్ధకాలనిర్ణయ మగుచుండఁగాఁ బూర్వు లట్లు నానామార్గములు పట్టుట కేమి కారణ ముండును? ఒకవేళ వారు గ్రంథములో వచ్చెడు వారినామములను బరిశీలింపక యట్లు వ్రాసియుందురా? లేదా, గ్రంథములో నిట్టినామములు లేకయె యుండినను మనవీరభద్రరావుగారు "మొదటి రెండవ" అని నిర్ధారణముచేసి వ్రాసి యుందురా? యని.

దీనికై యాగ్రంథమునఁ బైవారిపేరు లెట్లు వ్రాయఁబడినవో చూచి నిర్ణయించుకొనుట యావశ్యకమై యున్నది. పల్నాటివీరచరిత్రముయొక్క బాలచంద్రయుద్ధప్రకరణమున.—

"ఒకవేయి యశ్వాల నొనరఁ బ్రతాప
రుద్రుఁడు పంపించె రూఢసంగతిని.

కొండయన్నమరాజు కోటకేతుండు.
వీరభల్లాణుండు విక్రమాధ్యునకు. "

అని కేవలప్రతాపరుద్ర కోటకేత వీరభల్లాణశబ్దములే కానవచ్చుచున్నవి కాని "ప్రథమప్రతాపరుద్రుండు రెండవకేతరాజు రెండవవీరభల్లాణుఁడు" అని రావుగారు వ్రాసినయట్లు కానరావు. ఇవిగాక మఱికొన్నిస్థలములఁ బై వారినామములు రావుగారు వ్రాసినట్లున్న వేమో యని యెచ్చటఁజూచినం గానరావయ్యెను. ఇది గాక, పల్నాటివీరచరిత్రమును జక్కఁగాఁ బరిశీలించి యుద్ధకాలమునుగుఱించియు నితరవిషయములను గుఱించియు 80 పేజీ లుపోద్ఘాతము వ్రాసిన అక్కిరాజు ఉమాకాంతముగారు పైగ్రంథముయొక్క 34 పేజీలో "ఒకవేయియశ్వాలు" అను దానిక్రింది ఫుట్నోటులో "ఇతఁడు ప్రతాపరుద్రీయకృతిపతియై క్రీ. శ. 1295 మొదలుకొని 1323 వఱకు రాజ్యముఁ జేసి రుద్రదేవికి దౌహిత్రుఁడై ప్రఖ్యాతి వడసినప్రతాపరుద్రుఁడు కాక, కాకతిప్రళయుని తరువాత రాజ్యము చేసి మొదటిప్రతాపరుద్రుఁ డని చరిత్రములందుఁ బేర్కొనంబడిన రుద్రదేవుండై యుండవలయును" అనియు, ఉపోద్ఘాతము 40 పేజీలో "నలగాముఁడు లేఖలు వ్రాసినవారిలో వీరభల్లాణుండుగూడ నున్నాఁడు. వీరభల్లాణు లిద్దఱు గలరు. లింగాయతమతము స్థాపింపఁబడినతరువాత నున్నది రెండవవీరభల్లాణుఁడు కనుకఁ బల్నాటియుద్ధకాలమున నున్న దితఁడై కావలెను" అనియు 37 వ పేజీలో "వీరిలోఁ గోటకేతుఁడు సుప్రసిద్ధుఁడైనధరణికోటరాజు ......తలంపుతోఁ గోటకేతుఁడు సంధి కుదుర్చుటకై రాయబారిగఁ బోయి యుండ వచ్చు నని యూహించినచో నసందర్భ మేమి కానరాదు" అనియు నూహాగా వ్రాసియున్నారు. దీనివలనఁ బ్రమాణాంతరసహకారమున నితఁడు ప్రథమప్రతాపరుద్రుఁడు, రెండవకేతరాజు, రెండవవీరభల్లాణుఁడు అని యేర్పడు నవి వారియాశయము కాన

వచ్చుచున్నది. వారియుపోద్ఘాతగ్రంథము పరిశీలింపఁగాఁ బ్రమాణాంతరసహకారముననే ఆయానామముల కర్థనిర్ణయము చేసినట్లు వ్యక్తము కాఁగలదు. అట్లుగాక ప్రత్యేకముగఁ బ్రథమప్రతాపరుద్రాదినామములే యుండినచో యుద్ధకాలనిర్ణయమునకై వా రంతగాఁ బ్రయాసపడరనుట తెల్లము గాక పోదు.

ఇట్లుండుటనుబట్టి వీరభద్రరావుగారిలేఖనమునకు నాధారము పరిశీలింప వలసి యున్నది. ఒకవేళఁ బ్రమాణాంతరములచే నిర్ణీతంబగుసిద్ధాంతమును వా రట్లుపన్యసించినా రనుకొన్న ననుకొనవచ్చును గాని యాప్రమాణంబు లెవ్వియో మనము దెలిసికొనుట యత్యంతావశ్యకమై యున్నది.

ప్రతిశబ్దమున కర్థము నిర్ణయించునపు డాశబ్దముయొక్క శక్తిజ్ఞాన మావశ్యకముగా నుండును. అయ్యది

"శక్తిగ్రహం వ్యాకరణోపమానకోశాప్తవాక్యా ద్వ్యవహారతశ్చ
వాక్యస్య శేషా ద్వివృతే ర్వదంతి సాన్నిధ్యత స్సిద్ధపదస్య వృద్ధాః"

అనుటచే వ్యాకరణాద్యధీనముగానున్నది. ప్రతాపరుద్ర కోటకేత వీరభల్లాణశబ్దములకు వీరు వ్రాసినయర్థమునందు శక్తి గల దని వ్యాకరణకోశాదులం దెచ్చటను వ్రాసి యుండ లేదు. ఆధునికసంకేతశబ్దములు గాఁబట్టి వ్రాసియుండ లే దనుకొన్నను నివి నియతముగఁ బైవారినే బోధింపక యింకఁ గొందఱనుగూడ బోధించుచున్నవి. కాకతివంశమునఁ బ్రతాపరుద్రు లిరువురు గల రనియు, కనిగిరి ప్రతాపరుద్రగజపతి మొద లగువారు కొంద ఱుండి రనియు వినుచున్నాము. ఇంకను లేరని మన మెట్లు సిద్ధాంతీకరింపవచ్చును. "గణపతి కింకను గూఁతులు లే రని మన మెట్లు సిద్ధాంతీకరింపవచ్చును" అని 307 పేజీలో రావుగారే వ్రాసియున్నారు గదా! కాఁబట్టి ప్రతాపరుద్రపద మనేకార్థకము.

ఇటులు 238 పేజీలో “కేతరాజు తనశాసనములోఁ దనపూర్వులఁ గొందఱను పేర్కొ-సియున్నాఁడు. భీమరాజునకు మొదటి కేతరాజు కేతరాజునకు మొదటి భీమరాజు భీమరాజునకు రెండవకేతరాజు” అని రావుగారు వ్రాసి యుంచుటచేతను అనేకసంస్థానములలోను జగద్గురుపీఠములలోను నామద్వయపరంపర యగపడుచుండుటచేతను ఇంకఁ గొందఱు కేతరాజులు లేరని సిద్ధాంతీకరింప సాధ్యపడమిచేతను కేతరాజులనేకులు గలరని యొప్ప వలసి యున్నది. వేల్పూరి రామేశ్వరస్వామియాలయములోని శాసనములో గణపరాజు కోటకేతుని పుత్త్రుఁడుగా నుండినట్లు వ్రాయుట యిందునకు బాధకము గాదు. ఆతండు కేతనకు భీముం డను పుత్త్రునకన్న మఱియొకపుత్త్రుఁడై యుండిన నుండవచ్చును గదా! వీరభల్లాణులు చరిత్రములందు నలువురు గానవచ్చుచున్నారు. కాన నాపేరిటివా రనేకులు గలరని యొప్ప వలయు. మొదటిప్రతాపరుద్రుఁడు రెండవకేతరాజు రెండవవీరభల్లాణుఁడు అని సంఖ్యానిర్దేశముగ వారు వ్రాయుటచేతనే యీ పేర్లు గలవా రనేకులున్నా రని తేటపడుచున్నది. ఇట్లగునపు డివి నానార్థకశబ్దములని యేర్పడఁగలదు. నానార్థకహర్యాదిశబ్దము లేకార్థమును బోధించుటకు సంయోగాదిసహకారు లవశ్య ముండవలయు. అయ్యవి

శ్లో. సంయోగో విప్రయోగశ్చ సాహచర్యం విరోధితా
అర్థః ప్రకరణం లింగం శబ్దస్యాన్యస్య సన్నిధిః
సామర్థ్య మౌచితీ దేశః కాలో వ్యక్తిస్స్వరాదయః
శబ్దార్థ స్యానవచ్ఛేదే విశేషస్మృతిహేతవః.

అని కావ్యప్రకాశమున వ్రాయఁబడినవి. ఇచ్చటఁ బ్రతాపరుద్రశబ్దాదులకు రావుగారు చేసిన విశేషార్థనిర్ణయము సేయుటకు సహకారిగా నోరుగంటి కాకత్యాదిశబ్దములు లేవు. కాకతిప్రథమప్రతాపరుద్రుఁడు ఓరుగంటిప్రథమప్రతాపరుద్రుఁడు అని యుండినచో నన్యశబ్ద

సాన్నిధ్యమునం జేసి తదితర ప్రతాపరుద్రవ్యావృత్తి యగును. అవి లేవు. ఇఁకఁ గాలము సహకారిగాఁ దీసికొనఁ దగియున్నది. ఇఁటులైనం గాకతీవంశములో నిద్దఱు ప్రతాపరుద్రులు ప్రసిద్ధులు గలరు. వారిరువురకుఁ గాలభేదమును గలదు. ఇట్టిస్థితిలో నెవనికాలమును బట్టి వీని యర్థమును మనము నిశ్చయింపవచ్చునో నిర్ధారింప నలవి గాక యున్నది. ఒకవేళ యుద్ధకాలమునుబట్టి అనఁగా యుద్ధకాలమున నున్నప్రతాపరుద్రుఁడు ప్రథమప్రతాపరుద్రుఁడు గాన దానింబట్టి యితఁడు ప్రథమప్రతాపరుద్రుం డని యనుకొందమన్నచో యుద్ధకాల మెద్దియో తెలియ దయ్యెను. ఆకాలము తెలియకయే కదా వీరిపేర్లను బట్టుకొని పెనంగులాడుచున్నారు. అది దెలిసి యున్నచో నీప్రయాసమున కవసరమే యుండదు. కాఁబట్టి యీశబ్దార్థములను బట్టియే యుద్ధకాలము నిర్ణయింపఁదగియున్నది. ఈశబ్దములు పలానావారిని బోధించు నని నిర్ణయించుటకు మార్గాంతరము లేనందున యుద్ధకాలమును బట్టియే వీనియర్థనిర్ణయము చేయఁదగి యున్నది. ఇట్లగుచోఁ దత్కాలిక కాకతీయేతరప్రతాపరుద్రవ్యావృత్తి కాక పోవుటయే కాక యన్యోన్యాశ్రయదోషము దొందుకొని పరస్పరాపేక్షచే నేయర్థము గాక యట్టే నిలిచి పోవును. ఇట్లు ప్రమాణములు లేవనుట స్పష్టము. ఇట్టిస్థితిలో రావుగారు "ఇంతయేల? మొదటిప్రతాపరుద్రుఁడు నలగామరాజునకు సైన్యము నంపె నని చెప్పఁబడియుండుటచేత 1196 వఱకు పరిపాలనము చేసినప్రతాపరుద్రునితో బ్రహ్మనాయఁడు సమకాలికుఁడనుట స్పష్టము గదా!" యని యేయాధారమున నిర్ధారించి వ్రాసిరో తోఁపక యున్నది. రుద్రదేవుని శాసనములందుఁ గాని గ్రంథములందుఁ గాని యీవిషయము గానరాదు. "చెప్పఁబడియుండుటచేత" అని వ్రాసినారు కాని యెచ్చటఁ జెప్పఁబడినదో వివరింపరైరి. అంత ఘంటాఘోష

ముగఁ జెప్పఁబడి యుండినచోఁ బైపండితు లనేకవిధములుగఁ యుద్ధ కాలమునకై చర్చలొనరించుట నిరుపయుక్తంబు కాక పోదు గదా!

ఈ న్యాయమును బట్టియే కోటకేతుండు భీమరాజకుమారుఁడై ధరణికోట నేలిన రెండవకేతరా జనుసిద్ధాంతము భంగపడఁ గలదు. పల్నాటివీరచరిత్రములో భీమరాజుకుమారుఁ డని గాని ధరణికోటపురాధీశ్వరుఁ డని గాని వ్రాయఁబడలేదు. కాఁబట్టి యాగృహనామము గల మఱియొక కేతరా జయియుండిన నుండ వచ్చును. యుద్ధకాలమున నున్నవాఁ డతఁడె యనునిర్ణయ మన్యోన్యాశ్రయదోషము చేతను, తత్కాలికు లైన యితర కేతరాజులకు వ్యాప్తిగాక పోవుట చేతను, నిలువఁ జాల దని వ్రాయంబడియెను. తత్కాలమునందుఁ గోటశబ్దము గృహనామముగాఁ గల కేతరాజు లింకఁ గొందఱు లే రని చెప్పుటకు సాధ్యపడదు గదా! కేతరాజునకుఁ గోటపదము ధరణికోటశబ్దైకదేశము గా దనియుఁ దన్నివాసమునఁ గలిగినది కా దనియుఁ దరువాత విస్తరముగ నిరూపింపఁగలను. అమరావతిశాసనమును బట్టి యితఁడు రెండవకోటకేతుండే యని సిద్ధాంతీకరింప వలను గాదు. ఆశాసనములో నట్లు లేదు. గ్రంథములో వానిని బోధించునట్లు వ్రాయఁబడలేదు. అంత సుప్రసిద్ధునిఁ బేర్కొనునపుడు వానిగుణతను దెలుపుశబ్దములను బ్రయోగింపక యనామధేయుని వ్రాసినటులు కోటకేతుండని వ్రాయఁదగదు కదా! అతఁడే యీతండయి యుండినచోఁ దాను బల్నాటియుద్ధమునఁ జేసినట్టిప్రసిద్ధకృత్యమును దనశాసనములందు వేనియందును వ్రాయక మౌనధారణముగలిగియుండుటకుఁ గారణమేమి? శాసనములలో వ్రాయఁబడలే దని బేతిరెడ్డి గణపతివలన సన్మానింపఁబడుట లోనగు విషయములను విశ్వసింప మన్న వీరభద్రరావుగారు శాసనానుదాహృత మైన కేతరాజువృత్తాంతమును విశ్వసిం

చుటకు వినిగమకము లేదు. అది లేక యితఁడే యాకేతరాజో మఱియొకఁడో యని సంశయము జనించునపుడు వారియిష్టసిద్ధి కానేరదు.

ఇట్లు వీరభల్లాణుండు ద్వారసముద్రాధిపతి యైన రెండవవీరభల్లాణుఁ డను సిద్ధాంతము గూడ నిరస్తం బగును. నలువురు వీరభల్లాణులు చరితములందుఁ జూపట్టుచున్నారు. పలానా వీరభల్లాణుఁ డని గ్రంథమున లేదు. యుద్ధకాలమును బట్టి చూచిన మన్న నన్యోన్యాశ్రయంబుఁ దత్కాలికవీరభల్లాణాంతరావ్యావృత్తియుఁ జూపెట్టియున్నవి. ఆకాలమందు వీరభల్లాణనామము గలవా రితరులు లేరని చెప్పుటకు సాధ్యపడదు గదా! రెండవవీరభల్లాణుఁడు తనశాసనములం దెచ్చటను దాను జతురంగసైన్యముతోఁ బల్నాటియుద్ధమునకుఁ బోయినట్లు వ్రాయింప లేదు. ఇట్టి ప్రసిద్ధకృత్యము వ్రాయమికిఁ గారణ మేమి? రావుగారికి శాసనానుదాహృతవిషయము విశ్వాసపాత్రము గా దయ్యెను. కావున నతఁడు రెండవవీరభల్లాణుఁ డను సిద్ధాంతము నిరస్తం బగుచున్నది.

ఇ దంతయుఁ బరిశీలింపఁగాఁ బ్రతాపరుద్రకోటకేతవీరభల్లాణశబ్దములకు స్వేష్టార్థమును గల్పించుకొని యందువలనఁ బల్నాటివీరయుద్ధకాలనిర్ణయముఁ జేసికొని తన్మూలమున "ఇంత యేల? ప్రథమ ప్రతాపరుద్రుఁడు నలగామరాజునకు........స్పష్టము గదా!" అనియు, "పల్నాటివీరులకాలమును దెలిపెడుచరిత్రాంశము లెఱుంగమిచేతనో" అనియు మున్నుగా వీరభద్రరావుగారు వ్రాయుటయవిచారసిద్ధ మని యేర్పడుచున్నది.

ఇదిగాక యీప్రతాపరుద్రుఁడు కాకతీయుఁ డని చెప్పుటకు వీలే లేదు. ఎందుకనఁగా నలగామరాజు యుద్ధాహ్వానపత్రిక లంపునపుడు కర్ణాటమాళవమళయాళప్రముఖదేశాధీశుల కంపఁజకు నంపినట్లు వ్రాసిన

కవి కాకతివారికి యుద్ధాహ్వానపత్రిక నంపెనని వ్రాయలేదు. కనుఁడు. పలునాటివీరచరిత్రమున నలగామరాజాయారాజులకు యుద్ధాహ్వానపత్త్రిక లంపినాఁ డను సందర్భములో వాక్యములు క్రిందివిధముగఁ జూపట్టుచున్నవి.—

"వ్రాయించె లేఖలు వసుధేశతతికి
బ్రహ్మనాయనివద్ద బలు వైనకుంత
మున్నది యని భీతి నుర్వీశు లెల్ల
నప్పనా లిచ్చినా రడిగినయట్టు
లేనును మీరలు నేకమై యిపుడు
పటువిక్రమస్ఫూర్తి ప్రకటంబుగాను
బ్రహ్మనాయనిగర్వపటిమ దూలించి
మనసులో నరమరల్ మానియు మనము
పోరాడి శత్రులం బొరిగొనిమొదము
శ్రీగిరీశునియాన చెన్నునియాన
అని బాసపత్రిక లపుడు వ్రాయించి
మామగండమకోట మనుజేశునకును (1)
ధరణికోటపురికి దక్షుఁడైనట్టి
భీమదేవుం డనుపృథ్వీశునకును (2)
గోలంకిభర్తకు (3) ఘూర్జరపతికి (4)
నురగసేనుం డనునుర్వీశ్వరునకు (5)
నేడుమాఁడెము లేలు నెఱుకుకామునికి (6)
బొన్నాళ్ళభూపతి (7) పొదిలెరాజులకుఁ (8)
గటకాధిపతికిని (9) గల్వరాయనికి (10)
దేవాద్రి నేలెడుతెలుఁగుబిడ్డలకుఁ (11)

పెదబాహుభూపతి (13) భీమసేనులకు (13)
సూర్యకుమారాఖ్యచోళరాజునకు (14)
సంగ్రామవిజయుఁడౌ జయదేవునకును (15)
జయసింగునృపతికిఁ (16) జంద్రాద్రిపతికి (17)
ధీరవిక్రముఁడైన తిరునాళ్ళపతికి (18)
వీరభళ్ళాణుండు విక్రమాఢ్యునకు (19)
నరవసింగాళ్ళున (20) కర్ణమూపతికి (21)
బంగాళపతికిని (22) బాండ్యేశునకును (23)
మళయాళ (24) కర్ణాట (25) మాళవేంద్రులకు (26)
వ్రాయించి పంపిన వారెల్లఁ గూడి
చింతించి రీరీతిఁ జిత్తంబులోన
నలగామరాజును నాయనివారు
పగ వెట్టుకొని పోరఁ బైన నైనారు
తనకు సహాయులై తరలి రండంచు
పయలేఖ లంపెను నలగామరాజు
సవతిపుత్త్రుల కిప్డు సమకూరెఁ బోరు
తీర దెవ్వారలో తెగటారుదనుకఁ
గాముఁడు గెల్చినఁ గలయుప్పనములు
లే వని పంపెను లేఖలు మనకుఁ
గదలుద మిప్పుడు కామునికడకు ॥

అని, ఇక్లైవరెవరికో యూరును బేరును దెలియని దేశకాలవిప్రకృష్టుల కాహ్వానపత్రికల నంపిన నలగామరాజు దనరాష్ట్రముతోఁ గలిసియున్న యేకశిలానగరసామ్రాజ్యము నేలుచు ఘనతఁ గాంచియున్న కాకతివారి కాహ్వానపత్రిక నంపకుండినపు డనాహూతుండైన ప్రతాపరు

ద్రుఁడు పిలువనిపేరంటముగ నలగామునకు వేయియశ్వముల నంపె ననుట విశ్వసనీయము కాదు. కాన నితఁడు కాకతీయుఁడు గాక మఱి యొకప్రతాపరుద్రుండు అనఁగాఁ బేరులేక యుద్ధమున కాహూతు లలో "కటకాధిపతికిని గల్వరాయునికి" ఇత్యాదిగాఁ జెప్పఁ బడిననరపతులలో నొక్కఁడై యుండనోపు. కాకతివారికిఁ దక్క నిత రుల కెవ్వాఁకిని బ్రతాపరుద్రనామ ముండ దని చెప్పుట సాధ్యపడదు కదా!

ఒకవేళ రుద్రదేవుండు నలగామరాజుచే నాహూతుండు గాక పోయినను నలగామరాజునను గ్రహమును గోరి తదింగిత మెఱింగి సైన్యము నంపెనని యనుకొనుటకును వీలులేదు. నలగామరాజు నంతటి సామంత మహీకాంతుల సంతతుల కిరీటరత్నకాంతులచే నీరాజితాం ఘ్రియుగళుం డగురుద్రదేవుండు నలగామరాజునను గ్రహముఁ గోరినాఁ డనువిషయ మెంతమాత్రమును విశ్వాసపాత్రంబు గాదు గదా! వీ రిరువురకు రూఢసంగతి యుండెననుట గూడ నిందుచేతనే సంభావితము కా దని తేటపడఁగలదు.

ఇది గాక, నలగామునిచే నాహూతులైనట్లు కవిచేఁ గంఠో క్తముగఁ జెప్పఁబడినకోటకేత వీరభల్లాణులు గూడఁ బైని వీరభద్రరావు గారు వ్రాసినవారు గాక మఱియెవరో ఆపేరిటివారై యుండవలె నని స్పష్టముగ నుడువ వచ్చును. దీనికై నలగామరాజుస్థితి యెట్టిదో పైవా రలస్థితి యెట్టిదో చూడ వలసియున్నది. నలగామరాజు చేదిదేశము నుండి రాజ్యభ్రష్టుండయి వచ్చినతనతండ్రి యగు ననుగురాజునకుఁ జందనవ్రోలురాజు దనకూతు నిచ్చినపుడు హరణముగా నిచ్చినయొక పల్నాటితాలూకా నేలుచున్నవాఁడు. కోటకేతమహారాజు పితృ పితామహాదిపరంపరగా వచ్చినధరణికోటరాజ్య మనుభవించుచు ఘనత కెక్కి యమరావతిశాసనములో వ్రాయఁబడిన

"స్వస్తి శ్రీచతుస్సముద్రముద్రితవసుంధరాపరిపాలక శ్రీమత్త్రిణ
యనపల్లవప్రసాదాసాదితకృష్ణవేణీదక్షిణ షట్సహస్రావనీవల్లభ భయ
లోభదుర్లభ చోళచాళుక్యసామంతమదానేకపమృగేంద్ర విభవామ
రేంద్ర......శ్రీమన్మహామండలేశ్వర ప్రతాపలంకేశ్వర"

అని మొద లగుబిరుదములను వహించి యాకాలమున సుప్రసిద్ధుం డయి యుండె ననుటకు సందియము లేదు. మఱియు నితఁడు రాజమహేంద్రవరము మొదలుకొని కాళహస్తివఱకుఁ గలయాంధ్రదేశమును బాలించినగొంకరాజునకు మేనల్లుఁడుగా నుండెను. అనుగురా జీదేశమునకు వచ్చునప్పటికిఁ జందవోలురాజ్యము కోటకేతునిమేనమామ యగుగొంకరాజునధీనముగానే యుండె నందురు. ఇఁక రెండవవీరభల్లాణుండు ద్వారసముద్రము రాజధానిగాఁ గృష్ణానదివఱకుఁగలకర్ణాటదేశమంతయు నుద్దామముగఁ బరిపాలించుచుఁ గల్యాణపురాధిపతులగు కాలచూరులను జయించి రాజాధిరాజయి జగత్ప్రసిద్ధి గాంచి యక్కాలపురాజకోటిలో మేటియై యుండినవాఁ డనువిషయమును జరిత్రములు చాటుచున్నవి. ఇట్టివారలకు నలగామరాజు యుద్ధాహ్వాన పత్రిక లంపె ననియు, వీరు చతురంగసైన్యములతో యుద్ధమునకు వచ్చి యుండి రనియు, వ్రాయుట యెంతమాత్రము విశ్వాసపాత్రము గా దనుట తెల్లము గదా! కాఁబట్టి పైవారు రెండవకోటకేతుఁడు రెండవవీరభల్లాణుఁడు గాక యాపేరిటివా రెవరో యై యుందురని నిశ్చయముగ నుడువ వచ్చును.

ఇంతియకాదు మఱియొకవిధమునఁ గూడ వీరు పైవారు కా రని నిశ్చయింప వచ్చును. చూడుఁడు. యుద్ధాహ్వాన పత్రిక లంపు మని నాయకురాలు నలగామునకుఁ జెప్పునప్పుడు

"మన కప్పనము పెట్టుమన్న వారలకుఁ

బంపించి లేఖలు బలములఁ గూర్చి
పగతుల శిరముల బలిమిని గొట్టి"

అని చెప్పె ననియు నాపత్రిక లందినతరువాత వారెల్లఁ గూడి

« కాముఁడు గెల్చినఁ గలయప్పనములు
లే వని యంపెను లేఖలు మనకు »

అని యనుకొనిరనియుఁ బైసందర్భమున వ్రాయఁబడి యున్నది. గెల్చినఁ (మనము) జయించినచో కలయప్పనములు మనకు ఉంచిన—అనఁగా మనమియ్యవలసినకప్పములు లేవు అని కాముఁడు మనకు లేఖలు అంపెను అని యన్వయము. ఇందువలన నలగామునిచే నాహూతు లగు నరేంద్రు లతనికిఁ గప్పము లిచ్చుచున్నట్లును యుద్ధమున గెల్చినచో వారికవి మాఫీ చేయఁబడునని నలగాముఁడు వ్రాయించినట్లును దాత్పర్య మగుచున్నది గదా! వీరభల్లాణునియుఁ గోటకేతునియుఁ జరిత్రములు పూర్తిగఁ జదివినవారు రాజ్యభ్రష్టుండయి స్త్రీమూలక మగు స్వల్ప మయినపల్నాటిరాజ్యమునకుఁ బాలుపడిన నలగామునకు రాజాధిరాజు లగు పయివా రప్పనము లిచ్చుచుండి రనుటయు నవి మాఫీ చేయించుకొనుకోర్కెతో వారు యుద్ధమునకు వచ్చి యుండి రనుటయు నెంత మాత్రము విశ్వసింపఁగలరో యిట్టి యసంభావితార్థమునకయి నేను విస్తరించి వ్రాయంబనిలేదు. యుద్ధాహూతులలోఁ గోటకేతుండు లేఁడు కాఁబట్టి యతనియం దిది యన్వయింప దని యనుకొనుటకు వీలులేదు. అతనితండ్రి యగుధరణికోటభీమరా జప్పనము నిచ్చువాఁ డయినపుడు తత్పుత్త్రుం డగుకోటకేతుం డిచ్చువాఁడు కాఁ డనుటకు వీలుండదు కదా! మఱియుఁ గోటకేతుండు దనమేనమామ యయి చక్రవర్తిగా నున్నగొంకరాజున కొకవేళఁ గప్పము కట్టినం గట్టును గాని వారివలనఁ దిరిపెముగ రాజ్యము నొందిననలగామరాజునకుఁ

గట్టఁడు గదా! కాఁబట్టి ధరణికోట రెండవకేతరాజు ద్వారసముద్రపు రెండవవీరభల్లాణుఁడు కాక మఱియెవరో ఆపేరిటివారు పల్నాటి యుద్ధమునకు వచ్చి యుండినవా రనుట స్పష్టము.

ఇందువలననే బంగాళ మళయాళ మాళవ ఘూర్జర కర్ణాట పాండ్యచోళ ప్రభృతిదేశాధీశులు గూడఁ బల్నాటియుద్ధమునకు వచ్చినవారు కా రని యర్థసిద్ధ మగుచున్నది. ఆయాదేశముల నేకచ్ఛత్రాధిపతులుగా నేలుచుఁ బ్రసిద్ధిఁగన్న రాజేంద్రులు స్వల్పరాష్ట్రాధిపతి కప్పనము లిచ్చుచుండి రనుటయుఁ దానంజేసి తదాజ్ఞను శిరసావహించి యప్పనములు మాఫీ యగు ననుపెద్దకోర్కెతో యుద్ధమున కేతెంచి యుండి రనుటయు మిక్కిలి యసంభావితములు కదా! ఇట్లుండఁగా ప్రథమప్రతాపరుద్రుఁడు నలగామునకు గప్పము గట్టుచుండి యుండు వలన యుద్ధమునకు సాహాయ్యముఁ జేసెననునది స్మరింపను గూడఁ దగినది కా దని తేటపడక పోదు.

ఇ దంతయుఁ బరిశీలింపఁగా శ్రీనాథకవి తనచరిత్రము చదువువారివీనులవిందుగా నాయాదేశాధీశులు యుద్ధమునకు వచ్చి యుండి రని కల్పించి యైన నుండవలె. లేదా పల్నాటికిఁ జేరువ నున్నపాళెగాండ్రకుఁ బ్రతాపరుద్రుఁడు వీరభల్లాణుఁడు బంగాళపతి మాళవేంద్రుఁడు పాండ్యేశుఁడు అని మున్నగునవి నామములై యైన నుండవలె. ఇంతియే కాని వేఱుగా నుండ నోపదు.

ఇట్టిస్థితిలో వీరభద్రరావుగారు ప్రథమప్రతాపరుద్రుఁడు నలగామరాజునకు వేయిగుఱ్ఱము లంపె ననియు రెండవకేతరాజు బ్రహ్మనాయునికడకు రాయబారము గొనిపోయె ననియు రెండవవీరభల్లాణుని నామము......యున్నది అనియు వ్రాయుట వింతగా నున్నది.

ఇం కొకటి. పల్నాటియుద్ధమునకుఁ బైరాజులు వచ్చినా రనుట మిక్కిలి యసంభావిత మని ప్రకారాంతరమునఁ గూడ సిద్ధించు

చున్నది. దీనికై నలగామరాజు వారి కాహ్వానపత్రము లెప్పుడంపెనో వార లెపు డేరీతిగ వచ్చిరో విచారింపవలసియున్నది. పల్నాటివీరచరిత్రములో మలిదేవరాజు బ్రహ్మనాయఁడు యుద్ధసన్నద్ధులయి స్వసైన్యముగఁ గార్యమపూడియుద్ధరంగము ప్రవేశించి తమరాజనీతి న్యాయానువర్తిత్వము ప్రకటించుటకయి నలగామునొద్దకు బట్టుమూర్తిని సంధికై పంపి రనియు నాతఁడు సంధి కొడంబడక మలిదేవరాజబ్రహ్మనాయకాదులపౌరుషపరాక్రమములను దృణీకరించి బ్రతుకం గోరియుండినచో వచ్చినత్రోవ పట్టుకొని వెడలుట శ్రేయం బనియుఁ గానిచో రణబలి గావించెద ననియుఁ జెప్పు మని బట్టునకుఁ జెప్పిపంపి, తరువాతఁ దాను యుద్ధసన్నద్ధుండయి వెడలునపుడు నాయకురాలి యాలోచనవలనఁ దన కప్పనము లిచ్చునట్టి యాయారాజులకు యుద్ధాహ్వానపత్రిక లంపి స్వసైన్యుఁడయి కార్యమపూడి చేరె ననియు, నావల నాయారాజులు వచ్చి నలగామరాజును జేరి రనియు వ్రాయఁబడియున్నది. ఈయాంధ్రులచరిత్రముయొక్క యేడవప్రకరణమున 216 వ పేజీలో వీరభద్రరావుగారు కూడఁ బైకథాసందర్భము నిటులు వ్రాసియున్నారు —

"దూతను వచ్చినదారిని బంపి వైచెను. పిమ్మట నలగామరాజును నాయకురాలును తమకు సాహాయ్యము చేయవలసినదిగా నానాదేశరాజులకును లేఖలను బంపించిరి.....నలగాముఁడును వీరపురుషోచితము లయినకర్మముల నెల్ల నాచరించి గజారోహణం బొనర్చి నిజసైన్యంబులతోడ బయలుదేఱి కార్యమపూడికి వచ్చెను. మహారాజులనేకు లసంఖ్యాకము లయినసైన్యంబులతోడ వచ్చి యుద్ధభూమిని నలగామరాజును గలసికొన్నట్లుగా వీరచరిత్రమున మిక్కిలి యతిశయోక్తులతోఁ గూడినవర్ణనములతోఁ జెప్పఁబడియెను." అని.

యుద్ధాహూతు లయినరాజులరాక వల్నాటివీరచరితమునఁ గ్రిందివిధముగఁ జూపట్టుచున్నది.

"లలి మీఱ వీరభల్లాణుండు (1) వచ్చెఁ
బటువిక్రమాఢ్యులు పండ్రెండువేలు
కడలవా రొకవేయి గజచయ మమర
బొన్నాళ్ళవిభుఁడు (2) సముదగ్రవృత్తి వచ్చెఁ
బదినూఱు వేలకాల్బలములతోడఁ
గూడి ముప్పదివేల కుంజరావళులఁ
గదిసె మాళవపతి (3) కామభూవిభుని
గడఁగి తొమ్మిదివేల కాలరిబంట్ల
నమ్మఁదగినయట్టి నాయకచయము
నొకవేయి యశ్వాల నొనరఁ బ్రతాప
రుద్రుఁడు (4) పంపించె రూఢసంగతిని
బదివేలకాలరిబలములతోడ
ముదమునఁ బ్రాచిదే* వుండును (5) గలసె
నీలిటెక్కెంబుల నేర్పైనబంట్లు
వెంట రా (6) బంగాళవిభుఁడును గలసె
గజములు పదివేలు ఘన మైనబలము
నిరువదివేలతో నేతెంచె నొడ్డె
భువి నేలుబలదేవపురుషోత్తముండు (7)
పదివేలతురగముల్ బంట్లొకలక్ష
కూడి రాఁ గల్యాణ (8) ఘూర్జరపతులు (9)
కామునిఁ గదిసిరి గౌరవ మెసఁగ
ధనరథాస్యుఁడు (10) వచ్చె దర్పంబు మీఱ
మహిదేవిదాసుఁడు (11) మదకరుల్ వేయి

శకటసహస్రముల్ చనఁ బునఃగొలువ
నేతెంచె సాహస మెల్లవా రెఱుఁగఁ
బదిలక్షలబల ము * త్సవమునఁ రాఁగ
ద్రావిడ (12) కేరళ (13) ధరణీశవరులు (14)
వచ్చిరి నలగామవసుధేశుకడకుఁ
బద్మసేనుండునుఁ (15) బహుపడి వచ్చె
గురుసహస్రద్వయఘోటకయుతుఁడు
గుండమదేవుఁడు (16) గొబ్బూరిరాజు (17)
మొదలయిన రాజులు ముఖ్యలౌబంట్లు
నేనూటితోఁగూడ నెనుబదిమీఁద
నెనుబదివేలతో నేతెంచి రపుడు
తక్కినరాజులు తమతమబలము
లెసఁగఁగ నేతెంచి రివ్విధంబునను" అని.

ఈరాజులయాగమనవిషయము సావధానముగఁ బరిశీలింపఁ దగియున్నది. పల్నాటిదేశమునకు ద్వారసముద్రము దేవాద్రి మొదలగుకర్ణాటదేశములు, మళయాళము పాండ్యరాజ్యము మున్నగు దక్షిణదేశములు, కల్యాణము ఘూర్జరము మున్నగుపశ్చిమదేశములు, బంగాళము కటకము మొదలగునుత్తరదేశములు మిక్కిలిదూరమున నున్న వనుట తెల్లము. ఇప్పటివలెఁ గాక యక్కాలమున మార్గములు సరిగా లేకయు మార్గమధ్యమున నాయారాష్ట్రాధిపతు లగువీరులు కయ్యమునకు సడ్డము వచ్చి యిబ్బందులు గలుగఁ జేయుటయు మున్నగునీతిబాధలు వాచామగోచరములయి యుండె ననునది సుప్రసిద్ధము. ఏనిర్బంధములు లేక వచ్చినను గాల్నడకగా వచ్చువారలు నెలలపైని వత్తురు గాని దినములలో రా నేర రనుట లోకు లెఱుంగుదురు. ఇట్టిస్థితిలోఁ బైఁ బేర్కొనఁబడినవిధముగ రాజులు గజరథ

హయపదాతివర్గముతో వచ్చుట కెంతో కాలము పట్టును గదా! పల్నాటినుండి యాహ్వానపత్రములు గొనిపోయినవా రచ్చటఁ జేరుటకును వా రిచ్చటికి సపరివారముగ నేతెంచుటకును గొన్ని నెలలు పట్టునని నిస్సంశయముగ నుడువ వచ్చును. మఱియు నాహ్వానపత్రికలందినతరువాత

"వ్రాయించి పంపిన వా రెల్లఁ గూడి
చింతించి రీరీతిఁ జిత్తంబులోన"

అనుటచే నాయారాజు లెల్లఁ గూడి కొంతవట్టు చింతించి యావల బయలుదేఱినట్లు వ్రాయఁబడినది. దూరదూర దేశములం దుండినవారు గూడుటకు మరల స్వరాష్ట్రములు చేరియో యచ్చటనుండియో వెడలి వచ్చుటకు నింకఁ గొంత తడవు గాక మానదు. దీర్ఘవైరము గలరాజులు సంధి కొడంబడక యుద్ధసన్నద్ధు లయి రణరంగమును బ్రవేశించిన తరువాత యుద్ధమునకుఁ దడవు సేయుదు రనుట యవిశ్వసనీయం బని వ్రాయం బని లేదు. నలగామరాజు గురిజాలనుండి 20 మైళ్లు దూరమున నున్న కార్యముపూడికిఁ జేరినవెంబడి అనఁగా నొకటిరెండుదినములలోపల బంగాళమళయాళాది దేశాధీశులు తమతమదేశములనుండి యెన్నియో యోజనములు దూరముననున్న కార్యమపూడిఁ జేరుట సంభావితము గాదు. నలగామరాజు "మాకు సహాయులైన రాజులు వచ్చువఱకు యుద్ధమున కారంభింపఁ గూడ" దని ప్రతిపక్షులకు నియోగించుటయు వారు వల్లే యని మిన్న కుండుటయు సంభవింప దని చదువరు లెఱుంగఁ గలరు. కాఁబట్టి పల్నాటియుద్ధమునకుఁ బై రాజులు వచ్చియుండి రనుట మిక్కిలి యసంభావితము.

మఱియు వార లిటకు రావలసినంత ఘనకార్యము గూడఁ జూపట్టదు. కనుఁడు, వీరభల్లాణుఁడు లెక్కకు మీఱినగజములు పదుమూఁడు వేలు భటజనులు గల సైన్యముతోను బొన్నాళ్ళ

విభుండు లక్షకాల్బలము గల సైన్యముతోను మాళవపతి ముప్ప దివేలు కుంజరావళులు గల సైన్యముతోను గూడి వచ్చినట్లును ప్రతాపరుద్రుండు తొమ్మిదివేలు కాల్బలము నమ్మకమైన సంఖ్యలేనట్టి నాయకసమూహము వేయి యశ్వములు గలసైన్యము నంపినట్లును ప్రాచిదేవుండు పదివేలుకాల్బలముతోను బంగాళపతి లెక్కలేనిబంట్ల తోను బలదేవపురుషోత్తముండు పదివేలు గజములు ఇరువదివేలు బంట్లు గలసైన్యముతోను గల్యాణపతియు ఘూర్జరపతియుఁ బదివేలు గుఱ్ఱములు లక్షబంట్లు గలసైన్యముతోను మహిదేవిదాసుఁడు వేయి గజములు వేయిబండ్లు గలసైన్యముతోను ద్రావిడకేరళధరణిపతులు పదిలక్షలబలముతోను పద్మసేనుండు రెండువేలపెద్దగుఱ్ఱములతోను గుండమదేవుఁడు గొబ్బూరిరాజు మున్నగువార లెనుబదివేల యేనూట యెనుబది మంచిబంట్లతోను తక్కినరాజు లివ్విధంబున ననఁగా నెను బదివేల యేనూటయెనుబది సంఖ్యగల సైన్యముతోను వచ్చినట్లును జెప్పఁబడినది. ఈసంఖ్య చూడ నిరువదిలక్షలకు మించియున్నది. ఇచ్చటఁ బదునేడ్గురు రాజులు మాత్రమే వ్రాయఁబడిరి. యుద్ధాహ్వాన పత్రికలో వ్రాయఁబడిన తక్కిన తొమ్మండుగురు రాజుల సైన్యము యొక్కయు నిందు లెక్కలేక చెప్పిన సమూహవాచకశబ్దములచేఁ దెలి యఁదగిన సైన్యముయొక్కయు సంఖ్యను మన మూహించినచో నగో చర మగును. కాఁబట్టియే కవి

« వచ్చినబలముల వరుస గణింప

బుద్ధిమంతుల కైనఁ బొందదు నేర్పు »

అని వ్రాసెను, ఇట్లు సంఖ్యాతీతమైన సైన్యముతో రాజాధిరాజులు వచ్చుసంతవని పల్నాటిపాళెగాంధ్ర యుద్ధమున నేమియుఁ గానరాదు. తుదకు వచ్చినసైన్యమువిడిదికైనం బల్నాటిదేశము చాలదు. శ్రీశైలా రణ్యము చేరువ నున్నది కాఁబట్టి యది విడిదిగాఁ జేసినను వచ్చినవారి

యన్నోదకములకుఁ బల్నాటిదేశము విక్రయించినను జాలదు. కోడి పందెములో వచ్చినపగవలన జరిగినయీ చిన్నభూస్వాముల తగవు వాస్తవమునఁ గవిచెప్పినంత జరిగియుండినచో వారివారి శాసనాదు లందుఁ దప్పక వ్రాయఁబడి యుండును. అట్లెచ్చటను గానరాదు, ఈ వచ్చినవారెల్ల నోడుట వాస్తవమే యయినయెడ బ్రహ్మనాయఁడు నలిదేవరాజును సార్వభౌమునిఁగాఁ జేసి యుండును.

కాఁబట్టి కవి కేవలవాగాటోపమున యుద్ధము నింత పెంచి పెద్ద చేసిన వాఁడే కాని వాస్తవమున నింత జరిగి యుండదు గాన దీనికై లక్షలకొలఁది సైన్యములోఁ బైరాజులు రావలసినంత పని గలిగియుండు నని నమ్ముటకు వీలులేదు. కావుననే వీరభద్రరావుగారు «మిక్కిలి యతిశయోక్తులతోఁ జేరిన వర్ణనములతోఁ జెప్పఁబడినది» అని వ్రాసిరి. ఇంక నీవాక్యములలోఁ జెప్పఁబడిన రాజులనామముల విషయములో ననేకాసందర్భములు కానవచ్చుచున్నవి. విస్తరభీతిచే వ్రాయనైతిని. ఇదంతయుఁ బరిశీలింపఁగా విల్సన్ దొరగారు «బ్రహ్మనాయఁడు మఱి పన్నిద్దఱు భూస్వాములు పశువుల మేపరులు గలిసి పల్నాటిదేశములోని మాచెర్ల గురిజాల అను రెండుపట్టణములమీఁద యుద్ధము చేసిరి" అని వ్రాసినవిషయమే వాస్తవ మని నమ్మఁదగి యున్నది. ఇందువలనఁ గవి యల్పవిషయములఁ బెంచి వ్రాసినాఁ డనియు నందుచే నివి యవాస్తవము లనియు నందుచే నమ్మఁదగ వనియుఁ దేలును. రావుగా రతిశయోక్తులతోఁ జేరినవర్ణనము లన్న మాటకుఁ గూడ నిదే తాత్పర్యము. లేని యర్థము నున్నట్లు వర్ణించుట గదా యతిశయోక్తి. అట్టివర్ణనములు వాస్తవములు గా వనుట తెల్లము. అవాస్తవము లని తెలిసియు నందున్న ప్రతాపరుద్రాది శబ్దములను బట్టి కాలనిర్ణయము చేసికొని దానిచే మమ్ము వారు దూఱుట తగదు.

ఇఁక నంతటి శ్రీనాథమహాకవి యింత యసంభావితార్థమును వ్రాయునా? యని యనుకొనరాదు. కవులు తమకావ్యోత్కర్షమునకు యిట్లు వర్ణించువా రనుట "కవీనా ముచ్ఛ్రాయ సౌందర్య గుణామృషోద్యాః । కవే రాహార్య వర్ణనమ్" ఇత్యాదివచనముల వలనను అనుభవమువలనను, విశ్వవిఖ్యాతంబై యున్నయది. అట్టులుగాక యసర్వజ్ఞుఁడుగా నున్న పండితమాత్రం బగు శ్రీనాథకవియైనను రెండు మూఁడు వందల సంవత్సరములకు వెనుక జరిగి యున్న పల్నాటివీరుల యుద్ధవృత్తాంతమును జరిగినవాస్తవస్థితి వదలకుండ వ్రాయుట కెట్లు సమర్థుండు కాఁ గలండు? వాదనిర్వాహమునకై నే నీకవియందు దోషసమర్థనము చేయుచున్నా నని తలంప రాదు. ఇంతకన్న నసంభావితార్థముల నెన్నింటినో యిక్కవివరుండు వక్కాణించినవాఁడు.

ఉమాకాంతముగారు పల్నాటిచరిత్రోపోద్ఘాతమున ననేక స్థలములలో నీ కవియొక్క పొరపాటులను నిరూపించి వ్రాసి యున్నారు. స్థాలీపులాకన్యాయమున నించుక వ్రాయుచున్నాను. ఆయుపోద్ఘాతము 44 వ పేజీలో,

"గ్రంథములో ననుగురాజు కార్తవీర్యుని కేడవతరము వాఁడుగాఁ జెప్పఁబడిన దని యిదివఱకే తెల్పియుంటిని. రావణుఁడు నర్మదాతీరమున శివపూజ చేయుచుండఁ గార్తవీర్యార్జునుఁడు నర్మదలో జలక్రీడలు సల్పుటయు, నతని వేయిచేతులచేత నడ్డగింపఁబడిన జలప్రవాహ మెగదట్టి రావణునిపై దొట్టుటయు, వారిద్దఱు కలహించుటయుఁ, బురాణప్రసిద్ధవిషయంబులు గానఁ గార్తవీర్యుఁడు రావణునికి సమకాలీనుఁడై యుండవలయును. రావణుఁడు రాముఁడు నేకకాలమం దుండినవారు. రామాయణకాలము క్రీ. పూ. 18 వ శతాబ్దమునకు ముందేకాని తరువాతనై యుండ దని రమేశచంద్రదత్తు మొదలగుపండితులు వ్రాసియున్నారు.

అనఁగా నిప్పటికి మూఁడువేల రెండువందలసంవత్సరములకుఁ బూర్వమున నగును. కార్తవీర్యార్జునుఁడు రామాయణకాలమున నుండినవాఁ డగుటచే నతఁడును మూఁడువేల సంవత్సరములక్రిందనే యుండి తీరవలయును. అనుగురాజు కార్తవీర్యుని కేడవతరము వాఁ డైనయెడలఁ దరమునకుఁ బూర్తిగ నూఱేండ్ల ప్రకారము చూచినను సుమారు రెండువేలసంవత్సరముల క్రిందట ననుగురా జుండినవాఁ డగును. కురుక్షేత్రయుద్ధము జరిగినతరువాత నాలువందలసంవత్సరములకో యేనువందలసంవత్సరములకో పల్నాటియుద్ధము జరిగియుండును. ఇదియే నిజమైనచో వీరభల్లాణుని భీమదేవుని నాకాలమునకు నెట్టి శాసనములు రద్దుపఱచి హిందూదేశచరిత్రము తలక్రిందు చేయవలసి యుండును. కావున ననుగురాజు కార్తవీర్యుని కేడవతరము వాఁడని వ్రాసిన వ్రాఁత నిరాధారపువ్రాఁత యని స్పష్టము కాక మానదు" అనియు, 45 వ పేజీలో "అనుగురాజు చేదిదేశమును విడిచి పల్నాటి కేల వచ్చెనో చూతము. కార్తవీర్యుఁడు చేసినపాతకములు బాధింపఁగా బ్రాహ్మణుల యాలోచనవలన జీడినూనెగుడ్డలు ధరించి ససైన్యుఁడు సామాత్యుఁడు సకుటుంబుఁడై రాజ్యమును వదలి యిలవేలు పైన చెన్నకేశవుని వెంటఁ బెట్టికొని తీర్థయాత్రకు వెడలి వచ్చి వచ్చి కృష్ణానదీస్నానము చేసినప్పుడు తాము ధరించినసల్లగుడ్డలు తెల్లనాయె ననియు నంతటఁ బాపవిముక్తులైరనియుఁ జందనవోలులో నపుడున్న రాజనుగు భూపాలునకుఁ గూఁతు నొసఁగి పలనాడు హరణ మిచ్చెననియుఁ గార్తవీర్యుఁడు చేసినపాపములు పట్టణము నంటి యుండుటవలనఁ దిరిగి స్వదేశమునకుఁ బోవుట కిలవేల్పయినచెన్నకేశవుఁ డిష్టపడలే దనియు, నందుచేఁ బలనాటిలోనే స్థిరపడి రనియు గ్రంథములోఁ జెప్పఁబడినది. ఎన్నిసంవత్సరములక్రిందటనో కార్తవీర్యుఁడు చేసినపాపము లతనిపూర్వుల నెవరిని బాధింపక యనుగురాజునే యేల బాధించెనో తెలియ

రాదు, తీర్థయాత్రకు వెడలినచో రాజ్యమునఁ దమప్రతినిధి నెవ్వరినో యుంచి బయలుదేఱుదురు గాని దేశము నరాజకము చేసి యిలవే ల్పునుగూడఁ బెఱికికొని కట్టగట్టుక యందఱు నొక్కసారి బయలువెడలి యుండరు. చెన్నకేశవుఁడు నోరుచేసికొని మానుషభాషణంబుల స్వదేశమునకుఁ బోవలదని చెప్పెనఁట. పరమ భక్తులు గనుక నట్లు చెప్పె ననుకొన్నను జేదిరాజ్యమువంటి రాజ్యమునుండి తొలఁగించు నంతటి కరుణ భక్తులపైఁ జెన్నకేశవునికిఁ బుట్టుట చిత్రమే. కార్త వీర్యుఁడు చేసినపాపములు చేదిదేశము నంటికొని వదలకయుండుట దురవగాహము. ఏదియెట్లున్నను దాను దేశము విడిచి పోవలసివచ్చిన పుడు తనపూర్వుఁడైన కార్తవీర్యుఁడు చేసినపాపము లనుగురాజునకు జ్ఞప్తికి వచ్చియుండుట వాస్తవము......మహమ్మదీయులతొందరలవల ననో స్మిత్తుదొరగారు చెప్పినట్లు రీవాభగేలులవలననో లేక యన్యశత్రుల వలననో యనుగురాజు రాజ్యమును గోలుపోయి ససైన్యముగఁ బల వాటికి వచ్చియుండును......ఇట్టికష్టకాలమున ననుగురాజు దన దుర దృష్టమునకుఁ గారణము కార్తవీర్యార్జునుండు చేసినపాపములే యని భావించుట యొకవింత గాదు"

అనియు మున్నుగా నెన్నెన్నియో కవియొక్క భ్రమప్రమా దాదులు చూపినారు. కాఁబట్టి యీకవి యసంభావితార్థవక్తలలో మొట్టమొదటివాఁడు గా లెక్కింపఁ దగినవాఁడు.

ఇంకొకటి. ఈకవి కేవలము పుక్కిటిపురాణగాథలను విశ్వ సించి యీచరిత్రమును వ్రాసినవాఁడు. కాఁబట్టియే కృష్ణదేవరాయచరి త్రము పదుమూఁడవప్రకరణమున "మనదేశములో సత్యవంతము లగు చరిత్రములను వ్రాయునభ్యాసము లేనికారణమునఁ బుక్కిటిపురాణగాథ లను బురస్కరించుకొని మనము చరిత్రములనువ్రాయఁబూనినఁ బెక్కు దోషము లుండక మానవు." అని వీరభద్రరావుగారు వ్రాసినవాక్య

మునకే పల్నాటివీరచరిత్రము విషయమగుచున్నది. ఈచరిత్రము కేవలము పుక్కిటిపురాణములనే పురస్కరించుకొని శ్రీనాథుఁడు రచియించినట్లు లోకప్రవాదము గలదని యుమాకాంతముగారు తమ పల్నాటివీరచరిత్రోపోద్ఘాతము 78-79 పేజీలలో, శ్రీనాథుఁడు దేశసంచారము చేయుచు మాచెర్ల చేరి నారికురుపుబాధవలన నచటఁ జెన్నకేశ్వరుని సేవించుచుండ నొకనాఁడు రాత్రి చెన్నకేశ్వరుఁడు స్వప్నమందు సాక్షాత్కరించి మద్భక్తుండగు ననుగురాజుయొక్క చరిత్రమును మదంకితముగఁ జేయుము నీవు రోగముక్తుండ వగుదువని చెప్పిన తరువాత,

"శ్రీనాథుండు మేల్కాంచి స్వప్నవృత్తాంతమునకు సంతసించి పల్నాటివారిహృదయసీమలయందుఁ జిరకాలవిజృంభణముతో నాటియుండినచరిత్రాంశములఁ జక్కఁగ గ్రహించి గ్రంథరచనకుఁ దొడఁగి ...... చెన్నకేశవునియాలయములోఁ గూర్చుండి చెప్పుచు దాదాపుగా భారత మంత పెద్దదిగా నున్న యీగ్రంథమును రెండుమాసములలోఁ బూర్తి గావించె నఁట. గ్రంథము సమాప్తియగునటికి రోగముకూడఁ బూర్తిగఁ గుదిరె నఁట. గ్రంథము పూర్తి యైనతరువాత నేకారణముననో మనస్సు చలించి తోఁటియుట్ల విషయప్రవృత్తుండు కాఁగాఁ జెన్నకేశవుఁడు కోపించి ప్రతిదినము పగలే శ్రీనాథునికిఁ బ్రత్యక్షమగువాఁ డారో జతనికి దర్శన మీక స్వప్నమందగపడి నీవు పతితుఁడ వైతివి గాన నీగ్రంథము నేను గ్రహింపఁజాలనది మాలమాదిగలపాలెఁగాక యనివాక్రుచ్చి యదృశ్యుండయ్యెనఁట. మఱునాఁడుశ్రీనాథుండు మేల్కాంచి యశుభస్వప్నంబునకువగచి యెంతయో కష్టముతో రచియించిన యిమ్మహాగ్రంథము భగవంతుఁడు చేకొననిచో దాన ఫల మేమి యని దుఃఖావేశంబుతోఁ జేత నున్న తాళపత్రసంపుటము చింపి చిందఱవందఱగాఁ బాఱ వేసె నఁట. మాలలు మాది

గలు మొదలైనవారెవరికి దొరికినపత్రములు వారు సేకరించిరఁట.. ఈ కథయొక్క నిజానిజము లెట్లున్నను గ్రంథమొకచోటను సంపూర్ణముగ లేక శకలములుగా నొకరివద్దఁ గొంత మఱియొకరివద్దఁ గొంతగఁ జాల మట్టకుఁ బిచ్చుకుంటలు మాలలు మొదలగు నిమ్నజాతులయాధీనము లోనే యున్నమాట వాస్తవము" అని మొదలుగా వ్రాసియున్నారు. ఇట్లు లోకప్రవాదమునకు ననుభవము సరియైనను నింతియే దీని వాస్తవ మగు యుండనోపు. ఇట్లు ప్రక్కటిపురాణముల మూలమై నది కావుననే యీగ్రంథము దోషములపాలై యున్నదని తోఁచెడిని.

కొందఱు.—పల్నాటివీరులచరిత్రమును గవి మహాభారతమున కనురూపముగ రచియింప నెంచి యనేకవిషయములను దోఁచినట్లు కల్పించినాఁడు. నలగామరాజమలిదేవరాజాదులను గురుపాండవులకుద్ది చేసి వారియుద్ధమునకు ద్యూతమునకై వీరి యుద్ధమునకుఁ గోడిపందెము కారణముగాఁ జేసి యోటుపడినవారల కరణ్యవాసాదులు దెచ్చి పెట్టి విరాటనగరమున గోగ్రహణముమాఱ్కి మందాడినగరమున గోగ్రహణమును మలిదేవరాజాదులు సమయబద్ధులై శ్రీశైలములో నేడుసంవత్సరములు గడిపినతరువాత రాయబారుల నంపుటను నానల యుద్ధోద్యోగ రాజాహ్వానాదులను గొంచె మించుమించుగాఁ గల్పించి తుదకుఁ గార్యమపూడిని గురుక్షేత్రము గావించి బాలచంద్రనాయుని నభిమన్యునిఁగాను బ్రహ్మనాయునిఁ గృష్ణునిఁగాను జేసి కథాశరీరము నెంతయుఁ బెంచి పెద్దఁ జేసినవాఁడు. పర్ణ్యులయతిశయమునకై యనుగురాజా కార్తవీర్యార్జునున కేడవతరమువాఁ డనియుఁ బున్యాతమంబైన యయోధ్యాదేశమునుండి (పరాజితుఁడై పాఱి గాక) తీర్థయాత్రకయి వెడలి వచ్చి పవిత్రమైన పల్నాటిదేశమున వసించినాఁ డనియుఁ జెన్నకేశవుని సాక్షాత్కారముగలవాఁ డనియు నేమియేమియో కల్పించినాఁడు. వాస్తవమునఁ బాలమాచాపురియనునది పాలమాచఱను నాంధ్రభాషా

శబ్దములతోఁ జేరిన నామము గలిగియుండినందునను జంబనాపురి యను నామాంతరము గూడ జంబన్న (జంబన) అను నాంధ్రపదముతోఁ జేరియున్నందునను వీరికులదైవము పేరు గూడ చెన్న యను నాంధ్రపదముతో నున్నందునను అనుకుశబ్దంబు నట్టిదిగానే చూపట్టుచున్నందునను వీరాంధ్రదేశాభిజనులుగా నెన్నఁదగి యున్నారు. వీరిమంత్రులకుఁ గల రేచర్ల గోత్రము వెలమకులము పేరినాయఁడు దొడ్డనాయఁడు పెద్దన్న అని మొదలయిన నామములును దీనిని బలపఱచుచున్నవి. రేచర్ల యను గ్రామమున వసించుటను బట్టి వారి కాగోత్రము కలిగియుండుటయు నాగ్రామమేకశిలానగర ప్రాంతము నాంధ్రదేశమున నుండుటయు శ్రీనాథభీమఖండాదుల చేతను అనుభవము చేతను వెలమపదము మనయాంధ్రదేశములో నున్న నాలవజాతివారిలో నొకతెగవారియందు రూఢమగుటయు నాయఁడు దొడ్డ పెద్ద అన్న మొదలగునవి యాంధ్రభాషాపదములగుటయు సుప్రసిద్ధంబ. దీనిం బట్టియె "బ్రహ్మనాయునితండ్రి మున్నగువారు పశ్చిమసీమనుండి కృష్ణానది దాఁటి పల్నాటికి వచ్చినవారు" అని యిచటి పెద్దలు చెప్పుచున్నారు. అపుడా దేశమును బిల్లలమఱ్ఱి రాచకొండ రాజధానులుగాఁ రేచర్ల జేతిరెడ్డివంశజులే పాలించుచుండిరి గావున నీబ్రహ్మనాయకాదులు వారికుటుంబములోని వారే యయి యుండవలె. కవి యేమో యతిశయమునకై వీరికి వారికిఁ గలసంబంధమును మఱుఁగుపఱచి యార్యావర్తమునుండి వీరనుగురాజు వెంట వచ్చినవారని వర్ణించి యున్నవాఁడు కాని వేఱు కాదని వాక్రుచ్చుచున్నారు.

మఱికొందఱు.—ఈకవి యాంధ్రనైషధాదికృతికర్తయైగన్న శ్రీనాథకవి గాఁడు. అక్కవిరాజై యుండినచో నింత యసంబద్ధవితార్థములను జెప్పఁడు. తదీయకవితాసుధారసమును గ్రోలి తన్మాధుర్యాదుల ననుభవించినవార లీవిషయము నెఱుంగఁగలరు. మఱియు నాతండు సుకృటిపురాణములను బురస్కరించుకొని యిట్టికావ్యరచ

నము నెప్పటికిఁ జేయఁడు. చేయువలసి వచ్చినచో నద్దానిసందర్భము లను సంస్కరించి సంభావితం బగునట్లు చేయును. కావున నిది యథా శ్రుతగ్రాహి యైన యాపేరిటిమఱియొకయప్రగల్భకవిచేఁ గూర్పంబడి యైన నుండవలెను. లేదా, యెవఁడో తా నేర్చినకొలంది వ్రాసి తన గ్రంథమునకు మహత్త్వము రాఁ గోరి ప్రసిద్ధశ్రీనాథమహాకవి రచి యించినట్లు వ్రాసియైన నుండవలెను. ఇంతియ కాని వేఱుగానోపదు. కాఁబట్టియే యాగ్రంథమునందుఁ బెక్కులు శబ్ద దోషములు చూప ట్టుచున్న వని యంద్రుం.

దీనం జేసియే రావుగారీ యాంధ్రులచరిత్రముయొక్క యుపోద్ఘాతమున 26 పేజీలో « ఉమాకాంతముగారు ప్రకటిం చినభాగము శ్రీనాథకవిరచితగ్రంథములోనిది యేనా యని యొక గొప్పసందేహము గలుగుచున్నది. ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారము లోని ప్రతు లశోచనీయావస్థలో నున్నవి » అనియు, ఏడవప్రకర ణము 196 వ పేజీ ఫుట్నోటులో « ఈశ్రీనాథుఁడు శృంగారనైషధాది మహాకావ్యములను రచించిన కవిసార్వభౌముఁడే యని చెప్పుచున్నారు గాని, యాగ్రంథములోని వ్యాకరణదోషములను వీక్షించినప్పు డీ గ్రంథ మామహాకవిరచితము కా దేమో యని సందియము కలుగు చున్నది" అనియు వ్రాసినా రని యెంచెదను.

ఈకవి యెవఁ డైన నగుం గాక, గ్రంథములో నున్నప్రతాప రుద్రాదిశబ్దములు ప్రథమప్రతాపరుద్రాదులను బోధింపమి యున్న గువానిచే రావుగారిసిద్ధాంతము నిలువకపోవుటయే మాకోరినపని. ... విమర్శమువలన సిద్ధించినది. అయినను పై సందర్భము లన్నియు ...ంగినరావుగా రాభాగములోని « ఒకవేయియశ్వాల » నని మొద లగువాక్యములను బట్టి వాస్తవమును విచారింపక ఇంతయేల యని మొదలుగా వెలుగోటివారి వంశచరితమును దూఱవచ్చుట యుచితం బుగాఁ దోఁపదు.

ఇదివఱకు సుమాకాంతముగారు ప్రకటించిన బాలచంద్రయుద్ధ ప్రకరణమున నున్న వాక్యముల నెత్తి విమర్శించితిని. ఇపుడు, మదరాసు లిఖితపుస్తకభాండాగారములో లెక్కకుమీఱి యున్న ప్రతులలో నెం. 14-3-15. 12-2-34. 14-4-82 గల ప్రతులలోని కొన్నివిశేషముల నుదాహరించుచున్నాఁడను. అందు యుద్ధాహ్వానప్రకరణమున.—

« ఉరగేశుఁ డనునట్టి యొడ్డభూపతికి
దేవాద్రి నేలెడు తెలుగుబిజ్జలుకు
సూర్యకుమారుకుఁ జోళభూపతికి
వీరభల్లాణికి (భల్లాణుకు) విక్రమపతికి
అరవసింగాళున కణ్ణామపతికి
(అణ్ణామపతి తిరువణ్ణామలై పతియై యుండనోపు.)
బంగాళపతికిని బంచపాండ్యులకు
మఱియు దేశాధీశ మండలేశులకు »

అనియు, ఆగమనప్రకరణమున

« పరఁగంగ శ్రీవీరభల్లాణి వచ్చె
అశ్వంబు లొకవేయి యమితప్రతాప
రుద్రుఁడు పంపించె రూఢసంగతిని
బాచిదేవుఁడు వచ్చి పన్నుగాఁ గదిసె
(బాచి యనునది నంద్యాలసమీపమున నుండు బాచిపల్లియను గ్రామ మని గ్రహింప నగు.)
ఇరువదివేలతో నేతెంచె నుద్ది
భూమేలుబలదేవపురుషోత్తముండు
ధపదదాసుఁడు పంప ధరణీశ్వరుండు
ఉజ్జయినీపురి నొప్పుగా నేలు

మహాదేవదాసుఁడు మదకరుల్ వేయి
పదిలక్షబలములు పన్నుగాఁ గొలువ
దక్షిణజలనిధి దాపున నున్న
పేరైనరాజులు పృథివి కంపింప
సింధునదీతీరశివకీర్తిఘనుఁడు
గట్టుభూముల నేలుఘను లైనపతులు
గురుసహస్రద్వయఘోటకసహితు
లగుతురుష్కులు వచ్చి యవనీశుఁ గనిరి
సాని (గి) పోతమరాజు సత్యాఖ్య ప్రెగడ"

అనియు భేదము లగపడుచున్నవి. వీరల సైన్యములను గుఱించి వ్రాయఁబడిన వాక్యములలో నెన్నో భేదములు గలవు. ఇం దాహ్వానప్రకరణమునఁ గ్రొత్తవారు, ఒడ్డెభూపతి తెలుగుబిజ్జలుఁడు సూర్యకుమారుఁడు విక్రమపతి అణ్ణామపతి పంచపాండ్యులు దేశాధీశులు మండలేశ్వరులు. ఆగమనప్రకరణమునఁ గ్రొత్తవారు, పేరైనరాజులు శివకీర్తిఘనుఁడు గట్టుభూముల నేలురాజులు తురుష్కులు సాని (గి) పోతరాజు సత్యప్రెగడ. పై లిఖితపుస్తకములలో ముద్రితప్రతి నున్నపాఠములకన్న నించుక భేదముతో వ్రాయఁబడినవారు—వీరభల్లాణి, అమితప్రతాపరుద్రుఁడు, ధనదదాసుఁడు, మహాదేవదాసుఁడు.

ఇట్లు భిన్ననామములు గలరాజులును ఆహ్వానకాలములో లేక యాగమనకాలములో వచ్చియున్నరాజులును ననేకులు గలరు వారి వారికిఁ గాలభేదము గూడ నగపడుచున్నడి. వీనిలో వాస్తవ మెద్దియో అవాస్తవ మెద్దియో నిశ్చయించుట దుశ్శకమైయున్నది. ఇదంతయు ననుభవించియే కాఁబోలు "ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారములోని ప్రతు లయోమయావస్థలో నున్నవి" అని వీరభద్రరావుగారు వ్రాసి యుందురు. ఇట్టివానిని బట్టి కాలనిర్ణయంబు వా రెట్లు చేసిరో.

తోఁపక యున్నది. ఒకవేళ అనేకప్రతులను పరిశీలించి ముద్రింపఁబడిన ప్రతియె విశ్వసింపఁదగిన దని యనఁజూతురు. అది తగదు, మన మెద్ది నిర్దుష్టము గా నుండునో దానినే గ్రహింపవలయుఁ గాని యెట్లుండి నను ముద్రితప్రతి యని గ్రహించుట తగదు గదా! ముద్రితప్రతి లోని పాఠములకన్న లిఖితప్రతులలోని పాఠములే కొన్ని సమీచీనములు చూపట్టుచున్నవి.

« మూదమునఁ బ్రాచిదేవుండును గలసె.
పదిలక్షులబల ముత్సవమున రాఁగ »

అను ముద్రితపుస్తకపాఠములలో యతిదోషములు కానవచ్చుచున్నవి.

బాచిదేవుఁడు వచ్చి పన్నుగాఁ గలసె
పదిలక్షబలములు పన్నుగాఁ గొలువ

అని లిఖితపుస్తకములందుఁ గలపాఠములలో నవి లేక యున్నవి. ఇది గాక.—

« వీరభల్లాణుండు విక్రమాఢ్యునకు »

అను ముద్రితవాక్యములో విశేష్యపదమును ప్రథమాంతముగఁ జెప్పుట శాస్త్రీయము కాదు. వీరభల్లాణికి (భల్లాణుకు) అనులిఖితపుస్తక పాఠము సరిగాఁ దోఁచెను. ఇదిగాక ముద్రితప్రతిలో, « తెనుఁగుబిడ్డ లకు కర్ణమాపతికి కడలవారొక వేయి ధనదధాన్యుఁడు" అని మొదలు గాను, లిఖితపుస్తకములలో, « తెనుఁగుబిజ్జలుకు, అర్ణామపతికి, పంద్రెండు వేలు, కడలవారొక వేయి, ధనదదాసుఁడు " అని మొదలుగాను జూప ట్టుచున్నవి. వీనిలోఁ గలభేదము స్పష్టము. కాఁబట్టి లిఖితపుస్తకముల లోనిపాఠము లప్రశస్తము లని తీసివేయు వలను లేదు. ఇది గాక అనేకప్రతులలో నేకరూపముగా నున్నపాఠములను లిఖితప్రతులలో నున్నవని యెట్లు తీసివేయవచ్చును? ఇట్లగునపుడు బిజ్జలుఁడు వీర

భల్లాణి పంచపాండ్యులు రుద్రుఁడు మున్నగువారలు రావుగారు కని పెట్టినవారు గాక యీ నామములు గలయితరరాజులు గావచ్చును. దేవాద్రియన దేవరకొండ. మాదానాయనియుమామహేశ్వరశాసనమున “దేవనగదక్షిణప్రాంతంబున” అనివ్రాయఁబడినది. బిజ్జలవంశీయులు కాపువా రాంధ్రదేశమున నైజాములో జమీన్‌దారులు ప్రసిద్ధులు. వీరభల్లాణి యనువాఁడు నొకఁ డుండనోపు. పంచపాండ్యులు మధురానాథులు సుప్రసిద్ధులు. రుద్రులనువా రెందఱో కలరు. అమితప్రతాపము గలరుద్రుఁ డనునర్థ మగునే కాని ప్రతాపరుద్రుఁ డనునర్థము కాదు. ఈవిషయము ముందు వివరింపఁబడ గలదు. ఇట్లున్న వీనిం బట్టి వేటూకయుద్ధకాలము గూడ సిద్ధాంతపడ వచ్చును. ఇట్లగుచో “మొదటిప్రతాపరుద్రుఁడు నలగామరాజునకు” అని మొదలుగా రావుగారు చేసినసిద్ధాంతము నిలువఁజాలదు. పరస్పరవిరోధములవలన నాకాలము స్థిరపడ దన్నచో రావుగారు నిర్ధారించిన యుద్ధకాలము గూడ నిలువకపోవును.

ఇట్లు శ్రీనాథకవి రచితగ్రంథ ప్రతులలోనే యిన్ని విరోధములు కానవచ్చుచున్నవి. ఇంక నీచరిత్రము మల్లయ రామసెట్టి వీరభద్రయ్య మున్నగు పెక్కండ్రు కవులచే వేర్వేఱుభంగుల రచియింపఁబడినది. వానిలోఁ గలపరస్పరవిరోధములు వాచామగోచరములు. పల్నాటివీరచరిత్రవిమర్శము వేఱుగ వ్రాయ నుపక్రమించినాఁడఁ గాన వానినెల్ల నిట వ్రాయను. ఇట్టి పరస్పరవిరోధముచేఁ గాలనిర్ణయము కాకపోవుట యటుండఁ జరిత్రాప్రామాణ్యశంక గూడ వచ్చుచున్నది. ఈచరిత్రము శాసనాధారమును గాదు. కాఁబట్టి పరస్పరవిరోధముల చేతను శాసనములం దుదాహృతములు గామిచేతను జెవిరెడ్డి గాథలు విశ్వాసపాత్రములు గావని వక్కాణించుచున్న రావుగారు పరస్పరవిరుద్ధములై శాసనానుదాహృతములై యున్న పల్నాటివీరచరితములలోని విష

యములను నమ్ముటకు వీలు లేదు. అట్లగునపుడు రావుగారు ప్రతాప రుద్రాదిశబ్దములకుఁ దమయిష్టప్రకారము మొదటిప్రతాపరుద్రుఁడు రెండవ కేతరాజు రెండవవీరభల్లాణుఁడు అని యర్థము సల్పికొని చదువరుల శాగ్రంథములో నిట్లే యున్న దని నమ్మకము గలుగఁజేయుటకు « చెప్పఁబడియున్నది » అని మొదలుగా వ్రాసి జేతిరెడ్డిమూలపురుషుఁ డనువిషయమును నెట్టివేయ మాటాడ్డుట మిక్కిలి యవిచారసిద్ధ మని యేర్పడుచున్నది.

ఇఁక రావుగా రాయా రాజుల కాలమునుబట్టి పల్నాటివీరుల యుద్ధకాలము నెటులు నిర్ధారించిరో తద్విమర్శము చేయఁబడుచు న్నది. వీరు పల్నాటియుద్ధము క్రీ. శ. 1176 పైనను 1182 లోపలను జరిగిన దని సిద్ధాంతము చేసి యున్నారు. కొమ్మరాజుతండ్రి వీరసోమేశ్వ రుఁడు మృతినొందినతరువాత నీయుద్ధము జరిగిన దని చెప్పఁబడియుండుట చేతను సోమేశ్వరుఁడు 1176 వఱకుఁ బరిపాలనము చేసినందుచేతను 1176 సంవత్సరమునకుఁ బూర్వము జరుగ లే దనియు, కోటకేతుఁడు సింహాసనము నధిరోహించుటకు మున్నే యీ యుద్ధము జరిగిన దని యే ర్పడియుండుటచేతను కేతరాజు 1182 వ సంవత్సరమున సింహాసనము నధిరోహించి యుండుటచేతను, 1182 సంవత్సరమునకుఁ దరువాత జరిగి యుండ దనియు, నీరెండు పైసిద్ధాంతమునకు ముఖ్యాధారములని చాటు చున్నారు. కోటకేతమహారాజు 1182 వ సంవత్సరమున సింహాసన మెక్కినాఁ డనుట కమరావతిలోనియా తేనిశాసనము ప్రమాణం బని చరిత్రకారుల నిశ్చయము. ఆశాసన మివ్విధంబుగ నున్నది.

« అస్తి శ్రీధాన్యకటకం పురం సురపురా ద్వరమ్। యత్రా మరే శ్వర శ్శంభు రమరేశ్వరపూజితః। .........శాకాబ్దే యుగ శైందు రూపగణితే మాఘే దశమ్యాం తిథౌ। శుక్లాయాం గురువాసరే శుభ

దినే సంప్రాప్తరాజ్యోన్నతిః । శ్రీమత్కేతన్నృపస్సమస్తగురవే గ్రామాగ్ర్యవరేణ్యాస్వహర్షాక్ । సంప్రాదాత్తుంగ తేశ్వరాయ విపులశ్రీ బ్రహ్మసంపద్వ్రతః ॥ స్వస్తి శ్రీచతుస్సముద్రముద్రితనిఖిలవసుంధరాపరిపాలక శ్రీమత్త్రినయనపల్లవప్రసాదాసాదితకృష్ణవేణీనదీదక్షిణ షట్సహస్రావనీవల్లభ భయలోభదుర్లభ చోళచాళుక్యసామంతమదానేకప మృగేంద్ర విభవామరేంద్ర శ్రీమదమరేశ్వరదేవదివ్యశ్రీపాదపద్మారాధక పరబలసాధక శ్రీధాన్యకటకపురవరాధీశ్వర ప్రతాపలంకేశ్వర... శ్రీమన్మహామండలేశ్వర కోటకేతమహారాజులు శకవర్షంబులు 1104 అగు నేటిమాఘశుద్ధ 10 గురువారం నాడు శ్రీమద్బుద్ధదేవరకు నాచంద్రతారార్కంగా నిచ్చిన యూళ్ళు కంద్రవాటిలోని కంతేరు కొండపడమటిలోని మేడికొండూరు డోకిపఱ్ఱు. ఈధర్మం నడపనివారు పంచ మహాపాతకములు చేసినవారు « స్వదత్తాంపరదత్తాంవా యోహరేత వసుంధరామ్ । షష్టివర్షసహస్రాణి విష్ఠాయాం జాయతే క్రిమిః ॥ అని.

« ఈశాసనప్రకారము కోటకేతుఁడు క్రీ. శ. 1182 వ సంవత్సరమునకు సరి యైన శా. శ. 1104 వ సం. మాఘశుద్ధదశమినాఁడు రాజ్యమునకు వచ్చెను.'' అని యుమాకాంతముగారు వ్రాసినారు. అదియే మనరావుగారికి జీవాతు వని యెంచెద. అయినను గాకున్నను నీశ్లోకమువలన నీయర్థము రా నేరదు. ఎందు కనఁగా, శుభదినే, అను సప్తమికి సంప్రాప్త అనుచోటి ప్రాప్తిక్రియయం దన్వయ మైనచో గదా యది ఘటిల్లును. అప్పు డిది రాజ్యప్రాప్తిబోధకశాసనం బగును. కేవల రాజ్యప్రాప్తిని బోధించుటకై శాసనము లెవ్వారును స్థాపించుట కానము. కేతరాజొకవేళ నూతనముగ నట్లు స్థాపించియుండు నను కొందమన్నచో గ్రామదానమునకుఁ గాలము లేకపోవును. తా మొనరించినధర్మములు తత్కాలము తెలుపుటకు శాసనము:లు వ్రాయిం

చుచుఁ దద్వ్యాజమునఁ దమపౌరుషపరాక్రమాదులు దెలుపుట కను చున్నారము. ఇది దానముఁ బొందినవారికి శాశ్వతాధారముగా నుండు ననియు దీనిం గనినవా రిట్టిసత్కార్యము లొనరింతు రనియు నందు వలన ధర్మసంస్థాపనం బగు ననియు స్థాపకులతాత్పర్యము. రాజ్య ప్రాప్తిబోధనమువలన ఫలితార్థ మెద్దియు లేదు. కాఁబట్టి సంప్రాదాత్ అనుక్రియయందే శుభదినే అనుచానికన్వయము గా నోపు.

ఇఁక శ్లోక మీ యర్థమునే బోధించుననుటయందు నియా మకము లేదు కాఁబట్టి యిది నిలువఁ జాల దన్నచో, శాబ్దబోధయందు వక్తృతాత్పర్యజ్ఞానము సహకారికారణము కాఁబట్టి యిచ్చట శాసన స్థాపకునితాత్పర్య మేయర్థమునందుఁ గలదో ఆయర్థమే యీశ్లోకము నకుఁ జెప్పవలయు. అందుకై శాసనమున నీశ్లోకార్థ మెటులు వ్రాయఁ బడినదో చూడ వలసి యున్నది. అయ్యది యిట్లు వ్రాయంబడినది.

« కోటకేతమహారాజులు శకవర్షంబులు 1104 అగునేటి మాఘ శు 10 గురువారమునాడు శ్రీమద్బుద్ధదేవరకు నాచంద్రతారార్కంగా నిచ్చినయూళ్ళు...జాయ తే క్రిమిః '' అని.

ఇందుఁ గేవలము భూదానమును గూర్చియె వ్రాయఁబడినది గాని రాజ్యప్రాప్తిపేరే యెత్త లేదు. « స్వదత్తాం పరదత్తాం వా » అనునుప సంహారవాక్యము కూడ దానమె యిందు ముఖ్య మని తెలుపుచున్నది. ఇది రాజ్యప్రాప్తిబోధకమై యుండినచో « కోటకేతమహారాజులు శక వర్షంబులు 1104 అగునేటి మాఘ శు 10 గురువారమునాఁడు రాజ్యము నొందిరి. » అని వ్రాయవలసి యుండెను. అటులు లేక « గురువారము నాఁడు శ్రీమద్బుద్ధదేవర కిచ్చినయూళ్ళు » అని మొదలుగ వ్రాయఁ బడినది. ఇందువలన, సంప్రాప్తరాజ్యోన్నతిః శ్రీమత్కేతనృపః గురు వాసరే శుభదినే సుగతేశ్వరాయ బహూన్ గ్రామాన్ సంప్రాదాత్ " అని యన్వయము చేయవలసి యుండును. కాఁబట్టి దాన క్రియాన్వ యమునందే వక్తృతాత్పర్యము తేటపడుచున్నది.

ఒకవేళ శుభదినే యనుదానికిఁ బ్రాప్తిక్రియయందును దానక్రియయందును నన్వయము చెప్పఁగలమందు రేమో. అట్లగుచో "కోటకేతమహారాజులు...గురువాసరమునాడు సంప్రాప్తరాజ్యోన్నతిరైమై బుద్ధదేవర కిచ్చినయాళ్ళు" అని వ్రాయవలసి యుండెను. అట్లు వ్రాయలేదు. ఇంత యేల? సంప్రాప్తరాజ్యోన్నతిః, అను పదము యొక్క యర్థానువాద మైనను జేసి యుండ లేదు. ఇది గాక ప్రాప్తిక్రియకు రాజ్యోన్నత్యమే కర్మముగాని రాజ్యము కాదు. అట్లగుచో సంప్రాప్తరాజ్యస్య ఉన్నతిః యస్య అని వ్యధికరణసమాసము చెప్పవలసివచ్చును. అయ్యది "సంభవతి సామానాధికరణ్యే" అను న్యాయమునకు విరుద్ధము. తద్విధియు లేదు. కాన నెన్నఁడో రాజ్యము నొంది యిప్పుడు తదౌన్నత్యము గలవాఁ డని చెప్పవలయును. అట్లగునపుడు "ఈశాసనప్రకారము కోటకేతుఁడు క్రీ. శ. 1182 సంవత్సరము...రాజ్యమునకు వచ్చెను" అను లేఖనము నిరాధార మగును. అట్లగునపుడు "కోటకేతరాజు 1182 సంవత్సరమునఁ బరిపాలనము వహించినాఁడు...పల్నాటియుద్ధము 1176-1182 సంవత్సరములనడుమ జరిగిన దనుట కేమిసంశయము లేదు" అనురావుగారివ్రాఁత నిరాలంబమై నిలువఁ జాలక పోవును. ఇట్లుకాఁగా 1182 లోపలనే పల్నాటి యుద్ధము జరిగిన దని యుద్ధమునకుఁ బెట్టినయుద్దు దీఱినది. అందువలన "ప్రతాపరుద్రునితో సమకాలికుండైనతనతాత యైనబేతినాయనికిఁ బ్రహ్మనాయఁ డెట్లు సమకాలికుఁ డయ్యెను...దురవస్థ పట్టినదిగదా" అని మొదలైనరావుగారిపరితాపము పరిహృతము గాఁగలదు. ఇది గాక, యీకోటకేతసింహాసనాధిరోహణకాలనిర్బంధము వదలినపుడు ప్రధానమల్లనిబ్రహ్మణన్యాయమున సకలోపద్రవములు అనఁగాఁ బరిపాలనమువూత్రము వదలుకొని బ్రతికి యుండిన నుండఁదగినవీరసోముని

చావు కల్పించుటయు 1199 సంవత్సరపు సాగిపోతరాజును 1182 సంవత్సరమున కీడ్చుటయు మొదలగునవి శమింపఁ గలవు.

ఇఁక నీయాక్షేపము చేయ వత్తురు. కోటకేతుఁడు 1182 సంవత్సరమునఁ గాక యంతకుఁ బూర్వమే సింహాసన మెక్కి యుండునన్నచో నతనితండ్రి యగుభీమరాజు రాజ్యకాల మడ్డము వచ్చును. 1182 నకుఁ బూర్వము భీమరాజు గదా రాజ్యము చేయుచున్నవాఁడు అని.

ఇది నిలువదు. భీమరాజు 1181 వఱకు రాజ్యముచేయుచున్నట్లు శాసనములలో వ్రాయలేదు. కోటకేతుని శాసనమునుబట్టి యూహించెద మన్నచో నన్యోన్యాశ్రయదోషము ప్రసక్తించి యేకాలనిర్ణయము గాక పోవును. 1181లో భీమరాజు రాజ్యము చేయుచున్నందునఁ గోటకేతుఁడు 1182సంవత్సరముననే సింహాసన మెక్కె నాఁ డనియుఁ గోటకేతుఁడు నాఁడే సింహాసన మెక్కినందున నంతవఱకు భీమరాజు రాజ్యము చేయుచుండె ననియు నూహించినచో నన్యోన్యాశ్రయదోషము తప్పదు గదా! ఒకవేళ నీభీమరాజు 1127 మొ. 1158 వఱకు రాజ్యము చేసిన గొంకరాజుసోదరిని వివాహ మాడినవాఁడు కావున నితఁడు క్రీ. శ. 1140 వ సంవత్సరముననో లేక యాప్రాంతముననో రాజ్యమున కారంభించి క్రీ. శ. 1182 వఱకుఁ బాలించి యుండును అని యుమాకాంతముగారి లేఖనమును బట్టి యాభీముని రాజ్యకాలనిర్ణయము కాఁదగు నన్నచో నాపక్షమున గొంకరాజు రాజ్యకాలమున కన్యూనానతిరిక్తముగ 1127 నుండి 1158 వఱకే భీమునిరాజ్యకాలమని చెప్పుట యుక్తిమంత మగును గాని గొంకరాజుకాలమునకు న్యూనాధికభావముగఁ జెప్పుట యుక్తిమంతము గాదు. ఇట్లనిర్ణీతమగుభీమదేవుని రాజ్యకాలమును బట్టి కోటకేతరాజు సింహాసనాధిరోహణకాలమును నిర్ణయించుటకు వీలు లేదు. అమరావతిశాసనము తన్నిర్ణాయకము కా దని నిరూపింపఁబడియెను.

ఇదిగాక పల్నాటివీరచరిత్రమున భీమరాజును జెప్పినపుడు కేతరాజుతండ్రి యని గాని కేతరాజును జెప్పినపుడు భీమరాజుపుత్త్రుఁడని గాని లేనందున నీభీమరాజు కేతరాజుతండ్రి గాక మఱియొకధరణికోట భీమరాజయియో, యీకేతరాజు భీమరాజుకుమారుఁడుగాక మఱియొక కేతరాజయియో, యుండునేమో యని సంశయము ప్రబలుచున్నది. కోటగండభూపతి మొద లగుక్కోట తెగవా రింకఁ గొందఱున్నారు గదా! కోటరాజ్యము కొంత విభజించుకొని వారును పాలించుచుండిన నుండవచ్చును గదా! ఇంతకు "ధరణికోటపురికి దక్షుఁడైనట్టి" అనుచోటి దక్షపదము సమర్థుఁడన్నయర్థమునే బోధించును గాని రాజను నర్థమును బోధింపదు. ఇందువలన నాపురిలో సమర్థుండయిన భీమదేవునికి, అని యర్థ మగును. దానంజేసి కేతరాజుతండ్రి గాక వారికుటుంబములోవాఁడు మఱి యొకభీముఁడు ధరణికోటలో నుండిన నుండ వచ్చును. లేక పుత్త్రుఁడగు కేతరాజునందు రాజ్యభార ముంచి సమర్థుఁడైన భీమరాజు జీవించి యైన నుండవచ్చును. భీమరాజునందు రాజ్యభార ముంచి కేతరాజు నూరక యుంచినవారు కేతరాజునందు రాజ్యభార ముంచి భీమరాజు నూరక యుంపవచ్చును గదా! లేదా, యీధరణికోట సత్తెనపల్లితాలూకాలోని ధరణికోటయై యీభీమరా జక్కడివాఁడై యుండిన నుండవచ్చును. ఇవన్నియుఁ జూడఁగా "ధరణికోటపతికి" అని పాఠము నూహించుటయే యుక్తమని తోఁచెడిని. ధరణికోటపతి కేతరా జగును కాన నతనికాహ్వానము పంపిన ట్లగును. భీమదేవుండు "పెదబాహుభూపతికి భీమసేనునకు" అనుచోటి భీమసేనునివలె నెవ్వండో యయి యుండ నోపు. కాఁబట్టి భీమరాజు రాజ్యకాలమును బట్టి కేతరాజు రాజ్యారంభ కాలమును నిర్ణయించుట సాధ్యపడదు.

ఇదిగాక కోటకేతరాజునకు ధరణికోటభీమరాజునకు సంబంధమే లేదు. ఎందుకనిన.—ఈకోటపదము ధరణికోటపదమునుండి వచ్చినది కాదు. అట్లగుచో "ధరణికోటపురికి దక్షుం డైనట్టి" అని భీమరాజును గుఱించి చెప్పునప్పుడు పూర్తిగా ధరణికోటపదము వ్రాసినట్లు "కొండయమ్మమరాజు కోటకేతుండు" అని కేతరాజును గుఱించి చెప్పునప్పుడును బూర్తిగా ధరణికోటకేతరాజు అని వ్రాయవలసియుండెను. అట్లుగాక యసంపూర్తిగఁ జెప్పుటకుఁ గారణ మేమి? ఛందోబద్ధవాక్యము కాఁబట్టి సందర్భోచితముగ నట్లు వ్రాయఁబడిన దన్నచో నమరావతిశాసనములో "కోటకేతమహారాజు" అని యసంపూర్తిగ వ్రాయుటకుఁ గారణ మేమి? ఇయ్యది ఛందోబద్ధ మైన వాక్యము కాదు కాఁబట్టి యథేష్టముగఁ బూర్ణనామము ప్రయోగింపవచ్చును గదా! కాన నిది ధరణికోటపదమునుండి వచ్చినది కాదు.

ఒకవేళ నీవంశస్థులకు ధరణికోటవారనియుఁ గోటవారనియు రెండువిధముల వ్యవహార మున్నది కాఁబట్టి యెటులు చెప్పినను జెప్పవచ్చునన్నచో నిట్లు విచారించెదను. ఈమతమున కోటవారనునదియుఁ ధరణికోటవారనునదియు సమానార్థకములే కదా! అగుచో కోటవారనుదానికి ధరణికోటవారనియే యర్థ మగును. ఇట్లగునప్పుడు పైశాసనములో "ధాన్యకటకపురవరాధీశ్వరకోటకేతమహారాజులు" అని చెప్పుట తల శిరోభార మన్నట్లు పునరుక్తం బగును చూఁడుఁడు. ధాన్యకటకము ధరణికోటయు నొక్కటియే కాన ధాన్యకటకపురవరాధీశ్వరుం డనఁగా ధరణికోట పురాధీశ్వరుండగును కోటకేతుమహారా జనఁగా ధరణికోటపురాధీశ్వరుం డగు కేతరా జగును. ఇట్లగునపుడు ధరణికోటపురాధీశ్వరుం డైన ధరణికోటపురాధీశ్వరుండు అని పునరుక్తార్థము కావలసి వచ్చును. కాన నీకోటపదము ధరణికోట పురవాసమున వచ్చినది గాక యెచ్చటనో కోట యనుగ్రామ

మున వీరిపూర్వు లుండినందునఁ గలిగిన గృహనామ మని యూహింపఁ దగియున్నది. కోట యనునది నెల్లూరిజిల్లాలో నున్నది; అయ్యది జైనులరాజధానియై యుండిన ట్లచ్చటి ప్రతిమాదులవలనఁ దెలియ నగును. కానఁ దద్వాసముననో యట్టినామము గల మఱి యొకగ్రామమునందు వాసముననో వీరికిఁ గోటవా రని యుపనామము గలిగి యుండవలె. కానిచో నిటఁ బునరుక్తంబుగా «కొండయున్నమ రాజు కోటకేతుండు, విని కోటకేతుండు వివరించిచెప్పె» అని మొదలుగాఁ బలుతావులఁ గోటపదమునే చెప్పుటకుఁ గారణముండదు. ఇందువలనఁ గోటకేతరాజునకు ధరణికోట భీమరాజునకు సంబంధము లేదు.

ఇఁక వీరసోమేశ్వరుఁడు 1176 వఱకుఁ బరిపాలనము చేసినందున నంతకుఁదరువాతనే యుద్ధముజరిగినదనుట విమర్శింపఁబడు. 1182లోపల వీరసోముని మరణమునకుఁ బ్రమాణము లేదు. తత్పరిపాలన మతఁడు మరణించినతరువాత యుద్ధము జరిగిన దన్నదానికి సాధకముఁ గాఁ జాలదు. నాఁటి కతఁడు మరణించినట్లు శాసనమున్నచో సాధక మగును. పుత్రునియందు రాజ్యభార ముంచి 1176 సంవత్సరమునకుఁ బైనిగూడ జీవించియుండ వచ్చును గదా! పల్నాటియుద్ధము 1182 లోపల జరిగి యుండుటను ఆయుద్ధములోపల వీరసోమేశ్వరుఁడు మృతి నొందినట్లు పై చరిత్రములో నుండుటనుబట్టి 1176-1182 మధ్యకాలమున వీరసోమేశ్వరుని మృతి నూహించెద మన్నచో, నూహింపవచ్చును గాని యాయుద్ధ మీమధ్యను జరిగినట్లు ప్రబలప్రమాణముండవలయు. కోటకేతుని యమరావతిశాసనము సాధకము గా దని వెనుక నిరూపింపఁబడియెను. కాఁబట్టి కోటకేతరాజు 1182 సంవత్సరమునకుఁ గొంతకాలము ముందే రాజ్యమునకు వచ్చి యుండ వచ్చును. వీరసోమేశ్వరుఁడు రాజ్యముఁ జాలించుకొని కొన్నిసంవత్సరములు జీవించి యుండిన నుండవచ్చును.

ఇట్టిస్థితిలో యుద్ధము పలానా కాలమున జరిగిన దని నిర్ధారణము లేనం దున 1176 వఱకే యతఁడు జీవించి యుండె నని యెట్లు నిర్ధారింపఁ గలుగుదుపు?

ఇది గాక యీసోమేశ్వరుఁడు 1176 పైని జీవింపలే దని యు, కలచూరివంశస్థుఁ డైనబిజ్జలునికుమారుఁ డనియు గదా మీరు చెప్పుచున్నారు! ఉమాకాంతముగారు పల్నాటివీరచరిత్రము యొక్క 36 పేజీలో "చాళుక్యుఁ డగునాల్గవ వీరసోమేశ్వరుని ప్రస్తావ మున తైలపునివద్దనుండి యన్యాక్రాంతమైన కల్యాణపురము నితఁడు క్రీ. శ. 1182 వ సంవత్సరములో స్వాధీనము చేసికొని చాళుక్యరా జ్యము పునరుద్ధారము చేసెను. బిజ్జలుఁడు నతని కుమారుఁడు బసవే శ్వరునిలింగాయతమతకలహములలోఁ జిక్కి యుండుటచే సోమేశ్వరుని కంతగా నాటంకము లేనట్లు తెలియవచ్చుచున్నది." అని వ్రాసి యున్నారు. దానియభిప్రాయము చూడఁగా 1182 సంవత్సరమునఁ జాళుక్యుఁ డైన నాల్గవసోమేశ్వరుఁడు కలచూరిబిజ్జలుని నతనిపుత్రుఁ డగు సోమేశ్వరుని బాఱఁదోలి స్వరాజ్యమును గట్టుకొన్నట్లు తేలుచున్నది. 1176 పైని కలచూరిసోమేశ్వరుఁడు జీవింపకున్నయెడ 1182 వ సంవత్సరమునాఁటికిఁ జళుక్యవీరసోమేశ్వరుఁడు స్వారాజ్యము సాధించు నప్పటికి బిజ్జలుఁడు నతనికుమారుఁడు సోమేశ్వరుఁడు లింగాయతమత ములోఁ జిక్కువడి యుండుట సంభవింపదు.

ఇదిగాక యీవీరసోముఁడు కలచూరిబిజ్జలునికుమారుఁ డని రావుగారు చెప్పుటకు వీలు లేదు. ఏడవప్రకరణము 198 వ పేజీలోఁ (బల్నాడు పాలించిన కలచూరి) "చాగిబేతరాజనకే అనుగురాజను నామాంతరము గలదేమో యని సందేహము కలుగుచున్నది. అయి నను గాకపోయినను శాసనములోని చాగివారికుటుంబమువారే యీ యనుగురాజు మొదలగువారని మనము నిస్సంశయముగా విశ్వ

సింపవచ్చును" అని వ్రాసినారు. అట్లయినపుడు కలచురిబిజ్జలుని మనుమరాలిని కలచురి యనుఁగురాజుపుత్రుఁడు మలిదేవరాజు వివాహమాడుట సంభవింపదు. కాన బిజ్జలునికొడుకగు వీరసోమేశ్వరునిఁ దీసికొనుట రావుగారిమతమున ఘటిల్లదు.

ఇది గాక మఱియొకరీతిగాఁ జూచినను నితఁడు బిజ్జలునికొడుకనుటకు వీలు లేదు. ఇతనికుమారుఁ డగు కొమ్మరాజు యుద్ధమునకుఁ బోవునపుడు అతని ననుసరించియున్న యంకాళశక్తి బ్రహ్మనాయనితో

"మావారు కల్యాణమందున నుండి
ఘనరాజ్యసంపదల్ కడకుఁ బోఁదోలి
పాలుపొందఁగా విష్ణుపోరు కందఱము
లోనయి వచ్చుట లోకంబు లెఱుఁగు"

అని మొదలుగా విలపించినట్లు పల్నాటివీరచరిత్రమునఁ జెప్పఁబడినది. ఉమాకాంతముగారు "కల్యాణపట్టణములోఁ దన్నాదరించువారు లేరనియుఁ బలనాటిలో నున్న కొమ్మరాజొక్కఁడు యుద్ధరంగమునకుఁ బోవుచున్నాఁడనియుఁ దన కిఁక నాధారము లేదనియు నంకాళశక్తి విలపించినట్లు పై నుదాహరింపఁబడిన ద్విపదపంక్తులవలన నర్థము కాఁగలదు. దీనినిఁ బట్టి చూడఁ బల్నాటియుద్ధకాలమునఁ గొమ్మరాజు వంశమువారికిఁ గల్యాణపట్టణములో నధికారము క్షీణించిన దని తేలుచున్నది" అని 43 పేజీలో వ్రాసినారు. సుయల్‌దొరగారు తమ శాసనపుస్తకము 2 వాల్యములో 182 పేజీలో బిజ్జలునిపుత్త్రులు సోమేశ్వరుండు 1167 మొదలు 1175 వఱకు, శంకముఁడు 1175 మొదలు 1180 వఱకు, ఆహవమల్లుఁడు 1176 మొదలు 1188 వఱకు, శింఘణుఁడు 1183 వఱకు రాజ్యము చేసి రని వ్రాసిరి. ఇట్లు చరిత్రకారులు బిజ్జలునికొడుకగు సోమేశ్వరుని తరువాత నతనితమ్ములు శంకముఁడు, ఆహవమల్లుఁడు, శింఘణుఁడు అనువారు కలిసి కొంతకాల

మూఁరాజ్య మేలి రనియు, 1188 వఱకు నాహవమల్లుఁడు పరిపాలనముఁ జేసె ననియు వ్రాసియున్నారు. ఈ వీరసోమేశ్వరుఁడు బిజ్జలుని కొమరుం డైనచోఁ యుద్ధకాలమునకుఁ దనపినతండ్రులు రాజ్యము చేయుచుండఁగా గొమ్మరాజు వంశమువారు కల్యాణరాజ్యభ్రష్టులగుటయు సంకాళశక్తి విలసించుటయు సంభవింపవు. వెనుక రాజాగమన ప్రకరణమున నున్న « కూడిరాఁగల్యాణఘూర్జరపతులు » అనునది గూడ దీనిం బోషించుచున్నది. కల్యాణపతి యైనకొమ్మరాజు మలిదేవరాజునొద్ద నుండఁగా నలగామరాజుపక్షమున వచ్చినకల్యాణాధిపతి యన్యుఁడై యుండవలెను గదా! కాఁబట్టి యీతండు బిజ్జలునికొడుకని చెప్పుటకు వీలు లేదు.

ఇదిగాక యింకొకరీతిగఁ జూచినను నీవీరసోముండు బిజ్జలుని కుమారుఁ డని చెప్పుటకు వీలు లేదు. బిజ్జలునికుమారులలో వీరసోమేశ్వరుండు జ్యేష్ఠుండై యుండెను. అతనిరాజ్యావసానకాలమునకుఁ గొమ్మరాజు 30 సంవత్సరములవయస్సు గలపుత్రుండు కలవాఁ డగుటచే నేఁబది సంవత్సరములకు మీఱినవయస్సు గలవాఁడై వీరుఁడై యుండెను. ఆకాలమున కాఱుసంవత్సరములలోపల జరిగిన యుద్ధమునకుఁ బూర్వమె కొమ్మరాజుకొడు కైన యలరాజు రాయబారిగా నలగామరాజు నొద్దకుఁ బోయినందున నప్పటి కలరాజు ప్రౌఢుఁడై యుండె ననుట తెల్లంబే కదా! అట్టి యతనితండ్రి కొమ్మరాజు బిజ్జలునికుమారులలో జ్యేష్ఠుం డగుసోమేశ్వరుని పుత్రుండే యైయుండినచోఁ దండ్రిరాజ్యమాతనికే సంక్రమింప వలసియుండెను. అట్లుగాక ఆహవమల్లాదులు రాజ్యము చేసినందున నితఁడా సోమేశ్వరునికుమారుఁడు కాఁ డనియు, నాసోమేశ్వరుఁ డపుత్రుండై యుండె ననియు నూహింపఁ దగియున్నది. కాఁబట్టి కొమ్మరాజు తండ్రియైన సోమేశ్వరుఁడు బిజ్జలుని కొడు కని చెప్పుటకు వీలు లేదు. అట్లు చరిత్రకారు లెవ్వరును

వ్రాయ లేదు. ఇతఁడు బిజ్జలుని కొమరుండేనై యుండినచో నితనికిఁ గొమ్మరాజు కొడుకై యుండినచోఁ జరిత్రకారు లెవ్వరును వ్రాయమికిఁ గారణ మేమి? కావున నీసోమేశ్వరుఁడు బిజ్జలుని కొడుకు కాఁ డని నిర్ధారింపవలసి యున్నది.

ఇదిగాక మఱియొకరీతిగాఁ జూచినను కొమ్మరాజుతండ్రి వీర సోముఁడు బిజ్జలునికొడు కని చెప్పుటకు వీలులేదు. పల్నాటివీరచరిత ములో వీరసోమునితమ్ములు అల్లాణరాజు, బల్లాణరాజు, నందిసోముఁడు, నాగసోముఁడు, కంచుసోముఁడు, పెంచుసోముఁడు, జలములకర్తన యని యేడ్గురు చెప్పఁబడి యున్నారు. పైచరిత్రములలో బిజ్జలుని కుమారుఁడైనవీరసోమునకు శంకముఁడు ఆహవమల్లుఁడు శింఘణుఁడు అని ముచ్వురే తమ్ములు వ్రాయఁబడి యున్నారు. కొమ్మరాజుతండ్రి సోమేశ్వరుఁడు బిజ్జలునికొడుకై యుండినచో సుయుల్ మొదలగుచరిత్ర కారులు పైయేడ్గురు నీసోమేశ్వరునితమ్ము లని వ్రాసి యుందురు. లేదా, బిజ్జలునికొడుకైనసోమేశ్వరుఁడు కొమ్మరాజుతండ్రియై యుండినచో బిజ్జలునికొడుకు లగుతక్కినపై ముచ్వురను పల్నాటివీరచరిత్రకారులు సోమేశ్వరునితమ్ములనుగా వ్రాసియుందురు. అట్లెవ్వరును వ్రాయలేదు. ఇంతమాత్రమే కాదు. పల్నాటివీరచరితములో వచ్చెడు సోమేశ్వరుని కుటుంబము వారలకు కంచుసోముఁడు పెంచుసోముఁడు కొమ్మరాజు రాచమల్లుఁడు అనిమొదలుగా నాంధ్రభాషానామములు బిజ్జలుని కొడు కగుసోమేశ్వరుని కుటుంబములోనివారలకు భాషాంతరనామ ములు కానవచ్చుచున్నవి. కానఁ గొమ్మరాజు తండ్రియు బిజ్జలునికొడు కును నొక్క వీరసోమేశ్వరుఁడే యని చెప్పుటకు వీలు లేదు.

ఇదిగాక మఱియొకవిధముగఁ జూచిన నీవీరసోమేశ్వరుఁడు బిజ్జ లునికుమారుఁ డని చెప్పుటకు వీలు లేదు. ఈయాంధ్రచరిత్రము మొ దటిప్రకరణమున 26 పేజీలో

« బిజ్జలునితరువాతివారు 1182 వ సంవత్సరమువఱకును గల్యాణపురమును బరిపాలించిరి. బిజ్జలునితరువాత సోమేశ్వరుఁడు సంకాముఁడు ఆహవమల్లుఁడు ననుకాలచుర్యరాజులు మూవ్వురు పరిపాలించినట్లు కన్పట్టుచున్నది. శా. శ. 1104 (క్రీ. శ. 1182) వ సంవత్సరమునఁ బశ్చిమచాళుక్యరాజగునాలుగవసోమేశ్వరుఁడు కాలచుర్యులనుండి తనపూర్వులు గోల్పోయినభాగములను మరల స్వాధీనము గావించుకొనియెను. మఱికొన్నిభాగములను దేవగిరియాదవులును గాకతీయాంధ్రులును నాక్రమించుకొనఁగా బిజ్జలునివంశ మంతరించినది » అని రావుగారు వ్రాసియున్నారు. ఇందు 1182 వఱకు బిజ్జలుని కుమారులు కల్యాణమును బాలించుచుండి రనుటవలన 1176 పైని 1881 లోపల జరిగినయుద్ధమునాఁటికిఁ గొమ్మరాజువంశమువారు రాజ్యభ్రష్టు లగుటయు నంకాళశక్తి విలపించుటయు సంభవింపవు. మఱియు బిజ్జలునికుమారులలో బల్లాటిపేర చరిత్రమున వ్రాయఁబడిన సోమేశ్వరుని యేగ్గురు సోదరులు వ్రాయఁబడనందునను ఈకొమ్మరాజు అలరాజు వ్రాయఁబడనందునను వారికిని గొమ్మరాజునకును సంబంధము లే దని తేటపడుచున్నది. ఇట్లు స్వకీయలేఖనమువలననే యుద్ధమునాఁటికి బిజ్జలునివంశీయులకుఁ గల్యాణాధికారముండె ననియు నల్లాణరాజు బల్లాణరాజు మొదలగువారు సోమేశ్వరునితమ్ములు గా రనియుఁ, గొమ్మరాజు తత్పుత్త్రుఁడు గాఁ డనియుఁ దేటపడుచుండఁగా బిజ్జలునికొడుకు వీరసోమేశ్వరుఁడు కొమ్మరాజుతండ్రి యని వ్రాయుట వింతగా నున్నది.

ఇట్లుండ బేతాళనాయనియు బేతినాయనియుఁ బుత్రులకుఁ జరిత్రములలో నామభేదము చూపట్టుచున్నందున వారికి భేదము సాధింపఁజూచిన మన వీరభద్రరావుగారు వీరసోమేశ్వరునినామము గాంచి భ్రమించిరో కలచురివంశములో సుప్రసిద్ధుం డయిన వీరసోముఁడు కొమ్మరాజుతండ్రియేమై యుండు నన్న సంపూర్ణ

విశ్వాసముచేతనో కలచురి సోమేశ్వరుని వంశక్రమముం దెలి
పెడి చరిత్రాంశము లెఱుంగమిచేతనో మఱి యేకారణముచేతనో
కలచురి సోమేశ్వరునివంశమును బల్నాటి సోమేశ్వరునివంశమును
నొక్కటిగఁ జేసి ఆసోమేశ్వరుఁడే యీసోమేశ్వరుం డని హేత్వాభాస
ములతో సిద్ధాంతపఱచినారు. పైవిమర్శమువలనఁ గోటకేతుని బట్టి
కాలనిర్ణయము చేయుటకు వీలులేనపుడు సోమేశ్వరుని బట్టి తన్నిర్ణ
యము చేయవలసి యుండును. సోమేశ్వరు లనేకులు గలరు గాన
యుద్ధకాలమును బట్టి బిజ్జలునికుమారుఁడైన సోమేశ్వరునిఁ దీసికొన
వలసి యుండును. ఇట్లగుచో నన్యోన్యాశ్రయదోషము సిద్ధముగఁ జూ
పెట్టి యుండఁగలదు. కొమ్మరాజుతండ్రి సోమేశ్వరుఁ డెవ్వఁడో ఇంకను
విచారింపవలసి యున్నది.

ఇట్లు పల్నాటియుద్ధకాల నిర్ణయమునకు రావుగారు ముఖ్య
సాధనముగా నెత్తికొన్న కోటకేతవీరసోముల కాలవిమర్శము చేయఁ
బడినది. దీనివలననె తక్కినవారికాలవిమర్శము సైతము చేసిన ట్లగు నని
తలంచెద. ప్రతాపరుద్రుఁడు సాగిపోతరాజు వీరభల్లాణుఁడు అను నామ
ములు గలవా రనేకు లుండఁ బట్టి యెవనిని దీసికొనవలెనో నిర్ణయించు
కొనుటకు వేఱొండుసాధనము లేక యుద్ధకాలమునే తీసికొనవలెను. వీర
సోమునిఁ గోటకేతునిబట్టి యుద్ధకాలనిర్ణయము కానపుడు వీరలనామము
లనుబట్టియే తన్నిర్ణయము చేయవలసి యుండును. ఇట్లగుచో నన్యోన్యా
శ్రయదోషము వచ్చును. కాఁబట్టి కోటకేతసోమేశ్వర కాలాపేక్షులగు
వారలు తత్కాలవిమర్శమువలననె విమృష్టు లగుదురు. కోటకేతుని
బట్టియే భీమరాజుకాలనిర్ణయము చేయఁ దగి యున్నది కానఁ గేత
రాజువలననె కాలనిర్ణయ మగుచుండఁగా భీమరా జన్యథాసిద్ధుండు.
వెలనాటిచోళగొంకరాజునామము వీరిచరిత్రమునఁ గానరాదు.

గుంటూరు చంద్రికా ముద్రాక్షరశాలలో అభినవసరస్వతి అని పేరితో 1918 ఫిబ్రవరిలో ప్రచురింపఁబడిన పత్రికలో బ్ర. ముద్దులపల్లి గురుబ్రహ్మశాస్త్రిగారు పల్నాటివీరుల యుద్ధకాలమును గూర్చి వ్రాయునప్పుడు,

“మాచర్లలోఁ జంద్రవంకనదీతీరమునఁ గల యాదిగువ వ్రాసినయొకచిన్నశాసనమున ‘ అన్నుంగామరా ’ జని పేర్కొనంబడినది. ఇతఁ డెవ్వరైనది తెలియరాదు, ఇతఁడె యనుగురాజైనచో దీనిం బట్టి కూడ 12 వ శతాబ్దమని యెంచ వచ్చును. ఇతఁ డనుగురాజు కొడుకులలో నొకఁ డనియు తెలియవచ్చుచున్నది.

స్వస్తి శ్రీశకాబ్దంబులు 1064 అగునేటిదుందుభిసంవత్సర శ్రావణశుద్ధ ఏకాదశీగురువారమున శ్రీమన్మహామండలేశ్వర అన్నుంగామరాజులు యూరియకామిసెట్టి శ్రీచెన్నకేశవదేవరకు నిచ్చినతోట దీని నెవ్వరేని విఘలం దలంచినవారు గంగలో కపిలలం బొడిచినవారు “స్వదత్తాం పరదత్తాం వా యో హరేతు వసుంధరా। షష్టిర్వర్షసహస్రాణి విష్టాయాం జాయతే క్రిమిః॥ కరణం సూరిద్రాలు.

మఱియు వినుకొండతాలూకా పెదకంచర్లపాటిమీఁద కృష్ణగంధర్వుఁడు కట్టించిన దని చెప్పఁబడుభీమేశ్వరాలయము పాదు దిబ్బకొద్ద నుండిన నల్లయ యనువిప్రునిశిలాశాసనమున

ఒఱ పగుశాకహాయనము లుర్విగజాంబరచంద్రసంఖ్యగా
వఱలినకన్యసంక్రమణ వాసరనాథదినంబునందుఁ గం
చెఱువులభీమనాథునకుఁ జెల్వుగ నిల్పె నఖండదీపముల్

అని శాసనపుఁబిఱిభాగమునఁ గన్పట్టుచున్నది. దీనిని బట్టి కృష్ణగంధర్వుఁడును శా. 1081 నాటి కున్నట్లుండినది. కావునఁ బల్నాటివీరులును క్రీ. 12 వ శతాబ్దమున నుండి రనుట నిస్సంశయము” అని వ్రాసినారు.

వీనిలోన మొదటిశాసనమున, అన్గంగామరాజులు యూరియ కామిసెట్టి యనువార లిరువురు చెన్నకేశవునకుఁ దోట నిచ్చినట్లు సామాన్యముగ నర్థము కాఁగలదు. నలగామరాజు నొకసెట్టియుఁ గూడి యిచ్చుట యసంభావితంబు. యూరియ అనునది కామిసెట్టికి గృహనామముగాఁ గనుపట్టుచున్నది. నేను సంగ్రహించినపాఠమున యలియ యని యున్నది. అప్పుడు అనుగురాజులయలియ (అల్లుఁడు) అగు కామిసెట్టి అని యర్థ మగును. రాజుల అని వ్రాయవలసి యుండ నక్కాలపుపరిపాటి ననుసరించి లు అనునక్షరము వ్రాయఁబడిన దనియు అన్గంగామునియుంపుడుస్త్రీల యందుఁ గలిగినకన్యను బెండ్లాడిన సెట్టి యొవ్వఁడో యొకం డయి యుండు ననియు భావింపవలయును. మిక్కిలి ప్రసిద్ధమైన పైశాసనాంతిమశ్లోకమున నున్నయపశబ్దములు దీనిస్థాపకుఁడు రాజుగాక సెట్టియేమై యుండు నని తోఁపించుచున్నవి.

నిజ మెట్లున్నను బూర్వపాఠమున దానకాలమున నలగామరాజుండినట్లగును. ఈపాఠమున నతఁడుండిన నుండవచ్చును లేకపోయినను లేక పోవచ్చును. అయ్యది సరిపడునట్లు కాన్పింపదు. శాసనకాలము క్రీ. 1142 సంవత్సర మగుచున్నది. ఆకాల మనుగురాజుయొక్క రాజ్యకాలమై యున్నది. అప్పుడు నలగామరాజొక్కఁడు దానశాసనము వ్రాయించుట గాని సెట్టియుఁ దానును గలిసి వ్రాయించుట గాని యతని కల్లుఁడుగా నొక్కఁ డుండుట గాని సంగతములు గావు. ఎందుకనిన, మందాడివలసనాటికి 40 సంవత్సరములు అనుగురాజు 13 సంవత్సరములు నలగామరాజును రాజ్య మేలిరని తచ్చరిత్రమునన్నున్నది. వలసతరువాత 7 సంవత్సరములకు యుద్ధము జరిగి యున్నందున 1160 సంవత్సరమున నలగామరాజురాజ్యమున కారంభించి యుండవలెను. "అనుగురాజు చని పోవునపుడు కొడుకుల నందఱను బ్రహ్మనాయని కప్పగించెను" అని యుమాకాంతముగారి లేఖనమును దద్గ్రంథ సందర్భ

మును జూపఁగా నలగాముఁడు రాజ్యమునకు వచ్చునఱకు 20 సంవత్సరములవయస్సు గలవాఁడై యుండ వలయును. ఇట్లగునపుడు శాసనకాలమునకు నలగామరాజు జన్మించియుండిన శిశువై యుండఁ గలఁడు. కాన నతఁడు స్థాపింప లేఁడు. ఆతఁడే స్థాపించినాఁ డనుకొన్నచో నతఁడు శాసనస్థాపనకాలమునకు 20 సంవత్సరములవాఁడైయైన నుండుట యుచితము. అప్పటికి ననుగురాజునకు వివాహము యయియో కాకయో యుండును. ఇట్లు కాలాసందర్భమువలనను, తండ్రి రాజ్యము చేయుచుండఁగాఁ గుమారుఁడు శాసనము స్థాపించుట సంప్రదాయవిరుద్ధం బగుటవలనను, 1182 సంవత్సరములోపల యుద్ధము జరిగిన దన్నవారిమతమున కీశాసన మనుకూలము గానోపదు.

ఇఁక రెండవశాసన మైనను విశ్వసించుటకు వీలు లేదు. అయ్యది కృష్ణగంధర్వుఁడు స్థాపించినది కాదు. నల్లయు నైనను శాసనస్థాపనము నాఁటికిఁ గృష్ణగంధర్వుఁ డుండినట్లు వ్రాసినవాఁడు కాఁడు. ఆయాలయము లోకప్రతీతిప్రకారము కృష్ణగంధర్వుఁడు కట్టించిన దగుట సత్యమై యుండినచో నీశాసనస్థాపనమునకుఁ గృష్ణగంధర్వుఁడు పూర్వుఁడో సమకాలికుఁడో నై యుండు నని మాత్ర మూహ కలుగవచ్చును. అగ్రిమనిర్ణయమువలన యుద్ధకాల మింకొకయుబ్దశతము మాఱవలసి యుండును గాఁబట్టి యపు డీశాసనములు మన మనుకొన్న నలగామ కృష్ణగంధర్వులను గాక వారితాతలను బోధింపవలసి యుండును. నలగామరాజుతాత వీరకామేంద్రుఁడై యున్నాఁడు. ఆతనిపేరే నలగామరాజున కుంపఁబడినది. ఇతనికి వీరకామేంద్రుఁ డని నామాంతర మున్నట్లుమా కాంతముగారు గూడ వ్రాసి యున్నారు. కాఁబట్టి శాసనమునందుఁ జూపఁబడు కామరాజు నలగామరాజుతాతయో యాపేరిటివాఁడు మఱియొకండో నై యుండనోపు. అనుగురాజు తననాఁడే యీదేశమునకు వచ్చినాఁ డనుట యంత విశ్వసనీయముగ లేదు. వీర

భద్రకవి వీరు మొదలనుండి మాచర్ల రాజధానిగా నీరాజ్యమును పాలించుచుండి రని యే వ్రాసినాఁడు. వీరభద్రరావుగారీయాంధ్ర చరిత్రముయొక్క 14-195 పేజీలలో వ్రాసిన చాగిబేతరాజువృత్తాంతము గూడ దీనిని బలపఱచుచున్నది. ఈవిషయము స్థలాంతరమున విమర్శింపఁబడును. పైపత్రికలో " యుద్ధము క్రీ. 1080 - 1089 మధ్య జరిగి యుండునని విల్సన్ దొరవారు వ్రాసినట్లు మెకంజీదొరవారు వ్రాసిరి. ఇది యింతపూర్వము కాదనియు క్రీ 1160 వ సంవత్సరమున జరిగి యుండుననియు బ్రౌన్ దొరవారు తమ నిఘంటువున వ్రాసిరి. కార్యమపూడిలో వీరులపేరఁ గట్టిన మంటపమునఁగల శాసనమును, బ్రహ్మనాయుఁడు కట్టినదని చెప్పఁబడు మాచెర్ల చెన్నకేశవాలయమును బాగుచేయించినట్లు వ్రాయించిన తదాలయములోని శాసనములును 14 వ శతాబ్దములోనివై యున్నవి. " అని యాశాస్త్రిగారే కొందఱు చేసిన యుద్ధకాలనిర్ణయముల నుపేక్షించినారు. ఇట్లు పరోపదర్శిత యుద్ధకాలముల విమర్శము ముగిసినది.

ఇఁక నీయుద్ధకాలనిర్ణయము సరిగాక పోయినను బోవును గాక. పైరాజు లుండఁదగిన మఱియొకకాల మైన యుద్ధకాలమై యుండవలెను గదా! అక్కాలం బెద్దియో నిరూపించుట మీ కవశ్యకర్తవ్యం బని యందురేని, అన వచ్చును గాని తన్నిరూపణంబు కాకదంతపరీక్షాతుల్యంబు. ఇదిగాక మా వ్రాసిన వెలుగోటివారి వంశచరిత్రమునందుఁ బరోద్భావితంబు లగునాక్షేపములను సహేతుకముగ నిరాకరించుటయే మాకుఁ గావలసినపని. అయ్యది పైవిమర్శమువలన నైనది. అయినను బూర్వవృత్తాంత పరిజ్ఞానమునకై తత్తదర్థనిర్ణయము సేయుట చరిత్రగ్రంథకారులకు ధర్మముకదా! యని, వాదిసమ్మతము లయిన ప్రమాణములనే యనుసరించి తన్నిరూపణంబు సేయఁగలను. అభ్యుపగమవాదమునఁ బూర్వాక్షేపములు ప్రసరింపఁగూడదు.

ఇప్పు డిది విచారించెదను. పై రాజు లుండఁదగినకాల మనఁగాఁ యుద్ధాహ్వానమునందును రాజాగమనమునందును గానవచ్చుచున్నవా రెల్లరు నుండఁదగినకాల మనియా? యుక్తముఁగఁ దోఁచిన కొంద ఱుండఁదగినకాల మనియా? యభిప్రాయము. మొదటిపక్షమున రావుగారు మళయాళ కర్ణాట మాళవేంద్రాదు లేపేఁటివారలో వారు యుద్ధమున నుండినట్లు శాసనాదిప్రమాణము లెచ్చటనున్నవో చూపవలసియుండును. అది సాధ్యపడమిచే రెండవపక్షమునే యవలంబించుచోఁ జాతము. ప్రథమప్రతాపరుద్రుఁడు ధరణికోటభీమరాజు రెండవ కోటకేతరాజు సాగిపోతరాజు బిజ్జలునికుమారుఁడగు వీరసోమేశ్వరుఁడు రెండవవీరభల్లాణుఁడు వెలనాటిచోళగొంకరాజు, అను నీసప్తర్షులతోఁ గద వారు కాలనిర్ణయము చేసినారు. ఎట్లుండినను వారలలోనే కాలనిర్ణయము చేయవలయు ననునిర్బంధము లేదు కాఁబట్టి యితరులనుగూడ గ్రహింపవచ్చును గదా! అట్లగుచో రావుగారు వీరసోముని కాలము నాధారము చేసికొనినట్లు బేతిరెడ్డి కాలము నాధారము చేసికొని బేతిరెడ్డికి బ్రహ్మనాయుఁడు మనుమఁడు కాబట్టి బేతిరెడ్డికిఁ దరువాతనే యుద్ధము జరిగినదిగాని పూర్వము జరుగ లేదని చెప్పఁగలను.

ఇదిగాక నలగామరాజు పంచపాండ్యులకు యుద్ధాహ్వానపత్రిక నంపినటులు

" బంగాళపతికిని బంచపాండ్యులకు
(పాఠాంతరమున.)
బంగాళపతి పంచపాండ్యేశులకును "

అను వాక్యమువలనఁ దెలియవచ్చుచున్నది. పంచపాండ్యులు వీరపాండ్య విక్రమపాండ్య సుందరపాండ్య కులశేఖరపాండ్య పరాక్రమపాండ్యాఖ్యు లేవురు సహోదరులు, వీరలు ఘనబాహువిక్రమునై

పంచపాండవులవలెఁ బ్రబలి పంచపాండ్యు లని ప్రసిద్ధిగన్న మధురాపురాధీశ్వరులు. ద్వితీయప్రతాపరుద్రుని నియోగమున దాచానాయఁడు యుద్ధమునకుఁ బోయి వీరలను జయించియే "పంచపాండ్యదళవిభాళ" అనుబిరుదము నొందినవాఁడు. ఈవిషయము 363-364 పేజీలలో రావుగారుగూడ వ్రాసియున్నారు. వీరలు 1292 సంవత్సరమున మార్కోపోలో మనదేశమునకు వచ్చినప్పుడు మధురాపురాధీశులై యుండిరని యాతఁడు వ్రాసినట్లు సుయల్ గారు తమశాసనముల పుస్తకము రెండవవాల్యమున 222 వ పేజీలో వ్రాసియున్నారు. మద్రాసులోని లిఖితపుస్తకభాండాగారములో నున్న శ్రీనాథకవిరచితమగు పల్నాటివీరచరిత్రపుస్తకముయొక్క ప్రతులలో నొక్కదానిలో "పంచపాండ్యేశులకును" అనియుఁ దక్కినయన్నింటిలో "బంచపాండ్యులకును" అనియునే యున్నందునఁ బంచపాండ్యులకు నలగామరాజాహ్వానపత్రిక నంపియుండె ననియు పంచపాండ్యపదము వీరపాండ్యాది సోదరపంచకమునందే రూఢమగుటచే వారు 13 శతాబ్దమునంతమునందు 14 శతాబ్దమునాదియందు మధురాపురి నేలుచున్న వీరపాండ్యాదులే యనియుఁ దేలుచున్నది. చేతిరెడ్డికాలముగూడ దీనికి సహకారి యగుచున్నది. "బంగాళపతికిని బాండ్యేశునకును" అను ముద్రితపుస్తకపాఠము పైయోరియంటల్ లైబ్రరీలో నేప్రతియందును వ్రాయఁబడినదికాదు. వలయువా రచ్చటఁ జూడవచ్చును. కావున నది విశ్వసింపఁదగినది కాదు. 41 పేజీలో నుమాకాంతముగారిచే మందపోటుకథలోనిదిగా నుదాహరింపఁబడిన "భల్లాణదేవుండు పంచపాండ్యులును" అను వాక్యము గూడ నక్కాలమునఁ బంచపాండ్యులుండి రనుటను బలపఱచుచున్నది. పంచపాండ్యుండు, అను నేకవచనము ప్రామాదికము. పంచశబ్దముమీఁద నేకవచనము పుట్టదు. ఆపేటివాఁ డుండు ననుట యప్రమాణము. పూర్వవాక్యా ననుగుణంబును. కాఁబట్టి ప్రసిద్ధపంచ

పాండ్యులకాలములోనె యుద్ధముజరిగినది కాని యంతకుఁ బూర్వము గాని పరము గాని జరిగినది కాదు. ఇట్లుబేతినాయఁడు పంచపాండ్యులు యుద్ధకాలనిర్ణాయకు లని ఫలిత మేర్పడినది.

ఇట్లగునపుడు బేతిరెడ్డికి మునిమనుమఁ డగు బాలచంద్రుఁడు ప్రౌఢుఁడై యుండఁదగిన కాలం బెద్దియో యయ్యది యుద్ధకాలమగును. మల్లానాయఁ డను దొడ్డనాయునికి రావుగారి మతప్రకార మెట్టికి శాసనము నాఁటికి సంతానము లేనందునఁ దరువాతఁ గలిగినదని యంగీకరించి చూచినచో, దొడ్డనాయని రెండవకుమారుఁ డగు బ్రహ్మనాయఁడు 1220 పైని గలిగినాఁడనుట కేమియు నాక్షేప ముండదు. తరువాత 1260 లోపల బాలచంద్రుఁడు గలిగి 1280 వఱకుఁ బ్రౌఢుండు గావచ్చును. మల్లానాయఁడు దొడ్డనాయఁడు కాఁడను వారిమతమును బట్టి చూచినచో 1208 పైని దొడ్డనాయఁడు గలిగియుండఁ దగును. అతనికి 1230 పైని బ్రహ్మనాయఁ డుదయింపవచ్చును. అతనికి 1260 పైని బాలచంద్రుఁ డుద్భవించి 1290 వఱకుఁ బ్రౌఢుండు గావచ్చును. కావున నాప్రాంతకాలమున యుద్ధము జరిగియుండ నోపు.

ఇదిగాక పల్నాటియుద్ధమునకు రెండువేలపెద్దగుఱ్ఱములతోఁ దురుష్కులు వచ్చినట్లు తచ్చరిత్రములోని

« గురుసహస్రద్వయ ఘోటకసహితు
లగుతురుష్కులు వచ్చి యవనీశుఁ గనిరి »

అనువాక్యమువలనఁ దెలియవచ్చుచున్నది. ఈవాక్యము మద్రాసులోని గవర్నమెంటు లిఖితపుస్తకభాండాగారములో నున్నశ్రీనాథకవిరచితమైనపల్నాటివీరచరిత్రము ప్రతులలోనన్నింటిలో నేకరూపముగఁ గానవచ్చుచున్నది. కాఁబట్టి యిది సర్వసంప్రతిపన్నపాఠ మనుటకు సంశయం బేమియు నుండదు. కాన నిది ప్రమాణముగఁ దీసికొనఁ దగియున్నది.

ఘోటకములందు గురుత్వవిశేషణస్వారస్యమును బట్టి యాఘోటకము లరబస్థాన మున్నగు యవనరాజ్యములనుండి వచ్చినవియే యై యుండు నని తోఁచుచున్నది. ఇందువలనఁ దురుష్కులు దక్షిణహిందూస్థానము నకు రాసాగినతరువాత నె యీపల్నాటియుద్ధము జరిగినది కాని యంతకుఁ బూర్వము జరుగ లేదని చెప్పవలసి యున్నది. 1294వ సంవత్సరమున అల్లావుదీన్ గొప్ప సేనతో దేవాద్రిమీఁదికి యుద్ధమునకు వచ్చియుండె నని చరిత్రములు చాటుచున్నవి. కాన నాతరువాత నే యీ యుద్ధము జరిగి యుండఁగలదు. "పద్మసేనుండును బసవడి వచ్చె గురుసహస్ర ద్వయ ఘోటకయుతుఁడు" అను ముద్రితప్రతిలోని పాఠము పైవ్రాసునోరియంటల్ లైబ్రెరీలోని ప్రతులలో నెందును గానరానందున నాపాఠము సంప్రతిపన్నముగా గ్రహింప నర్హము గాదు. పండితులు పరిశీలింప నభ్యర్థితులు.

ఇదిగాక పైచరిత్రమున రాజాగమనప్రకరణములో

"అశ్వంబు లొకవేయి యమితప్రతాప
రుద్రుఁడు పంపించె రూఢసంగతిని"

అనువాక్యము కానవచ్చుచున్నది. ఇం దమితప్రతాపము గలరుద్రుఁడు రుద్రదేవి యై యుండనోపు. రుద్రుఁ డని పురుషనామముతో వ్యవహారము రుద్రాంబికయం దుండుట సుప్రసిద్ధమైనవిషయము. ఆమె 1295 వఱకు రాజ్యము చేసినది కావున నామె కాలముననే యుద్ధము జరిగి యుండవలెను. అమితపదముండఁబట్టి ప్రతాపపదము విశేషణకుక్షిలోఁ జేరినది కావున విశేష్యంబు రుద్రపదమే యైనది. ఇట్లగుసపుడు విశేష్యమైన ప్రతాపరుద్రపదము లేనందున ద్వితీయప్రతాపరుద్రుని దీసికొనుట సందర్భింపదు. ప్రథమప్రతాపరుద్రుండు తురుష్కప్రవేశ పంచపాంద్యసమకాలికుఁడు కాఁడు. అమితప్రతాపవిశేషణస్వారస్యమువలన నీరుద్రుఁడు రుద్రదేవియే యైయుండునని తోఁచెడిని. యవనపంచపాండ్య

కాలనపహారమున నితరదోషములకుఁ బ్రసక్తి గలుగదు. కాఁబట్టి రుద్రాంబికకాలములోఁ బైవారలుండఁగ నీయుద్ధము జరగి యుండఁ గలదు. ఈవాక్యము మద్రాసులోని పై భాండాగారములోనున్న నెం. 14-3-15. 12-2-34. 14-4-12 14-3-4 గల ప్రతులలో నొక్కటేవిధముగ నున్నది. నేను స్వయముగ వానిం జదివి వ్రాసి తెచ్చినాఁడను. కాఁబట్టి యీపాఠమే సర్వసంప్రతిపన్న మని గ్రహింపఁదగినది. "ఒకవేయియశ్వాల నొనరఁబ్రతాప" అను పాఠము పై పుస్తకభాండాగారమున నొక్కప్రతియందును వ్రాయఁ బడలేదు. కాన నది క్వాచిత్కపాఠమె కాని సర్వసమ్మతంబు గాదు.

ఈపాఠములందు వాస్తవము దెలియఁ గోరువారు పై లైబ్ర రీలోఁ దెలియనగు. ఇట్లు యుద్ధకాలము జేతిరెడ్డి యనంతర కాల మని సామాన్యరూపముగను రుద్రయవనపంచపాండ్యసమావేశ కాల మని విశేషరూపముగను నిరూపింపఁబడినది. అక్కాలము 1294-1295 సంవత్సరములకాలం బగును, మఱికొందఱు రాజులు గూడ నీయుద్ధ కాలమునకు ఘటిల్లుచున్నారు.

పల్నాటియుద్ధమునకు వీరభల్లాణుఁడు వచ్చినట్లు తచ్చరిత్ర మున నున్నది. ద్వారసముద్రపుభల్లాణులలో మూఁడవవాఁడు 1276 మొదలుకొని 1310 వఱకు నుండినవాఁడు. అతఁడు 1290 పైని జరిగినయీయుద్ధకాలమున నుండ వచ్చును. చాగిపోతరాజు 1199 లో నున్నవాఁ డని రావుగారు తలంచినవారు. అతనితరువాతివాఁ డగు పోతరాజో మఱిపోతరాజో యై యుండు నని నాయభిప్రాయము. రామవిలాసములో నేనుఁగులక్ష్మణకవి చాగిపోతరాజునకు నరసింహరాజు అతనికి పోతరాజు మాచరాజు వారిలో మాచరాజునకు నెఱి పోతరాజు జన్మించినట్లు వ్రాసియున్నాఁడు. చాగిపదము వారికి గృహనామము. రెండవకేతరాజుపుత్త్రుఁడు కేతన క్రీ. శ. 1240 లో వేల్పూరి

రామేశ్వరాలయములో "గణపయదేవరదివ్య శ్రీపాదపంకజభక్తిపరాయణుండైన కేతనబాలుండు" అని శాసనము స్థాపించినవాఁడీయుద్ధకాలమునకు నుండఁగలఁడు. ఇదిగాక మణిదెం సోమేశ్వరాలయమున గరుడస్తంభముమీఁద నున్న కోటకేతుని మఱియొక శాసనములో "శాకాబ్దే రామబాణక్షితిశశిగుణితే ... దొడ్డకేతక్షితీశః" అనియు "స్వస్తిచతుస్సముద్ర ... శ్రీమన్మహామండలేశ్వర కోట దొడ్డనామాది సమస్తప్రశస్తిసహితం కేతరాజులు" అనియు, నున్నది. ఇది మన రెండవ కేతరాజునకుఁ బుత్రుఁడు చినకేతరాజు పుట్టినతరువాత వచ్చిననామముగా నున్నది. ఎట్లైనను మఱియొక చిన్న కేతరాజున్ననే యీదొడ్డపదము సార్థకమగును. ఆకేతరాజెవ్వఁడో వాఁడే యీయుద్ధకాలమున వచ్చియుండును. దొడ్డకేతునియుద్దామస్థితిని నతనిమామ లగు పూర్వచాళుక్యుల సామ్రాజ్యమును బరిశీలించినచో మాడ్గులవీరరెడ్డిచింతపల్లిరెడ్లను వెంటఁబెట్టుకొని నాయకురాలిపనుపున బ్రహ్మనాయనికడకు సంధికిఁ బోయినవాఁడు ఆదొడ్డకేతరాజుగాక సామాన్యస్థితి గల మఱియొక కేతన యని తెలియఁగలదు. యితఁడు లిఖితపుస్తకములలో "కోటకేతన్న కేతన" యనియే వ్రాయఁబడినవాఁడు.

ఇఁక ధరణికోటభీమరాజు వీరసోముఁడు వెలనాటిచోడగొంకరాజు శేషించి యున్నారు. సరిపడినను సరిపడకపోయినను వారు వ్రాసినవారల నెల్లరను వ్రాయవలె నను నియమము లేదని వెనుక వ్రాసితిని. వారు లేకపోయినంతమాత్రమున నిర్ణీతమగు యుద్ధకాలమునకు భంగము రాదు. అక్కాలమున మఱియొక ధరణికోటలో దక్షుఁడైన భీమరాజుండిన నుండవచ్చును. కేతరాజు ధరణికోటపురాధికారము లేక కోటగృహనామము గల మఱియొక్కఁడై యుండిన నుండవచ్చును. కాన నేకకాలమున వారిద్దఱిసమావేశము విరుద్ధము గాదు.

వెలనాటిచోడగొంకరాజునామము పల్నాటిచరిత్రమునఁ గానరాదు. అప్పటికి వారిస్వాతంత్ర్యమే శమించినది. కావుననే సమీపబంధువు లగు ప్రాచ్యచాళుక్యుల కాహ్వానము గాని యుద్ధమున వారి ప్రచారము గాని లేదు. « మామగుతమగొంక మహీపాలునకును » అనుపాఠము కాలవిరుద్ధము. 1127 మొ 1158 వఱకే యతనిపరిపాలనము కానవచ్చుచున్నది. ఆతనిపుత్త్రుఁ డగు రాజేంద్రచోడున కానామమున్నను నతఁడు నలగామునకు మామగాఁడు. అనుగురాజునకు కాలికుఁడును గాడు. « వెలనాటిచోడుండు విక్రమాఢ్యుండు » అనుచోట నున్న వెలనాటిచోడుఁడు కులోత్తుంగచోడగొంకరాజు పుత్త్రుఁడైన రాజేంద్రచోడుఁ డనియు, నతనికిఁ గులోత్తుంగచోడగొంకరా జని నామాంతర మున్న దనియు, వ్రాసినయుమాకాంతము గారు వెలనాటి చోడుఁడు కులోత్తుంగచోడగొంకరాజును జతుర్థకులజు లని వ్రాసి యింక నీవిషయము విచారణీయ మని వ్రాసిరి. కాఁబట్టి వెలనాటిచోడుఁడను వాఁడు నలగామునిమామ యైనగొంకరాజు కాఁడు. ఇకఁ వాఁ డెవ్వఁడైన నగుంగాక. ఆపేరిటివాఁడు యుద్ధకాలమున నుండుటయే మాకు ముఖ్యమన్నచో కృష్ణాజిల్లా తలగడదీవిలోని శాసనమునందు వెలనాటి చోడయ్య అనువాఁడు 1343 లో నుండె నని వ్రాయఁబడినట్లు సుయెల్ గారు వ్రాసినారు. కాఁబట్టి యాతఁడో యతనిపూర్వుఁడో యుద్ధకాలమున నుండవచ్చు నని తలంప వచ్చును.

ఇందువలన రావుగారు 191 పేజీలో « వెలుగోటివారి వంశవృత్తమునం జెప్పఁబడినపురుషులయొక్క కాలనిర్ణయాదివిషయములను బట్టి చూచినను బేతిరెడ్డి ... మూలపురుషుఁడను సిద్ధాంతము నిలువఁజాలదు. » అని మొదలిడి వ్రాసినయాక్షేపగ్రంథమంతయు దత్తోత్తరం బైనది. తమచే నిర్ధారింపఁబడిన పల్నాటియుద్ధకాలవిరోధమే కదా వారిప్రబలాక్షేపము. అది పరిహృతం బైనదనుట

యీవిమర్శము చూచినవారికి విశదంబు గాకపోదు. ఇదిగాక 183 పేజీలో "బేతిరెడ్డి బేతాళనాయఁడు కాఁడని సహేతుకముగ నిరూపింపఁబోవుచున్నాను" అని ప్రతిజ్ఞచేసి రావుగారు వ్రాసిన (2) గుర్తుగల హేతుగ్రంథము నాఁడే నిరస్తం బయ్యెను. ఇట్లగునపుడు పై సిద్ధాంతము నిలువఁ జాల దన్నమాటె నిలువఁ జాల దనుట తెల్లంబు. మఱియు నీయుద్ధకాలప్రతిబంధముననే రావుగారు పదవ ప్రకరణములో "అయినను వీరిని బ్రహ్మనాయనిజ్ఞాతి కోటిలోని వారిఁ గా నంగీకరింప వచ్చు" ననియుఁ బల్నాటిచరిత్ర యుపోద్ఘాతము 41 పేజీలో నువమాకాంతముగారు చెవిరెడ్డి బ్రహ్మనాయని వంశమున నతనితరువాతివాఁ డనియు నంగీకరించినారు. ఈ ప్రతిబంధము నివర్తించినపుడు వారు బ్రహ్మనాయనిని బేతాళనాయనిమనుమనిగ నంగీకరింపమికిఁ గారణము లేదు. ఇంకొకటి. చాగిబేతరాజునకు ననుగురాజునకు నామభేదము సంతానభేదము పితృాదిసంబంధిభేదము మున్నగునవి యెన్నియో యుండినను రావుగారు 7 వ ప్రకరణమున చాగిబేతరాజు ప్రసక్తియందు "పల్నాటిలోని శాసనములోఁ బేర్కొనంబడిన చాగిబేతరాజునకే యనుగురాజను నామాంతరము గలదేమో యని సందేహము కలుగుచున్నది" అని వారిప్పురకు నభేదముఁ జెప్పఁ జూచినవారు పై భేదములు లేని బేతిరెడ్డిబేతాళనాయక బేతినాయకులకు భేదము సాధింప బహుభంగులఁ బరాక్రమించుట వింతగా నున్నయది.

ఇఁక నేమైన దేశవిరోధ మున్నదని యెంతురేమో అదియుఁ జూతము. పిల్లలమఱ్ఱిబేతిరెడ్డికిఁ బిల్లలమఱ్ఱిబేతాళనాయనికి దేశైక్యము పిల్లలమఱ్ఱిశబ్దముచేతనే వ్యాఖ్యాతంబు గదా! బేతిరెడ్డికి బేతినాయనికి నగపడెడు దేశభేదము బేతినాయఁడు ఆంధ్రదేశము వాఁడా? ఆర్యావర్తదేశమువాఁడా? అని విమర్శించి నిర్ణయించినచోఁ దొలంగును. మొదటిపక్షమునఁ బల్నాటిచరిత్రములోనార్యా

వర్తమునుండి యనుగురాజువెంట దొడ్డనాయఁడు వచ్చినాఁ డని వ్రాయుట విరోధించును, రెండవపక్షము నవలంబించినచోఁ గులగోత్రనామవిరోధములువచ్చుచున్నవి (పల్నాటివీరచరిత్రమున బేతినాయఁడు వెలమకులమువాఁడని చెప్పఁబడినది. వెలమ కమ్మ కాపు అనునవి మన యాంధ్రదేశమునాలవజాతివారిలోఁ గల తెగలవారలయందు రూఢము అనుట శ్రీనాథభీమఖండాదులవలనను అనుభవమువలనను దెలిసినవిషయమే కదా!) ఇట్టి నామము గల తెగ యాంధ్రదేశముననే ప్రసిద్ధంబుగాని యార్యావర్తమునఁ గాదు. రేచర్లగోత్రము తద్గ్రామవాసమునఁ గలిగిన దని «ఏయూరు నుండిన యాయూరిగోత్రంబు» అని మొదలుగాఁ బద్మనాయకచరిత్రాదులందు వ్రాయఁబడినది. ఆగ్రామమాంధ్రదేశమున నుండుటయు నాశబ్దము రేఁడు చెలువు శబ్దములచే నిష్పన్నం బగుటయు సుప్రసిద్ధంబు. కాఁబట్టియే అనపోతానాయని అయ్యనవోలిశాసనమున శ్లో. తస్య గోత్రాణ్యనేకాని ప్రసిద్ధాన్యాంధ్రమండలే» అని వ్రాయఁబడినది. కాన వీరిగోత్ర మాంధ్రదేశముననే ప్రసిద్ధంబు కాని యార్యావర్తమునఁ గాదు. బేతినాయఁడు దొడ్డనాయఁడు పెద్దన్న అని మొదలగుశబ్దము లాంధ్రభాషాశబ్దములే కాని హిందుస్థానిభాషాశబ్దములు గావు.

కాఁబట్టి వీరు తొలుతనుండి యీదేశమువారే యను రెండవ పక్షము నవలంబించినచో నీ కులగోత్రనామములు విరోధించను. అందువలన నీదేశమునుండి యీదేశమునకు నేతద్వంశీయు లెవరోఁ బోయి యుండవలెను. ప్రథమప్రతాపరుద్రుఁడు వెలమలగోత్రనిర్ణయము బేతిరెడ్డినాఁడు చేసినట్లు పద్మనాయక చరిత్రాదులవలనఁ దెలియుచున్నది. కాన నాఁటి తరువాతివారే యార్యావర్తమునకుఁ బోయి యుండవలయు.

పరిశీలింప దామానాయఁడే తొలుత నార్యావర్తమునకుఁ బోయి నవాఁడని యెంచవలెను. చేతినాయఁడు మున్నగువారు కాకతివారి యొద్ద సైనాపత్యాదులలో నుండఁగాఁ దత్పుత్రుండు హైహయుఁడగు పల్నాటియనుఁగురాజునొద్ద సమాత్యుండుగా నుండవచ్చును. అనేక దృష్టాంతములవలన దామానాయఁడె యిచ్చటనుండి యనుఁగు రాజునొద్దకుఁ బోయినవాఁడని యేర్పడును. చెవిరెడ్డి చేతిరెడ్డి చేతినాయకులపుత్రులలోఁ గలనామభేదమునుగుఱించియు నితరవిషయములను గుఱించియు విస్తరముగ వెనుక వ్రాయంబడియెను. యుద్ధకాలమునుమార్చుటవలనఁ గాలాపేక్షములగు నాక్షేపము లన్నియు దూరాపాస్తములైనవి.

ఒక్కటిమాత్రము శేషించినది. రావుగారు మల్లానాయనికి నెల్లూరుశాసనమునాఁటికి సంతానమే జనింపలేదని సంతానాభావపక్షమును దొలుత నెత్తికొని తరువాత «ఒకవేళఁ బుట్టినా రనుకొన్నను» అని సంతానసద్భావపక్షమును దీసికొని దోషము లీయసాగి «మల్లానాయనికి సంతానమే లేక యుండఁగాఁ బ్రతాపరుద్రునితో ... సమకాలికుఁ డయ్యెను» అని మరలసంతానాభావపక్షమునే యుపసంహారవాక్యమున నవలంబించి దోషము లిచ్చి యున్నారు. ఇది ప్రమాదజనితమో మఱి యెద్దియో తోఁపక యున్నది.

ఏతదాక్షేపమధ్యమున «ప్రపితామహుఁడు పితామహుఁడు మనుమఁడు వయస్సువచ్చినమునిమనుమఁడు నేకకాలమున నున్నవారని చెప్పవలసి వచ్చును. ఇది యెంతయు నసందర్భముగా నున్నది కదా" యనివ్రాసినారు. ఏల వ్రాసిరో తోఁపదు. లోకములో వయస్సువచ్చినమునిమనుమనితో సమకాలికులగువార లెందఱో వినఁబడుచున్నారు కనఁబడుచున్నారు. మనముచూచుటకైనను నిరువదిసంవత్సరములమీఁదఁ బుత్రుండు నలువదిసంవత్సరములమీఁదఁ బౌత్రుండును

నఱువది సంవత్సరములమీఁదఁ బ్రపౌత్రుండును బుట్టినవారికి నెనుబది సంవత్సరములమీఁద వయసువచ్చినమునిమనుమనితో సమకాలికులై యుండుట వింతగాఁ దోఁపదు.

ఇదంతయుఁ బరిశీలించినపండితోత్తములకు 194 వ పేజీలో రావుగారు « కాఁబట్టి తేలినపర్యవసాన మేమనఁగా వెలుగోటివారి వంశచరిత్రమును తద్వంశవృక్షమును చరిత్రమునకు విరుద్ధముగాఁ గూర్పఁబడిన వనియు వానిని సంస్కరించుకోవలసి యున్న దనియు స్పష్ట మగుచున్నది » అని వ్రాసినవ్రాఁత భేర్యాదిధ్వనివలె నిరర్థకం బనియు నీవాక్యమునకు విచారలేశము లేక వ్రాసినరావుగారి గ్రంథమునందే సమన్వయము కాఁదగియున్న దనియుఁ దేటపడకపోదు. విస్తరభీతిచే వివరింపఁ జాలకయున్నాఁడను.

ఇది యాఱవప్రకరణవిమర్శము.

## ఆక్షేపసమాధాన సంగ్రహము.

(1) ఆక్షేపము. బేతిరెడ్డి జ్యేష్ఠుండు, నామిరెడ్డి కనిష్ఠుండు.

సమాధానము. ఇది నిరాధారము. 1195 వ. సంవత్సరమున నామిరెడ్డిబిరుదములను వహింపకుండుట బేతిరెడ్డి జ్యేష్ఠతకుఁ గారణము కాఁజాలదు. బిరుదములను వహించుటయు వహింపమియు వారివారి యిచ్ఛాధీనములు కాని యితరాధీనములు కావు. పేజీ 5 మొ. 8 వఱకు.

(2) ఆ. 1199 వ సంవత్సరమున బేతిరెడ్డి మరణించినాఁడు.

స. దీనికిఁ బ్రమాణము లేదు. 1202 వ సంవత్సరమున నామిరెడ్డి బిరుదములను వహించుట బేతిరెడ్డి మరణమునకుఁ గారణము కాదు. 1208 వ సంవత్సరమున బేతిరెడ్డి జీవించియున్నట్లును ఎఱ్ఱక్క సువాసినీచిహ్నములు ధరించియున్నట్లును నామెశాసనమున వ్రాయఁబడినది. 8—20

(3) ఆ. బేతిరెడ్డినిగూర్చి బట్టులచే నసత్యములైనయనేకగాథలు కల్పింపఁబడినవి. వెలుగోటివారివంశచరిత్రకారులు చెవిరెడ్డి గణపతివలన గౌరవింపఁబడినాఁడని మొదలయిన విషయములు బట్టులపొగడ్తలను నమ్మి వ్రాసినారు. పద్మనాయకచరిత్రాదులయందు బేతిరెడ్డియె బేతాళనాయఁడని చూపినహేతువులు పరస్పరవిరుద్ధములు. ఈగ్రంథములలో నసత్యములు నసందర్భములునైనట్టివిషయము లెన్నియో గలవు.

స. ఇదంతయు వంధ్యప్రతిజ్ఞయె కాని [illegible]హించునది కాదు. 21—38

(4) ఆ. బేతిరెడ్డికి చెవ్విరెడ్డియని నామము లేదు. ఎఱ్ఱక్కశాసనములో చెవ్విరెడ్డిపేరు వ్రాయక బేతిరెడ్డిపేరే వ్రాయఁబడియున్నది.

స. శాసనములలో జన్మనామమే వ్రాయ[illegible]ననునియమము లేదు. కాకతిరుద్రదేవునిశాసనములోఁ గాకతి బెల[illegible] శ్రీయు

త్రిభువనమల్లః॥ అని బిరుదనామముచేతనే పేర్కొనంబడినాఁడు కాన బేతిరెడ్డికి చెవిరెడ్డియను నామము కలదు. 39—43

(5) ఆ. బేతిరెడ్డి వేంకటగిరి మొదలగు సంస్థానాధిపతులకు మూలపురుషుఁడు కాఁడు. దాని హేతువులు పరస్పరవిరుద్ధములు.

స. దీని కివి హేతువులని యెవరును వ్రాయలేదు. అట్లు తలంచుట భ్రమము. ఇష్టసంపాదకమును గాదు. 44—8

(1) హేతువు వెలుగోటివారివంశచరిత్రకారులు చెవిరెడ్డిగాథను పూర్వగ్రంథములకు విరుద్ధముగాఁ గల్పించినారు.

సమాధానము. ఆగ్రంథకర్తలిట్టులు కల్పించియుండినచో వారి గ్రంథ మవిశ్వసనీయం బైనం గావచ్చును గాని యందువలన బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడనుట నిర్వహింపదు. 49—50

(2) హే. పూర్వగ్రంథములలో నెందులో లేనట్టి హేమాద్రిరెడ్డిపేరు నూతన గ్రంథకారులు కల్పించినారు.

స. ఉపోద్ఘాతము 4 పేజీలో బేతాళచరిత్ర మనుగ్రంథములో హేమాద్రిరెడ్డినామ మున్నదని స్పష్టముగ వ్రాసియున్నారు. ఆగ్రంథము నామూలాగ్రముగఁ బఠించితి నని వ్రాసిరిగాని పఠించినవారు కారు. ఇది బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడనుటకు హేతువును గాదు. 51—52

(3) హే. చెవిరెడ్డివృత్తాంతము వారువారు వేర్వేరుభంగుల వ్రాసినారు.

స. ఆవృత్తాంతమెట్టులు వ్రాయఁబడినను బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడనుట నిర్వహింపదు. 53

(4) హే. శివుఁడు మూఁడు వరములు గోరినట్లు పూర్వగ్రంథములలో నుండఁగా నూతనగ్రంథములో నొకవరమే వ్రాయఁబడినది.

స. శాసనాది ప్రమాణములను బట్టి నూతనగ్రంథమున నొకవరమే స్థాపింపఁబడినది. 54—55

(5) హే. పెద్దిరెడ్డిని గణపతి సన్మానించినతరువాతఁ గవులు వేడుకతో బేతాళుఁడని పిలిచినట్లు చెప్పఁబడియుండఁగా నూతనగ్రంథమునఁ జేవిరెడ్డికి గణపతిదేవుఁడు బేతాళుఁడని పౌరుషనామ మిచ్చినట్లు వ్రాయఁబడినది.

స. "నాఁడాదిగ సుకవీంద్రులు
వేడుక బేతాళుఁ డంచు వేమఱు బిలువన్"

అనుపద్యమును మాత్రమే చూచినారు దానియర్థ మేమో దాని పూర్వోత్తరసందర్భ మేమో పరిశీలించినవారు కారు. ఇది చేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడనుటకు సాధకమును గాదు. 55—63

(6) హే. పూర్వగ్రంథములలో మూలపురుషుఁడు ఆదిజగన్నాథరావు ప్రోలిరెడ్డి అని చెప్పియుండఁగా నూతనగ్రంథమున హేమాద్రిరెడ్డి యని వ్రాయఁబడినది. నామిరెడ్డి ఎఱ్ఱకసాని శాసనములలో నీపేళ్లు లేవు.

స. చేతిరెడ్డికిఁ బూర్వులు ప్రోలిరెడ్డి మొదలగువా రున్నమాత్రమున చేతిరెడ్డి మూలపురుషతకు భంగము లేదు. పై యుపోద్ఘాతము నాలవపేజీ చూచియున్న నీయాక్షేపము చేయరు. చేసిన సది ప్రతిజ్ఞాతాంశపర్యాహతకమును గాదు. 63—65

(7) హే. ఎఱ్ఱకసాని శాసనములో చేతిరెడ్డి గణపతివలన గౌరవింపఁబడినట్లు వ్రాయలేదు. చేతిరెడ్డికి కిరీటాధిపత్యము వర్ణింపలేదు.

స. ఆ శాసనార్థము పరిశీలించినచో నీయాక్షేపమునకవకాశ ముండదు. ప్రతివిషయము శాసనములో వ్రాయవలెనని నియమము లేదు. శాసనానుదాహృతవిషయము లెన్నింటినో మీరు వ్రాసిరి. 65—80

(8) ఆ. వీని నన్నింటిని జూడఁగా చేతిరెడ్డిగాథ విశ్వాసపాత్రము గాదని తేటపడఁగలదు.

స. చేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడని సాధింప నుపక్రమించి యుక్త్యుపసంహారము చేయుట శాస్త్రసంప్రదాయవిరుద్ధము. 81

(9) ఆ. చేతిరెడ్డిపై సంస్థాపితములగు మూలపురుషుఁ డను సిద్ధాంతము నిలువఁజాలదు.

స. దీనికై మీరుచూపిన హేతువులు నిరర్థకములు 82—83

(1) హే. వెలుగోటివారి వంశచరిత్రములో బేతాళనాయనికి దామానాయఁడు మొదలగువారు పుత్రులని వ్రాయఁబడినది. పల్నాటివీరచరిత్రములో బేతినాయనికి దొడ్డనాయఁడు పుత్త్రుఁ డని వ్రాయఁబడినది.

స. ఇది బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడనుట నెట్లు చూపిన సాధింపదు. దామానాయుని కది నామాంతరము. 83—87

(2) హే. దామానాయనికి దొడ్డనాయఁ డనియు మల్లానాయఁ డనియు నామాంతరములను కల్పించియున్నారు.

స. దామానాయని కెన్ని నామములు కల్పించినను నది బేతిరెడ్డి మూలపురుషతకు భంజకము కాదు. చరిత్రములం దొక్కొకనికి నెన్నెన్నియో నామములగపడుచున్నవి. 90

(3) హే. దామానాయునికి మల్లానాయఁ డని నామాంతర మంగీకరించినను ఎఱ్ఱక్కదేవి శాసనమునాఁటికి మల్లానాయునికి సంతానమే జనింప లేదు.

స. శాసనములలో వ్రాయమిచే తదభావము సిద్ధింపదు. 94

(4) హే. పుట్టినారనుకొన్నను శిశువులై యుందురు. అట్టివారు 1182 లోపల జరిగిన యుద్ధమునాఁటికిఁ బ్రౌఢులై యుండుట యసంభావితము.

స. ఆయుద్ధము 1182 లోపల జరిగిన దనుసిద్ధాంత మనేక యుక్తిప్రమాణములచే నిరసింపఁబడి 1295 లోపలజరిగిన దని బహుప్రమాణములచేతను యుక్తులచేతను స్థాపింపఁబడినది. 96—152

(5) హే. 1203 నాఁటికి జీవించియున్న దొడ్డనాయఁ డనెడుమల్లానాయఁడు 1182 లోపలనే మృతినొందవలసినదురవస్థ పట్టినది.

స. యుద్ధకాలము మాఱుటచే నీదురవస్థ లేదు. 155

(6) హే. అనపోతమాదానాయకులు వెన్నమనాయని నుండియు సింగభూపతి దాచానాయని నుండియుఁ దమశాసనగ్రంథములలో వంశాభివర్ణనము చేసినందున బేతిరెడ్డియుఁ దత్పుత్త్రులును ఈసంస్థానాధిపతులపూర్వులు కారు.

స. వారలు తమ ప్రపితామహునినుండి పురుషత్రయమునే వర్ణించి యున్నారు. వీనిలో నెద్దియుఁ బ్రతిజ్ఞాతసాధకముగాదు. 95—96

ఇది యాక్షేపసమాధానసంగ్రహము.

శ్రీ ర స్తు.

## ఆంధ్రచరిత్ర దశమప్రకరణ విమర్శనము.

చిలుకూరు వీరభద్రరావుగారు పదవప్రకరణమును వెలమవీరుల చరిత్ర మను నామముతో నుపక్రమించి 285 పేజీలో "పద్మనాయకుల జన్మకథన మెట్టిదైనను" అనువఱకు 16 పేజీలు వెలమవారికులములోఁ గొన్ని దోషము లున్నట్లు ప్రకటించినారు. ఉపక్రమమున "వెలమ వీరుల చరిత్ర" మని వెలమసామాన్యచరిత్రముగాఁ జూపినను, నుపసంహారమున "పద్మనాయకుల జన్మకథన మెట్టిదైనను" అని విశేష పర్యవసానము చేసినందునను జివఱకు పద్మనాయకు లగుదామానాయక ప్రభృతులచరిత్రము వ్రాసినందునను నింకఁ గొన్ని సందర్భములవలనను నీచరిత్రము పద్మనాయక వెలమచరిత్రమే కాని వెలమసామాన్యచరిత్రము గా దని తేటపడఁగలదు. కావున నిందు వ్రాయఁబడు దోషములకుఁ బద్మనాయక వెలమలే లక్ష్యములుగా నుండఁగలరు.

ఇందుఁ గొన్ని దోషములు వారలయందుఁ బ్రయోగింపఁబడు చున్న వెలమ పద్మజ పద్మనాయకాది శబ్దములను బురస్కరించుకొని వ్రాయఁబడినవియుఁ గొన్ని వారలం గూర్చి ప్రవర్తించియున్న పద్మనాయకచరిత్రాదులను బురస్కరించుకొని వ్రాయఁబడినవియుఁ గొన్ని స్వమతిపరిణామమాత్రమును బురస్కరించుకొని వ్రాయఁబడినవియునై యున్నవి. వీనిలోఁ బ్రథమాక్షేపము క్రిందివిధముగ నున్నది.—

"వెలమలు సంస్కారశూన్యులై శూద్రప్రాయులైన క్షత్రియ సంతతివారమనియు సచ్ఛూద్రులమనియు చెప్పుకొను తెగలవారిలో నొక్కరుగ నున్నారు. ఈ తెగవారిని గూర్చినచరిత్రము సాంతముగ నిందుఁ దెలుపుటకు సాధ్యపడక పోయినను గొంతవఱకైనను వివరించుట యావశ్యకముగఁ గానంబడుచున్నది. వెలమశబ్దము వెల్లాళ శబ్దము

నుండి పుట్టిన దని కొందఱు చెప్పుచున్నారు. వెళ్ళాన్తై యనఁగా సీరుఁ గట్టువారు వ్యవసాయకులు అని యర్థము. వర్మశబ్దభవము వెల మశబ్ద మని చెన్నపురి రాజకీయకలాశాలయందు సంస్కృతోపన్యాస కులుగా నుండి కీర్తిశేషు లైన యం, శేషగిరిశాస్త్రులవారు శబ్ద శాస్త్రి మనుతమగ్రంథమందు వ్రాసియున్నారు. దక్షిణహిందూస్థాన ములో వర్మశబ్దము నామములతుదను బెట్టుకొన్నవారు పల్లవులు కదంబులు చాళుక్యులు మొదలగువారుగ నున్నారు. పై కలాశాల యందు శేషగిరిశాస్త్రులవారికిఁ బూర్వ మాపనియందే యుండిన ఆప ర్టుగారు పల్లవులే వెలమ లని వ్రాసియున్నారు" అని.

దీనిపై నిది విచారింపవలసియున్నది. వెలమశబ్ద మెన్నింటివలనఁ బుట్టినను ఎన్నియర్థములను బోధించినను వర్మశబ్దభవ మనుటను పద్మ నాయకబోధకం బగుటను నేమైన నాటంకపఱచునా? ఆటంకపఱచు నన్నచోఁ దత్ప్రకారం బెద్దియో యగపఱచుట యావశ్యకంబు. కానిచో నేలయీవృథాశ్రమము? వర్మశబ్దభవ మగు వెలమశబ్దము పద్మ నాయకబోధక మగుటను వెళ్ళాన్తైశబ్దభవ మగునది స్వాభిమతార్థబోధక మగుటను వా రంగీకరించిన యట్లే కదా? అని.

ఇదిగాక శబ్దములు కొన్ని సమానానుపూర్వులై యుండినను భిన్నభిన్నధాతునిష్పన్నంబులై యుండును. ద అనుశబ్దము దాధా తువునుండియు దోధాతువునుండియు నిష్పన్నం బగును. కృత్ అను శబ్దము కృఞ్ధాతువునుండియు కృతాధాతువునుండియు నిష్పన్నం బగును. దానంజేసి వాని కర్థభేదము గూడఁ గలదు. అయినను ప్రక రణాదిసందర్భోచిత మగునర్థమే గ్రహింపఁ బడుచుండును కాని యప్ర కృతానుచితార్థము గ్రహింపఁబడదు. విష్ణుసహస్రనామములలోని శ్రీదః అనుదానికి శ్రీని భంగపఱచువాఁ డనియు ప్రియకృత్ అనుదానికిఁ బ్రీతిని భంగపఱచువాఁ డనియు నర్థము చేయుట హరిశబ్ద మనేకార్థక

మని హరింపవచ్చే ననుచోట కప్పను కోతిని గ్రహించిన ట్లనుచితం బగును కదా! అట్లు వెలమశబ్ద మనేకార్థక మని పద్మనాయకుల ప్రస్తావమున నీసుగట్టువా రనునర్థముఁ దీసికొనుట యనుచితం బగు ననుట తెల్లము. లేనియర్థము పొనఁగింపఁ జూతమన్నఁ బొసంగదు. ప్రత్యక్షప్రమాణవిరుద్ధం బగుప్రమాణాంతరము దుర్బలము. ఏనాఁడో యెవఁడో యట్టివాఁ డుండు నని యూహించుట నిలువఁ జాలనిదియునతి ప్రసక్తంబును. కావున వెలమశబ్దమున కపార్థముఁ గల్పించి పద్మనాయకులయందుఁ గళంకమారోపించుటకు వలను లేదు. ఈపక్షము నిర్వహింపదనియే కాఁబోలు రావుగారు దీనిని విడనాడి మార్గాంతరము ననుసరించిరి. ఆమార్గ మిటు లున్నది.—

« శబ్దవ్యుత్పత్తి యెటులుండినను వెలమవారును కమ్మవారివలె మిశ్రజాతివారని చరిత్రము వేనోళ్ళఁ జాటుచున్నది. చరిత్రమునందు రెడ్లకును కమ్మవారికిని వెలమవారికిని సంబంధములు గానంబడుచున్నవి. ఇంతమాత్రముచేత నీమూఁడు తెగలవారు నొక్క తెగలో నుండి యేర్పడినా రని చెప్పుటకును సాధ్యపడదు. ఈమూఁడు తెగలకు జన్మస్థానములు గొల్లజాతులును పల్లెజాతులును నై యున్న వని చరిత్రమందు దృష్టాంతము లనేకములు గానం బడుచున్నవి. ఆంధ్రసామ్రాజ్య విజృంభణకాలమున యదువృష్ణి భోజాంధకు లనెడుగొల్లజాతివారికిని యవనశకపహ్లావాదులకును గలిగినసమ్మేళనమున నూత్నరక్త మీజాతులయందుఁ బ్రవహింపఁగా వీరలు విజృంభించి గంగాతీరము మొదలుకొని కన్యాకుమారివఱకుఁ గలదేశములను వేర్వేఱుకాలములందు వేర్వేఱుగృహనామములతోఁ బాలించుచు వచ్చిరని చరిత్రము సాక్ష్య మిచ్చుచున్నది » అని.

రావుగారు మొదటియాక్షేపమును స్థాపింపక జాఱి వచ్చుటయు నీయాక్షేపమునఁ బేరు నూరును జెప్పక « చరిత్రము వేనోళ్ళఁజాటుచు

న్నది. చరిత్రమునందు ... గానంబడుచున్నది. చరిత్రమునందు దృష్టాంతము లనేకములు కానంబడుచున్నవి. చరిత్రము సాక్ష్యమిచ్చుచున్నది" అనిచరిత్రపదమును బేర్కొనుటయుఁ జూడ "విషం భవతు వా మావా ఫటాటోపో భయంకరః" అనున్యాయము ననుసరించి ప్రమాణము సున్నయైనను నెన్నియో ప్రమాణము లున్నట్లు పామరజనమనోవ్యామోహము గాఁ జరిత్రపదము నలుమూలలఁ బ్రావృత్తి పెట్టి మనసున నున్న మాలిన్యమును బయలు పఱచి రని తోఁపించుచున్నది. కాదేని దానిపే రెద్దియో యేపండితునిచేత వ్రాయఁబడినదో యేప్రమాణము ననుసరించి వ్రాయఁబడినదో యించుకైనను వ్రాయుదురు. ఒకవేళ గ్రంథవిస్తరభీతినో వ్రాయ నవకాశము లేమినో వ్రాయుట యనావశ్యక మని తోఁచియో వ్రాసినారు కా రనుకొంద మన్నను, అట్లను కొనుటకు వీలు లేదు. శ్రీనాథుఁడు మొదలగు పెక్కండ్రుకవులచే వేలువేలు గ్రంథములవఱలమున విశ్వవిఖ్యాతంబు గావింపఁబడిన పల్నాటివీరచరిత్ర మంతయు నోపికతో నొకప్రకరణముగ వ్రాసిన మహానుభావులకుఁ జరిత్రము పేరు వ్రాయుటయందు గ్రంథవిస్తర భీతి గాని యు దేపనిగఁ గూర్చుండినవారి కవకాశము లేమి గాని యడ్డములైయుండు నన్న విషయ మెవరును విశ్వసింపరు. ప్రసిద్ధులందు దోషారోపము సేయ సమకట్టినప్పుడు దానికిఁ గావలసిన సాధనసామగ్రి ప్రదర్శించుట యత్యంతావశ్యక మనుట లోకవిదితము. కాన ననావశ్యక మని యెంచ నవకాశమును లేదు. ఇట్టిస్థితిలో వీరు మానధారణము చేయుట పైన్యాయమునే స్మరింపఁ జేయుచున్నది.

ఇప్పటిచరిత్రగ్రంథకారులకుఁ గొందఱకు నేనాఁడో మరణించి మట్టిలోఁ గలసిపోయినవారిని లేవనెత్తి యశ్రుత దృష్టపూర్వములగు శౌర్యధైర్యాదిలోకోత్తర గుణరత్నములతో వారల నలంకరించుటయు

నుత్తమ స్థితిలో నున్న యిప్పటివారిని వినని కనని దూషణములచే నధః కరించుటయు నైజంబై కనుపట్టుచున్నది.

ఇంక వెనుక పేజీలో "ఈ తెలగవారిని గూర్చి చరిత్రము సాంతముగ నిందుఁ దెలుపుటకు సాధ్యపడక పోయినను గొంతవఱకైనను వివరించుట యావశ్యకముగఁ గానంబడుచున్నది" అని వ్రాసినగ్రంథముచే వారు ప్రమాణములు దెలుపుటకు సాధ్యపడకపోయినను దోషము లారోపించుట యావశ్యకముగ నున్నది అని స్వాభిప్రాయమును దేటపఱచినారు. ఇదిగాక యీ పేజీ ఫుట్నోటులో "వీరిని గుఱించి సాంఘికచరిత్రము (ఎన్నఁడో తీరిక కలిగినపుడు) వ్రాయఁబడు" నని వ్రాసినారు. కాఁబట్టి పై యాక్షేపములు చేయుట సరిగా దని యనవత్తురు. అట్లనరాదు. కేవలము పరహ్లాదయానందసంధాయకులగు సజ్జనుల కిది ముఖ్యధర్మంబె యైన నుపపత్తిప్రదర్శనమున కవకాశ మెప్పుడు గలుగునో అప్పుడే యీపనికిఁ బూనుట సముచితంబు గదా!

ఇప్పుడు వారి మనసునఁ బెట్టుకొన్న చరిత్రం బెట్టిదియై యుండునో మనము కొంచె మరసి చూతము.

చరిత్రములు మహర్షిప్రణీతములు మహాకవినిబద్ధములు దేశసామాన్యచరిత్రములు స్థానికచరిత్రములు మొదలుగా ననేకరూపములై యున్నవి. వీనిలో స్థానికచరిత్రములు శాసనాది ప్రమాణసహకారమున్న నే గ్రాహ్యంబులు. దేశచరిత్రంబులు నింతియే. వీరభద్రరావుగారు గూడ 12 వ ప్రకరణము మొదటిపేజీలో "స్థానికచరిత్రములోని విషయము లన్నియు పరమసత్యములను గా మనమెంత మాత్రమును భావింప రాదు. అయ్యవి యవిమర్శపూర్వకముగాఁ బ్రజలచేఁ జెప్పుకొనఁబడునట్టిగాథలను బురస్కరించుకొని వ్రాయఁబడినవి." అని వానికగ్రాహ్యతం జెప్పినారు. కాన వానివిషయ మెత్తఁ

బనిలేదు. వెలమవారలను గుఱించి మహర్షిప్రణీత పురాణేతిహాసాది ప్రమాణములు దుర్లభంబు లని తోఁచెడిని. ఇఁక మహాకవినిబద్ధప్రబంధములు తత్కవి ప్రామాణికతనుబట్టి విశ్వసింపఁబడు. వానియందీపద్మనాయక వెలమలవృత్తాంత మెట్లు చెప్పఁబడినదో చూడవలసియున్నది. శాస్త్రరహస్యవేత్తయై జగత్ప్రసిద్ధిఁ గన్న శ్రీనాథమహాకవి తనభీమఖండమున.—

" ఉ. కైటభదైత్యవైరిపదకంజమునం దుదయంబు నొందె ని
న్నేటికి భూతధాత్రికిని నెంతయు నచ్చినతోఁడఁబుట్టువై
హాటకగర్భముఖ్యనిఖిలామరమౌళిమహామణిప్రభా
పాటలవర్ణమైనయొకపావనవర్ణ ముదీర్ణసంపదన్. "

" వ. అప్పుణ్యవంశంబునఁ గంసాసురవిధ్వంసిచరణపల్లవంబు దనకుఁ బుట్టినిల్లుగావునఁ గారణగుణసంక్రమంబునం బోలె జామరతోమరచ్ఛత్రధనుఃఖడ్గాదిచిహ్నోపశోభితంబై చదలేటిసేటివలని సోదరీయస్నేహలబ్ధంబులుంబోని పావనత్వశుచిత్వగాంభీర్యమాధుర్యంబులు చరితమనస్స్వభావవచనంబుల ధరియించి పైదోడుం గూడివి విశ్వవిశ్వంభరాక్రీడంబు తనకు విదిర్చినపరమశాంతి యంతరంగంబున సంతరించి నిఖిలప్రపంచమునకు నాధారంబై ప్రవర్తిల్లె. అందుఁ బద్మనాయకులను వెలమ లనఁ గమ్మ లన సరిసగ్లనఁ బంటగ్లన బహుప్రకారశాఖోపశాఖాభిన్నంబు లయినమార్గంబులఁ ద్రిమార్గగంగాప్రవాహంబునుం బోలె గోత్రంబు లెన్నియేనియు జగత్పవిత్రంబులై ప్రవహించుచుండ ...... పంటమహాన్వయంబు" అని వ్రాయఁబడినది.

ఇందు "పావనవంశము అప్పుణ్యవంశంబున జగత్పవిత్రంబులై" అని వ్రాయఁబడియుండుటవలనఁ బై శాఖలవారియందు రావుగారారోపించినకళంకమున కవకాశంబు లేదని తేటపడుచున్నది. వాస్త

వమునఁ బద్మనాయకకులము నానాజాతిసంకీర్ణ మయి యుండినచో నక్కవిరా జట్లేల యసత్యములు వ్రాయును? కవు లెంతటివారలైనను ద్రవ్యలోభమున నట్టులు వర్ణించుట స్వాభావిక మని యనుకొనుటకు వీలులేదు. పంటవారి కంకితముగాఁ జేయుచున్న కవి యొకవేళ వారివలన ధనము నాశించి యుండు ననుకొన్న ననుకొనవచ్చును గాని యవర్ణ్యులగుపద్మనాయకులవలన నపేక్షించినాఁ డనుకొనుటకు వీలులేదు కదా! ఇట్లగునప్పుడు వర్ణ్యులగు పంటవారిని క్రిందుపఱచి యవర్ణ్యులగు పద్మనాయకులను మొదటఁ జెప్పుటచే వారియం దభ్యర్హితత్వం బపరిహార్య మని తేటఁపడగలదు. ఇందువలన శ్రీనాథకవిరాజు వారివీరివలె ద్రవ్యైకాభిలాషియై యసత్యవాది కాక సత్యమునే పురస్కరించి వర్ణించువాఁ డని స్ఫుట మగుచున్నది. <u>ఇదిగాక</u> రెడ్లకుఁ బద్మనాయకులకుఁ బ్రబలవైర మని రావుగారు బలుతావుల వ్రాసిరి. పంటవారి యాస్థానమున నున్న శ్రీనాథకవి వారికి విరోధులగు పద్మనాయకుల నధఃకరింపక ముందు వర్ణించినందునఁ బద్మనాయకులు కమ్మ మొదలగు నితరశాఖలవారికన్న నుత్కృష్టు లని యీ గ్రంథకారునియభిప్రాయము గ్రహింపఁదగి యున్నది. వీరభద్రరావుగారు తమకృష్ణరాయలచరిత్రము 13 వ ప్రకరణము 121 వ పేజీని కృష్ణరాయఁడు దాసీపుత్త్రుఁడు కాఁ డని స్థాపించునపుడు " ఇంతియగాక కృష్ణరాయాస్థానకవులలో నొకఁ డగునందితిమ్మన తనపారిజాతాపహరణగ్రంథము ప్రథమాశ్వాసమున,

క. ఆనరసమహీమహిళా
జానికిఁ గులసతులు పుణ్య♦చరితలు తిప్పాం
బానాగాంబిక లిరువురు
దానవదమనునకు రమయు ♦ ధరణియుఁ బోలెన్.

...నాగాంబిక దాసీయువతియే యైనయెడలఁ గులాంగన యనియుఁ బవిత్రచరిత్రము గలదనియుఁ దిమ్మనార్యుఁ డేల యసత్యోక్తులు పలుకును" అని వ్రాసి యున్నారు. అట్లు పద్మనాయకులు పలుజాతుల నుండి గలిగిన తెగవారై యుండినయెడలఁ బావనవర్ణ మనియుఁ బుణ్యవంశ మనియు జగత్పవిత్రగోత్రము లనియు శ్రీనాథమహాకవి యేల యసత్యోక్తులు పలుకును? అని పై న్యాయసామ్యమును బట్టి మనము నిర్ధారించుకొనఁ దగియున్నది. ఇదిగాక యింకొక విశేషము. తిమ్మనామాత్యుఁడు రాయలవారి యాస్థానకవి యని రావుగారే వ్రాసియున్నారు. అట్టివాఁ డొకవేళఁ బోషకప్రభువు లందూ భక్తిచేతనో వ్యతిరేకముగఁ జెప్పినచో జీవనభంగము కలుగునన్న భయముచేతనో యట్లు చెప్పియుండు నని యనుకొనుటకు వీలున్నది. అట్లయినను రావుగారి కక్కఱని చెప్పినవాక్యముకూడఁ బ్రమాణమైనప్పుడట్టి వెవ్వియు లేని శ్రీనాథమహాకవి పద్మనాయకులను బైవిధముగఁ జెప్పియుండుట ప్రమాణ మగుననుటకు సంశయ ముండదు గదా!

ఇదిగాక రావుగారిచేఁ బ్రమాణముగా నెన్నఁబడుచున్నపల్నాటివీరచరితమునఁ గార్తవీర్యునిసంతతివాఁడగు క్షత్రియుఁ డయినయనుగురాజు తనమంత్రియైన వెలమయైన రేచర్లదొడ్డనాయనికుమారునిఁ బెద్దనను దత్తపుత్రునిఁగా స్వీకరించె నని నుడవం బడినది. ఇందు వలన వారు క్షత్రియసంబంధసముచితప్రాశస్త్యము గలవారై యుండిరని యెట్టివారికిని దోఁపకపోదు. ఒకవేళ వర్ణ్యులప్రాశస్త్యమునకై కవి క్షత్రియుఁడు కాకుండినయనుఁగురాజును క్షత్రియుఁ డనియో యాతనిచే స్వీకరింపఁ బడనిపెద్దనను స్వీకరింపఁబడినాఁ డనియో వర్ణించి యుండు ననుకొందమన్నచో యుద్ధమున కాయా రాజులు వచ్చియుండిరనువిషయముగూడ ప్రశంసావాదమైయే యుండవలసివచ్చును. ప్రతాపరుద్రవీరభల్లాణాదులచే యుద్ధకాలనిర్ణయము చేసినమన రావుగారపుడు

మానధారణము గలిగి యుండవలసి వచ్చును. కాన నాదారి ననుసరించుట తగదు.

ఇదిగాక సోమదేవరాజీయములోఁ బ్రతాపరుద్రుఁడు సభాసదులను గూర్చి పలికినట్లుగా నీక్రిందివాక్యములు వ్రాయఁబడినవి. « ఆరాజు హర్షించి మనంబున విచారించి యిట్లనియె. గణపతిమహారాజు నానావర్ణంబులవారికి నాయకత్వ మిచ్చుటం జేసి బహునాయకంబై యున్నయది. బహునాయకంబు ననాయకంబు నొక్కసరియే కావున నాయకత్వంబున కుత్తమవంశజాతులే కాని యితరజాతులవా రర్హులు కారు. మఱియు నొక్కమాటఁ జెప్పెద. మానధనులును నీతివివేకసంపన్నులును గాంభీర్యసముద్రులును మంత్రవివేకదక్షులును స్వామిహితానుచరులును సచ్ఛూద్రులును నైనపద్మనాయకులు నాయకత్వంబునకుఁ దగుదు రని సభాసదులతోఁ బల్కిన వారు రాజు వివేకంబునకు హర్షించి » అని.

ఇందు « నానావర్ణంబులవారికి నాయకత్వంబు లిచ్చుటం జేసి» అనుటవలనఁ బూర్వమున్ననాయకులు నానావర్ణములవా రనియుఁ దద్వ్యతిరేకముగఁ బద్మనాయకు లేకజాతీయులనియు « ఉత్తమవంశజాతులే కాని యితరజాతులవా రర్హులు కారు » అనుటవలనఁ బూర్వమున్ననాయకు లుత్తమవంశమువారు కారనియుఁ బద్మనాయకు లుత్తమవంశజు లనియు నేర్పడుచున్నది. ఇదంతయు సచ్ఛూద్రులయినపద్మనాయకు లనుటచే బలపఱుపఁ బడినది. ప్రతాపరుద్రుఁ డప్పటిపద్మనాయకులస్థితిని జక్కఁగఁ దెలిసియుండి కదా యట్లు చెప్పి యుండును. శాస్త్రజ్ఞులగు తత్సభాసదులు పద్మనాయకులయుదంతమును జక్కఁగఁ దెలిసియుండిరి కదా పద్మనాయకుల కులప్రాశస్త్యమును గని పెట్టిపలికినరాజువివేకమునకు హర్షించియుందురు. ఇప్పటివారికన్న వారి కీవిషయము చక్కఁగఁ దెలిసియుండుననుటకు సందేహముండదు కదా.

ఇట్లు భీమేశ్వరపురాణము పల్నాటివీరచరిత్రము సోమదేవరాజీయము పద్మనాయకులు సత్కులీను లని చాటుచున్నవి. ఈకృతి కర్తలు పద్మనాయకులయాస్థానకవులు గాని వారిప్రేరణమున గ్రంథములు వ్రాసినవారు కాని వారివలనఁ బ్రతిఫలమును గోరి ప్రశంసించినవారు కాని కారనుట తెల్లము. రాయలవారియాశ్రితులైనకవులు వారిప్రేరణమున వ్రాసినగ్రంథములు ప్రమాణము లైనపుడివి కాక పోవు గదా! ఇట్టిమహాకవుల గ్రంథములసంవాదంబును బడసి పద్మనాయకులయాస్థానకవులచే వ్రాయఁబడిన భానుమతీపరిణయవాసవదత్తాపరిణయాదిగ్రంథములు ప్రమాణము లగునన్న విషయము వ్రాయుట యనావశ్యకము. ఇంతియుకాదు. రావుగారు కృష్ణరాయలు దాసీపుత్రుఁడు కాఁడని సాధించునపుడు తత్సహోదరుండగు నచ్యుతదేవరాయలు వ్రాయించినశాసనములోని "తిప్పాజీనాగలాదేవ్యోః కౌసల్యా శ్రీసుమిత్రయోః" అనువాక్యమును బ్రమాణముగా నెత్తికొన్నారు. అట్లు వీరిపూర్వులైన పండితప్రభువులు రచియించినగ్రంథములు వ్రాయించినశాసనములు నెన్నియో యేతద్వంశప్రాశస్త్యముఁ దెలుపుచున్నవనుట లోకవిదితము. సర్వజ్ఞసింగభూపతి తన రసార్ణవసుధాకరమున, "తస్య పాదాంబుజా జ్జాతో వర్ణో విగతకల్మషః" అనియు నామిరెడ్డి తనశాసనమున "శ్రీమత్పద్మజపాదపద్మయుగళా ల్లోకత్రయాభ్యర్చితా దుద్భూతే విపులేకులే" అనియు, ఎఱ్ఱక్క తనశాసనములో "నిత్యస్తుత్యాచ్చరణకమలా ద్వేదవిద్భి ర్మహద్భిః తుర్యం వర్యం సమజని కులమ్" అనియు మాదానాయఁడు తనశాసనములో "విష్ణో స్తచ్చరణా ద్విజిష్ణు రుదభూ ద్వర్ణో గుణార్ణోనిధిః" అనియు వ్రాయించియున్నారు. ఇయ్యవి వీరికుల ప్రాశస్త్యమును జెప్పుచున్న వనుట వివరింపఁబనిలేదు. ఇట్లు రేచర్లమాధవరాయాది ప్రణీతములగు చంద్రికాపరిణయము మున్నగుగ్రంథములును రేచర్లగోత్రులు గాక తక్కిన

డెబ్బదియాఱుగోత్రములపద్మనాయకులు రచియింపించినయిందుమతీ పరిణయాదిగ్రంథములును బద్మనాయకులు పవిత్రాన్వయు లని నుడువు చున్న వనియుఁ బైఁ బేర్కొనఁబడినశ్రీనాథాదిమహాకవిగ్రంథసంవాదంబునం జేసి యవి ప్రమాణకోటి నధిరోహించు ననియుఁ జెప్పుటకు సంశయ మొట్టివారికిని గలుగదు.

ఇట్లుండఁగా రావుగారు « చరిత్రము వేనోళ్లఁ జాటుచున్నది చరిత్రము సాక్ష్య మిచ్చుచున్నది " అని మొదలుగాఁ జెప్పినచరిత్ర మెద్ది యైయుండు నన్నసంశయము మఱింత ప్రబలుచున్నది.

ఇఁక నేమైనఁ బుక్కిటిపురాణములను నమ్మియిటులు వ్రాసి యుందురేమో యని విచారింపఁగా నవియుఁ దీసికొన వీలులేదు. వీరు తమకృష్ణరాయవిజయములో 13 వ ప్రకరణమున 119 వ పేజీలో « శ్రీకృష్ణదేవరాయఁ డుత్తమక్షత్రియుఁడు గాక దాసీపుత్రుఁ డను నుద్దేశ్యముతోఁ దదనుగుణ్యము లగుకథలు గల్పింపఁబడి సత్యత్వ మును దెలిసికొనెడుసందర్భమునఁ జరిత్రకారులకు వేసటం బుట్టించు చున్నవి. మనదేశములో సత్యవంతము లగుచరిత్రములను వ్రాయు నభ్యాసము లేనికారణమునఁ బుక్కిటిపురాణగాధలను బురస్కరించు కొని మనము చరిత్రములను వ్రాయఁ బూనినఁ బెక్కుదోషము లుండక మాన " వనియు « గ్రంథస్థనిదర్శనము లుండఁగా నయ్యవి విశ్వసింపక పుక్కిటిపురాణగాధలతోఁ బెనఁగులాఁడుట యెల్ల నఱచేతిలోనివెన్నముద్దను విడచి మోచేయినాకుటవంటిది కాదే" యనియు వ్రాసియున్నారు. కానఁ బుక్కిటిపురాణములనునమ్మి యిటులు వ్రాసి నారనుకొనుటకు వీలులేదు.

ఒకవేళ కృష్ణదేవరాయలవిషయములో వారివంశీయులు వ్రాయించిన శాసనములు తదాస్థానకవులు వ్రాసినగ్రంథములు వానికి సంవాదములుగా నున్నకొన్నిచరిత్రములు ప్రమాణములుగా నెత్తి

కాని తద్విరుద్ధముగాఁ బ్రకటించినచరిత్రములు పుక్కిటిపురాణగాథల ననుసరించిన వని నిరసించినవీరభద్రరావుగారు పద్మనాయకుల విషయములో నుదాసీను లగుశ్రీనాథాదిమహాకవులచే స్వతంత్రముగా వ్రాయఁబడినభీమఖండము మొదలగువానిలో నొక్కదాని నైన నెత్తికొనక యేతద్వంశీయులచే వ్రాయఁబడినశిలాశాసనములను గ్రంథములను జూడక ఏతదాస్థానకవులచే వ్రాయఁబడిన వాసవదత్తాపరిణయాదులను జదువక పుక్కిటిపురాణములను నమ్మియే "యీమూఁడు తెగలవారికి జన్మస్థానములు గొల్లజాతులు పల్లెజాతులునై యున్న" వని వ్రాసియుండినచో "గ్రంథస్థప్రదర్శనములుండఁగా... మోచేయి నాకుటవంటిది కాదే!" అని వారిచే వ్రాయఁబడిన న్యాయము వారిమెడను బడక తీరదు కాఁబట్టి రహస్యముగ వారిచెవికిమాత్రము సోఁకునట్లు వేనోళ్లఁ జాటుచు సాక్ష్య మిచ్చుచున్న (పేరులేని) చరిత్రమెద్దియో యెంతచూచినను గోచరింపక యున్నది. వీరంతగుట్టుగఁ బెట్టుకొన్న చరిత్రము పేరు తెలియక పోయినను అది యప్రామాణిక మని నిశ్చయింప నొకదారిమాత్ర మగపడుచున్నది. అదిమెద్దియన. వీరాచరిత్రమున "యదువృష్ణిభోజాంధకు లనియెడు గొల్లజాతివారికిని యవనశకపహ్లావాదులకును గలిగిన సమ్మేళనమున" అని యుండినట్లు వ్రాసినారు. యదువృష్ణిభోజాంధకులు గొల్లజాతి వా రని యెచ్చటను గానంబడదు. మఱి యేమనిన భాగవతనవమస్కంధమునఁ జంద్రవంశము రాజులను జెప్పునపుడు,

"శ్లో. యయాతే ర్జ్యేష్ఠపుత్త్రస్య యదో ర్వంశం నరర్షభ
వర్ణయామి మహాపుణ్యం సర్వపాపహరం నృణామ్
యదో స్సహస్రజి త్క్రోష్టు ర్నలో రిపు రితి శ్రుతాః
చత్వార స్సూనవ స్తత్ర శతజి త్ప్రథమాత్మజః
...తస్య పుత్త్రశతం త్వాసీ ద్వృష్ణి ర్జ్యేష్ఠం యతః కులమ్

మాధవా వృష్ణయో రాజన్ యాదవా శ్చేతి సంజ్ఞితమ్
...భజమానో భజి ర్దివ్యో వృష్ణి ర్దేవావృధోం ధకః
సాత్వతస్య సుతా స్సప్త మహాభోజ శ్చ మారిష
మహాభోజో ఽతిధర్మాత్మా భోజా ఆసం స్తదన్వయే
అంధకస్య సుతా రాజన్ చత్వారః పృథువిక్రమాః
కుకురో భజమాన శ్చ శుచిః కంబళబర్హిషః.

అని మొదలుగాఁ జెప్పఁబడినది. తద్వ్యాఖ్యలం దీకడపటి శ్లోకము క్రింద « అంధకా ఏతే వృష్ణయ ఇత్యపివ్యవహ్రియంతే » అనివ్రాయఁ బడినది. శ్రీవిష్ణుపురాణాదులందు నిట్లే చూపట్టుచున్నది. కాని యొక చోటనైనను యదువృష్ణిభోజాంధకులు గొల్లజాతివా రని కానం బడదు.

ఇట్లుండఁగా యదువృష్ణ్యాదులు గొల్లజాతివా రని యేపండితుఁడు వ్రాసెనో యేప్రమాణము ననుసరించి వ్రాసెనో పురాణేతిహాసాదివిరోధము నెట్లు పరిహరింప నెంచెనో తోఁపక యున్నది. ఒకవేళఁ బామరులగు కొందఱు గొల్లలు శ్రీకృష్ణుండు గొల్లవారియిండ్లలో వసియించుటం జేసి మేము యాదవుల మని చెప్పుకొనుచుందురు. అట్టివాని నేమైన నమ్మి యీచరిత్రమున నట్లు వ్రాయఁబడి యుండు నేమో? అటులైనచోఁ బైని పేర్కొనం బడిన మహాకవిప్రబంధ శిలాశాసనాదుల నెల్ల దిగఁద్రోచి యంత విమర్శయు లేక వ్రాసినచరిత్రమును బురస్కరించుకొని రావుగా రిట్లు వ్రాయుట « గ్రంథస్థములగు నిదర్శనము లుండఁగా ... మోచేయి నాకుటవంటిది కాదే? » అనుస్వోక్తన్యాయము ననుసరింపక తీరదు. ఇందువలననే 3_4 ఆక్షేపములు నిరస్తంబు లగును.

మూఁడవయాక్షేపము. « వెలమవారు కమ్మవారు నామాంతములను రెడ్డి యనుబిరుదవాచక పదము చేర్చుకొని వ్యవహరింపఁ

బడుచు వచ్చినను, రెడ్లకుఁ బ్రతిస్పర్ధులుగ నుండుచు వచ్చిరి. కమ్మవా రికిని గొండవీటిరెడ్లకును బద్మనాయక వెలమలకును జరిగినయుద్ధములు చరిత్రమున సుప్రసిద్ధములుగా నున్నవి. దుర్జయవంశజులు పల్లవులయి నట్లు రాజరాజుయొక్క శాసనములో « రెడ్డికులకాలపల్లవరాయ ఇతి ప్రాపయశో ఖ్యాః » అని రెడ్డికులమునకు యమునివంటివాఁ డయిన పల్లవరాయఁ డని చెప్పఁబడి యుండుటచేత స్పష్ట మగుచున్నది. ఆరాజరాజుయొక్క పై శాసనములో « ధాత్రీపతిత్వం భువిదుర్జయత్వం వర్మాంతనామాపి నరేంద్రచిహ్నమ్ '' అని నరేంద్రచిహ్నమైన వర్మబిరుదమును వహించెనివా రని చెప్పియుండుటచేతఁ బైనిఁ బేర్కొనఁబడిన పండితుల యభిప్రాయములు సరియైన వేమో యని తోఁపకపోదు. మఱియు నామాంతమున వర్మశబ్దము గలవారు శూద్ర క్షత్రియు లని పై శ్లోకము వేనోళ్ళఁ జాటుచున్నది. '' అని వ్రాయఁ బడియున్నది.

ఈయాక్షేపమునకుఁ బ్రస్తుత లగు వెలమవీరులం దన్వయము క్రిందిరీతిగ నున్నది. రాజరాజుశాసనమున రెడ్డికులమునకు యముని వంటివాఁ డైనపల్లవరాయఁ డుండె నని చెప్పినందున రెడ్లకు విరోధులు పల్లవులని యేర్పడుచున్నది. వెలములు రెడ్లకుఁ బ్రతిస్పర్ధులై యుండిరని చరిత్రములలో నుండినందున ఆపర్టుగారు పల్లవులే వెలమ లనిచెప్పుట సరియైన దగుచున్నది. ఇట్లు పై శాసనమున దుర్జయునివంశ జులు నామాంతముల వర్మబిరుదమును బెట్టుకొన్నవా రని చెప్పఁ బడినది కూడ వర్మశబ్దఘనము వెలమశబ్ద మని శేషగిరిశాస్త్రిల వారు చెప్పుటకు నిదర్శనమగుచున్నది. అని. ఇందువలన వెలమలు పల్లవులనియు వర్మశబ్దము నామాంతమునఁ బెట్టుకొన్నశూద్రక్షత్రి యులనియు ఫలితార్థము తేలఁగలదు. ఈకల్పనము సాహసైకశర ణము గా నున్నది దుర్జయవంశజులలో నెవఁడో రెడ్డికులవిరోధి

యగుపల్లవరాయఁడు కలఁడన్నమాత్రమున నావంశజులు పల్లవులగుటయు వెలమవారు రెడ్డికులమునకు విరోధులు గానుండిరనుటను బట్టి వారు పల్లవులలోఁ జేరుటయు దురూహాముగ నున్నది. కమ్మవారును రెడ్లకుఁ బ్రతిస్పర్థులై యుండిరని వారే వ్రాసియున్నారు కదా! అట్టికమ్మవారిప్రత్యభిజ్ఞకు విషయము గాక వెలమవారు మాత్రమే యెట్లయిరో తోఁపక యున్నది.

ఇట్లు దుర్జయవంశజులు నామాంతమున వర్మశబ్దముఁ దెచ్చిపెట్టుకొని యుండిరని చెప్పుటచేత వారే వెలమలని ప్రత్యభిజ్ఞ చేసియున్నారు. చాళుక్యులు కదంబులు నామాంతమున వర్మశబ్దమును పెట్టుకొన్నవా రని చెప్పినరావుగారు వారిప్రత్యభిజ్ఞకు విషయము కాకుండ నెట్లుచేసిరో తోఁపకయున్నది. ఇదియొకటి. వెలమశబ్దమునకుఁ బ్రకృతియైన వర్మశబ్దము జాతిక్షత్రియుల నామాంతముల శాస్త్రసిద్ధమైయున్నది గాక పల్లవులు మధ్యను దెచ్చిపెట్టుకొన్న వర్మశబ్దమే యని నిశ్చయించినారు. దీనికిఁ బ్రమాణము చూపఁజాలరు. గౌణముఖ్యము లగు వర్మశబ్దములు రెండున్నపుడు ముఖ్యమును వదలి యముఖ్యము నాశ్రయించుట శాస్త్రయుక్తులకు దూరముగదా!

ఇదిగాక యీశాసనమునుబట్టి దుర్జయవంశజులు పల్లవులైవారు వెలమలై యుండిరని వీరియూహ సరియైయుండెనేని రాజరాజునాఁటికి వెలమలు వర్మాంతనామములు గలిగియే యుండిరనవలయు. అట్లగునపు డక్కాలపు వెలమలు నంతకుఁ బూర్వపు వెలమలు వర్మాంత నామములతో వ్యవహరింపఁబడుచుండవలెను. అట్లులేదు. రాజరాజు పదునొకండవశతాబ్దమువాఁడు. నామిరెడ్డిబేతిరెడ్డి ప్రపితామహుఁడగు ముంజరాజు తద్వంశ మూలపురుషుఁ డగు భీమరాజు బేతాళనాయని నుండి హేమాద్రిరెడ్డి వఱకుఁ బదితరములవారు శాసనగ్రంథములందు వర్మాంతనామములు గలవారుగాఁ జూపట్టరు. అట్లగునపుడు వారే

వీరను ప్రత్యభిజ్ఞ యెటులు గలుగును? కాన నీకల్పనంబు సాహసైకశరణం బని వక్కాణించెదను.

ఇఁకొకవిశేషము. నామాంతమున వర్మశబ్దము గలవారు శూద్రక్షత్త్రియులని పై శ్లోకము వేనోళ్ళఁ జాటుచున్న దఁట. ధర్మశాస్త్రములం దట్టివారు క్షత్త్రియు లనియే యున్నది కాని శూద్రక్షత్త్రియు లని లేదు. పైశ్లోక మీయర్థమును బోధించునేమో వారు మఱియొకసారి పరిశీలింపవలసి యున్నది. ఇదిగాక శూద్రక్షత్త్రియు లనుట యుపపన్నంబు గాదు. శూద్రత్వము క్షత్రియత్వము విప్రతిషిద్ధధర్మంబులు. అయ్యవి యొక్కచోట నుండవు. తత్త్వచంద్రికలో చిదచిద్విశిష్టబ్రహ్మమున కేకత్వము చెప్పెడువారిమతముపై «నాద్యః ఏకత్వాసిద్ధేః నహివిశేషణవిశేష్య తత్సంబంధానాం త్రయాణా మేకత్వం సంభవతి శూద్రోయం బ్రాహ్మణ ఇతివ ద్విప్రతిషేధాత్ » అని వ్రాయఁబడినది. అట్లు శూద్రత్వక్షత్త్రియత్వములు గూడ విప్రతిషిద్ధధర్మంబు లగుటం జేసి యొకవ్యక్తియం దుండఁజాలవు కదా!

నాల్గవయాక్షేపము. «ప్రాచీనశాసనముల వెలమశబ్ద మెచ్చటనైనఁ గలదా» యని విచారింపఁగా మొదటి కుళోత్తుంగచోడచక్రవర్తి కుమారుఁ డైన రాజరాజచోడగంగుచే వ్రాయింపఁ బడిన టేకిశాసనములో (వెలమనూళ్ళు) లను నొకతెగవారు తెలికితెగవారిలోఁ గలరని కనుపట్టుచున్నది. తాము సహస్రశాఖాన్వయగోత్రుల మనియు మనుకులక్షత్రియుల మనియుఁ దమశాసనములలోఁ దెలికతెగవారు చెప్పుకొనుచున్నారు. ఏది యెట్టు లున్నను వెలమవారెల్లరు నొక్కతెగలోనివారు కారు. ఇట్లే రెడ్లుకూడ నొకతెగలోనివారు కారు" అని వ్రాయఁబడినది.

ఇయ్యది చూడ శకుంతలావణ్యశబ్దము విని భరతుఁడు శకుంతలను స్మరించినయట్లు వెలమనూళ్లు అనుశబ్దమును విని రావుగారు

వెలమలను స్మరించినయట్లు లున్నది. దృఢతరసంస్కార ముద్బోధక సమవధానమున విషయస్మారకము గాక మానదు కదా! వెలమనూళ్లుశబ్దగత వెలమశబ్దము నిరర్థక మని తోఁపకయే కాఁబోలు నేమో ప్రబలాధార మబ్బె నని తెలికతెగలోఁ గూడ వెలమలు గలరనియుఁ దన్మూలమున వెలమవార లెల్ల నొక్క తెగలోనివారు కా రనియు వ్రాయుచున్నారు. ఇదిగాక యీశాసన ప్రకారము రాజరాజచోడగంగునాఁటికి వెలమలు వెలమనూళ్ళని వ్యవహరింపఁబడుచుండిన ట్లుదాహరణ మగపఱచిననే రావుగారియూహ నిలుచును. అటు లగపఱుపఁ జాలరు.

ఒకవేళ «నేదియెట్లులున్నను» అనుటచేత దీనియందు దౌర్బల్యమును వారే యగపఱచి యుండఁగాఁ దన్మూలమున వెలమవా రెల్లరు నొక్క తెగలోనివాడు కా రని వ్రాసినట్లు భావించుట తప్పని యందురేని « ఏదియెట్లులున్నను » అనుటచేత నీయూహయందును « శబ్దవ్యుత్పత్తియెటులుండినను" అనుటచే వెలమశబ్దనిర్వచనమునందును పేరు వ్రాయమిచేత వెలమవారు మిశ్రజాతివారని చాటుచున్నచరిత్రమునందును దౌర్బల్యము తమయంతరంగమునకే తోఁచియున్నచో వెలమవారలెల్ల నొక్క తెగలోనివారు కారని వ్రాయుట యుచితం బని యెవరైనం జెప్పఁగలరా! ఇట్టివారు ప్రమాణప్రదర్శనప్రయాసము వెట్టుకొనక నూరక తోఁచినదూషణము లన్నియు గణపాఠముగ వ్రాసి ఇది వెలమవీరులచరిత్రము అని వ్రాసియున్న నీతంటాలెవ్వియుఁ బ్రసక్తింపకుండును.

ఇప్పు డొక్కటి తెలియఁదగినది. అగ్రిమగ్రంథమున కుపక్రమవాక్యము «పద్మనాయకులు" అని చూపట్టుచున్నది. అయ్యది యింతకుఁ బూర్వము పద్మనాయకేతరులచరిత్ర మనియు నిదిమొదలు పద్మనాయకచరిత్ర మనియు బోధించు నని సామాన్యదృష్టికిఁ దోఁచును.

ఇదివాస్తవమైనచో వెనుకఁ బద్మనాయకప్రస్తావము లేక యుండ వలెను గదా! అట్లు లేదు. మఱేమన్న "కొండవీటిరెడ్లకును పద్మ నాయకులకును జరిగినయుద్ధములు చరిత్రములందు సుప్రసిద్ధములు" అని వారికివారికి విరోధము చూపి, "రెడ్డికులకాలపల్లవరాయః" అనుదానితోఁ బద్మనాయకులకు సంబంధము కలిసి, పై పండితుల యభిప్రాయముతో నైకకంఠ్యము నుపపాదించినారు. దీనింబట్టి చూడఁగా వెనుకవ్రాసినదంతయుఁ బద్మనాయకులను గూర్చియే యన వలసి వచ్చును. ప్రకరణాదిని "వెలమవీరులు కొందఱు" అని మొదలుగ వ్రాసినవాక్యము గూడ నీయర్థమునే బలపఱచుచున్నది. కాదేని పద్మ నాయకేతరు లగువెలమలు కాకతీయులయొద్దఁ బ్రసిద్ధికెక్కినయట్లు చరిత్రములలోఁ జూపవలసి యుండును. కాఁబట్టి యీప్రకరణమంతయుఁ బద్మనాయకులను గుఱించియే వ్రాయఁబడిన దని యెన్నం దగి యున్నది.

ఇఁకఁ బద్మనాయకులచరిత్ర మఁట. రావుగారిదివఱకుఁ బ్రమాణోపన్యాసప్రయాసమును బుచ్చుకొని యుండిరి. ఇపుడు శాస లకు వచ్చిరి. చూడుఁడు "వెలమలలో నొకతెగవా రని చెప్పంబడెడి పద్మవెలమలే పద్మనాయకుల మని చెప్పుకొనుచున్నారు. స్వాతంత్ర్యకదృష్టి తోడను నిష్పక్షపాతబుద్ధితోడను విమర్శించి చూచినపక్షమునఁ బద్మ నాయకులు కేవలము వెలమలలోనుండి యేర్పడినవారుగాఁ గను పట్టరు." అని వ్రాయుచున్నారు. ఇందుఁ బ్రమాణములప్రస్తావ మెత్తికొనకయే "స్వాతంత్ర్యకదృష్టితోడను నిష్పక్షపాతబుద్ధితోడను" అని వ్రాయుచున్నారు.

ఒకవేళఁ దరువాతఁ బ్రమాణములను జూపఁగల రన్నచో ముం దీవిషయము విమర్శింపవలసి యున్నది. దీనిం గూర్చి వారేయే ప్రమాణములను జూపఁగలరో అయ్యవి పైఁ బేర్కొనంబడిన శ్రీనాథ

భీమఖండాదులకన్నను శిలాశాసనాదులకన్నను ప్రబలము లై యుండి నను వారియిష్టసిద్ధి కాఁగలదు. వానికి సమబలము లై యుండెనేని అప్పుడు పరస్పరవిరోధముచేఁ బ్రమేయసిద్ధి కానేరదు. దుర్బలము లై యుండెనేని అవి ప్రదర్శించుట నిరర్థక మని వ్రాయం బనిలేదు. వాస్తవస్థితిలో వా రగపఱచెడుప్రమాణములు నే నుదాహరించిన ప్రమాణములకన్నఁ బ్రబలములు కాని సమబలములు కాని యై యుండ వని నానిశ్చయము. ఎందుకనిన. శ్రుతిస్మృతీతిహాసపురాణములలో శ్రుతికి శ్రుతియు స్మృతికి స్మృతియు ఇతిహాసంబున కితిహాసంబును పురాణమునకుఁ బురాణంబును సమబలంబులుగా నుండును గాని శ్రుతికి స్మృతియు స్మృతికిఁ బురాణంబును మొదలుగా సమబలంబులుగావు. ఇయ్యది "శ్రుతిస్మృతివిరోధేతు శ్రుతి రేవ బలీయసీ" ఇత్యాది ప్రమాణంబువలనఁ దెలియం దగును. అట్లు ప్రసిద్ధమహాకవినిబద్ధగ్రంథముల కట్టిగ్రంథములును శాసనములకు శాసనములును సమబలములు కాఁగలవు. కాని యనామధేయపురుషప్రణీతములును బుక్కటిపురాణములును గైఫీయతులును స్వకపోలకల్పితములును సమబలములు కాఁజాలవు. కాఁబట్టి వారగపఱచెడుప్రమాణము లెవ్వియో యెంతమాత్రము విశ్వసనీయములో విచారించిన నది తేటపడఁగలదు. వారు వ్రాసినప్రథమప్రమాణ మిట్లున్నది —

"వెలుగోటివారి వంశచరిత్రమునందు వీరు నాల్గవవర్ణములో నత్యుత్తమ మైన పద్మనాయకకులమువారు. ఇందుఁ బద్మనాయకుం డనఁగాఁ బద్మబాంధవుం డగుసూర్యుఁడు. అని వ్రాయఁబడియుండియు, ఏకారణముచేతనో—లేదా పద్మనాయకుం డనఁగా పద్మపతియను రాజు...ఇట్లు కాఁగా వారు పద్మపతివలనఁ బహుకాలము జాత్యుచితసంస్కారశూన్యులై యొకతెగవారుగా నేర్పడి శూద్రప్రాయు లై యున్నందున నేకులమువారనియుఁ జెప్పుటకు వీలులేక పద్మనాయక

కులమువా రని వ్యవహరింపఁబడుచు వచ్చిరి...పద్మనాయకకులము యొక్క యుదంతి మెఱుంగకయే నాల్గవవర్ణములో నత్యుత్తమమైన దని వ్రాయుటయు వింతగ నున్నది. చతుర్థవర్ణములోఁ జేరిన తక్కిన శాఖలవారికంటె నెట్లుత్తమమైనదో ప్రమాణములు చూపింపకపోవుట వలన సందేహమో విశేష ముండెనని బోధపడక పోదు. రావువంశీయచరిత్రమునందు—ఏకులమువా రనియుఁ జెప్పుటకు వీలులేక పద్మనాయకకులమువా రని వ్యవహరింపఁ బడుచువచ్చి రని తేటతెల్లము సేయుచుండ వేఱుగ వ్యాఖ్యాన మేల ?" అనువఱకుఁ గలగ్రంథము.

ఇదంతయుఁ బ్రమాణభ్రాంతితో వ్రాసినవ్రాఁతయ కాని ప్రమాణము గాదు. ఇందు « ఏకులమువా రనియుఁ జెప్పుటకు వీలులేక పద్మనాయకకులమువా రని వ్యవహరింపఁ బడుచువచ్చిరి " అనునది వీరికి ముఖ్యప్రమాణముగఁ దోఁచినది. కాఁబట్టియే క్రిందగీరగీసి చూపినారు. దీని పూర్వోత్తరసందర్భముఁ బరిశీలించి యుండినచో నిట్లు వ్రాయరు. దీనికిఁ బూర్వసందర్భమున « అతఁడు (మహాపద్మపతి) సూర్యచంద్రవంశజు లగురాజులను...కారాగృహమున నుంచె ... ఇట్లు కాఁగా వారు పద్మపతివలన బహుకాలము జాత్యుచితసంస్కారహీనులై యొకతెగవారుగా నేర్పడి శూద్రప్రాయులై యున్నందున " అని వెలుగోటివారి వంశచరిత్రలోను,

« కారాగృహే వర్తమానా స్స్వాచార పరివర్జితాః
క్షత్రివేషవిహీనాశ్చ శస్త్రాస్త్రపరివర్జితాః
స్నానసంధ్యావిహీనాశ్చ హోమకర్మవివర్జితాః
వేదోక్తాచారహీనాశ్చ శూద్రాచారైకతత్పరాః
శూద్రాసీతోదకం సమ్యగ్గృహ్యమాణాశ్చ భూమిపాః
మత్స్యమాంసాదనాశ్చైవ శూద్రా ఇవ శిఖావృతాః
నందస్యచ నమస్కారం కృత్వాముక్తాశ్చ తేనవై

నియోజితాశ్చ తేనైవ నందేనైవ దురాత్మనా
...వింధ్యస్యదక్షిణేభాగే సముద్రప్రాంతమంక్షితాః
కళింగాంధ్రవిదర్భాంగదేశా నాగత్యభూమిపాః
తదాదిభూమిపాలాశ్చ సూర్యసోమసముద్భవాః
పూర్వోక్తేన ప్రకారేణ భవిష్యంతి న సంశయః "

అని మార్కండేయ పురాణవచనములు రావువంశీయచరిత్రలోను వ్రాయఁబడియున్నవి.

వీనింబట్టి పద్మపతివలనఁబరాభూతులై స్వకర్మపరిభ్రష్టులై యప్పటి సందర్భమునుబట్టి పద్మనాయకకులము వారని వ్యవహరింపఁబడుచు వచ్చినవారుసూర్యచంద్రవంశజులగు క్షత్రియులని యెట్టివారికినిబోధపడకపోదు. అట్లుండినవారెవరో వారు సూర్యచంద్రవంశపురాజులై నందునవారే యీపద్మనాయకులని చెప్పినపుడు వీరిజాతి కేమి యపకర్ష రాఁగలదు? క్షత్రియత్వరూపవస్తుస్థితికి భంగము లేదుకదా! ఇంతమాత్రమున రావుగారు పద్మనాయకకులమున కెద్దియో యపకర్ష ఘటిల్లునని తలంచి యీవాక్యమును దెచ్చి క్రింద గీరగీసి చూపుట పూర్వోత్తర సందర్భార్థపరిజ్ఞానము లేక యసమంజసము గాక మానదు.

ఇంకొకవింత. రావువంశీయచరిత్రమునందు " ఏకులమువారనియుం జెప్పుటకు వీలులేక...వచ్చి రని తేట తెల్లము సేయుచుండ వేఱుగ వ్యాఖ్యాన మేల " అనివ్రాసినారు. ఈవాక్యమాగ్రంథములోనే లేదు. ఇట్టిదాని నాగ్రంథస్థముగా నెట్లు వ్రాసిరో తోఁపక యున్నది. వెలుగోటివారివంశచరిత్రమునందు అని వ్రాయఁబూని పొరపాటున నిట్లు వ్రాసిరో ముద్రణప్రమాదమో తెలియరాదు.

ఇంతకన్న నింకొకవింత. రావువంశీయచరిత్రమున మార్కండేయపురాణస్థములుగా వ్రాయఁబడినపద్మపతికి సంబంధించిన పైశ్లోకముల నన్నిఁటిని వ్రాసి తరువాత "దీనినంతయుఁ జదివిసపిమ్మట శూద్ర

వేషధారులగు క్షత్త్రియులు కొందఱున్నట్లుగా గ్రహింపఁగలరు. అట్టివారాంధ్రాది దేశములలోనే స్థిరపడిన ట్లుండుటం బట్టి వారీపద్మనాయకులను నామమున నుండినశాఖవారుగా ననుమానింపఁబడుదురు. అట్లుకారనువారట్టివారు మఱియొకరున్నారని చెప్పఁగలరేమో యోచించి చెప్పంగోరెదము" అని గురుజాడ శ్రీరామమూర్తిగారు వ్రాసియున్నారు" దానింజూచి రావుగారు "రావువంశీయ చరిత్రకారునకుఁ గూడ సంశయము తోఁచి స్పష్టముగఁ జెప్పఁజాలక... అనుమానింపఁబడుదురు. అని వ్రాసినా" రని క్రింద గీఁగీసి చూపినారు.

ఈవ్రాఁత ఆపదమునకుఁగలపూర్వోత్తరసందర్భము లెవ్వియో దాని నిట గ్రంథకర్త యేయభిప్రాయమున వ్రాసియున్నాఁడో యెట్లు సమన్వయించునో అనునవి విచారింపక వ్రాసినట్లు తెల్లంబగుచున్నది. వారు వ్రాసినపూర్వోత్తరసందర్భములను బట్టి చూడఁగా, అట్టిశూద్రవేషధారులైనక్షత్త్రియు లాంధ్రాదిదేశములలోనె స్థిరపడిన ట్లుండుట వలనను అట్టివారీపద్మనాయకులు గాక మఱియొకరు లేకపోవుటవలనను ఈపద్మనాయకనామముగలవారే పైపురాణములోఁ జెప్పఁబడిన శూద్రవేషధారులగుక్షత్త్రియులని యనుమానింపఁబడుదురు. అనఁగా అనుమానప్రమాణముచే వీరుగానే స్థిరపడుచున్నారు అనునర్థమగుచున్నది. కాఁబట్టి యిట ననుమానమనునది "ప్రత్యక్షానుమానోపమానశబ్దాః ప్రమాణమ్" అనుసూత్రోక్తము లగునాలుగు ప్రమాణములలో నొక్కటి. ప్రమాణ మనఁగాఁ బ్రమాకరణము. ప్రమ యనఁగా యథార్థజ్ఞానము. శ్రీరామమూర్తిపంతులుగారు శాస్త్రసిద్ధార్థమునెఱింగియే యిట ననుమానింపఁబడుదురు అని వ్రాసినారు. దీనికిట్టియర్థముండఁగా వీ. రావుగారు "రావువంశీయచరిత్రకారునకుఁ గూడ సందియముతోఁచి స్పష్టముగఁ జెప్పఁజాలక" అని వ్రాయుట చూడ నీయర్థము బోధపడక వ్రాసినట్లు తెల్లము గాకపోదు. ఆగ్రంథకర్తకు

సంశయార్థమే యభిమతమై యుండినచోఁ "అట్లు కాదనువారు అట్టి వారు మఱియొక రున్నా రని చెప్పఁగలరేమో యోచించి చెప్పం గోరెదము" అని యుత్తరవాక్యమును వ్రాయరు. ఇట్లు వ్రాసిన శ్రీరామమూర్తిగారికి అట్టివారిపద్మనాయకులే కాని యన్యులు గా రని నిశ్చయమున్నట్లు తేటపడుచున్నది. కాని వారో మఱియొకరో అని వారికి సంశయమున్నట్లింతమాత్ర మేర్పడదు. కాఁబట్టి యింత మాత్రము పూర్వోత్తరసందర్భములను గనిపెట్టి గ్రంథకర్తయభిప్రాయ మిటు లుండునని నిర్ధారింపక "రావు...సంశయము తోఁచి స్పష్టముగఁ జెప్పఁజాలక" అని వ్రాయుట యెంతో వింతగా నున్నది.

ఇదిగాక సంశయమునకు నిశ్చయమునకు నెంతో భేదము గలదు. సంశయమనునది విరుద్ధకోటిద్వయావగాహిజ్ఞానము. స్థాణువా పురుషుఁడా అనుచోటఁ బరస్పరవిరుద్ధంబు లగు (ఒకటి యుండిన చోట మఱియొకటి యుండనట్టి) స్థాణుత్వము పురుషత్వము చేరి యుండుటను బట్టి యది సంశయంబునాఁ బరఁగు. ఇట్లగుటవలన శ్రీరామమూర్తిగారివాక్యములు వారికి సంశయమున్నట్లు తెలుపునా? నిశ్చయమున్నట్లు తెలుపునా? అని విచారించినచో నెట్లేర్పడఁ గలదో కొంచెము చూచి యావల రావుగారి వ్రాఁత యోగుబాగుల నిర్ధారింతము. శ్రీరామమూర్తిగారివాక్యము లిటులున్నవి. "అట్టివా రాంధ్రాదిదేశములలోనే స్థిరపడి యుండినట్లు చెప్పినందున వారిపద్మ నాయకనామమున నున్నవారుగా ననుమానింపఁబడుదురు" అని.

ఇందుఁ బద్మనాయకులుగా ననుమానింపఁబడుదురని యేక కోటియే యున్నది కాని పద్మనాయకులా మఱియొకరా యని కోటిద్వయము లేదు. దీనిహేతువాక్యము చూచిన నేకకోటిసాధక ముగనే యున్నది. అయ్యది ఆంధ్రాదిదేశములో వసించి శూద్రవేషము ధరించి పద్మనాయకపదముతో వ్యవహరింపఁబడుట యనునది. ఇవి

రెండు హేతువులు గా నెంచినను విరుద్ధకోటిసాధకములు గావు. దీని యనంతరము “అట్లు కా దన్నవా రట్టివారు మఱియెవ్వరైనఁ గల రేమో యోచించి చెప్పఁ గోరెదము” అని వ్రాయఁబడినవాక్యము చూచినను నిశ్చయమునే స్థిరపఱచుచున్నది. సంశయ మున్నవారు “ఇట్టివారు మఱియొక రుండిన నుండవచ్చు” నని కదా వ్రాయుదురు. వీని నన్నింటిని బట్టి చూడఁగా రావువంశీయులచరిత్రగంథకర్తలు పైవాక్యము తమనిశ్చయము దెలుపుటకై వ్రాసినవారే కాని సంశయమును దెలుపుటకుఁ గా దని ప్రాజ్ఞు లెఱుంగఁగలరు.

ఇట్లుండఁగా మనరావుగారు “రావువంశచరిత్రకారునికిఁ గూడ సందియము తోఁచి స్పష్టముగఁ జెప్పఁజాలక యనుమానింపఁబడుదురు అని వ్రాసినా” రని క్రింద గీర గీసి వ్రాయుట స్వాజ్ఞానప్రకటనమునకే గాని వేఱు గాఁ దోఁపదు. ఇట్టియపార్థములను అసదర్థములను బ్రోవు చేసికొని వెలుగోటివారివంశచరిత్రము రావువంశీయచరిత్రములలోని కొన్నివాక్యములు స్వాభీష్టము నీడేర్చునన్న సంపూర్ణవిశ్వాసముతో “సత్యైకదృష్టితోడను నిష్పక్షపాతబుద్ధితోడను... గనుపట్టదు” అని నిశ్శంకముగాఁ బ్రకటించుట వీరిపాండిత్యప్రతిభలను ధైర్యసాహసములను గ్రంథరచనోచితజ్ఞతను వేనోళ్ళఁ జాటుచున్నదని వేఱుగ వ్రాయ నక్కఱలేదు. ఇందువలన “పద్మనాయకు లొకప్పుడు” అని మొదలు 275 పేజీలో “లేశమాత్రము సంశయము లేదు” అనువఱకుఁ గలరావు గారిద్వితీయ ప్రమాణగ్రంథము దత్తజలాంజలి యైనది.

ఈమూఁడుపేజీలమధ్యను నిరసింపఁ దగినవిషయములు కొన్ని గలవు. అయ్యవి “పద్మనాయకుఁ డనఁగాఁ బద్మబాంధవుఁ డగుసూర్యుఁడు అని వ్రాసియు, నేకారణముచేతనో, లేదా పద్మనాయకుఁ డనఁగా బద్మపతియనురాజు అని వ్రాసినా” రనియు “పద్మనాయకుఁ డనుఁ వాఁడెవ్వఁడో వీరికి బోధపడలే దని పైవాక్యములను బట్టి తెలి

యుచున్నది" అనియు "వెలమకులము వారికందఱకుఁ బద్మనాయకుఁడు మూలపురుషుఁ డని చెప్పుటకుం గతియాధార మెయ్యదియుఁ గానం బడదు" అనియు "పద్మనాయకకులముయొక్క యుదంత మెఱుంగకయే నాల్గవవర్ణములో నత్యుత్తమ మైనదని వ్రాయుటయు వింతగా నున్నది" అనియు "చతుర్థవర్ణములోఁ జేరినతక్కినశాఖలవారికంటె నెట్లధిక మైనదో ప్రమాణములుచూపింపకపోవుట వలన నం దేద్దియో విశేష ముండె నని బోధపడక పోదు" అనియు, "పద్మనాయకు లొకప్పుడు క్షత్త్రియులుగా నుండిశూద్రు లై పోయి రని తెలుపుచు నందులకుఁ బ్రమాణముగా ననేకక్షత్త్రియులు శూద్రు లై పోయి రని పురాణములలోనికొన్ని వాక్యములనుబ్రకటించిరి. అయ్యవి...వసిష్ఠకౌండిన్య ధనంజయకాశ్యపగోత్రజాతులైన రాచవారినిగూర్చి చెప్పఁబడినవాక్యములు గాని పద్మనాయకులనుగూర్చి చెప్పినవికావు" అనియు, "ఇట్టి వలిశూద్రులు క్షత్త్రియులై రనుటకుఁ గారణము వర్ణాశ్రమధర్మములోఁ జేరినకులముచేతఁ గాక క్షాత్త్రమును దాల్చి భూమిని జయించి పాలించుటయని చెప్పవచ్చును. అట్టివారు పదునెనిమిదిజాతులలోను గూడ నుండి రనుటకు లేశమాత్రము సంశయము లేదు" అనియు నేడు విషయములు గలవు.

ఇందు "వ్రాసియుండియు నేకారణముననో" అనుమొదటి విషయము విమర్శింపఁ బడుచున్నది. ఇట్లు రావుగారు వ్రాయుట కేమి కారణమో తెలియదు. ఒకవేళఁ బ్రకారాంతరావలంబనమున నర్థభేద మున్నచోఁ బూర్వార్థము పొసంగదని కాఁబోలు వారే ప్రకారాంతరము నవలంబించినా రని వ్రాసినను వ్రాయవచ్చును. అట్లు లేదు. పక్షద్వయమునను బద్మనాయకులు తొలుత క్షత్త్రియు లనువివక్షితార్థమునకు భంగ మేమియు లేదు. "తదాది భూమిపాలాశ్చ సూర్యసోమ[illegible]ముద్భవాః" అనికదా తత్ప్రకరణస్థమార్కండేయపురా

ణవాక్య మున్నది. భిన్నార్థములందుఁ బోలె సమానార్థములందును వ్యుత్పత్తిభేదాశ్రయణము సంప్రదాయసిద్ధముగనున్నది. కాన "నేకారణముచేతనో" యని వ్రాయుట కవకాశము లేదు. దీనిపైఁ బూర్వసమాసమున సూర్యవంశక్షత్రియులనియు నుత్తరసమాసమున సూర్యచంద్రవంశక్షత్రియు లనియు నర్థభేదము కల దన్నయాక్షేపము తోఁచును. అటులైనను క్షత్రియు లనుమాయుద్దేశ్యమునకు భంగము లేదు. ఇదిగాక ద్వితీయసమాసమున సూర్యచంద్రవంశజు లని యర్థమైనను ప్రథమసమాసానుగుణముగ నందలి సూర్యవంశక్షత్రియు లనునర్థమును గ్రహించుటయం దేమియు విరోధ ముండదు. నానార్థకస్థలములోఁ బ్రకరణానుగుణం బగునర్థమును గ్రహించుట శాస్త్రసమ్మతం బైయున్నది. కాఁబట్టి రావుగా రట్లు వ్రాయుట యుచితంబు గాదు.

ఇఁక "పద్మనాయకుఁ డనునాతఁ డెవ్వఁడో వీరికిఁ బోధపడలే" దనునది విమర్శింపఁ బడును. వెలుగోటివారి వంశచరిత్రములో "పద్మనాయకుఁ డనగాఁ బద్మబాంధవుఁ డగుసూర్యుఁడు. లేదా పద్మపతి యనురాజు" అనువాక్యములు పద్మనాయకుఁడు సూర్యుఁడో పద్మపతి యనురాజో కాఁదగు నని తెలుపుచుండఁగా రావుగారిట్లువ్రాయుట యనుచితంబు. ఒకవేళ నాపదమున కాయర్థములు కావని నిశ్చయమున్నయెడల నెటులు కావో తత్ప్రకారము నిరూపించి యిందువలన వీరికిఁ బద్మనాయకుఁ డనువాఁ డెవ్వఁడో బోధపడలే దనివ్రాయుట సముచితంబుగా నుండెడి. అట్లు నిరూపించినవారు కారైరి. ఒకవేళ 28వ పేజీలోఁ బద్మఁ డనఁగా బ్రహ్మనాయనియన్నయగు బాదన్న. అతఁడు నాయకుఁడుగాఁ గలవారు పద్మనాయకు లని వ్రాయఁబోవుచున్నారు. అధర్మసూక్ష్మము వీరికి బోధపడలేదని యాశయ ముండును కాఁబోలు. అయ్యది యవిచారసిద్ధ మని తరువాత నిరూపింపఁగలను.

ఇఁక "వెలమకులమువారి కందఱకుఁ బద్మనాయకుఁడు మూల పురుషుఁ డని చెప్పుటకుం గలయాధార మెయ్యదియుఁ గానంబడ" దనునది విమర్శింపఁబడును. స్థూలదృష్టి కీయాక్షేపము తోఁచినను విమర్శించి చూచిన దీని కవకాశము కానరాదు. ఎందుకనిన. సామాన్యవాచకశబ్దములకుఁ బ్రకరణాదులను బట్టి కొన్నిచోటుల విశేషపర్యవసానము చూపట్టుచున్నది. ఉద్యానప్రదేశమున నుండి వృక్షము లన్నియుఁ గడు శోభిల్లుచున్న వని ప్రయోగించినపుడు వనప్రదేశము ననుసరించి యీవనమున నున్నవృక్షము లన్నియు నని సామాన్యవాచక మగువృక్షశబ్దమునకు నన్నిశబ్దమునకును విశేషపర్యవసానమనుభవసిద్ధమై యున్నది. అట్లు వెలుగోటివారిచరిత్ర మనుప్రకరణమును బట్టి వెలమలందఱు అనుచోటి సామాన్యవాచక మగు వెలమపదము అందఱు అనుసర్వనామపదము పద్మనాయక వెలమలందఱు అని విశేషపర్యవసాయి యగుచున్నది. ఇదిగాక "కులమువా రందఱు పద్మనాయకకులమువా రని వ్యవహరింపఁ బడుచున్నారు" అను నుత్తరవాక్యసందర్భమును బట్టి యెవరు పద్మనాయకకులమువా రని వ్యవహరింపఁ బడుచున్నారో ఆకులమువా రందఱు ఆవెలమవా రందఱు అనియర్థము సిద్ధ మగుచున్నది. ఇయ్యది ఛాగపశున్యాయసిద్ధ మగువిషయము. ఇందువలనఁ బైదోషము ప్రసక్తింపదు.

ఇఁక "పద్మనాయకులయొక్క యుదంత మెఱుంగకయే నాల్గవవర్ణములో నత్యుత్తమ మైనదని వ్రాయుట వింతగా నున్నది. చతుర్థవర్ణములో... బోధపడక పోదు." అనునవి విమర్శింపఁ బడును.

వీనింగూర్చి మొదలిది తెలియఁ దగియున్నది. ఇపుడు రావుగారు పద్మనాయకులు చతుర్థవర్ణమువా రనుటను గూర్చియు ఆవర్ణములో వీ రత్యుత్తము లనుటను గూర్చియు విప్రతిపన్ను లైనట్లుతోఁచెడి.

మొదటిపక్షమునకు వెనుక నుదాహరింపఁబడిన గ్రన్థములు శాసనములు మొదలగునవి యే చాలినంత సమాధానము లగుచున్నవి. రెండవ దానికిఁ బంటవారిని వర్ణింపఁబూని తద్విరుద్ధకోటిలో నున్న పద్మనాయకుల నాదియందుఁ జెప్పిన శ్రీనాథమహాకవి యే సమాధానము చెప్పఁగలఁడు. శూద్రులలో నుత్తములు గా గణింపఁ బడుచున్న కమ్మ కాఁపు మొదలగు తెగలవారలలో నగ్రగణ్యులు గఁ బద్మనాయక వెలమలను జెప్పినందున వారలయం దెద్దియో విశేష ముండునని బోధపడక పోదు కదా! అయ్యది తక్కిన శాఖలవారికన్న నత్యుత్తమత్వమే కాఁదగి యున్నది. మఱియుఁ జతుర్థవర్ణములో వీరత్యుత్తములనుట కింకొక నిదర్శన మున్నది. వీరలయందుఁ బద్మజశబ్దము ప్రయోగింపఁ బడుచున్నది. అయ్యది వీరు భగవత్పాదపద్మమునజన్మించుటం జేసికలిగినది. శూద్రులందఱును హరిపాదపద్మజు లయి యుండినను వారలయం దాశబ్దము ప్రయోగింపఁబడక వీరియందే ప్రయోగింపఁబడుటవలన వీరలయం దెద్దియో విశేష ముండునని బోధపడకపోదు. అదియే వీరుత్తములనుటకుఁ నిదర్శనము.

ఈవిషయములో రావుగారు 278 వ పేజీలోఁ గ్రిందివిధముగ నాక్షేపించినారు. "విష్ణువుయొక్క పాదపద్మమునందు జన్మించుటచేతనే వీరికిఁ బద్మజు లనిపేరు గలిగిన దనియు నందువలననే పద్మనాయకు లనునామము వహించి రనియుఁ జెప్పుట సయుక్తికముగాఁ గనుపట్టదు. ఎందుకనిన. విష్ణుపాదోద్భవసంభవులమని కమ్మవారు పంటరెడ్లు మొదలగు తెగలవారెల్లరును జెప్పుకొనుచున్నవారయినను వారలకుఁ బద్మనాయకులను పేరు గ్రంథములను వినంబడదు." అని. ఇది శబ్దశక్తిస్వభావమును దెలియక వ్రాసిన వ్రాఁతగా నున్నది. శబ్దశక్తి, యోగము రూఢి యోగరూఢి అని ముత్తెఱంగులై తన్మూలమున శబ్దములు యౌగికములు రూఢములు యోగరూఢములు అని త్రే

భాభిన్నములై యుండును. అందు యౌగికములు పాచకాదిశబ్దములు. రూఢములు డిత్థాదిశబ్దములు. యోగరూఢములు పంకజాదిశబ్దములు. యోగమనఁగా నవయవశక్తి రూఢియనఁగా సముదాయశక్తి, కాఁబట్టి యీ రెంటితోఁ గూడినపంకజాదిశబ్దములు తదుభయార్థములను జెప్పును. అనఁగాఁ బంకజశబ్దమునకుఁ బంకజనికర్తృత్వము పద్మత్వము రెండును బ్రవృత్తినిమిత్తము లగుచున్నవి. అందువలనఁ బంకజనికర్తయైనపద్మము అనునర్థము వచ్చుచున్నది. దీనింబట్టి మత్స్యమండూకాదులు జలజములు పంకజములు నైనను వానియందుఁ బద్మత్వము లేమింజేసి జలజపంకజశబ్దము లందుఁ బ్రయోగింపఁ బడక తదుభయముగల పద్మమునందే ప్రయోగింపఁ బడుచున్నవి. అట్లు పద్మజపదము యోగరూఢము. ఇందు యోగార్థము హరిపాదపద్మజనికర్తృత్వము రూఢ్యర్థము పద్మనాయకత్వము, ఏతదుభయము పద్మనాయకులయందే యున్నది కాఁబట్టి పద్మజశబ్దము వారలయందే ప్రయోగింపఁబడుచున్నది. ఇదియు మండూకాదులకన్నఁ బద్మమునందుఁ బోలె నితరులకన్నఁ బద్మజులందుఁ బ్రాశస్త్యమును బట్టి రూఢంబై యుండఁగలదు కానఁ బైయాక్షేపమున కవకాశము లేదు.

ఇదంతయు వీరభద్రరావుగా రెఱింగియున్నచో "పద్మనాయకులయుదంత మెఱుంగకయే నాల్గవవర్ణములో సత్యుత్తమమైన" అని మొదలుగాఁ దమ యెఱుంగమిని బరులయం దారోపింపరు.

ఇఁక నైదవవిషయము విమర్శింపఁబడును. అది యిటులున్నది. "పద్మనాయకు లొకప్పుడు క్షత్త్రియులుగా నుండి శూద్రులైపోయి రనుటకుఁ బ్రమాణముగ ననేకక్షత్త్రియులు శూద్రులైపోయి రని పురాణములలో నుండి కొన్నివాక్యములను బ్రకటించి యుండిరి. అయ్యవి వీరిని గుఱించి వ్రాయఁబడినవి కావు.

" వసిష్ఠకౌండిన్యధనంజయానాం
గోత్రోద్భవాః కాశ్యపగోత్రజాతాః
శూద్రా ఇహాత్యంతగృహీతవేషాః
భూపా భవిష్యంతి కలౌ యుగేస్మిన్ "

అని వసిష్ఠకౌండిన్యధనంజయకాశ్యపగోత్రులగు రాచవారిని గూర్చి చెప్పఁబడిన వాక్యములు గాని పద్మనాయకులను గూర్చి చెప్పఁబడినవి కావు" అని.

ఇది నిరాధారము. పై శ్లోకమే దీని కాధారమన్న నది సందర్భవశమునఁ బద్మపతిపరాభూతులై నయాగోత్రముల రాజులు కలిలో శూద్రప్రాయు లగుదురని గూఢముగ బోధించుచున్నది. పద్మనాయకు లట్టివారు కారనిగాని రాచవారే యట్టివారనిగాని బోధింపదు. "ఇట్లగునప్పుడు వీరివిషయములనుగూర్చి ప్రమాణము వ్రాయకపోవుటవలన సందేహమో విశేషముండెనని బోధపడకపోదు" అని స్వోక్తికవకాశము గలుగఁ గలదు. కాఁబట్టి యాశ్లోకము పద్మనాయకులను గూర్చి చెప్పఁబడినది కాదనుటకును రాచవారిని గూర్చి చెప్పఁబడిన దనుటకును రావుగారు ప్రమాణప్రదర్శనము చేయుట యావశ్యకంబు.

ఇదిగాక నిందు "అనేకక్షత్రియులు శూద్రులై పోయి రని పురాణములలో నుండి కొన్ని వాక్యములను బ్రకటించిరి" అను నుపక్రమవాక్యమును "అయ్యవి... రాచవారిని గూర్చి చెప్పఁబడిన వాక్యములు" అను నుపసంహారవాక్యమునుజూడఁగా క్షత్త్రియులు కలిలో జాత్యంతరములలోఁ జేరిరని చెప్పెడు పురాణవచనము లన్నియు రాచవారినిగూర్చియే ప్రవర్తించినట్లు రావుగారిసమన్వయము కానవచ్చుచున్నది. ఇట్లగుచో బ్రాహ్మణాదివర్ణములలో క్షత్త్రియులు చేరిరను భాగవతాదివచనములు విరోధింపఁగలవు.

ఒకవేళ రాచవారిలోను దళితరులలోను ప్రవేశించి రన్నచో నాయితరులు పద్మనాయకులు గూడఁ గావచ్చును గదా! అపుడు రావుగారికి స్వప్రతిజ్ఞాహానియు, స్వానిష్టప్రాప్తియు ఘటిల్లును.

ఇదిగాక యీ వచనము లన్నియు వసిష్ఠాదిగోత్ర చతుష్టయము గలరాచవారిని గూర్చినవే యన్నచో క్షత్రియు లందఱు నీనాలుగు గోత్రములవారే నైయుండి రని యేర్పడఁగలదు. ఆక్షత్రియులు కలిలో రాచవారగునపుడు పూర్వగోత్రములతోడనే వైయుండవలెఁ గదా! కానిచోఁ బూర్వగోత్రపరిత్యాగమునకు నూతనగోత్ర స్వీకారమునకుఁ బ్రమాణము చూపవలసి వచ్చును. మఱియు నాక్షత్రియులే యీరాచవా రని ప్రత్యభిజ్ఞ చేయుటకు గోత్రములు గాక యితరములు హేతువులు గావలసివచ్చును. కాఁబట్టి పూర్వగోత్రములతోడనే రాచవారై రననలయు. అట్లగునపుడు సూర్యచంద్రవంశజులైనక్షత్రియు లందఱు నీనాల్గుగోత్రములు గలవారే యని యేర్పడఁ గలదు.

“ ఇక్ష్వాకూణా మయం వంశ స్సుమిత్రాంతో భవిష్యతి
సోమవంశం కలౌ నష్టం కృత్వాఙ్గా స్థాపయిష్యతి
నందాంతం క్షత్రియకులం వేదవైదిక సంయుతమ్ ”

ఇత్యాదివచనములు కలిలో సూర్యసోమవంశజు లందఱు క్షత్రియులు జాత్యంతరు లగుదు రని చెప్పుచున్నవి కదా! ఇట్లగునపు డితరగోత్ర క్షత్రియబోధకవచోవిరోధము గూడ వచ్చును.

ఇదిగాక యిందువలనరాచవారెల్లరు నీనాలుగుగోత్రములవారె యని యేర్పడఁగలదు. ఇట్లయిననే కదా పైనాలుగుగోత్రముల క్షత్రియులే యీరాచవా రనుప్రత్యభిజ్ఞ నిలుచును. పూర్వము క్షత్రియులగోత్రములు వేఱు, ఇపుడు రాచవారిగోత్రములు వేఱు అయినచో

నీ ప్రత్యభిజ్ఞకు జీవాతు వెద్దియు లేకపోవును. కాన రాచవారు నాలుగు గోత్రములవారే యని యొప్పక దప్పదు. అట్లగునపుడు ప్రత్యక్షవిరోధము ఘటిల్లును. రాచవారి నాలుగుగోత్రములవారు కాక యనేకగోత్రములవా రగపడుచున్నారు కదా!

ఇదిగాక యీవచనమున "శూద్రా ఇవాత్యంతగృహీతవేషాః" అని చెప్పినందునఁ బైనాలుగు గోత్రములక్షత్త్రియులు కలిలో నిక్కలి శూద్రవేషమును ధరించి యుండఁగల రని తేలుచున్నది. వారివారియనుష్ఠానక్రమ మెటులున్నను బూర్వకాలమున నేమి యిప్పటికాలమున నేమి ద్విజులనుటకు యజ్ఞోపవీతము ముఖ్యమైన గుర్తుగానున్నది. కువలయానందమున "విశ్వప్రసిద్ధతరవిప్రకులప్రసూతే ర్యజ్ఞోపవీతవహనం హి న ఖ ల్వపేక్ష్యమ్" అనునది గూడ ద్విజుఁడనుటకు యజ్ఞోపవీతము గొప్పగుర్తని తెలుపుచున్నది కాని వేఱు కాదు. సాధారణముగ లోకమునఁ బగలువేషకాఁడు కూడ ద్విజునివేషమును దాల్చునపుడు యజ్ఞోపవీతమును ధరించి వచ్చును. కాఁబట్టి శూద్రవేషధారణమునకు యజ్ఞోపవీత ముండఁగూడదు. రాచవారు యజ్ఞోపవీతములను ధరించి వైదికమంత్రములతోఁ గర్మములు జరుపుకొనుచు నిప్పటికి క్షత్త్రియు లని ప్రసిద్ధిఁ గని యున్నారు. అట్టి వారు "శూద్రా ఇవా త్యంతగృహీతవేషాః" అనునీవచనమునకు లక్ష్యము లెటులు కాఁగలరు? కాన నీయూహ నిలువఁ జాలదు.

ఇదిగాక రాచవారు పద్మసతికి సంబంధించినక్షత్త్రియు లని చెప్పినచో మఱియొకయనర్థము ఘటిల్లుచున్నది. చూడుఁడు. వీరీవదవప్రకరణమున 284 - 285 వ పేజీలలో "బ్రహ్మనాయనియన్న బాదన్న యని పల్నాటివీర చరితమున వ్యవహరింపఁ బడినది. బాదన్న యనునది పద్మన్న యనుపేరికి వాడుకగా వ్యవహరింపఁ

బడిననామము, కాఁబట్టి బ్రహ్మనాయని యన్నయగు పద్మఁడు నాయకుఁడు గా గల కులమని చెప్పవచ్చును. కాని మార్యుఁ డగుపద్మఁడు నాయకుఁ డని చెప్పినచోఁ బొసఁగ నేరదు. ఆ పద్మఁడు పద్మసాలె కులమునకు సంబంధించినవాఁడుగఁ గన్పట్టుచున్నాఁడు"

అని వ్రాసినారు. అయ్యది దీనికి విరోధించును. ఒకచోటఁ బద్మపతి రాచవారికి సంబంధించినాఁ డనియు నొకచోటఁ బద్మసాలెలకు సంబంధించినాఁ డనియుఁ జెప్పినచో విరోధము తప్పదు కదా! మఱియు బాదన్నకుఁ బద్మన్న యనుపే రుండె ననుట నిరాధారము. పల్నాటిచరిత్రములోఁ గాని మఱి యెచ్చోటఁ గాని బాదన్న కానామ మున్నట్లు చూపకయె "వాడుకగా వ్యవహరింపఁబడుచున్న నామము" అని వ్రాయుట వింతగా నున్నది. ప్రమాణము లేనట్టి వీరియూహ నిలువ దని వ్రాయఁ బనిలేదు. ఇదిగాక బ్రహ్మనాయఁడు పైచరితములో విష్ణ్వంశసంభూతుం డని వ్రాయఁబడి లోకోత్తరకృత్యము లొనర్చి యిప్పటికిని బూజింపఁబడుచున్నవాఁడు. అట్టి ప్రసిద్ధపురుషుఁ డొకవేళ కులపతి యై యుండు నని చెప్పినం జెప్పవచ్చును గాని యేప్రసిద్ధి లేక యగస్త్యభ్రాత యనునట్లు బ్రహ్మనాయనియన్న యని యనే తెలియఁదగిన బాదన్న కులపతి యని యెట్లు చెప్పవచ్చును? కాన నీకల్పనము నిస్సారము.

ఇదిగాక వీరు 278 పేజీలో "శ్రీనాథకవి తనభీమఖండములో వెలమలు గమ్మలు ఒంటరులు మొదలగువారల నెల్లరను పద్మనాయకు లని చెప్పినట్లుగా నాకడ నున్న ముద్రితప్రతిలో నున్నది." అని వ్రాసినారు. వీరిమతములోఁ బద్మఁడు పై బాదన్న యేకదా! అతఁడు కమ్మవారికిఁ బంటవారికి సరిసర్లకు నాయకుఁడు (కులపతి) అని చెప్పవలసి వచ్చును. వారలు వేర్వేఱు తెగలవా రగుట ప్రసిద్ధము. రెడ్లకు వెలమలు ప్రబలవైరు లని వారే వ్రాసియున్నారు. ఇట్టిస్థితిలో

బాదన్న పైతెగలవారి కెల్ల నాయకుఁ డెట్లగునో తోఁపక యున్నది.

ఇంతేగాక రావువంశీయచరితము 46 పేజీలో శ్రీరామమూర్తిగారు " తద్వంశమునకు (అప్పారావుగారి వంశమునకు) మూలపురుషుఁడగు బసవన్న యనునతఁడు కాకతిప్రతాపరుద్రునకు నైదాఱువందలసంవత్సరములు పూర్వుం డగు కరికాలచోడునివలన ననేకబహుమానము లందినవాఁడు. అప్పటికిఁ గూడ పద్మనాయకు లనుపేరిటనే యీ వంశవుసచ్ఛూద్రులు వ్యవహరింపఁబడుచున్నట్లు విస్పష్ట మగుచున్నది. " అని వ్రాసినారు. పైబాదన్న ప్రథమప్రతాపరుద్రునికాలమున నున్నట్లు రావుగారిసిద్ధాన్తము. ఇట్లగునపుడు బాదన్నకుఁ బూర్వులైన పైవారికి మఱియొకపద్మన్న నాయకుఁడై యుండె నని చెప్పవలసి వచ్చును. కాఁబట్టి మూర్యుఁ డగుపద్మపతిని బట్టియె వీరి కీసమాఖ్య వచ్చిన దనుట సమంజసము.

నిజ మిట్లుండఁగా దీని నపలపించి యేప్రమాణమును జూపక " ఆపద్ముఁడు పద్మసాలెవారికి సంబంధించినవాఁడుగాఁ గన్పట్టుచున్నాఁడు " అని వీరు చెప్పుటకు స్వకీయ శ్రీసూక్తియే ప్రమాణముగా నున్నది. అనాప్తు లగు వీరివచనము ప్రమాణాంతరసహకారము లేక యంగీకరింపఁ బడదు. ఇంతియే కాక ప్రమాణములు చూపనందున నందెద్దియో విశేష ముండె ననుస్వవాక్యము స్మృతిపథారూఢము కాఁగలదు.

ఒకవేళఁ బద్మసాలెలు పద్మపదాంకితు లగుటం జేసి పద్మపతికి సంబంధించినవా రని యెంచి యుందురేమో ? ఒకపద్మపదమును బట్టియే యట్లూహించినవారు పద్మజులు పద్మనాయకులు పద్మనాయకకులమువారు అని మూఁడుపద్మపదములుగల పద్మవెలములు పద్మపతికి సంబంధించి యున్నవా రను నూహను నిరసించుట యనుచితంబు గదా ! ఇంతే కాదు. పద్మజులు పద్మపతిని బూర్తిగ బోధించెడుపద్మ

నాయకపదము గలవారై యున్నారు. పద్మసాలె లట్టుబోధింపని పద్మపదము మాత్రము గలవారై యున్నారు. కాఁబట్టి పద్మనాయకులు పద్మపతికి సంబంధించినవారు కా రనుటకును పద్మసాలెలే అట్టివా రనుటకును వీలు లేదు.

ఇదిగాక పద్మసాలె వారు భావనామహర్షి సంతతివారైనట్లు మార్కండేయపురాణాంతర్గతమైనభావనామహర్షిమాహాత్మ్యమున సప్తమాధ్యాయమునందు భావనామహర్షియొక్కయుఁ బంచపుటియొక్కయు నుత్పత్తిప్రకారమును విష్ణుమూర్తి వారల కుపదేశించిన ప్రకారమును జెప్పి కొన్నిశ్లోకముల తరువాత

"ఇతి దత్వా తయో ర్విష్ణు రనుజ్ఞాం కృపయా పునః
ఉవాచ పరమప్రీతో లోకానుగ్రహకాంక్షయా
సర్వేషాం మానరక్షార్థం యత్నః కార్యః కథంచన
యువాభ్యాం వస్త్రనిర్మాణం క్రియతా మితి చా బ్రవీత్.

అని చెప్పఁగా వారలు

"త్వన్నాభికమలోద్భూతః బ్రహ్మా లోకపితామహః
త్వదాజ్ఞయా జగ త్సర్వం సృష్టవా న్స్వయ మేవ సః
తేషాం హి వస్త్రనిర్మాణే భువనే నాస్తి కేశవ
తత్తి తంతూ న్వినా నైవ భవేదే తన్నసంశయః
భవత స్తంతుహరణ మావాం యాచామహే హరే
తత్ర ప్రసీద దేవేశ తంతుసంధాయకో భవ
ఇత్యుక్తః పరమప్రీతో హరి రాలోక్య వై తదా
స్వనాభిపద్మనాళస్య తంతూ న్తాభ్యాం దదౌ తతః
...మన్నాభిపద్మనాళోత్థ తంతుసంపూర్ణకోశకాః
తతస్తే పద్మశాలీయాః సర్వలోకేషు విశ్రుతాః"

అని మొదలుగాఁ జెప్పఁబడినది. అట్టి మహర్షిసంతతివారై యజ్ఞోప

వీతాదులు ధరించుచుండునట్టి పద్మశాలీయులు శూద్రస్త్రీగర్భమున క్షత్త్రియబీజముచే నుదయించి యుగ్రజాతివారైన పద్మపతికి సంబంధించినవా రని రావుగారు వ్రాయుట మిక్కిలి యనుచితంబు.

రావుగా రిట్లు పద్మశాలులు పద్మపతికి సంబంధించినవా రని వ్రాయుటయు "వసిష్ఠ కౌండిన్య ధనంజయానాం" అని మార్కండేయపురాణమునం జెప్పినవచనము రాచవారిని గూర్చి వ్రాయఁబడిన దని వ్రాయుటయు "ఇటీవలి శూద్రులు క్షత్త్రియులై రనుటకు ... సంశయము లేశమాత్రము లేదు" అని వ్రాయుటయుఁ దాము పద్మనాయకులు పద్మపతికి సంబంధించిన క్షత్త్రియులు కా రను సిద్ధాంతము స్థాపించువారు కాఁబట్టి "అట్టి వారు మఱియొకరు గలరేమో యోచించి చెప్పం గోరెదము" అని వ్రాసినశ్రీరామమూర్తిగారికి నట్టివారు వీరని నిర్ధారించి చూపుటకై పడినప్రయాసమై యున్నది. ఎన్నియేని చేసి యట్టివారిని జూపుభారము తమపై నుంచుకొన్న మహానుభావులు కదా!

ఇఁక నేడవవిషయము విమర్శింపఁ బడును. అయ్యది యిటు లున్నది. "ఇటీవలిశూద్రులు క్షత్త్రియులై రనుటకుఁ గారణము వర్ణాశ్రమధర్మములోఁ జేరినకులముచేతఁ గాక క్షాత్త్రమును దాల్చి భూమిని జయించి పాలించుట యని చెప్పవచ్చును. అట్టివారు పదునెనిమిదిజాతులలోను గూడ నుండి రనుటకు లేశమాత్రము సంశయము లేదు" అని.

శ్రీరామమూర్తిగారి యాశయమును గుర్తింపక వీ రిటులు వ్రాయుచున్నారు. వారు కేవలము క్షాత్త్రమును దాల్చి భూమిని జయించి పరిపాలించుట క్షత్త్రియత్వానుమాపక మని యెంచినవారు కారు. మఱేమన్న శౌద్రవేషధారణము ఆంధ్రాదిదేశవాసము పద్మనాయకనామవహనము అను వానితోఁ జేరిన క్షాత్త్రాదులు పద్మపతి

సంబంధి క్షత్రియత్వానుమాపకము లని యెంచినవారు. చూడుఁడు. « వీని నన్నింటిని జదివినపిమ్మట పాఠకులు శూద్రవేషధారు లగుక్షత్రియులు కొందఱున్నారని తెలియఁగలరు. అట్టివా రీయాంధ్రాదిదేశములలోనే స్థిరపడిన ట్లుండుటవలన వా రీపద్మనాయకనామమున నుండువారు గానే యనుమానింపఁ బడుదురు " అని వ్రాసియున్నారు. ఇందువలనఁ బై యర్థమే కదా తేటపడఁగలదు. కాఁబట్టియే « అట్టివారు మఱియెవ్వరైనఁ గలరేమో యోచించి చెప్పం గోరెదము ". అని వ్రాసినారు. పదునెనిమిదిజాతులలోఁ బైనాలుగుగుర్తులు గలవారున్నారా యని చూడఁగాఁ గొందఱకు శూద్రవేషధారణము కొందఱకుఁ బద్మపతినామవహనము లేదని తాత్పర్యము. కావున రావుగారు శ్రీరామమూర్తిగారి యాశయము నెఱింగినవారు కారనియుఁ బద్మపతికి సంబంధించినక్షత్రియులు పైగుర్తులు గలపద్మజులే కాని యితరులు కారనియుఁ దేటపడఁగలదు. ఇట మూఁడంశములు విచారింపవలసి యున్నవి. « ఇటీవలి శూద్రులు » అని వ్రాసినారు. అనఁగాఁ బూర్వము శూద్రులుగాక యిటీవల శూద్రులైనవారు అని యర్థ మగును. ఇందువలనఁ బైగ్రంథములందుఁ బద్మనాయకులు తొలుత క్షత్రియులుగా నుండి తరువాత శూద్రు లైరని వ్రాసినవారిని దూఱుట యనుచితం బని తేట పడఁగలదు. పద్మజులు వెనుక క్షత్రియు లై యుండి యిటీవల శూద్రు లని చెప్పఁ బడుచున్నారని యేకదా పైవారియభిప్రాయము. తాము వారట్టివా రయిన ట్లొప్పి దూఱుట కవకాశ ముండదు కదా! « శూద్రులు క్షత్రియు లైరనుటకు " అని వ్రాసినారు. ఇందువలనఁ దొలుత శూద్రులుగా నుండి తరువాత క్షత్రియు లైన ట్లర్థ మగును. అట్లదివఱ కెవ్వరును వ్రాయలేదు. ఇదిగాక « వర్ణాశ్రమధర్మములలోఁ జేరినకులము చేతఁగాక " అని వ్రాసినారు. దీనియర్థము పరిశీలింపఁగా వర్ణభేదను ఆశ్ర

మభేదము గలిగినట్టి ద్విజుల కులముచేతఁ గాక అని యగుచున్నది. ఈవిశేషణములకు వ్యావర్త్యమును «గారణ" మనుదానితోఁ «గులముచేత» అనుదాని కన్వయమును రావుగారు చెప్పంజాలరు. కులము గాక అని మాత్రమే వ్రాయందగి యుండఁగా నిట్టి యసందర్భపు వాక్యము నేల వ్రాసిరో వారికే తెలియవలయు.

ఇట్లు రావుగారు «పద్మనాయకులు కేవలము వెలమలలో నుండి యేర్పడినవారు గాఁ గనుపట్టరు" అను ప్రతిజ్ఞాతార్థమునకు వెలుగోటివారి వంశచరిత్ర రావువంశ చరిత్రములలో నందఱకుఁ దెలియఁదగి సామాన్యము లైన ప్రమాణముల నగపఱచి యిప్పుడు ప్రబలప్రమాణమును బ్రదర్శించుచున్నారు.—

«కాఁబట్టి పద్మనాయకులనిజస్థితి దెలిసికొనుటకుఁ బ్రయత్నింతము. ఈ వెలుగోటివారివంశములోనివారి ప్రేరణముననే వ్రాయఁబడిన పద్మనాయకచరిత్రమునందు నేమి వ్రాయఁబడినదో విచారింతము అందు వెలమలజన్మవృత్తాంతమును గూర్చి యీక్రిందిరీతిగ నున్నది.

«క. శూరుల జన్మస్థానము
నారసి నియమింపఁ గూడ దది యెట్లన్నన్
వీరులు షణ్ముఖమారులు
సూరిజనులఁ బోల మిగులఁ జోద్యం బగుచున్"

ఉ. కొందఱు రెడ్డినాయకులు గోప్యము నందిరి మానుషంబునన్
గొందఱు లక్కనాయకులు కుంభిని క్షీరజలోక్తిఁ బొల్చిరా
కొందఱు కొంకణోద్భవులు ఘోరపరాక్రమలీలఁ గ్రాలఁ గా
నందఱు నేకమై ధరను నద్భుతలీలఁ జెలంగి రెంతయున్.»

అని శూరులజన్మస్థానము నియమింపఁ గూడ దనియు మానుషవంతులును పరాక్రమవంతులునైన కొందఱు రెడ్డినాయకులును, కొందఱు

లక్కనాయకులును కొందఱు కొంకణోద్భవులును, ఏకమై యద్భుత లీల విహరించి రని నుడివియున్నాఁడు. మఱియు నాగ్రంథమునఁ జే యనేక విధములుగా నాకాలమునాఁటి గాథలను బురస్కరించుకొని వచించి యున్నాఁడు

« గీ. కొంకణాదిక సేతువు కుంభినులను
నాంధ్రద్రవిడాది దేశంబులందు వెలమ
పేరు ప్రఖ్యాతి నొందఁ విస్తార మగుచుఁ
గరము బహులము ఖవర్ణసంగతులఁ దనరి »

« క. లోహము తామ్రము సిద్ధుఁడు
సాహసమునఁ జేయు రజతస్వర్ణము భంగిన్
యాహాతమైన కులంబున
నూహం బ్రబలించె నృపతి యుర్విపు లెన్నన్. »

« క. మధుత జలకణ సంతతి
ముద్రిత వరశుక్తి పతిత మూర్తము భంగిన్
శూద్రాభావం బయ్యును
రుద్రక్షితిపాలు వాక్యరూఢిఁ జెలంగెన్ »

« గీ. ఊరివరద నీరు నురనిసరయుఁ జేరి
తీర్థయోగ్య మైన తెరగు గాదె
కాలచోదితమునఁ గాక తీశ్వరుఁ గొల్చి
కాపు లెల్ల వెలమ కమ్మ లైరి. »

పద్మనాయక చరిత్రములో నుదాహరింపఁబడిన పైపద్యములను బట్టి కొంకణాది దేశములనుండి వచ్చిన కుంభినులు మొదలగు వారిని తక్కిన తెగల వారలు వెలమలుగ భావించి తమకన్నఁ దక్కువగఁ జూచుచున్నటులను వారలు శూద్రులు గాక పోయినను బ్రతాపరుద్ర క్షితిపాలునిచే గౌరవింపఁబడి రనియు వెలమవారిలోను కమ్మవారిలోను

గూడ నూత్నరక్తము ప్రవహించుచుండె ననియు భావము సూచింపఁబడుచున్నది గదా, అప్పటికి వాడుకలోనుండు గాథలను బురస్కరించుకొని పద్మనాయకచరిత్రకారుఁ డట్లు వ్రాసియుండు ననుటకు సందియము లేదు. అని ''

పై ప్రతిజ్ఞాతాంశసాధనమున కిది ప్రబలాధార మని వ్రాసితిని. కాఁబట్టి ప్రధానమల్లనిబర్హణన్యాయమున దీనిం బరిమార్జించినచో నింక నెవ్వియు నడ్డగింపఁ జాలవని నమ్మి దీనిని శిథిలీకరింప యత్నించుచున్నాఁడను. మొదలిది విచారింపఁదగియున్నది. వెనుక నాచే నుదాహరింపఁబడిన శ్రీనాథాదిగ్రంథములకన్న నిది ప్రబలమా? లేక వానికి సమబలమా? లేక దుర్బలమా? యని.

అనేకగ్రంథములకుఁ బరస్పరసంవాదంబును శాసనాదిప్రమాణసహకారంబును సమృద్ధం బై యుండినందున నాచే నుదాహరింపఁబడిన ప్రమాణములే ప్రబలము లనియు నట్టివానిని వీరు కనఁబఱుపక కేవలము పద్మనాయక చరిత్రమునే వ్రాసినందున నిది దుర్బలమనియు సామాన్యముగఁ దోఁచెడిని. అయినను మూలప్రమాణములను సంవాదములను జూచి మన మీమాట యనఁదగి యున్నది. పద్మనాయకచరిత్రకారుఁడు పై ప్రకారము పద్యములు వ్రాయుటకు నాధారం బేమైన నుండునా? అని విచారింపఁగా నొక్కటి యగపడుచున్నది. రావుగారు 277 వ పేజీలో "అప్పటికి వాడుకలో నుండు గాథలును బురస్కరించుకొని పద్మనాయకచరిత్రకారుఁ డట్లు వ్రాసియుండుననుటకు సందియము లేదు." అని వ్రాసి యున్నారు. దీనిం బట్టి మన మప్పటిగాథ లెవ్వి యై యుండు నని విచారింపఁగా మహాకవినిబద్ధచరిత్రములు శాసనాదులు దుర్లభంబు లగుటం జేసి పుక్కిటిపురాణగాథలే యని తెలియఁ దగియున్నది. అట్టివానిని బురస్కరించుకొని వ్రాసినచరిత్రముల మహిమను కృష్ణరాయచరితము 119 వ

పేజీలో రావుగారు క్రిందివిధముగ వ్రాసియున్నారు. " పుక్కిటిపురాణ గాథలను బురస్కరించుకొని మనము చరిత్రములు వ్రాయఁ బూనినఁ బెక్కుదోషము లుండక మానవు " అని.

ఇందువలనఁ బద్మనాయకచరిత్రముయొక్క మూలప్రమాణములును వానివలన దానికిఁ గలిగినగుణాతిశయమును రావుగారే తేటపఱచినవారైరి. ఇట్టిగ్రంథమువలనఁ బ్రమేయసిద్ధిని గోరినవారిమహిమ యువారిచేతనే " గ్రంథస్థసిదర్శనము లుండఁగా... మోచేయినాకుట వంటిదికాదె " అని ప్రకటింపఁ బడినది. ఇయ్యాది గ్రంథప్రమాణములను వదలి పుక్కిటిపురాణముల నవలంబించి చరిత్రము వ్రాసినయక్కవికివ్యాపించునాక్షేపముగఁ దోఁచును. అప్పు డట్లు మోచేయినాకుకవి వాక్యమును బురస్కరించుకొని పెనంగులాడ వచ్చిన మనరావుగారు నామాటకుఁ బాత్రులు గాఁ గలరు గదా !

ఇఁక నాచరిత్రము వ్రాయునాఁటికి గ్రంథప్రమాణము లున్ననే కదా యక్కవియం దీదోషములు ప్రసక్తించును. పద్మనాయకుల చరిత్రమునకుఁ బ్రథమప్రవర్తకుం డాతఁడే కాఁబట్టి యాతనినాఁడు గ్రంథము లెవ్వియు లేనందున నప్పటికి వ్యాపించి యున్నగాథల ననుసరించి గ్రంథమును వ్రాసినవాఁడు అని యనవత్తురు.

దీనికై యక్కవికాలం బెద్దియో విచారింపవలసి యున్నది. అయ్యాది గ్రంథమున వ్రాయఁబడక పోయిన నక్కవి సర్వజ్ఞసింగభూపతిని వర్ణించియున్నాఁడు. కావున సింగమనీనియనంతరమేయాగ్రంథము రచింపఁబడినట్లు స్థిరపడుచున్నది. ఇదివఱకు వంశచరిత్రములు వ్రాయువారందఱును సింగభూపతి పదవతరమువాఁ డనియే వ్రాసినారు. కాఁబట్టి యీచరిత్రకారునిచే వర్ణింపఁబడిన సింగభూపతి యాతండేయై యుండనోపు. ఆభూపతి క్రీస్తుశకము 15 శతాబ్దమున నున్నవాఁడు.

అప్పటికినామిరెడ్డి యెఱ్ఱక్కదేవి అనపోతానాయఁడు మాదానాయకు లిరువురు వ్రాయించినశిలాశాసనములు సర్వజ్ఞసింగభూపతిచే రచియింపఁ బడినరసార్ణవసుధాకరము శ్రీనాథునిభీమఖండము మున్నగు నాధారములు పుష్కలముగ నుండినవి. కవి యట్టివానిని వేని ననుసరింపక పుక్కిటిపురాణములనే పురస్కరించుకొని చరిత్రము వ్రాసి యున్నాఁడు కాఁబట్టి రావుగారు వర్ణించినదోషముల కిక్కవియు సీతని కావ్యమును విషయము గాక మానదు. మూలశైథిల్యమున సికతాకూపమువలె మూలప్రమాణశైథిల్యమున నిలువఁ జాలక కూలి పోవుచున్న యీచరిత్రమును ప్రబలాధారముగ నెంచనమ్మి « సత్యైకదృష్టితోడను నిష్పక్షపాతబుద్ధితోడను విమర్శించి చూచినపక్షమునఁ బద్మనాయకులు కేవలము వెలమలలోనుండి యేర్పడినవారు గాఁ గనుపట్టరు " అని వ్రాయుట యజ్ఞానవిజృంభితంబని తేటపడఁ గలదు.

ఒకవేళ, మూలప్రమాణశైథిల్యమునఁ బద్మనాయకచరిత్రమప్రమాణ మయినపుడు శ్రీనాథగ్రంథము గూడ నప్రమాణంబే కావలసి వచ్చును. దానికిని మూలప్రమాణంబు మృగ్యంబే కదా యన్నచో నట్లనఁ గూడదు. శ్రీనాథునకుఁ బైవారి శిలాశాసనములు మూలప్రమాణంబు లగుచున్నవి. అయ్యవి పద్మనాయకులు పవిత్రాన్వయులని చాటుచుండుట తత్పరిశీలనమువలనఁ దేటపడఁగలదు. ఇదిగాక శ్రీనాథగ్రంథమునకు గ్రంథాంతరసంవాదంబును బుష్కలంబుగఁ గలదు. పద్మనాయక చరిత్రమునకో శాసనాధారములు గాని గ్రంథసంవాదములు గాని లేకపోవుటయే కాక మఱియొక్క పెద్దపిడుగు చూపెట్టి యున్నది. ఆగ్రంథకారుఁడు తరువాతి గ్రంథమునఁ బద్మనాయకుల కులప్రాదుర్భావ ప్రాశస్త్య వృత్తాంతములను గ్రిందివిధముగఁ జెప్పినాఁడు.

" గీ. దైత్యవిధ్వంసిపాదపద్మజు లటంచు
వేదములు పల్కుఁ గావున విదితముగను
శూద్రకులజులు నోట సంసూచితముగఁ
బద్మజఖ్యాతి నియమించి పల్కి రపుడు.

గీ. తారకలలోన గ్రహరాజు వేత్ర మైన
భాతి దశవిధ వెలమలఁ బాయఁ ద్రోచి
సప్తసప్తతిపద్మజసముదయంబు
బద్మనాయకు లనఁగను బ్రబలె జగతి." అని.

ఇందువలనఁ బూర్వాపర స్వగ్రంథవిరోధము జాగరూక మగు చున్నది. మూలప్రమాణములు లేక సంవాదములు లేక పోవుటయే కాక స్వగ్రంథవిరోధమును గూడ జాగరూక మైనచో

" అంతచ్ఛిద్రాణి భూయాంసి కంటకా బహవో బహిః
కథం కమలనాళస్య మాభూవన్ భంగురా గుణాః "

అనున్యాయమున నాగ్రంథము భంగురంబు గాఁ గలదనియు దానిని బ్రమాణముగఁ జేకొని వచ్చినరావుగారి యాక్షేప మవిచారవిలసితం బైనదనియుఁ దేటపడఁగలదు. ఇట్లుండియు రావుగారు పద్మనాయక చరిత్ర కారుఁడు స్వవచనవ్యాఘాతముగాఁ బద్మనాయకులను బ్రశం సించినాఁ డని యీపద్యములను వ్రేసి వేసినారు.

ఇపు డిది విచారింపవలసి యున్నది. ఈవ్యాహతిదోష మను నది పద్మనాయకప్రశంసావాక్యములకు మాత్రమే సంభవించునా ? తా ముదాహరించిన దూషణవాక్యములకుఁ గూడ సంభవించునా ? అని. ప్రశంసావాక్యములకే యన్నచో వైషమ్యములోఁ బ్రమాణము లేదు. ఉభయసమంబన్నచో నీవాక్యములవలన స్వోదాహృతవాక్యము లువ్యాహతంబులే కదా! అయినప్పు డవి ప్రమాణములగునని గ్రహిం

చుటయు వీనిని దీసివేయుటయు యుక్తి ప్రమాణములకు దూరం బని వ్రాయం బనిలేదు. ఇంతియే కాక పరస్పరప్రతిబంధమున నేయర్థము నిర్ధారించుటకును వీలులేక పోవును. ఇట్టిస్థితిలో రావుగారు దూషణ గ్రంథమును బ్రమాణముగ నెత్తికొని భూషణగ్రంథమును దూరీకరించుట తగదు. మేమో ప్రబలప్రమాణసంవాదమున దూషణపద్యముల దూరీకరించుచున్నాము.

ఇంతేకాదు. రావుగారు తమ కిప్పట్టున మాతృకమైనరావువంశీయచరిత్రమును బరిశీలించినవారయ్యును నాగ్రంథమునఁ బ్రమాణోపన్యాసపూర్వకముగ నిరాకరింపఁబడిన పద్మనాయకదూషణపద్యములను బ్రమాణముగ నెత్తికొని యందుఁ బ్రమాణముగా నెత్తికొన్నపద్మనాయకభూషణపద్యముల నప్రమాణములుగ నిరాకరించినాడు. మఱియు నందుఁ బద్మనాయకప్రశంసాపద్యములకు మూలప్రమాణములుగా వ్రాయఁబడినశ్రీనాథభీమఖండసోమదేవరాజీయాదులవే రెత్తినవారు కారు. తాము ప్రమాణముగాఁ దీసికొన్నదూషణవాక్యములకు మూలప్రమాణములను జూపినవారు కారు. ఇట్లుండున్న ప్రమాణవచనములను మూసి పెట్టుటకును అందు నిరసింపఁబడినవచనములనెత్తికొని వాస్తవస్థితి నింత యపలాపము చేయుటకును నెద్దియో విశేష ముండక దీఱదు. అయినను దా మాంధ్రులపూర్వవృత్తాంతమును వాస్తవముగ శాసనాది ప్రమాణముల ననుసరించి తెలిపెదమని లోకులను నమ్మించి గ్రంథకర్త లయి యుండియు గ్రంథకారు లిదివఱకు నిర్ణయించినయర్థములను నందునకుఁ బ్రమాణము లగు శాసనాదులను మఱుఁగుపఱచి వాస్తవమును దలక్రిందుగాఁ జేసి తమపుస్తకములు చదువుచున్నవారికి బుద్ధిభేదమును గలుగఁ జేయుట వీరిదుస్సాహసంబునకు ఘంటాఘోషం బగుచున్న దనుట తేటతెల్లము.

ఇఁక వినిగమనావిరహమున స్వోదాహృతదూషణపద్యములే ప్రమాణము లేల కాఁదగవు? అని వాదము లెత్తురు. ఇపుడు బలాబలవిచారము చేయవలసి యున్నది.

నాయుదాహృతభూషణపద్యములకు భీమఖండము సోమదేవరాజీయము పల్నాటివీరచరితము సింగభూపాలీయము చంద్రికాపరిణయము వాసవదత్తాపరిణయము భానుమతీపరిణయము ఇందుమతీపరిణయము మున్నగు గ్రంథములు, నామిరెడ్డి యెఱ్ఱా అనపోతమాదానాయకులు స్థాపించిన శాసనములు మున్నగునవి ప్రమాణములు. రావుగా రుదాహరించినదూషణపద్యములకుఁ బుక్కటిపురాణములు పేరును బ్రకాశింప వీలు లేనిచరిత్రములు నూతనముగ వారు కనిపెట్టిన యసందర్భవిషయములు ప్రమాణములు. వీనిస్వరూపము వెనుక వివరింపఁబడియెను. శేషించినది తరువాత విమర్శింపఁబడును. ఇట్లుండ నేతదుభయపద్యగణములో నేది గ్రాహ్యంబో యేది యగ్రాహ్యంబో పదార్థనిర్ణయపాండితీమండితు లగు పరీక్షకశిరోమణు లెఱుంగఁగలరు.

ఇఁకఁ బద్మనాయకచరిత్రకారుఁ డిట్లు స్వవాక్యవ్యాఘాతముగ వ్రాయుటకుఁ గతం బేమనిన, ముం దీవిషయము దెలియఁదగి యున్నది.

ఈచరిత్రము పద్మనాయకుల ప్రేరణముననే వ్రాయఁబడిన దనుటయుఁ బద్మనాయకులవృత్తాంతమును దెలుపుటకు వ్రాయఁబడినదనుటయు నిర్వివాదాంశములే కదా! లోకమునఁ జరిత్రము వ్రాయువారు వర్ణ్యులకు లేనిగుణముల నైనం దెచ్చిపెట్టి వర్ణించుచున్నారు గాని పేరునకు వెలమవీరులచరిత్ర మని ప్రకటించి కేవలము దూషణములే వ్రాసినమనవీరభద్రరావుగారివలె వర్ణ్యులదూషణములు వ్రాయువా

రుండరు కదా! అట్లగునపుడు పద్మనాయకచరిత్ర మనునది వారిప్రశంసార్థమే ప్రవర్తించినదై యుండవలయు. ఇట్టిగ్రంథములో వారి దూషణములు వ్రాయుట గ్రంథకారశైలీవిరుద్ధధర్మంబు. ఎంతయు ప్రగల్భకవియైనను వర్ణ్యులను నీచకులమువారినిగా వర్ణింపఁడు. ఇట్టి స్థితిలోఁ బద్మనాయకుల జన్మవృత్తాంత మిట్లు కవి చెప్పినాఁ డనువిషయము సంశయింపఁ దగి యున్నది. దానికిఁ దోడుగాఁ నిదితక్క నితర గ్రంథమంతయు వారిగుణాతిశయమునే యుగ్గడించుచున్నది. ఒకవేళఁ గవి ప్రమాదముననో మఱియే కారణముననో గ్రంథమునని ట్లువ్రాసి యుండు ననుకొనుటకు వీలు లేదు. కృతిప్రేరకుం డగు రేచర్ల బ్రహ్మనాయఁడు స్వవంశము నంతనీచముగా వర్ణించుచున్న నెటు లూరక యుండును? సామాన్యజనుం డైనను దనకులమునకుఁ గళంకము చెప్పినప్పు డోర్వఁజాల కుండుట కనుచున్నారము. ఘనతఁ గాంచిన రాజకుటుంబములో నుదయించి తమపూర్వుల వీర్యవిజయాదులను దెలిపెడి శాసనగ్రంథాదుల నెఱింగి తత్ప్రకాశమునకై చరిత్రము వ్రాయించిన బ్రహ్మభూపతి తమకులకళంకవార్తల నెటు లోర్చును? ఇట్టి స్థితిలోఁ గవి యిట్లు చెప్పుటకుఁ గారణము క్రిందివిధముగఁ దెలియఁ దగి యున్నది.

రావుగారీప్రకరణమున 271 పేజీలో « కమ్మవారికి పంటమహాన్వయులయిన కొండవీటిరెడ్లకును పద్మనాయక వెలమలకును జరిగిన యుద్ధములు చరిత్రమున సుప్రసిద్ధములుగ నున్నవి ” అనియు 281 పేజీలో (వెలమవారు) « రెడ్లకుఁ బ్రతిఘటించి వేఱుపడిన కులము నుద్ధారణము చేసిరని భావమేర్పడుచున్నది ” అనియు, 182 పేజీలో « రేచర్లబ్రహ్మనాయఁడు రెడ్డికులమునకు మాఱొడ్డి ... గౌరవము దెచ్చినవాఁ డగుటంజేసి ” అనియు 284 పేజీలో పద్మనాయకులలోఁ గొందఱు...రెడ్లకుఁ బ్రబలవైరులుగ నుండిరని వేద్యమగుచున్నది. ”

అనియు మొదలుగా వ్రాయుటచేఁ గొండపీటి రెడ్లకుఁ బద్మనాయకు లకుఁ బ్రబలవైరముండెననుటకు సంశయము లేదు గదా! ఈవిరోధమును బురస్కరించుకొని కొండవీటి రెడ్లు వెలమవారు పరమనీచ కులమువారుగాఁ గొండవీటిదండకవిలెలో వ్రాయించిరి. దానింగని పద్మనాయకులు కాఁపులు పరమనీచకులమువారుగా బద్మనాయక చరిత్రమున వ్రాయించిరి. దీనివాస్తవము నెఱుంగఁజాలక కొండవీటి నిజముగఁ బద్మనాయక దూషణమనినమ్మి వాదుచువచ్చిరి. వాస్తవము దెలిసినపండితులు లిది నిజము కాదని పరిహరించుచు వచ్చిరి. ఇంతియ కాని వేఱుకాదు. ఇదియే "కొండఱు రెడ్డినాయకులు" అని మొదలుగా "కాఁపులెల్ల వెలమకమ్మ లైరి" అనునటుకుఁ గలపద్యముల సమష్టి యభిప్రాయము. పద్యములు లేఖకపరంపరగా నశుద్ధములుగా నేర్పడి యుండినను బరిశీలించినవారి కీయర్థమే కాఁగలదు. చతుర్థ వర్ణములో వెలమ లుత్తము లని ప్రసిద్ధి గని యుండఁగాఁ గాఁపులు కమ్మలును మేము వెలమలము మేము వెలమలము అని ప్రకటించుచుండఁగాఁ బద్మనాయకులు ప్రతాపరుద్రుని సన్నిధిని వాదము పెట్టుకొని శాసనగ్రంథాదిప్రమాణ ప్రదర్శనపురస్సరముగా 77 గోత్రములవారు మాత్రమే నిజమైన వెలమ లని తీర్మానము నొంది దశవిధవెలమలను (మధ్యను వెలమల మని పేరు పెట్టుకొన్న కాఁపుకమ్మ మొదలగు వారిని) తమలోనుండి పాయఁద్రోచిరి. ఇదియే

"తారకలలోన గ్రహరాజు వేఱె యైన
భాతి దశవిధవెలమలఁ బాయఁ ద్రోచి
సప్తసప్తతి పద్మజ సముదయంబు
పద్మనాయకు లనఁగను బ్రబలె జగతి
రెడ్డిసంతతికి మాత్రోడ్డి ... కులముద్ధరించిరి వెలమవారు"

అని మొదలుగాఁ పై చరిత్రమునఁ బ్రకటింపఁబడిన దని తెలియుచున్నది.

ఇట్లు గాక నాకవి మహాకవి ప్రబంధములకు శిలాశాసనములకు స్వగ్రంథమునకు విరుద్ధముగాను కవిసంప్రదాయవిరుద్ధముగాను సర్గుణ్య లనుదూఱినాఁ డని తలంచుట యవిచారమూలమే కాని వేఱుగానోపదు. రావుగా రీపద్యములు నిజముగ వెలమవారిదూషకము లని యేనమ్మి యీ యర్థ మిం కింతదృఢము చేసిన లోకులు దీనినేమిక్కిలి విశ్వసింపఁ గలరని పైపద్యములక్రింద "వారిని తక్కిన తెగలవారు వెలమలుగ భావించి తమ కన్నఁ దక్కువగఁ జూచుచున్నటులును ... వెలమవారిలోను కమ్మవారి లోను గూడ నూత్నరక్తము ప్రవహించుచుండె" నని లేనియర్థ మును వ్రాయుట యెంతో వింతగా నున్నది ఇట్టియర్థ మీపద్యము లలో నేది బోధించునో నూత్నరక్త మెవరియందుఁ బ్రవహించినదో చూపుఁ డన్న నేమి చెప్ప నూహించిరో వారికే తెలియవలయును.

ఇట్లు స్వమతమును నెలకొలిపియిపుడు పరమతసాధకములుగాఁ దమకుఁ దోఁచినవానిని నిరాకరించుచున్నారు. అయ్యవి పద్మనాయక చరిత్రములో వీరిని బ్రశంసించుట వీరు తొలుత క్షత్త్రియులుగా నుండి రనుట ప్రతాపరుద్రునితో నేక పంక్తిభోజనము వీరికి ఘటిల్లిన దనుట అని ముత్తెఱంగులు.

అందు మొదటిది. "మఱియు నాతఁడు స్వవచనవ్యాఘాత ముగ నాగ్రంథముననే మఱియొకచోట

గీ. దైత్యవిధ్వంసిపాదపద్మజు లటంచు
పద్మజఖ్యాతి నియమించి పలికి రపుడు.

అని విష్ణువుయొక్క పాదపద్మమునందు జనించుటచేతఁ బద్మజు లను సంజ్ఞ కలిగిన దని నుడివెను. అదియునుంగాక తక్కిన వెలమ తెగలవారిని గ్రిందుపఱచుచుఁ బద్మనాయకుల నధికు లని చెప్పి

క. తారకలలోన గ్రహరాజు వేఱ యైన...
పద్మనాయకు లనఁగను బ్రబలె జగతి.

అని పొగడి యున్నాఁడు. విష్ణుపాదపద్మమునందు జన్మించుటచేతనే వీరికి పద్మజు లనుపేరు గలిగిన దనియు అందువలననే పద్మనాయకు లనునామము వహించిరనియుఁ జెప్పుట సయుక్తికముగాఁ గనుపట్టదు. విష్ణుపాదోద్భవసంభవుల మని పంటరెడ్లు కమ్మవారు మొదలగు తెగలవా రెల్లరును జెప్పుకొనుచున్నవా రయినను వారలకు పద్మనాయకు లను పేరు గ్రంథములను వినంబడదు... కొంతవఱకు గనుపట్టక మానదు" అనునది. పద్మజశబ్దవిషయమై వెనుకఁ గొంత వివరించినాఁడను. ఇపుడు "అందువలననే పద్మనాయకు లనునామము" అనునది విమర్శింపఁబడును. ఈయర్థము పైపద్యములలోఁ జెప్పఁబడలేదు. మొదటిపద్యము పద్మజులు అనునామమునకే సాధకముగ నున్నది. రెండవది పద్మజులుదశవిధవెలముల శాఖఁద్రోచుటయందు "తారకల లోన గ్రహరాజు వేత్రమైన భాతి" యని తారకలకువేత్రైన సూర్యుని దృష్టాంతము చెప్పి అందువలనఁ దద్వాచక మగుపద్మనాయకశబ్దము వీరికిఁ గలిగిన దని సూచించుచు "పద్మనాయకు లనఁగఁ బ్రబలె" అని చెప్పుచున్నది. కాన "అందువలననే" అని రావుగారు వ్రాయుట సరికాదు.

ఇంకొకవిశేషము. విష్ణుపాదపద్మమునందు జన్మించుటవలన వీరికిఁ బద్మజు లనుపేరు గలిగినదనుట సయుక్తికముగాఁ గనుపట్ట దను ప్రతిజ్ఞార్థమును సాధించుటకు విష్ణుపాదోద్భవసంభవులగుకమ్మవారు మొదలగువారలందుఁ బద్మనాయకశబ్దవ్యవహారము లేక పోవుట కారణముగఁ జూపినారు. కార్యకారణములకు సామానాధికరణ్యము నియతము కాఁబట్టి కారణము లేనిచోటఁ గార్యము జనింప దనుట లోకవిదితము. పద్మజశబ్దప్రవృత్తినిమిత్తమగు పద్మజనికర్తృత్వము హరిపాదపద్మజనికర్తలైన పద్మనాయకులందుఁ గలదు కాన వారల యందుఁబద్మజశబ్దప్రయోగము, హరిపాదోద్భవసంభవులగుకమ్మకాఁపు

మొదలగువారియందు పద్మజశబ్దప్రవృత్తినిమిత్త మగుహరిపాద పద్మజనికర్తృత్వము లేదు కాఁబట్టి వారలయందుఁ బద్మజశబ్దప్రయోగాభావము, న్యాయసిద్ధం బైనది కదా! ఇట్టిస్థితిలో కమ్మలు మొదలగు వారియం దాశబ్దమునుయొక్క ప్రయోగము లేదు కాఁబట్టి పద్మనాయకులయం దాశబ్దమును బ్రయోగించుట సయుక్తికము గా దనుటయే సయుక్తికము గాక యున్నది.

ఇఁక విష్ణుపాదోద్భవసంభవు లనునది ముద్రణప్రమాద మనుకొంద మన్న నది పొసంగునట్లు లేదు. ఏల యనిన. రావుగారు 8 వ ప్రకరణమున 234 పేజీలో కోటవంశమును గూర్చి వ్రాయునపుడు « వీరలు విష్ణుపాదోద్భవసంభవు లయిన చతుర్థాన్వయుల మని చెప్పుకొని యున్నారు " అని వ్రాసినారు. కాఁబట్టి ముద్రణప్రమాదము కాదనియు వీరిమతమున విష్ణుపాదోద్భవసంభవు లను నొకతెగవారు చతుర్థవర్ణములో నుండిరనియు నెంచఁ దగియున్నది. విష్ణుపాదోద్భవమైన చతుర్థవర్ణములో విష్ణుపాదోద్భవసంభవులు గల రనుటకుఁ బ్రమాణము ముఖ్యంబుకదా? అని యాశంక తోఁచును. స్మృతిపురాణాదులయం దున్నకొన్నివిషయములకు మూలప్రమాణములు మనకుఁ గానరాక యుండినను సర్వజ్ఞు లగుమహర్షులు వానిని గని పెట్టి చెప్పియుందు రని నమ్మినట్లు దీనిఁ గూడ మూలప్రమాణమును దేనినో రావుగారు కనిపెట్టి వ్రాసియుందు రని నమ్మవలసియున్నది. దీనినిజ మెట్లుండినను నీప్రతిజ్ఞనిలుపుకొనంజాలరు, చూడుఁడు. పైప్రతిజ్ఞాతార్థమునకు కమ్మ కాపు మొదలగువారియందు పద్మనాయక శబ్దము ప్రయోగింపకుండుట కారణముగా వ్రాసినారు. ఇయ్యది యెవరు హరిపాదపద్మోద్భవులో వారియందుఁ బద్మజశబ్దము ప్రయోగింపఁబడును అనువ్యాప్తికి భంగప్రదర్శనరూపముగఁ గానంబడియెడిని.

ఇం దోకయసందర్భము. హరిపాదపద్మజత్వమునకుఁ బద్మజశబ్ద ప్రయోగమునకే కదా వ్యాప్తిఁ గల్పించిరి, దీనికి హరిపాదపద్మజత్వ మున్నచోటఁ బద్మజశబ్దప్రయోగము లేకపోవుటయే భంజకం బగును గాని పద్మనాయకశబ్దప్రయోగము లేకపోవుట యెటులు భంజకంబగును? కానఁ గమ్మవారియందుఁ బద్మనాయకశబ్దప్రయోగము లేనందున వెలమలందుఁ బద్మజశబ్దప్రయోగము చేయుట సయుక్తికము గాఁ గనుపట్టదన్నమాటయే సయుక్తికముగాఁ గనుపట్టును.

తరువాత రావుగారు, శ్రీరామమూర్తి పంతులుగారు భీమఖండములో « పద్మనాయకులన వెలమలన” అని యుండినట్లు వ్రాసినారనియు నందువలనఁ బద్మవెలమలకుఁ బద్మనాయకు లనునామము గలుగుటకు వేఱుకారణ ముండవలయు ననియు వ్రాసినారు. శ్రీరామమూర్తిగారెత్తినపాఠములో « కైటభదైత్యవైరి ” యనుపద్యమున ఉదయంబునొందె యనుచోట (ఉదయంబునొంది) అనియు « కారణగుణసంక్రమంబున ” అనుచోట (కారణాసంక్రమంబున) అనియు, సోదరీయస్నేహలబ్ధంబులుం బోని పావనత్వ శుచిత్వ అనుచోట (సోదరీయస్నేహలబ్ధంబు లచ్ఛోనిపాతనత్వ శుచిత్వ) అనియు, చరితమనస్స్వభావవచనంబుల ధరియించి అనుచోట (భరితమనస్స్వభావవచనంబులు ధరియించి) అనియు మొదలగుతప్పులు విశేషముగఁ జూపట్టుచున్నవి. అట్లు «పద్మనాయకులన వెలమలన” అనివారెత్తినపాఠము గూడ సరిగామిచే « పద్మనాయకు లను వెలమలన ” అనుపాఠమే స్వీకరింపఁబడును. అందువలనఁ బద్మవెలమలకుఁ బద్మనాయకు లనునామము గలుగుటకు వేఱుకారణ ముండవలయు నను రావుగారియూహ నిరస్తంబు కాఁగలదు. ఈపక్షమునఁ గమ్మ పంట మొదలగువారియందుఁ బద్మనాయకపద మన్వయించు నని రావుగారు వ్రాయుట భ్రమమూలకము. « పద్మనాయకులను ” లనుచోటి అనుశబ్దము

వెలమపదముతో సమసించినది. కాఁబట్టి పదాంతరములతో సంబంధించుటకు వీలు లేదు. సమాసఘటకపదములు తదఘటకపదములతో నన్వయించునపుడు సమాసం బసాధువని శాస్త్రము కలదు.

తరువాత "ఎంత మందబుద్ధుల కైనను పద్మనాయకకుల మన్నతోడనే పద్మఁ డను వాఁడు నాయకుఁడుగాఁ గల సమూహ మని యర్థము గాక మానదు." అని వ్రాసినారు. ఏమికారణమో తొలుత వెలమలకుఁ బద్మజశబ్దము హరిపాదపద్మమునుండి యుదయించుటచే వచ్చినది కాదని నిరూపింపఁ బూని దానిని మాని కమ్మలయందుఁ పద్మనాయకపదము లే దని పద్మనాయకశబ్దమునకుఁ బరుగిడిరి. ఆవల నది వెలమలకు వచ్చినవిషయము విచారించుచు దానిని విడనాడి పద్మనాయకకులశబ్దము నందుకొనిరి. వీరిమతమునఁ బద్మజపద్మనాయకపద్మనాయకకులశబ్దములు సమానప్రవృత్తినిమిత్తకములై యుండు నేమో, ఇట్టివారు తొలుతనే పద్మనాయకకులనామము వచ్చినదనుటయు నయుక్తికముగాఁ గనుపట్టదు అని పద్మజపద్మనాయకపద్మనాయకకులశబ్దములను మూఁడింటిని నొక్కచేసారి యావృత్తి పెట్టి యున్న బాగుండును. "చైత్యవిధ్వంసి" అనుపద్యమున పద్మజశబ్దవ్యుత్పత్తిని మాత్రమే చూపి యుండఁగా నదియే పద్మనాయకశబ్దవ్యుత్పత్తికథన మని యెంచినవారు పద్మనాయకకులశబ్దమునకుఁ గూడ నదియే వ్యుత్పత్తికథనమని యెంచుట యుచితంబే కదా!

ఇఁక నింతమాత్రముతోఁ బోసిక స్వపాండిత్యము నిటులు ప్రకటించినారు. "ఎంత మందబుద్ధుల కైనను పద్మనాయకకుల మన్నతోడనే పద్మఁడు నాయకుఁడుగాఁ గలిగినసమూహ మని యర్థముగాక మానదు" అనుదాని తరువాత "అందువలన వేర్వేఱు తెగలనుండి యేకారణముచేతనో వేఱుపడివచ్చి ప్రత్యేకముగా నొకతెగ వారైరని తెలుపుటకుఁ బద్మనాయక కుల మనునదియే సాక్ష్యముగ నున్నది.

అందులకు గ్రంథములనాధారము లేవైనఁ గలవాయని పరిశీలించినచోఁ గొంతవఱకుఁ గన్పట్టక మానవు'' అని.

రావుగారికిఁ గావ్యకోశ పరామర్శము లే దని యీలేఖనమే సాక్ష్య మిచ్చుచున్నది. చూడుఁడు «సజాతీయైః కులం యూథమ్, గోత్ర జననకులా న్యభిజనాన్వయౌ'' అనుకోశములను బట్టి కులపద మేక జాతీయసమూహమును సంతతిని బోధించుటవలనఁ బద్మనాయక కులపదమునకుఁ బద్మఁడు నాయకుఁడుగాఁ గల యేకజాతీయసమూహ మని గాని పద్మనాయకునకు సంబంధించిన సజాతీయసమూహ మనిగాని పద్మనాయకుఁడనువానిసంతానమనిగాని, యమూర్థ చెప్పఁదగియుండగా, ముఖ్యవృత్తిచేతఁ గులశబ్దమునకు భిన్నజాతీయసమూహ మని యర్థము రాక యుండఁగా« వేర్వేఱు తెగలనుండి యేకారణముననో వేఱుపడి వచ్చి ప్రత్యేకముగ నొక తెగవా రయిరని తెలుపుటకుఁ బద్మనాయక కులమునదే సాక్ష్య మిచ్చుచున్నది » అని వ్రాయుట « అర్థవ్యుత్పత్తి రనర్థహేతుః'' అన్నమాటే కదా! పైగా « అందులకు గ్రంథముల నాధారము లేవైనఁ గలవా యనిపరిశీలించినచోఁ గొంతవఱకుఁ గన్ప ట్టకమానవు'' అని వ్రాసినారు. ఇయ్యది « బహూనాం జన్మనామం తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే'' అనుభగవదుపదేశము బోలి యున్నది. ఆధారములను గోరువారు మార్కండేయునంతయాయువు గలిగి ప్రాఁతకట్టలుదిరుగవేయుచు వచ్చినఁగొంతవఱకు(అసంపూర్తిగా) దొరకవచ్చు నని దారిచూపినారు. సుప్రసిద్ధమహాకవినిబంధములు శిలా శాసనములు పద్మనాయకులు పవిత్రాన్వయు లని ఘంటాపథముగ బోధించుచుండఁగా నెంతమందబుద్ధియైనను « తృషార్తో నర్మదాతీరే కూపం ఖనతి దుర్మతిః » అనున్యాయము ననుసరించి వీరుపదేశించిన ప్రకారము ప్రాఁతకట్టలు విప్పిముప్పుదెచ్చుకొనునా! వింతగా నున్నది.

ఇదిగాక, ప్రాఁతకట్టలలోఁ జిక్కునని వీ రాశ పెట్టినయాధారము లెట్టివిగ నుండునో తెలియఁదగి యున్నది. ఇట నాధారము లనఁగాఁ బ్రమాణములు అయ్యవి ప్రత్యక్షాదిభేదభిన్నంబులు. పద్మనాయకులు నానాజాతులలోనుండి వచ్చి యొకతెగవారుగా నేర్పడినా రనువిషయ మెవరును గనులఁ జూచినవారు కారు. వ్యాప్తిజ్ఞానము సంభవింపమి ననుమానము దుర్ఘటము. ఉపమానం బతిప్రసక్తము. శాబ్దము శబ్దజన్యబోధము. ఆప్తవాక్యము శబ్దమునాఁ బరఁగు. ఆప్తుండు యథార్థవక్త. ఆప్తు లనఁదగుమహాకవులయొక్క వాక్యములు శిలాశాసనాదులు తలక్రిందువడినను వీరికి దొరకవు. పుక్కిటిపురాణములననుసరించినచో నఱచేతిలోని వెన్నముద్దను వదలి మోచేయి నాకుటవంటి దగును. కాన వీ రాశించినయర్థము ఘటిల్లదు.

ఇఁకఁ బైమూఁడువిషయములలో రెండవది విమర్శింపఁబడును. అయ్యది «పద్మనాయకులలో సుప్రసిద్ధు లైన రేచర్లవారు చతుర్థవర్ణమునందు జనించినవార మని స్పష్టముగఁ దెలుపుకొనియుండఁ దద్వంశజు లయిన వెలుగోటివారు ... రావువారు ప్రకటించినగ్రంథములందుఁ బద్మనాయకు లొకప్పుడు క్షత్త్రియకులమువారుగా నేయుండి తరువాత శూద్రు లయిపోయి రనియు శూద్రజాతీయు వారికెవ్వరికి క్షత్త్రియనామము వర్తింపదనియు వ్రాయఁబడి యున్నది... వింతగా నుండక మానదు» అని.

శ్రీవెలుగోటివారు «వీరు నాల్గవవర్ణములో సత్యోత్తమ మైన పద్మనాయకకులమువారు» అనియే వ్రాయించినారు. కాఁబట్టి తమ పూర్వులు చతుర్థవర్ణమువార మని వ్రాయించుటచేత విరోధము లేదు. వెలుగోటివారిచరిత్రము సుపోద్ఘాతము 25 పేజీలో పైవాక్యము మొదలుకొని 86 పేజీలో «కాఁబట్టి యిప్పటివారు క్షత్త్రియవేషధారణ

ప్రయాసమునొందుట కలిబలముననే గాని శాస్త్రమునఁ గాదు" అను వఱకు 11 పేజీలు క్షత్త్రియత్వమును నిరసించి యుండఁగాఁ దద్విపరీతముగ రావుగారు భావించుట వింతగానున్నది. వీరలు తొలుత క్షత్త్రియులుగా నుండి రని యూహించుట పూర్వులు శూద్రుల మని వ్రాసినందునకుఁ గాని క్షత్త్రియుల మని వ్రాయనందునకుఁ గాని విరుద్ధము కాదు. వారు క్షత్త్రియత్వనిషేధమును జేసినవారు కారు. మఱేమన్నఁ దత్కాలస్థితిని మాత్రమే వ్రాసియున్నారు. ప్రమాణబలముచేతఁ బ్రమేయసిద్ధి యగుచుండి యది ప్రత్యక్షమునకు విరుద్ధము గాక యుండఁగాఁ బరిహరించుటకు వీ లుండదు.

ఇదిగాక, పై వారు తాము పద్మపతికి సంబంధించిన క్షత్త్రియుల మని మాత్రము వ్రాయించినారు గాని తమకన్న నితరులు క్షత్త్రియులు కా రని వ్రాయించినవారు కారు. శూద్రవేషధారణము పద్మనాయకపదవహనము ఆంధ్రదేశవాసము క్షాత్త్రము నున్నగుధర్మముల కూడికచే మార్కండేయపురాణోక్త మహాపద్మపతివృత్తాంతసమన్వయమును బట్టి యాక్షత్త్రియులే యీపద్మనాయకు లని ప్రత్యభిజ్ఞ కవకాశము గలిగినది. రాచవారు మొదలగువారలందు శూద్రవేషము లేమిని కమ్మ కాఁపు మున్నగువారలందుఁ బద్మపతినామవహనము లేమినిబట్టి వారలు పద్మపతికి సంబంధించిన క్షత్త్రియులు కారని యే వారియభిప్రాయము కాని క్షత్త్రియులు కా రని కాదు. రాచవారు శూద్రుల మని చెప్పుకొనుట పద్మనాయకులు తొలుత క్షత్త్రియు లనుటకు బాధకము గాదు. అగునన్నచోఁ దత్పరిహారము నిరూపింపవలసి యుండును. ఇవన్నియుఁ దెలియక "రాచవారియొక్క పూర్వులు సయితము వారి శాసనములలోఁ జతుర్థకులమువార మని చెప్పుకొని యుండఁగాఁ బెక్కు తెగలలో నుండి వచ్చి యేర్పడిన యీశాఖవారు తాము మాత్రము క్షత్త్రియసంతతివార మనియుఁ దక్కినవారు కారని వ్రాయుట

వింతగా నున్నది. " అని వ్రాయుట కేవలము విపర్యాదైర్ఘ్యప్రయుక్తమే కాని వేఱుగానుండదు. ప్రమాణములు చూపక యిట్టివ్యర్థపు వ్రాఁత వ్రాయుట యంతకన్న నింక నేమి కాఁగలదు?

ఇంకొక్కటి «పద్మనాయకులలో సుప్రసిద్ధు లగు రేచర్లవారు చతుర్థవర్ణమువార మని చెప్పుకొనుచుండఁగా" నని వ్రాయుటచేతను, «శ్రీనాథకవి తనభీమఖండమునందు...నాకడ నున్నముద్రితప్రతిలో నున్నది» అని వ్రాయుటచేతను బద్మనాయకకుల మకళంకమనుటకుఁ గలప్రమాణములను దాము చూచి యున్నవారని తేటపడఁగలదు. ఇట్టివా రయ్యును బ్రమాణములను మఱుఁగుపఱచి పేరులేనిచరిత్రములను బుక్కిటిపురాణములను స్వకపోలకల్పితములను బురస్కరించుకొని యపసిద్ధాంతమును బ్రకటించుట «గుణాయంతే దోషాస్సుజనవదనే దుర్జనముఖే గుణా దోషాయంతే» అనున్యాయమునఁ దక్క వేఱుగాఁ గానంబడదు. తమ కాసిద్ధాంతము చేయ నుత్సాహ మున్నచో నుభయపక్షసాధకము లగువానిని జేర్చి బలాబలవిచారము చేసి యనభిమతములను యుక్తిప్రమాణములచే నిరసించుట గదా పండితధర్మంబు.

ఇఁక మూఁడవది, ప్రతాపరుద్రుఁడు పద్మజులకు సపంక్తిభోజనగౌరవ మొసంగినాఁడనునది. దీనిపై రావుగారిటులు వ్రాయుచున్నారు. «మొదట కాకతీయులు కులముచేత క్షత్రియు లయినప్పుడు గదా యిట్టికార్యముయొక్క ఘనత వెల్లడియగుట కనువై యుండును. కాకతీయులు క్షత్రియకులమువారు కారనియు చతుర్థకులజులే యనియు నిటీవల దొరికిన రెండుశాసనములలో స్పష్టముగఁ గానంబడుచున్నది... కాఁబట్టి కాకతీయులతోడి సహపంక్తిభోజనము దొరికినమాత్రముచేత వీరు తక్కిన వెలమకమ్మశాఖలవారికన్నఁ గులాధిక్యము గలవా రని

చెప్పుటకుఁ గారణ మగపడకు గదా! పద్మనాయకులు చెప్పుకొను గాథను బట్టి వీరలకుఁ బ్రతాపరుద్రునికిఁ బూర్వము వానితో సహపంక్తిభోజనము లేదని యర్థ మగుచున్నది కదా? అందునకుఁ గారణ మెద్దియో యుండి యుండక మానదు" అని.

దీనిం జూడ వీరభద్రరావుగారు రాజస్థానములందుఁ గలసంప్రదాయములు గమనింపనటులు కానం బడియెడిని. రాజులు ప్రతివారితోడను సహపంక్తిభోజనము చేయువారు కారు. భాతృపుత్రాదులతోఁ గాక యితరులతోఁ గలసిభుజించినచో నది పంక్తికివచ్చినవారికి గౌరవప్రదానముగనే యుండును. ఇట్లు రాజులతో నేకాసనోపవేశనము సర్థాసనోపవేశనము పార్శ్వవిశేషోపవేశనము మున్నగునవి కూడ గౌరవములుగా నున్నవి. ఇట్టిమర్యాదలు రాజస్థానముల నుండువారికిఁ దెలిసి యుండఁగలవు. కాఁబట్టి రాజాధిరాజుగా నున్న ప్రతాపరుద్రునిపంక్తిలాభము గౌరవజనకమని పద్మనాయకులు చెప్పుకొనుట తగి యున్నది. ఇపుడు హైందవు లనేకులు కింగుయొక్కయు వైసరాయియొక్కయు బంక్తిభోజనాహ్వానమును బెక్కుభంగులఁ గోరుచున్నారు. అది గొప్ప గౌరవ మనికదా వారితో భోజనము ఘటిల్లకపోయిన నాహ్వానంబైనం జాలునని యత్యుత్తమవర్ణమువారు కూడఁ గోరుచున్నారు. ఇందువలన రావుగారు "మొట్టమొదట కాకతీయులు క్షత్రియులయిననే కదా యిట్టికార్యముయొక్క ఘనత వెల్లడిపఱచుట కనువై యుండును." అని మొదలుగా వ్రాసినవ్రాఁత పైమర్యాదల నెఱుంగక వ్రాసినవ్రాఁతగా నేర్పడుచున్నది. రాజులు దక్కువజాతివారైనను వారిపంక్తిలాభము గొప్పగౌరవ మని యెంచుచుండ నెక్కువజాతివారైనపు డింకను విశేషగౌరవము గాక మానదు గదా!

ఇఁకఁ గాకతీయులు క్షత్రియులు కారనువిషయము శోధించినది. వారు క్షత్రియు లైనను గాకపోయినను రాజాధిరాజు లగు

టచే వారితో సపంక్తిభోజనము గౌరవాధాయకమనుటకు క్షతి లేదు. కానఁ దద్విమర్శము ప్రకృతోపయోగి కాదు. అయినను వాది ప్రదర్శితములైనయనుపయుక్తవిషయములనువదలిదిఙ్మాత్రముగ సిద్ధాంతముఁను దెలిపెదను. కాకతీయులు క్షత్త్రియులే కాని తదితరులు కారు. ఇందులకుఁ బెక్కుప్రబలప్రమాణములు గలవు. ప్రతాపరుద్ర యశోభూషణమున విద్యానాథమహాకవి

"సోమార్కాభిజనం త దద్య జయతి శ్రీకాకతీయాన్వయః
పాతివ్రత్య మఃపైతి సాంప్రత మహీా వ్యాస్మాసు విశ్వంభరా
అస్మాభి ర్నిజదోః ప్రసూతి మధునా ధన్యా మజో మన్యతే
యత్కర్తృత్వముపాదిశ త్కులపతి ర్దేవస్స్వయంభూ స్స్వయమ్"

అనియు

"ఆమూలా త్ఫలితా ప్రసత్తిలతికా పత్యు స్స్వయంభూ ప్రభో
రాజ్ఞా క్షత్త్రియమౌళిమండవమణే స్తాతస్య సానుగ్రహా

అనియు మున్నుగాఁ గాకతీయులు క్షత్త్రియులని చెప్పియున్నాఁడు. ఇందు మొదటిది నాటకప్రకరణమున రుద్రదేవి వాక్యము. దాని ప్రకృతోపయుక్తార్థము.—ఇపుడు బ్రహ్మ మా చేత నిజదోఃప్రసూతి యగుక్షత్త్రి జాతిని గృతకృత్య మైనదానినిగాఁ దలంచుచున్నాఁడని. రెండవదియందు రెండవప్రతాపరుద్రునివాక్యము. దానికి క్షత్త్రియశ్రేష్ఠుండగు తండ్రి యొక్క (రుద్రదేవియొక్క) సానుగ్రహమైన యాజ్ఞయని యుపయుక్తార్థము. కాకతివారు క్షత్త్రియులు గాకున్న నీయర్థము లన్వయింపవు.

"సాహస్రాంశవ మైందవంచ మహతీ యే ద్వే కులే నిర్మితే
తే జాతే లఘునీ గుణై ర్విజయిని శ్రీకాకతీ యాన్వయే"

అని మొదలగువానియందుఁ గాకతికులమును సూర్యసోమవంశములకు భిన్న మైనదానినిగాఁ జెప్పుట కాకతీయ క్షత్త్రియత్వబాధకంబు

గాదు. సూర్యచంద్రవంశ్యులే కాక యితరులు గూడ క్షత్త్రియులు గలరు. లేదా,

> « కాకత్యాః పరశక్తేః కృపయా కూశ్మాండవల్లికా కాచిత్
> పుత్త్రి మసూత తదేత త్కుల మనఘం కాకతీయ మభూత్

అని అనితల్లిశాసనములో నున్నది. కాఁబట్టి అట్టివార్త విద్యానాథుని హృదయారూఢం బై యుండి కాకతికులము సూర్యసోమాన్వయములకు భిన్న మైనక్షత్త్రియకుల మని వర్ణించి యైన నుండవచ్చును, కానిచోఁ గాకతివారు క్షత్త్రియు లని బోధించెడుపైవాక్యములు విరోధించును. కాఁబట్టి యది వీరిక్షత్త్రియత్వమునకు బాధకంబు గాదు.

> « క్షుద్రక్షత్త్రియపక్షశిక్షణవిధౌ ప్రోక్షిప్తకాక్షేయకాః »

అనుటచే వీరు క్షత్త్రియేతరు లని కొందఱియూహ సరియైనది కాదు. రాజు దుష్టజనశిక్షకుం డనునపుడు రాజునకు జనసామాన్యాంతర్గతి యు దుష్టరాజగజాంకుశ మనునపుడు రాజసామాన్యాంతర్గతియు లేక పోవలసి వచ్చును. కాన విద్యానాథుండు కాకతీయులు క్షత్త్రియు లని చెప్పినాఁ డనువిషయము నిరపవాదంబు. సిద్ధేశ్వరచరిత్రము సోము దేవరాజీయము మున్నగాఁ గొన్నిగ్రంథములు గూడఁ గాకతీయులు క్షత్త్రియు లని నుడువుచున్నట్లు రావుగారుగూడ వ్రాసియున్నారు. విద్యానాథీయసంవాదంబున నవియుఁబ్రమాణకోటిం జేరుచున్నయవి.

ఇవిగాక గణపతిమహారాజులు గుంటూరుజిల్లా పేరూటుపల్లి శాసనములోఁ దాము సూర్యవంశజుల మని సూర్యునినుండి తమ వఱకు వంశావళి వ్రాయించి యున్నారు.

> « ఇచ్ఛాసిద్ధ్యై హిమగిరిసుతాబద్ధదోరాలవాలం
> దేవం లంబోదరకరిముఖం వందనైర్నందయామః

యస్య క్రీడాపరణతిభువో మేరుశృంగస్ఫులింగా
స్సంధ్యాశ్యాంతే దురితతిమిరోత్సారణా కార్యసూర్యాః ”
అని యుపక్రమించి కొన్ని పద్యములతరువాత

“ విశ్వైనసాంధతమసాంధ్యని రాకరిష్ణు
రంభోరుహాం చ హరితాం చ వికాసహేతుః
య స్యేక్షణా జ్జగదశేష మిదం సిసృక్షో
రావిర్బభూవ భగవా నయ మంశుమాలీ
తస్మో మను రభూ న్నామ్నా శేఖరో నయదర్శినామ్
విశ్వరాజన్యమూర్ధన్యచూడామణి రివాపరః
ఇక్ష్వాకు ర్నామ తస్మి న్నభవ దభిజనే
భూభుజాం చక్రవర్తీ సాకూ చ్ఛ్రీవత్సవకూ
స్స్వయ ముదితె ఇవ త్రాతుకామో ధరిత్రీమ్ ”
అని చెప్పుచువచ్చి

“ అథ నిరవిశ దుర్వీం తత్కులోదన్వదిందుః
కిల జలనిధివేలామేఖలాం ప్రోలరాజః
కనదురుకరవాలః కాలకాలాంబువాహా
భ్యుదయ......హంసః ” అని.

వారిదండనాయకుఁ డగు బయ్యననాయకుని పుత్త్రుం డగుజగదాళ ముమ్మడినాయకుఁడు గణపతి పరిపాలనకాలముననే స్థాపించిన పాకాల శాసనములోఁ గాకతీయులు సూర్యవంశజు లైనక్షత్త్రియు లని వ్రాయించి యున్నాఁడు. ఈవిషయము రావుగారు గూడ నీచరిత్రము నైదవప్రకరణమున 149 పేజీలో వ్రాసియున్నారు. అయినను “కాకతి గణపతిరాజు చక్రవర్తిపదమును వహించిన తరువాత నాతనిఘనత నిరూపించుటకై యతఁడు సూర్యవంశజుఁ డని కల్పింపఁబడి శ్లాఘింపఁ

బడినది" అని శ్లోకము క్రింద గణించినారు. అందునకు దృష్టి కరము లైన కారణములు గానరావు. వారియిష్టప్రకార మొకవేళ నాతం డట్లు పొగడి యుండు ననుకొందమన్నను గణపతిమహారాజు వ్రాయించిన శాసనమున కేమి చెప్పవచ్చును? తమకులవిషయమై వారు స్వయముగ వ్రాయించిన శాసనమునకన్న నితరము బలవత్తరము గాదుకదా! పూర్వపురాజులు సూర్యవంశమువార మనియో చంద్రవంశమువార మనియో వ్రాయించుకొనువాడుక గలదని కొంద అనుచున్నారు. అట్లూహించినపుడు స్వమతమున వాస్తవక్షత్రియు లెవరో వారియందుఁ గూడ నీశంక కవకాశము గలుగక మానదు. ఇంతకు రాజాధిరాజై వర్ణాశ్రమపరిపాలకుండై ఘనతఁ జెందిన య గ్గణపతిదేవుండు క్షత్రియుల మని యసత్యముగఁ గులముగానికులము నేల వ్రాయించును? అంతటిఘనుం డట్లసత్యము వ్రాయించినచో లో కులు నిందింతురుగదా! ఇఁక గణపతిదేవునకుఁ బూర్వులావంశపురాజులు క్షత్రియుల మని యెవరును వ్రాయింపలే దని యొకశంకను దెచ్చు చున్నారు. పూర్వులు జాత్యంతరులమని వ్రాయించి యున్నచో దీని కది బాధకం బగునుగాని యేకులమువారమనియు వ్రాయింపకయుండి నపుడు వారికి క్షత్రియత్వ మనభిమతం బని యూహించుట కవకాశ మించుకైన లేదు.

ఇంకొకటి. కాకతివారి కులగురుపరంపరలోఁ జేరి రుద్రాంబిక కాలమునను ద్వితీయప్రతాపరుద్రుని కాలమునను నుండి యపరశివావ తార మని పొగడ్త గన్న శివదేవమహాముని గుంటూరుజిల్లా మంగళ గిరితాలూకా మల్కాపురములో స్థాపించిన దాన శాసనమున

‹ అస్తి స్వస్తిమతీ తనుర్భగవతో దేవస్య తస్యాస్స్ఫుర
న్నాభీపంకజసంభవస్య భుజతో యే క్షత్రియా జజ్ఞిరే

తేషాం తిగ్మమరీచిసంతతిభువో యే దుర్జయాః క్షత్రియా
స్తేషా మస్తి కులం కలంకరహితం శ్రీకాకతీభూభుజామ్'

అని వ్రాయించినాఁడు.

ఈశాసన మెల్లఁ జదివినవారికి శివదేవమహామునియొక్క సత్య శౌచశమాదులు తేటపడఁ గలవు. ఈమహానుభావుఁడు కాకతివారిచే నీయఁబడిన మందర మనునగ్రహారమును సజ్జనులకుఁ బంచిపెట్టిన వాఁడు కాఁబట్టి స్వసుఖపరుఁడై పోషకుల ప్రీత్యర్థమై కల్లలు చెప్పువాఁడు కాఁడనియు, కాకతివారికులగురువై వారిసామ్రాజ్యకాలమున నున్న వాఁడు కాఁబట్టి వారికులవృత్తాంతము చక్కఁగఁ దెలిసియున్నవాఁ డని యు, నిస్సంశయముగఁ జెప్పవచ్చును. ఇంతటివారి శాసనములందుఁ గూడ సంశయించినచో నిఁక నెవ్వియుఁ బ్రమాణపదవి నధిరోహింపఁ జాలవు. ఇదిగాక దీనిని రావుగారు పరమప్రమాణముగా 12 ప్రకరణ మున రుద్రదేవీవృత్తాంతమున నెత్తికొన్నవారు. తమకుఁ గావలసిన యంశములోఁ బ్రమాణ మని వ్రాసి తమకుఁ బ్రతికూలమైనయంశ ములో నప్రమాణ మని తీసివేయుటకు వలను లేదు. అట్లగుచో స్వకీయ ప్రామాణికతకు భంగము రాఁగలదు. ఇటులుండఁ గాకతివారి కుల విషయమై చర్చించునపుడు దీనినిబయలుపడనీక మూసిపెట్టి "కాక తీయులు క్షత్రియకులమువారు కారనియు, చతుర్థకులజులే యనియు నిటీవల దొరకినరెండుశాసనములలో స్పష్టముగఁ గానంబడుచున్నది." అని రావుగారు వ్రాయుటవలన నందేదియో విశేష ముండునని బోధప డక పోదు. ఒకవేళ క్షత్రియు లనియొప్పినచో వారిపంక్తిభోజనలాభ మున మాకు ఘనతగలిగినదని పద్మనాయకులు చెప్పకొనవత్తురు. అది స్వసిద్ధాంతమున కడ్డము వచ్చునని తలంచి యిటులు వ్రాసిరేమో! అట్టి మహానుభావులే కదా! కానిచో గణపతిదేవునియొక్కయు నాతనిగురు వుయొక్కయు నాతనిదండనాథునియొక్కయు శిలాశాసనములు ప్రతా

పరుద్రయశోభూషణము సిద్ధేశ్వరచరిత్రము సోమదేవరాజీయము ము న్నగుగ్రంథములు కాకతివారు క్షత్త్రియు లని ఘంటాఘోషముగఁ జాటుచుండఁగా నన్నింటిని దలక్రిందుచేసి యిటులు వ్రాయ సాహసింపగు. దీనినిజ మెటు లుండిన నిఁక వా రగపఱచిన మల్యాలగుండయ దండనాథునిభార్య కుప్పమ్మశాసనములు వారిసిద్ధాంతమున కెంతమాత్రము సాధకంబు లగునో విమర్శింతము. అందొక్కటి

« తేషా మమేయమహిమా మహింతే వర్ణాశ్రయః
ప్రసవభూమి రతిప్రవృద్ధః । శుద్ధో భవ త్సమధికం
చతుర్వర్ణానాం దుగ్ధాబ్ధివ త్పుమరత్నగుణై
......ప్రశస్త మస్తి తత్రాపి కాకతీయకులమ్........."

అని మాత్రమే రావుగారిచే వ్రాయఁబడినది. ఇంతమాత్రమునఁ గాకతివారుశూద్రులని చెప్పుట కవకాశము లేదు. వారికులప్రస్తావమే యుండుఁగానరాదు. దీనిపూర్వోత్తరసందర్భములలో నావిషయ ముండు నం దు రేమో! అనుపయుక్తమైనదానిని బ్రకటించి యుపయుక్తమైన దానిని సమయము వచ్చినపుడు మూసిపెట్టనేల? అందునకుఁ గారణ మెద్దియో యుండు నని తోఁపకమానదు కదా! కాన నిది వారి సిద్ధాంతమునకు సాధకము గాఁజాలదు. అందువలన « ఇటీవల దొరకిన రెండుశాసనములలో » అని వారువ్రాయుట సరిగాదని తేలినది.

ఇఁక మఱియొకటిమాత్రము కాకతీయులు క్షత్త్రియులుఁ కారని బోధించుచున్నట్లు కానవచ్చుచున్నది. అందు

« అసృజ చ్చతురో వర్ణాన్ ముఖబాహూరుపాదతః
అన్యా న్యుచ్చావచాదీని భూతాని స్థావరాణిచ
అథ స్వీకృతవర్ణోక్త ధర్మనిర్మలచేతసః
జాతాన్ ద్విజాతయః పశ్చా చ్చతుర్థకుల ముజ్జ్వలమ్

తత్రానేకనృపాలఫాలలిఖితాం వీరాంకవర్ణావళిం
దర్శందర్శ మనర్గళం సమచర త్తీవ్రః ప్రతాపానలః
యస్మా దంచిత కాకతీశ్వరకుల క్షీరాబ్ధి సంవర్ధన
ప్రౌఢాహంకృతిచంద్రమా స్సమభవ త్ప్రోలాభిధానో నృపః ॥

అని యున్నట్లు వ్రాసినారు. ఇయ్యది పూర్వోదాహృతశాసన గ్రంథాది ప్రబలప్రమాణవిరుద్ధం బగుటచే సంశయింపఁ దగియున్నది. దీనివలననే యవి సంశయింపఁదగిన వని యెంచుటకిది యసహాయం బగుటచే వానికన్న దుర్బలంబై యున్నది. చక్రవర్తియై వర్ణాశ్రమస్థాపకుఁ డగు గణపతి దేవుండును త్రికాలవేత్త యగు నాతని గురువును మహాపండితుఁ డగు విద్యానాథుండును వ్రాసినవ్రాఁతలకన్న నెవరికో దండనాయకుండగు మల్యాల గుండయభార్య కుప్పమ్మ వ్రాయించినశాసనాక్షరములు ప్రమాణము లని చెప్పుట యొప్పదు కదా!

ఇదిగాక, దీనియర్థము పరిశీలింపఁదగి యున్నది. తత్ర తీవ్రః ప్రతాపానలః అనర్గళం సమచరత్ అని యన్వయము, అందు దుస్సహమైనప్రతాపాగ్ని యడ్డము లేకుండ సంచరించెను. అని యర్థము. వీరాంకవర్ణావళిని జూచిచూచి సంచరించె ననుటయందేమియు విశేషము లేదు గాన దానిని జూచి చూచి (వెదకి వెదకి)భక్షించెను నశింపఁజేసెను అనుట సమంజసము. ఎట్లయిన నగుంగాక. ఉత్తరార్ధమున యస్మాత్ అనుదానిచేఁ బ్రతాపాగ్నియే పరామర్శింపఁ బడును. ఏప్రతాపాగ్నికిఁ బ్రోలరాజు గలిగెనో యని యన్వయము చెప్పవలయును. ప్రతాపాగ్నినుండి పురుషుఁ డుదయించె ననుట యసంభావితము. అగ్నిగా నొకపురుషుని వర్ణించి యుండవచ్చు నన్నచో నపుడు పూర్వ మెవనినో చెప్పి వాఁడు ప్రతాపాగ్నియే యని వానియం దగ్నిత్వము నారోపించి వానివలనఁ బ్రోలరాజుదయించె నని చెప్పుట సంప్రదాయానుగుణము. అటులేమియు నందునేమో యని సంశయధోరణి ప్రబలుచున్నది.

ఇంతేకాక జాతాః అని యుండఁదగినచోట జాతా అని యుండుటయు అన్వయము లేక 'ఉచ్చావచాదీని' అని యుండు టయు తేషా మమేయ అనుశ్లోకములో నొకగణము లుప్తమై ఛందోభంగ మగపడుచుండుటయు మున్నగువానిచే శాసనమును బ్రకటించు వారు పరిశీలించినచో మఱి యేరీతిగ నుండునో యన్న సంశయము ప్రబలుచున్నది. కాఁబట్టి పైప్రబలప్రమాణములకు విరోధము లేకుండ యథోచితముగ దీనియర్థము దీసికొనం దగి యుండును. ఇందువలన నిటీవల దొరకినరెండు శాసనములలోఁ గాకతీయులు క్షత్రియులు కారనియుఁ జతుర్థకులజు లనియు రావుగారు నిర్ధారించుట కవకాశము కానరాదు.

ఇఁక గణపతిదేవుఁడు తత్పూర్వులు చతుర్థాన్వయు లయినకమ్మనాటి వెలనాటి వారితో సంబంధము చేయుచుండి రనునది విమర్శింపవలసి యున్నది.

పూర్వయుగములలో ద్విజులకు స్వావరజాతికన్యావివాహము శాస్త్రసిద్ధమే కదా! అయ్యది క్షత్రియులలో విశేషముగ జరుగుచున్నట్లు కానంబడుచున్నది. భీష్ముండు విదురునకు దేవకుఁ డను రాజునకు శూద్రస్త్రీయందుఁ గలిగినకన్యను దెచ్చి పెండ్లిచేసినట్లు మహాభారతాదిపర్వమున 114 అధ్యాయమున

"అథ పారశవీం కన్యాం దేవకస్య మహీపతేః
రూపయౌవనసంపన్నాం స శుశ్రావ పగాసుతః
తతస్తు వరయిత్వా తా మానీయ భరతర్షభః
వివాహం కారయామాస విదురస్య మహామతేః"

అని చెప్పఁబడినది. ఇంక ననేకదృష్టాంతములు సుప్రసిద్ధములు. ఆయాచారము కలిలోఁ గూడఁ గొంతవఱ కనువర్తించినది. మహానందియను

రాజు శూద్రస్త్రీని వివాహమాడెననియు నామెకు మహాపద్మపతి జనించెననియు మార్కండేయపురాణోత్తరభాగమున

“ మహానంది ర్మహారాజో రాజ్యం కుర్వ న్మదోత్కటః
స రాజా రాజకన్యాం చ ఏకాం శూద్రకులోద్భవామ్
కన్యాం గ్రహిష్యతి ముదా పత్నీత్వే నామ తచ్ఛ్రిణు
మహానందిసుతో రాజా శూద్రాగర్భోద్భవో బలీ
మహాపద్మపతిః కశ్చి న్నందః క్షత్త్రివినాశకృత్ ”

అని చెప్పఁబడినది. ఇటీవలి రాజులు గూడ స్వాపరజాతులలోఁ జక్కని కన్యలం జూచి మేము క్షత్త్రియులము మాకుఁ దక్కునవర్ణములలోని కన్యలను బెండ్లియాడుట శాస్త్రసమ్మతం బని తదాచారము ననుష్ఠించుచు వచ్చిరి. చాళుక్యవిష్ణువర్ధనమహారాజు వైశ్యకులమునఁ బుట్టిన కన్యకాంబను బెండ్లియాడ నభిలషించిన విషయము వైశ్య పురాణప్రసిద్ధంబు. ఈవలివారు కొందఱు గాంధర్వవిధిగా స్వీకరించియుంపుడుగత్తెలనుగాఁ జేయ సాగిరి. కృష్ణదేవరాయ కోటకేతరాజాదులు గూడ నిట్లాచరించినవా రనుట చరిత్రశాసనాద్యాధారము. ఇట్టి స్త్రీలయందుఁ గలిగినబిడ్డలు రాజకుటుంబముతోపాటు గౌరవింపఁబడుట గలదు, ఇట్టి స్త్రీలయం దుదయించిన కన్యలను దదనురూపవరుల కొసంగి విభవముతో వివాహములు చేసి వారలను రాజమర్యాదలతో నుంచుటయు వినుచుఁ గనుచు నున్నారము. ఘనతఁ జెందిన మైసూరుమహారాజుగారు కృష్ణరాజ వొడయరుగారు తమయుంపుడుకత్తెలం దుదయించిన కన్యలను యుక్తవరుల కిచ్చి బహువైభవముగ వివాహములు చేయుటయు వారలు విశేషగౌరవస్థితిలోఁ నుంచుటయుఁ బ్రత్యక్షసిద్ధము. అట్టివారు మేము మహారాజుగారియల్లుండ్ల మని చెప్పుకొనుచుందురు. ఇట్లు గణపతి దేవుండు మున్నగు కాకతీయులు గూడఁ గమ్మనాటి వెల

నాటికన్యలను స్వీకరించి యుందురు. వారలయందుఁ గలిగినకన్యలను దక్జాతీయులకే యిచ్చి వివాహము చేసి వారలను రాష్ట్రాధిపతులను గావించి యుందురు. వారలు కాకతీయుల బంధువుల మని ప్రకటింపకొనుచుందురు. ఇంతమాత్రమునఁ బైప్రమాణముల నన్నింటిని మూలఁబడవైచి కాకతివారు శూద్రకులజు లని రావుగారు సిద్ధాంతము చేయుట సరిగాదు.

కొందఱు కవులు కాకతివారు చంద్రవంశమువా రని వర్ణించుట పైశాసనగ్రంథాదులప్రామాణ్యమును నిరోధింపఁ జాలదు. వారికీశాసనాదులు దెలియకుండి యటులు వారు వ్రాసి యుండవచ్చును. మహామహోపాధ్యాయకోలచల మల్లినాథసూరిపుత్త్రుఁడైన ప్రతాపరుద్రీయవ్యాఖ్యాతయగు కుమారస్వామి సోమయాజియే పొరపాటు వడినాఁ డని పంఁడ్రెండవప్రకరణమున రావుగారు వ్రాసియున్నారు కారా! అట్టిమహాపండితుఁడే పొరపాటు నొందినపుడు సామాన్యకవులు పొందుట యంతగొప్పదిగాదు. ఒకవేళ నెవ్వండైనను విరోధముగ వ్రాసియుండినను నది « నహికస్యచి ద్గ్రంథకృతో విపరీతలేఖనం యుక్తిబలా ద్వస్తుసిద్ధౌ బాధకమ్ » అనుగదాధరభట్టాచార్యసూక్తి వలన విరోధించునది కాదు. ఈవిషయము రుద్రదేవీవృత్తాంతముతోడఁ బ్రత్యేకముగ వ్రాయుచున్నాను. కాన నిట విస్తరభీతిచే విరమించుచున్నాఁడను.

ఇట్లు పరమతసాధకము లనితోఁచినమూడువిషయములను నిరసించి నట్లెంచి యిపుడు స్వకపోలకల్పితములను వ్రాయుచున్నారు.

« ఇవిగాక పద్మనాయకచరిత్రములోని వని మఱికొన్నిపద్యములు రావువంశీయులచరిత్రమునందు నుదాహరింపఁబడియున్నవి. అయ్యవి సత్యాన్వేషణపరు లైనవారిని గమ్యస్థానమునకుంగొనిపోవుటకుం జాలియున్నవి.

సీ. రెడ్డిసంతతికి మాఱొడ్డిభేదం బైన
కుల ముద్ధరించి రీవెలమవారు
పద్మనాయకమానభంగంబు గాకుండ
బలియురై నెగడి రీవెలమవారు
గడిదేరి కాకతిగణపతి గొలిచియు
నిల నేలు ప్రభువు లీవెలమవారు
కాఁపులమాట్కికై కడఁగి వెలమలందు
నిలిచినశూరు లీవెలమవారు
సమరగాంగేయపటిమచే జరుపువారు
మిగుల మానంబునకుఁ బ్రాణ మిచ్చువారు
వినయఘనులైన నెరమన్నె వెలమవారు
పద్మజఖ్యాతిచే భువిఁ బరఁగువారు.

అని పద్మనాయకచరిత్రమునం దొకపద్యము గానంబడుచున్నది. దీని లోని "రెడ్డిసంతతికి మాఱొడ్డిభేదం బైనకులముద్ధరించి రీవెలమవారు" అను మొదటిచరణముయొక్క భావమును దెలిసికొనవలసి యున్నది. రెడ్లను బ్రతిఘటించి వేఱుపడిన కులము నుద్ధారణము చేసి రని భావ మేర్పడుచున్నది. ఇందలి భావమును దృఢపఱచునట్టి గాథ యెద్దియైనఁ గలదా యని మనము దెలిసికొనవలసియున్నది. అయ్యది పల్నాటి వీరచరిత్రమునం గానంబడుచున్నది. అందు బ్రహ్మనాయఁడు నాయకురాలితోఁ జేసినయుద్ధము కులముపోరని పలుతావులఁ జెప్పఁ బడియున్నది. అందు కులవిచక్షణము లేక బ్రహ్మనాయఁడు మాలలు, మాదిగలు, గొల్లలు, కంసాలులు, కమ్మరులు, కుమ్మరులు, రజకులు, రెడ్లు, మొదలగు తెగవారితోఁగలిసి చాఁపకూడుకుడిచె నని చెప్పఁబడియున్నది." అని.

ఇపు డీవిషయము స్మరింపఁదగి యున్నది. పద్మనాయకచరిత్ర మనునది పద్మనాయకుల గుణవర్ణనమునకై ప్రవర్తించినది కాని వారల

యందు దోషముల నారోపించుటకుఁగాదు. ఇట్టి గ్రంథములో నెద్దియేని స్థూలదృష్టికి దోషముగ భాసిల్లినచో విమర్శించి తన్నిర్ణయము చేసి కొనుట యావశ్యకము. కొందఱు రెడ్డినాయకులు మేము పద్మవెలమల మని చెప్పుకొనుచుండఁగా, బద్మనాయకులు కాకతీశ్వరునొద్ద జగడము పెట్టుకొని ప్రమాణపరిశీలన పురస్సరముగఁ దామే ముఖ్యముగఁ బద్మవెలమ లని తీర్మానము నొంది దశవిధవెలమలఁ జాయఁ ద్రోచి రని వెనుక వ్రాసియున్నాను. ఆవృత్తాంతమును గ్రంథకారుఁడు

సీ. « రెడ్డిసంతతికి మాఱొడ్డి భేదం బైన
కుల ముద్ధరించి రీవెలమవారు »

అని వర్ణించినాఁడు. భేదంబైన అనఁగా నితరదశవిధవెలమకులమునకన్న వేఱైన అని యర్థము. ఈవాక్యమును బోనాడి రావుగారు రెడ్డిసంతతి కనునది పద్మనాయకకులమున కేమియో యపకర్షమును జెప్పుచున్నటులు భావించుచు దీనిని దృఢపఱచునట్టి గాథయెద్దియైనఁ గలదా యని చూడఁగా, బల్నాటివీరచరిత్రము సహకారమైనట్లభిప్రాయపడుచున్నారు. బ్రహ్మనాయుఁడు నాయకురాలితోఁ జేసిన యుద్ధముఁ కులముపోరనిపలుతావుల వ్రాయఁబడినదఁట. బ్రహ్మనాయుఁడు కులహీనుఁ డని యాక్షేపణ రాఁగా నాయన రెడ్లతోఁ బ్రతిఘటించి నానాజాతులలో నుండి వేఱుపడినకులమును సంపాదించుకొన్నందున « రెడ్డిసంతతికి మాఱొడ్డి '' యని పైచరిత్రమున వ్రాయఁబడిన దని సమన్వయించినారు. సమస్తులకెద్దియు నసాధ్యం బుండదు. అయినను బల్నాటివీరచరిత్రములో బ్రహ్మనాయుఁడు కులముసంపాదించుకొనుటకై నాయకురాలితో యుద్ధము జేసినాఁ డని యెచ్చోటనైనను వ్రాయఁబడి యుండవలెఁ గదా! ఆచరిత్రము సుప్రసిద్ధము కాఁ బట్టి దానిని జదివినవారెందఱో యీవిషయము నెఱింగియుండఁ గలరు. వారలకుఁ బల్నాటియుద్ధము జరుగుటకుఁ గారణ మేమో సంపూర్ణముగఁ దెలిసి

యుండకమానదు. కాన నేనుదాని నిట వివరించుట యనావశ్యకము.

ఇంతయేల ? ఈయాంధ్రులచరిత్రముయొక్క యేడవప్రకరణ మంతయుఁ బల్నాటివీరచరిత్రమే కదా ! అందు "నాయకురాలి దుస్తంత్రములు" అని మొదలుకొని నాయకురాలు నలగామరాజు మనోరంజనము చేసి యాయనచేతఁ జేరినవిధము తరువాత బ్రహ్మనాయనిపైఁ గొండెములు చెప్పి రాజున కాయనయెడఁ బ్రీతిలేకుండఁ జేసినవిధము తరువాత బ్రహ్మనాయఁడు మలిదేవరాజులను దీసికొని మాచర్ల చేరినవిధము తరువాత నాయకురాలు బ్రహ్మనాయనివైభవమును సహింపఁజాలక మాచెర్లద్రోహించుటయుఁ గోడిపందెము పెట్టి బ్రహ్మనాయని నోడించి వలసపంపుటయు వలసపోయి మందాడిలోనున్న బ్రహ్మనాయని యావులమందను మరల్చుటయు నావల మలిదేవరాజాదులను దీసికొని బ్రహ్మనాయఁడు శ్రీశైలముఁ జేరి యేడుసంవత్సరములు గడిపి యలరాజును నలగామరాజునొద్దకు రాయబారిగా నంపఁగా నాయకురాలాతని జంపించుటయు నావలఁ గార్యమపూడిలో యుద్ధము జరుగుటయు రావుగారు తామే వ్రాసియున్నారు. ఇందులో నెచ్చోటనైనను బ్రహ్మనాయఁడు తనకు లేపకులమును సంపాదించుకొనుటకుఁ గలహించిన ట్లున్నదేమో వారే యాలోచింపవచ్చును.

ఇంకఁ బల్నాటివీరచరిత్రమునఁ గార్తవీర్యసంతతివాఁ డగు ననుగురాజు తనకు సంతానములేక బ్రహ్మనాయనియన్నను పెద్దన్నను బుత్రునిగా స్వీకరించి క్షత్రియుండగు కృష్ణగంధర్వునికన్య నిప్పించి వివాహముచేసె నని వ్రాయఁబడియున్నది. పెద్దన్న వాస్తవమున నంత నీచకులమువాఁడై యుండిన సచ్ఛక్షత్రియుఁడగు ననుగురాజు పుత్రునిగా నాతని నెట్లు స్వీకరింపఁగలఁడు. స్వీకరింపఁదగినంతకులప్రాశస్త్య ముండిననే కదా స్వీకరించియుండును. కాన నిదంతయు రావుగారియొక్క కల్పనాకౌశలంబే కాని వేఱుగాదు.

ఇఁకఁ గులముపోవన్న దానిని సాధింప బ్రహ్మనాయఁడు కులవిచక్షణము లేక నిమ్నజాతివారితో భుజించెనని వ్రాసినారు. "లబ్ధవర్ణో విచక్షణః" అనుకోశమును బట్టి విచక్షణశబ్దము ధర్మబోధకముగ నున్నది. అది బ్రహ్మనాయనియందన్వయింపదు. కులము విచక్షణము లేక యనుకొన్న బ్రహ్మనాయఁడు అనుప్రథమాంతముతో నన్వయింపదు. ఎట్లయిన నగుంగాక. బ్రహ్మనాయనికిఁ గులము విచక్షణము గాక యుండుట పైవారలతో భుజించినతరువాతనా? అంతకు వెనుకనా? చాఁపకూడు కుడిచినతరువాత నైనచో నట్లాచరించిన యొక బ్రహ్మనాయనికే కులప్రాశస్త్యము లేక పోవును గాని పద్మనాయకుల కెల్ల లేకపోదు. అట్టివారు ప్రతికులములోనునుండచ్చును అంతమాత్రమున నందఱకు నాదోషము రాఁగలదు. బ్రహ్మనాయనితో రెడ్లు చాఁపకూడు కుడిచినట్లు వ్రాసినారుకదా! అందువలన రెడ్లందఱు కులహీనులు కావలసి వచ్చును. చాఁపకూటికుడుపునకు మున్నే బ్రహ్మనాయనికుల మప్రశస్తమైయుండెనన్నచో దానికిఁ గారణం బెద్దియో యెచ్చట వ్రాయంబడినదో నిరూపించుట యావశ్యకము. ఇదిగాక పల్నాటి వీరచరిత్రమున బ్రహ్మనాయనియన్న బాదన్న యనుగురాజుచేఁ బుత్రుఁడుగా స్వీకరింపఁబడియుండెనని వ్రాసియున్నాను. పెద్దన్న మొదలగువారలతో ననుగురాజు గలిసి భోజనాదుల నొనరించుచుండెనని చెప్పకతప్పదు. కులప్రాశస్త్యమున్ననే కాని యిది ఘటిల్లదు. బ్రహ్మనాయఁడు ముందే కులహీనుండన్నచో దానివిరోధము పరిహరింపవలసి యుండును.

ఇంతియ కాదు. కులప్రాశస్త్యము లేని బ్రహ్మనాయనితో గొల్లలు కంసాలవారు కమ్మరులు కుమ్మరులు రెడ్లు చాఁపకూడు కుడిచి రనుట సంశయింపఁదగి యున్నది. యజ్ఞోపవీతము ధరించి ద్విజుల మని చెప్పుకొనెడు కంసాలలు మొదలగువారు, సచ్ఛూద్రు లనఁబడుగొల్లలు

శూద్రులలో నుత్తము లగు రెడ్లు కారణము లేక భుజింపరు కదా! బ్రహ్మనాయఁడు రెడ్డికులమునకు మాఱొడ్డి కులమును సాధింపఁ బోరాడునపుడాతనితో రెడ్లుకలిసి భుజించిరో తోఁపదు. ఇదిగాక యీచాఁపకూటికుడుపునకుఁ గారణములు భిన్నభిన్నములుగ నున్నవి. ఇచ్చట రావుగారు "వారలతో భ్రాతృభావము నెరపుటకై చాఁపకూటికుడిచి" అని వ్రాసినారు. ఇందువలన భ్రాతృభావము నెఱపుట దీని కారణ మగుచున్నది. ముందువీ రుదాహరింపఁబోవు "ఇచ్చోటభుజియించి లేకకార్యార్థులై" అను క్రీడాభిరామవాక్యమువలన నేక కార్య సాధనము దీనికారణ మగుచున్నది. ఏడవప్రకరణము 229 పేజీలో "వెలమకులమున జన్మము గాంచిన బ్రహ్మనాయఁడు రామానుజులచే బోధింపఁబడిన వైష్ణవమతమును స్వీకరించి తన్మతాభినివేశపరుఁడై యామతమును బల్నాటిలో వ్యాపింపఁజేసి ప్రసిద్ధుఁడయ్యెను. ఇతఁడు కులభేదమును బాటింపక అగ్రవర్ణమువారిని శూద్రవర్ణమువారినిగూడ వైష్ణవులను గావించి తనతోఁ గలుపుకొని సహపంక్తిభోజనము గావించినట్లు వీరచరిత్రమునఁ బలుతావులఁ బేర్కొనంబడెను" అని వ్రాసినారు. అందువలన బ్రహ్మనాయఁడు మతాభినివేశమున జాత్యంతరులతో భుజించినట్లు తేటపడుచున్నది. ఇట్లు చాఁపకూడుకుడుపునకు ననేక కారణములు గలిగినవి. ఇందెద్ది వాస్తవమో తెలియదు.

పరిశీలించినచో మతాభినివేశమే సరియైనకారణముగఁ గానంబడుచున్నది. కానిచో నగ్రజన్మమువారుగూడ నాతనితో భుజింపరు. వైష్ణవమతమును స్వీకరించినచో నట్టిన్యూనాధికభావములు లేక భ్రాతృభావముతో నందఱుగలసి భుజించుట తగియున్నది. వారిమతమున

"నశూద్రా భగవద్భక్తా విప్రా భాగవతాః స్మృతాః
సర్వవర్ణేషు తే శూద్రా యే హ్యభక్తా జనార్దనే"

ఇత్యాదిప్రమాణములచే వైష్ణవత్వమువలన నుత్తమత్వము రాఁగలదు. వైష్ణవులను గావించినతరువాతనే కదా బ్రహ్మనాయఁడు వారలతోఁ గలసి భుజించినవాఁడు. కాఁబట్టి యిదియే వాస్తవమైన కారణము. కులముపో రనునది కులమువారికి (సవతులపిల్లలకు) గలిగిన జగడ మని బోధించును. కానిచో «ఇల పణంబుగ» అనునది సమన్వయింపదు.

ఇఁక ద్వితీయకల్పనము.—«పల్నాటిభూమిపతులుగూడ గొల్ల సవతితల్లులబిడ్డ లని స్పష్టముగ క్రీడాభిరామ మనుగ్రంథమున నీక్రింది పద్యములో వాడుకొనఁబడి యున్నది.

సీ. ఇచ్చోట భుజియించి రేకకార్యార్థులై
సామంతనృపతులు చాఁపకూడు
ఇచ్చోట చింతించె నిచ్చ నుపాయంబు
నలినాక్షి యార్వెల్లినాయిరాలు
నిజ మనుశుద్ధికై నిప్పులయేటిలో
నోలాడె నిచ్చోట బీలసాని
యిచ్చోటఁ బోరిరి యిల పణంబుగ గొల్ల
సవతితల్లులబిడ్డ లవనిపతులు
ధీరు లగువార లేవురు వీరపురుషు
లై మదోద్ధతి నిచ్చోటఁ నాజిఁ బడిరి
యనుచుఁ జెప్పుదు రైతిహ్యమచట నచట
జనప పెద్దలు పల్లెదేశములయందు.

హైహయవంశజుల మయిన క్షత్రియుల మనిచెప్పుకొనెడి రాచవారు నయితము గొల్లసవతితల్లులబిడ్డ లని పేర్కొనఁబడుచుండఁగా, బ్రహ్మనాయకులు కులమునఁ దక్కినవారలకన్న నెట్లధికు లగుదురో యూహింప నలవి గాక యున్నది» అని.

ఇది యేమో వింతగానున్నది. హైహయులు గొల్లసవతితల్లుల బిడ్డలని పేర్కొనం బడినా రని వీ రంతకన్నఁ దక్కువవారమని చెప్పుకొనవలెనా యేమి? వారికన్న నెక్కువజాతివా రుండఁగూడదా! పద్మనాయకు లితరులకన్న నధికుల మని చెప్పుకొన్నవారు కారు. శూద్రులలో నధికుల మని చెప్పుకొని యున్నారన్నను హైహయుల కన్న నధికుల మని చెప్పుకొని యుండలేదు.

ఒకవేళ ననుగురాజు మొదలగు హైహయులయొద్ద దొడ్డనాయఁడు బ్రహ్మనాయఁడు మంత్రులుగా నుండిరి కాఁబట్టి తమప్రభువులే గొల్లవా రైనట్టు చెప్పఁబడి యుండఁగాఁ దాము శూద్రజాతివారిలో నధికుల మని చెప్పుకొనుట తప్పని యెంతు రేమో. అది సరిగాదు. పూర్వకాలమున విప్రులే రాజులయొద్ద మంత్రులుగా నుండువారు. యవనప్రభువులకుఁ గూడ వీరు మంత్రులుగా నుండువిషయము ప్రసిద్ధము. ఇప్పటికి నమాత్యబిరుదము వహించువారి కీవిషయము తెలియనిది కాదు. అట్టివారు పైసిద్ధాంతాను సారము వారికన్నఁ దక్కువ వార మని చెప్పుకొనవలెఁగదా!

ఇదిగాక క్రీడాభిరామకారుఁడు హైహయులను గొల్లసవతిపిల్లలని చెప్పియున్నాఁ డనుట విశ్వసింపఁదగినది కాదు, అట్లు చెప్పుటకుఁ గారణం బెద్దియుఁ గానరాదు. పల్నాటివీరచరిత్రమున వారు హైహయులని శ్రీనాథుఁడు చెప్పియున్నాఁడు. ఈగ్రంథమున వారలను గొల్లలనుగాఁ జెప్పినచోఁ దద్విరోధము వచ్చును. క్రీడాభిరామమును నతఁడే చేసియున్నాఁ డనుపక్షమున స్వవచనవిరోధము వచ్చును. కాఁబట్టి ప్రమాణము లేక గ్రంథవిరోధము నెంచక సంవాదం బెద్దియుఁ గనక యాకవి యిట్టులు చెప్పియుండుననుట విశ్వసింపఁదగదు. గ్రంథములో నట్లు గాన్పించుట లేఖకపరంపరగా నేర్పడినదోషంబుగా నుండును. గొల్లపదము ప్రాసవిశ్రమస్థానములలో లేదు కాఁబట్టి "అల్లసవతి

తెల్లులబిడ్డలు" అని యుండి యిట్లు పరిణమించి యుండవచ్చును. ఇంత మాత్రము విచారింపక యేమో గొప్పయాధార మబ్బినట్లు రావు గారు క్రిందగీరగీసిచూపుట సరియైనది గాదు.

ఇఁక నుచ్చాపచకపోలకల్పనములు. అందు మొదటిది — "వల్లవుఁ డనఁగా గొల్లవాఁ డని మాత్రమే కాక వంటలవాఁడని యర్థము కూడఁ గలదు. పద్మనాయకులలో వల్లవాదిత్యా వల్లవత్రిణేత్రా వల్లవచక్రవర్తి అనుబిరుదములు గలవారు వల్లవు లనియు వారు 77 గోత్రములలోనివా రనియు రావువంశీయచరిత్రమున నున్నది" అని.

పైచరిత్రమున వీరు చూపినట్లు వ్రాయఁబడలేదు. మఱేమన్న 77 గోత్రములవారిబిరుదములు వ్రాయునపుడు 67 వ దగు వల్లవుల గోత్రముక్రింద "వల్లవులవారివి వల్లవాదిత్యా వల్లవచక్రవర్తి వల్లవ త్రిణేత్రా" అని మాత్రమే వ్రాయఁబడినది. పద్మనాయకులగోత్రములు గ్రామనామములను బట్టి యేర్పడిన వని వ్రాసితిని. వల్లవుల అను నొక గ్రామము హనుమకొండప్రాంతమున నుండఁ గలదు. కడపజిల్లా ప్రొద్దటూరునకుఁ దూర్పున 6 మైళ్లు దూరమునఁ గూడ వల్లవుల, లేక పల్లవుల యని యొక గ్రామము గలదు. "మఱి పల్లవులగోత్ర మరసి చూడ" అని పద్మనాయక చరిత్రమున నున్నది. అట్టిగ్రామవాసమున "ఏయూరనుండిన నాయూరిగోత్రంబు" అనుటచే వారి కాగోత్రముగలిగి వారాబిరుదములను వహించినవారు. రేచర్లగోత్రమువారు రేచర్లవిక్రమాదిత్య అని బిరుదము వహించినారు గదా! కాన రావుగా రూహించినది సరికాదు.

రెండవది — "పద్మనాయకులలోఁ గొందఱు గోసంగివైరితల గుండుగండా అనుబిరుదమును వహించినవారు గోసంగులనియే యూహింపవలసి యుండును" అని.

ఇది సరికాదు. లోకములో నెవరికేని వైరులుగా నున్నవారు వారికి విజాతీయులుగాను మిత్త్రులుగా నున్నవారు వారికి సజాతీయులుగాను నుండవలసినట్లు నియమము లేదు. కురు పాండవులు భిన్నజాతీయులుగారు. గుహునితో విభీషణునితో సఖ్యము నొందిన శ్రీరాముండు తజ్జాతీయుండుగాఁడు. విషయానంతరరాజు శత్రువు వానియనంతరుఁడు మిత్త్రమని ప్రసిద్ధిగలదు. అందువలన స్వరాష్ట్రానంతరుఁడు భిన్నజాతీయుండు వానియనంతరుఁడు సజాతీయుఁడు నయిరేని యుండవలసి వచ్చును. కాన నానియమము లేదు. ఇట్లగునపుడు గోసంగులకు వైరులగువారికి వైరులైన పద్మనాయకులు గోసంగు లెట్లగుదురు? శత్రువులచేఁ బీడితులై యొకవేళ గోసంగులు శరణాగతులై యుండినచో వారలను గాపాడి యాబిరుదమును వీరు వహించి యుండిన నుండవచ్చును గదా! అంతమాత్రమున వారల కాకులమువచ్చుచో “గోబ్రాహ్మణ వైరిమదాపహ” అని బిరుదమువహించినవారు పశుజాతిలోఁ గూడఁ జేరవలసివచ్చును. కాన నీయూహ నిలువదు.

తరువాత “ఎన్నివిధములుగా నాలోచించినను బ్రహ్మనాయఁడె నానాజాతినాయకుల నొక్కచోటికిఁ జేర్చి రెడ్లతోఁ బ్రతిఘటించి పోరాడినవాఁడు. వానితరువాతనే పద్మనాయకులు కాకతీయులను గొల్చుచు గణపతిచక్రవర్తి రుద్రమదేవి ప్రతాపరుద్రచక్రవర్తి మొదలగువారి పాలనములో గొప్పపదవులను వహించి కాకతీయరాజ్యసంరక్షకులై యొప్పిరి” అని వ్రాసినారు.

పైదృష్టాంతములవలనఁ బద్మనాయకులు నానాజాతివారని యేర్పడినట్లు తలంచి యిటులు వ్రాయుచున్నారు. ఇయ్యది వెనుక బహుభంగుల నిరస్తం బైనది కాఁబట్టి మరల వ్రాయుట యనావశ్యకంబు. నానాజాతులతోఁ గలిసి యున్నచో నొకబ్రహ్మనాయఁడె నింద్యుఁడగును గాని యందువలనఁ గులమువా రెల్ల రెట్లు నింద్యులు

కాఁగల రనునాక్షేపము వచ్చునని «వానితరువాతనే పద్మనాయకులు కాకతీయులను గొలిచి» అని మొదలుగా వ్రాసినారు. ఇందువలన నాతనినింద్యత కులమువారి కందఱకుఁ గలదని వీరితాత్పర్యము.

ఇది యెల్ల స్వవచోవ్యాహతంబు. బ్రహ్మనాయునికిఁ బూర్వులు పద్మనాయకులు గణపతికిఁ బూర్వులైన కాకతీయులను నితర రాజులను గొలిచి యున్నట్లు వీరే వ్రాసియున్నారు. 7 వ ప్రకరణమంతయుఁ బల్నాటివీరచరిత్రము వ్రాసినారు. అందు బ్రహ్మనాయుని తండ్రి దొడ్డనాయఁడు హైహయుఁడగు ననుగురాజునొద్ద మంత్రియై ప్రసిద్ధి గన్నట్లు స్పష్టము కాఁగలదు. ఇదిగాక 6 ప్రకరణమున నామిరెడ్డి ప్రథమప్రతాపరుద్రునిసన్నిధిని బ్రసిద్ధి గన్నట్లు వ్రాసినారు. నామిరెడ్డిశాసనమున « యః ప్రఖ్యాతః పృథుభుజబలో రుద్రదేవస్య సైన్యే" ఇత్యాది వచనములు గూడ నీయర్థమును జాటుచున్నవి. వీరిమతమున గణపతికన్న బ్రహ్మనాయఁడు పూర్వుఁడనుట తెల్లము. కాఁబట్టి బ్రహ్మనాయునికన్నఁ బూర్వుండగుదొడ్డనాయఁడు బ్రహ్మనాయునికి సమకాలికుఁ డగునామిరెడ్డి ప్రసిద్ధి గని యుండె ననుట స్పష్టము. ఇంతే కాదు 6 ప్రకరణము 179 పేజీలో

« శ్రీమత్పద్మజ పాదపద్మయుగళా ల్లోకత్రయాభ్యర్చితా
దుద్భ్యాతే విపులే కులే నరవరో భీమాభిధానోభవత్
యః కాంచీనగరీకవాటహరణం కృత్వా ప్రచండాహవ
క్రీడ శ్ఛేదనరాధిపస్య కృతవాన్ మానద్రుమోన్మూలనమ్ "

అనుశ్లోకము వ్రాసి క్రింద « ఈశ్లోకమును బట్టి యితని (నామిరెడ్డి) పూర్వులు రాజకీయాధికార పదవులయం దుండి యుద్ధములను జేసి ప్రసిద్ధి కెక్కినవా రనియే తలంపవలసి యున్నది" అని వ్రాసినారు. నామిరెడ్డితండ్రితాతముత్తాతలలో నీభీమరాజు లేఁడు. వీరివంశమున నేనాఁడో ప్రసిద్ధుఁడుగ నుండినవాఁడు.

ఇదిగాక రావువంశీయచరిత్రములో 77 గోత్రములవారి బిరుదములు వ్రాయుచు 0 వ గోత్రమువారి బిరుదములలో "కాకతీ ప్రోలరాజ రాజ్యధురంధరా" అను బిరుదము వ్రాయఁబడినది. 46 పేజీలో అప్పారావుగారి వంశజులలో, బూర్వుఁడు బసవన్న అను రాజు ప్రతాపరుద్రునకై దారుకంచలసంవత్సరములకుఁ బూర్వుఁడై నకరికాలచోడునివలన గౌరవింపఁబడినవాఁడని వ్రాయఁబడినది. రావుగారికీ రావువంశీయచరిత్రము కరబదరసదృశము. ఈవిషయములన్ని దెలిసియుండియు స్వపక్షనిర్వాహమునకై మఱుఁగుపఱచి బ్రహ్మనాయనికిఁ దరువాతనే పద్మనాయకులు ప్రసిద్ధికి వచ్చిరని వ్రాయుట వింతగా నున్నది. ఇందువలనఁ దరువాతిపేజీలో "పద్మనాయకులు బ్రహ్మనాయనికాలముననే ప్రఖ్యాతిగాంచియుండిరి" అనునదియుఁ దత్పూర్వంబు పద్మజు లంతకుమున్ను నామధేయులుగనుండిరని వీరియాశయము.

మూఁడవది.—"బిరుదునాయకురాలి రణరంగరాహుత్త్రాణ సహస్రబాహు" అనుబిరుదమును వహించినవారు బ్రహ్మనాయనికాలములో నాయకత్వమును బొందినవారనుటకు సందియము కలుగ రాదు" అని.

దీనియర్థ మేమో మొదలు రావుగా రాలోచింపవలసి యుండును. పద్మజులు బ్రహ్మనాయనినాడు నానాజాతులలోనుండి వచ్చినవారే యని వీరియుద్దేశ్యము. ఇయ్యది బ్రహ్మనాయఁడే పద్మనాయకసృష్టికర్తయైయుండి తత్పూర్వము పద్మనాయకులున్నట్లు బోధించెడు శాసనగ్రంథాదులు రద్దుపడినచో నిర్వహించును. అవి ఘటిల్లవు. కాన నంతకుఁ బూర్వము శాఖోపశాఖలుగా నున్న పద్మనాయకులు కొందఱు పల్నాటిలో నాయకురాలితో యుద్ధము చేసి యాబిరుదము నొందవచ్చును గదా! బ్రహ్మనాయనితాతయగు జేతినాయనికిఁ బల్నాటిజేతినాయఁడని రావుగారే నామకరణము చేసినారు. ఇదిగాక 285

పేజీలో "పద్మనాయకులు మొట్టమొదట రాష్ట్రకూటులకు రాజధానిగా నున్న మాన్యఖేటమున నుండుచు వచ్చి యారాజ్య మంతరించిన వెనుక ననేకులు పల్నాటికి వచ్చి చేరిరి" అని వ్రాసినారు. దీనిఁ బట్టి పల్నాటిసీమలో బ్రహ్మనాయునిచే సృజింపఁబడినాయకులకుఁ బూర్వ మనేకులు పద్మనాయకు లుండిరని తేటపడుచున్నది. అట్టి పద్మనాయకు లాయుద్ధమున నాయకురాలితోఁ బోరాడి యాబిరుదము నొందవచ్చును గదా! కాన నాబిరుదమును బట్టి వారు క్రొత్తనాయకు లనుటకు వీలు లేదు. వీరిపూర్వు లాయుద్ధమున నుండిరని మాత్రము దీనివలన నూహింపవచ్చును. ఇదిగాక బ్రహ్మనాయఁడు నాయకులను జేసి పద్మనాయకులలోఁ జేర్చెనని యెచ్చటను లేదు. కొండఱను వైష్ణవులను జేసి వారలతోఁ గలిసిభుజించె నన్నంతమాత్రమున వారెల్లరును 77 గోత్రముల పద్మనాయకులలోఁ జేరి రని చెప్పుటకుఁ గల యాధారం బెద్దియో యొక్కచోటనైనను రావుగారు వ్రాయక "బ్రహ్మనాయఁడే నానాజాతులలో నుండి" అని మొదలుగాఁ బలుమాఱు వ్రాయుట వింత యగుచున్నది. ఇందు "రెడ్లతోఁ బ్రతిఘటించి" అనునది దత్తోత్తరం బైనది.

నాలవది.—"పద్మనాయకులలోఁ గొందఱు..."రెడ్డినాయక చాఱూ" అని బిరుదము గలిగియుండుటచేత రెడ్లకుఁ బ్రబలవైరులుగా నుండి" రని.

అగుదురుగాక. అందువలనఁ బ్రకృతమున కుపయోగ మేమి? ఇదిగాక యీలేఖనము బ్రహ్మనాయఁడు రెడ్లతోఁ గలసి భుజించె నను దానికి 271 పేజీలో "చరిత్రమునందు రెడ్లకు కమ్మవారికి వెలమవారికి సంబంధములు గానంబడుచున్నవి" అనుదానికి విరుద్ధంబుగ నున్నది. బ్రహ్మనాయనికి రెడ్లతోఁ గొందఱితో మాత్రమే విరోధ ముండె నన్నచో నట్లుండినవిరోధము పద్మనాయకసామాన్యమునకుఁ

తెచ్చిపెట్టి రెడ్లకుఁ బ్రతిఘటించి కులముద్ధరించినా రని వ్రాయుట స్వోక్తివిరుద్ధము. దీని తరువాత "బ్రహ్మానాయునియన్న బాదన్న" అనునది మొదలుకొని "పల్నాటికి వచ్చిచేరిరి" అనువఱకు వ్రాయఁబడినది వెనుక సవిస్తరముగ నిరసింపఁ బడెను.

అయిదవది—"కొండఱు గిరిదుర్గముల కధిపతులై మన్నె లను పేరితో వ్యవహరింపఁబడుచు వచ్చిరి. వీరిలో ననేకులు మాతంగులు గోసంగులు నై యుండి రనియు వీరలకు నెఱమన్నెలు సురమన్నెలు అనునామములు గల వనియుఁ జెప్పుటకుఁగూడఁ గొన్నిదృష్టాంతముల వలన నవకాశము గలుగుచున్నది" అని.

ఇందుల కేమియు నాధారము నగపఱచినవారు కారు. ఆదృష్టాంతము లెవ్వియో బయలుపఱచినచో మహానిబంధములు శిలాశాసనములున్నగు ప్రమాణగణము పెనఁగులాడునప్పు డట్టిదృష్టాంతములు నిలుచునో నిలువవో చూడనగును. ఒక్కటియుఁ బ్రబలప్రమాణము లేక కేవలమ్ము పేసలేని చరిత్రములు పుక్కిటిపురాణములు కపోలకల్పితములు ప్రోవుచేసి యీచరిత్రము నల్లి చదువరులకు నిజ మని నమ్మకము గలుగునటులు చేసిన రావుగారి చాతుర్యమున కెంతయు సంతసింపఁదగి యున్నది. ఇట్లు స్వకపోలకల్పితములు ముగిసినవి.

ఇందువలన స్వసిద్ధాంతము స్థిరపడినట్లు తలంచి ముగింపు చెప్పుచున్నారు "పద్మనాయకుల జన్మకథన మెట్టిదైనను" అని.

"శబ్దవ్యుత్పత్తి యెటులుండినను, పది యెట్టులుండినను" అని మొదలుగా వ్రాయుటచేఁ దత్తత్కల్పనములందనాస్థసూచించిన ట్లౌటను సూచించిరేమో ?

ఇట్లు పద్మనాయక సామాన్యచరిత్రము ముగించి స్వోద్దిష్టమగు తద్విశేషచరిత్రమును 'దామానాయఁడు' అని యుపక్రమించి

వ్రాయుచున్నారు. చెవిరెడ్డికి ముగ్వురు పుత్రులున్నట్లు వ్రాసినతరువాత « పిల్లలమఱ్ఱి రేచర్ల బేతిరెడ్డియు పల్నాటివీరుఁడైన రేచర్ల బ్రహ్మనాయనితాత యగు బేతినాయుఁడును చెవిరెడ్డి యని నామాంతరము గలపిల్లలమఱ్ఱిబేతాళనాయుఁడే యని శ్రీవెలుగోటివారి వంశచరిత్రము నందు వక్కాణింపఁ బడిన హేతువులు పరస్పరవిరుద్ధములై పొందిక లేక యున్నవని యీఅవప్రకరణమున సవిస్తరముగఁ జర్చించి యున్నాను " అని వ్రాసినారు.

దీనిసమాధానము వెనుకప్రకరణమున వ్రాసియున్నాను. పై మూఁడునామములు లొక్కపురుషునినే బోధించు ననుటకు వెలుగోటి వారి వంశచరిత్రమున హేతువు లెవ్వియు వ్రాయలేదు. ఈవిషయములో వారికి సంశయములేదు కాఁబట్టి దీనిప్రస్తావమే వారెత్తలేదు. రావుగా రందు హేతువులు వ్రాయఁబడిన వనియు నవి పరస్పరవిరుద్ధములుగ నున్నవనియు నందువలన నాగ్రంథకారుల యభిమతము సిద్ధింప దనియు వ్రాయుట « ఏష వంధ్యాసుతో యాతి " అనున్యాయము ననుసరించి యున్న దని 82 వ పేజీలో వ్రాసి యున్నాను. అందువలన నీనామత్రయ మొకపురుషునినే బోధించు ననుట నిరవవాదము.

తరువాత « కాఁబట్టి యీబేతాళనాయుఁడు రేచర్లవారికుటుంబములోఁ జేరిన మఱియొకనాయకుఁడో లేక వెలుగోటివారిపూర్వులు భ్రమచేత రేచర్లబేతినాయనినే యీతఁ డని తమవంశమునకు మూలపురుషునిగాఁ జేసికొనిరో యేమో నిర్ధారించుటకును పాలుపోక యున్నది " అని వ్రాసినారు.

ఇది క్రొత్తమాటగా నున్నది. ఇదివఱకు నాఅవప్రకరణము 182 వ పేజీలో « పిల్లలమఱ్ఱిశాసనములో నుదాహరింపఁ బడిన బేతిరెడ్డియే పైసంస్థానాధిపతుల మూలపురుషుఁడైన బేతాళనాయుఁ

డని చూపించిన హేతువులు పరస్పరవిరుద్ధములై యుక్తికిని సత్యమునకును దూరములై యున్నవి " అనియు 183 వ పేజీలో «చేతిరెడ్డి వేంకటగిరి ... సంస్థానాధిపతులకు మూలపురుషుఁ డని చెప్పఁబడు బేతాళనాయఁడు కాఁ డని సహేతుకముగ నిరూపింపఁ బోవుచున్నాను " అనియు 191 పేజీలో « చేతిరెడ్డియే బేతాళనాయఁ డని హేత్వాభాసములతో సిద్ధాంతము చేసియున్నారు » అనియు వ్రాయుటచే చేతిరెడ్డియే బేతాళనాయఁడని చెప్పుట సరిగాదని వెల్లడి చేసినారు. దానినే యిచ్చట ఆఱవప్రకరణమునఁ జర్చించియున్నాను అనుటచే స్మరింపఁ జేసియున్నారు.

ఇట్లగునపుడు, కాఁబట్టియనుదానికిఁ బైగ్రంథములోని హేతువులు పరస్పరవిరుద్ధము లని చర్చించితిని గాఁబట్టియేయనియర్థము చెప్పవలసి యుండును. కావున చేతిరెడ్డియె బేతాళనాయఁ డని చెప్పుట సరిగాదనియే యుత్తరవాక్యము వ్రాయఁ దగియుండును. అటులు గాక « ఈ బేతాళనాయఁడు రేచర్లవారికుటుంబములోని మఱియొక నాయకుండో లేక వెలుగోటివారిపూర్వులు భ్రమచేత బేతినాయఁడే యితఁ డని తమవంశమునకు మూలపురుషునిగాఁ జేసికొనిరో " అని వ్రాయుచున్నారు. ఈవాక్యమువలన చెవిరెడ్డి యనినామాంతరము గల బేతాళనాయఁడు వెలుగోటివారివంశమునకు మూలపురుషుఁడుగాఁడని రావుగారియభిప్రాయము తేటపడుచున్నది. ఇది యొకవేళ నపూర్వకల్పన మనుకొన్నను పూర్వవాక్యార్థమునకు నుత్తరవాక్యార్థమునకును « కాఁబట్టి » యని కార్యకారణభావము చెప్పుట యసంబద్ధం బగుచున్నది. ఆఱవప్రకరణమునఁ గాని యిచ్చట « పిల్లలమఱ్ఱి రేచర్ల బేతిరెడ్డియు " అనువాక్యమునఁ గాని బేతాళనాయఁడు పైసంస్థానముల వారికి మూలపురుషుఁడు కాఁ డని వ్రాయలేదు కదా! అట్లిచ్చటను వ్రాయక పూర్వోత్తరవాక్యార్థములకు హేతుహేతుమద్భావమును

ప్రకాశింపఁజేయుచు "కాఁబట్టి" అని వ్రాయుట యసంబద్ధ మగును గదా!

ఇదిగాక యిచ్చట "బేతినాయనినే యీతఁ డని తమవంశము నకు మూలపురుషునిగాఁ జేసికొనిరో" అనువాక్యముచేత వీరిమూల పురుషుఁడు బేతినాయఁ డైనట్లును వెలుగోటివారిపూర్వు లాయననే బేతాళనాయనిఁగా భ్రమించినట్లును దాత్పర్య మగుచున్నది. ఇది యత్యంతవిరుద్ధముగా నున్నది. పైవాక్యమున "పల్నాటిబేతినాయఁడును బేతాళనాయఁడే యని" వ్రాయుటచే బేతినాయఁడు బ్రహ్మనాయనితాత యనియు నాతండు వీరిమూలపురుషుఁ డెప్పటికిని గాఁడనియు వ్రాసినారు. ఆఱవప్రకరణము 191 పేజీలోఁ గూడ నీయర్థమునే ప్రకటించినారు. ఇట్లగునపుడు "బేతినాయనినే యీతఁడని" అని వ్రాయుట చింత్యముగ నున్నది. ఈబేతినాయఁడు మఱియొకబేతినాయఁడో, లేక యేమియో వ్రాయఁ దలంచి భ్రమచేత నిటులు వ్రాసిరో యెన్నివిధముల నాలోచించినను బొలుపోకయున్నది.

తరువాత "బేతాళనాయని మూవురుపుత్త్రులయొక్క చరిత్రముగూడ సందర్భానుసారముగ రచియింపఁ బడి యుండలేదు. వీరిని గూర్చినశాసన మొక్కటియు నింతవఱకుఁగానిపింపలేదు. వీరిచరిత్రము నకాధార మంతయుఁ బైవారు ప్రకటించినగ్రంథములే యైయున్నవి." అని వ్రాసినారు.

ఆఱవప్రకరణము ముగించునపుడు వీరిచరిత్రము వ్రాయుట ప్రసంగసంగతిలబ్ధమై యుండఁగా వదలిపెట్టి యిటఁ బద్మనాయక సామాన్యచరిత్రము ముగించునపుడు సంగతి యెద్దియు లేక దామానాయకాదులచరిత్రముతాము వ్రాయుటయే సందర్భానుసారముగ రచియింపఁబడక యున్నదికాని వంశచరిత్రమున దామానాయకాదిచరి

త్రము సందర్భానుసారముగ రచియింపఁబడక యుండలేదు. మఱియుఁ బై వారల చరిత్రము సందర్భానుసారముగ రచియింపఁబడలేటకు శాసనములు లేకుండుటయుఁ బై వారిగ్రంథములే యాధారములగుటయు హేతువులుగా రావుగారు తలంచిన ట్లేర్పడినది. దీనిని విమర్శింతము. శాసనములు లేకపోవుట చరిత్ర మసందర్భమనుటకుఁ గారణముగాదు. అ ట్లెచ్చటను ప్రసిద్ధిలేదు. మహాకవిప్రణీతము లయి లోకప్రసిద్ధి గన్న చరిత్రములెన్నియో శాసనములు లేకున్నను సందర్భవంతములై యాదరింపఁ బడుచున్నవి. శాసనానుదాహృతము లసందర్భములన్నచోఁ బల్నాటివీరచరిత్రము మున్నగునవి యెన్నియో మూలఁబడవలసి వచ్చును.

ఇఁక సందర్భానుసారముగ ననుదానికిఁ బ్రమాణానుసారముగ అని యర్థము. అందువలనఁ బైవారిచరిత్రము ప్రమాణానుసారముగ రచియింపఁ బడలే దని తాత్పర్య మన్నచో నాశబ్ద మాయర్థమును బోధించు ననుటకుఁ గోశాది ప్రమాణము లేదు.

ఇఁక వీరిచరిత్రమున కాధార మంతయుఁ బై వారు ప్రకటించిన గ్రంథములే యనునదియు వీరిచరిత్రము సందర్భానుసారముగ రచియింపఁ బడలే దనుటకుఁ గారణము కాదు. ఇదిగాక పై వారు ప్రకటించినగ్రంథములే యనునది స్వోక్తివిరుద్ధము. వీరు ప్రకటించినగ్రంథములే యనుటవలనఁ దదితరగ్రంథములు లేవని యర్థము కాఁగలదు. ఈ రావుగారు పంద్రెండవప్రకరణమునఁ బ్రసాదాదిత్యనాయునియు రుద్రనాయునియుఁ జరిత్రమును వ్రాసియున్నారు. పై వారిగ్రంథములలో నయ్యది వ్రాయఁ బడలేదు. అందువలన వీరలచరిత్రమును దెలిపెడు చరిత్రము లింకఁ గొన్ని యున్నట్లు తేటపడుచున్నది. అట్లగుచో «వీరిచరిత్రమున కాధార మంతయు పై వారు ప్రకటించినగ్రంథములేనై యున్నవి» అని వ్రాయుట తద్విరుద్ధం బగు

చున్నది. మఱియు "పైవారు ప్రకటించినగ్రంథములే" అను లేఖనమువలన నందవిశ్వాసము సూచింపఁ బడుచున్నది. పరులు ప్రకటించినగ్రంథములే ప్రమాణము లని నియమ మున్నచోఁ గృష్ణదేవరాయఁడు దాసీపుత్త్రుఁడు కాఁ డని సాధించునపుడు వారు ప్రకటించిన గ్రంథములనే ప్రమాణములనుగా నెత్తికొని రావుగారు చేసిన సిద్ధాంత మడుగు వట్టును. కానఁ బైవారు ప్రకటించినా రని యవిశ్వాసము సూచింపఁ దగదు.

దామానాయఁడు ఖడ్గనారాయణాది బిరుదములు వహించి యుండె ననుటకు "చటులఖడ్గాఖడ్గి సమరప్రవీణుఁడై" అను ప్రమాణమును వ్రాసి "ఇట్టిబిరుదముల నాకాలమున ననేకులు వహించుట యాచార మై యుండెను" అనివ్రాసినారు. ఇది దామానాయనిచరిత్రము సందర్భానుసారముగఁ గూర్పఁ బడలే దనుటకు హేతువు గాదు. ఇట్టిబిరుదములు ననేకులు వహించుటవలన దామానాయనిబిరుదవహన మయథార్థ మని యేర్పడదు. వారు వహించుటవలన వీరికి గౌరవక్షతియు లేదు. అక్కాలమున నీ బిరుదములను దామానాయఁ డొక్కఁడే వహించుచుండె నని పైగ్రంథములలో వ్రాయఁబడ లేదు.

"ఇంతకన్న వీరిచరిత్రము వ్రాయఁ బడలేదు" అని వ్రాసినారు. ఇది దామానాయనిచరిత్ర మసందర్భ మనుటకు హేతువు కాదు. వారిచరిత్రము కవులకుఁ బూర్తిగఁ దెలియకయుండి యిటులు వ్రాసియున్నారు. ఈవిషయము స్థలాంతరమున వివరించి యున్నాను.

ఇఁకఁ బ్రసాదాదిత్యనాయని గూర్చి వ్రాయుచున్నారు.—
"జేతినాయని పుత్రులలో నీతఁడు ప్రసిద్ధుఁడుగాఁ జెప్పఁ బడియెను... గణపతివలనఁ బ్రత్యుత్థానార్ధాసనాదులను ఇతరు లగు 76 గోత్రము

లవాయకులచేఁ బ్రణామము వెట్టించుకొనునట్టి మర్యాదను గాలిపెండేర మనుబిరుదాభరణమును కాకతిరాజప్రూజిత అనుబిరుదమును శ్వేతచ్ఛత్రధ్వజములను బొందెను అని వ్రాయఁబడియున్నది గాని శత్రులెవ్వరో యెవ్వరితో వీరు పోరాడిరో తెలిపి యుండలేదు ... ఇంతటిమహాశూరు లనేకు లాతనికొలువుకూటములో నుండఁగా నెల్లరకు నవమానకరముగా నర్ధాసన మిచ్చి వారలచే మ్రొక్కించఁ జేసె ననుట నిరాధారమై పరిహాసాస్పదముగ నున్నది." అని.

శత్రు లెవ్వరో వీ రెవ్వరితోఁ బోరాడిరో తెలిపి యుండక పోయినంతమాత్రమునఁ జరిత్ర మసందర్భముగఁ గూర్పఁ బడిన దని వ్రాయ వలను లేదు. పూర్వపూర్వచరిత్రములనుబట్టి సామాన్యాకారముగ నట్లువ్రాయుట సంప్రదాయాగతము. 308 పేజీలోఁ దాము "ఇట్లు మాండలికరాజులు గొందఱు చక్రవర్తియెడఁ గల భయముచే మిన్నకుండినను రాజద్రోహులై దేవగిరి ప్రభువులైన యాదవులతోడఁ గుట్రలు చేసి తుదకు యాదవులు దండెత్తి వచ్చునటులు చేసిరి" అని రావుగారు వ్రాసినారు. అదిగూడ నసందర్భమే కావలసి వచ్చును. అందును మాండలికరాజు లెవరో రాజద్రోహు లెవరోవ్రాయలేదుకదా! కాన నిదిచరిత్ర మసందర్భ మనుటకుఁ గారణము కాదు.

"ఇతనిపరాక్రమమునుమెచ్చి యాగణపతి గౌరవించి యుండునుగాని యితనివంటిమహాశూరు లనేకు లాతనికొలువులో...పరిహాసాస్పదముగ నున్నది" అని వ్రాసినారు. అసందర్భమనుట కిదియే ముఖ్య నిదర్శనము.

కావున నిది విమర్శింపఁదగియున్నది. రావుగారి కిచ్చుట గౌరవపదార్థమే తెలియలేదు. ప్రత్యుత్థానార్ధాసనాదికమే కదా యిచ్చుట

గౌరవపదార్థము. తొలుత యుద్ధప్రోత్సాహకాలమున గణపతిదేవుఁడు గెలిచివచ్చినవారిని ప్రత్యుత్థానార్ధాసనాదులచే గౌరవింతు ననియే కదా చెప్పినవాఁడు. ఉపక్రమమున నట్లు చెప్పి గెల్చివచ్చినతరువాత మఱియొకవిధ మయినగౌరవ మొనరించినచో నదిగౌరవమని యెవ్వరు నెంచరు. ఇంకను చక్రవర్తి తొలుతఁ దాను సెలవిచ్చిన గౌరవమున కర్హత లేదనియో మఱియేమనియో యెంచి ప్రతిజ్ఞాతగౌరవమును జేయక సామాన్యగౌరవము నొనరించె నని యనుకొందురు. అది ప్రసాదాదిత్యనాయుని కవమానకరముగఁ గూడ నుండును. చక్రవర్తి సత్యసంధతయు లోపించును. దీనంజేసి యితరు లిట్టిఘోరరణప్రసక్తి యందుఁ జక్రవర్తిప్రోత్సాహ వాక్యములందు సంపూర్ణవిశ్వాసము లేక వెనుదీయుదురు. అందువలన వారిసామ్రాజ్యమునకుఁ గీడు మూఁడును. ఇట్లు బహూపప్లవములు సంఘటిల్లును. తొలుత గణపతిదేవుఁడు చికీర్షితగౌరవస్వరూపమును బ్రకటింపక యుండినచో వీరియూహ కొంతవఱకు నిగ్గును. ప్రకటించియుండుటచే నది కొనసాగక పోవుటయే కాక « గౌరవించి యుండును గాని యందఱకు నవమానకరముగ నర్ధాసనాదు లిచ్చునా ?" అని వ్రాయుట యవిచారసిద్ధ మగుచున్నది. కాఁబట్టి యర్ధాసనాదిసత్కారము చేసెననుట పరిహాసాస్పద మన్నమాటయే పరిహాసాస్పదంబు. రాజసభలలోఁ బండితులప్రసంగములందును మల్లులయుద్ధములందును శత్రురాజుల పోరాటములందును బ్రోత్సాహమునకై పణముల నుంచుటయు గౌరవవిశేషప్రదాన ప్రతిజ్ఞలు సేయుటయు మున్నగునవి యిప్పటికిని బ్రసిద్ధము లైయున్నవి. అందువలన నితరుల కవమాన మనియెంచరాదు. ఇంగ్లాండులో లార్డులాబర్ట్సు బోయరుయుద్ధమున జయించి వచ్చినపుడు చక్రవర్తి జరపినగౌరవము లోకవిదితము. అయ్యది యచ్చటివారి కెల్ల నవమానకర మని యిదివఱకు నెవ్వరు నెంచినవారు కారు.

ఇఁక «నిరాధారమై పరిహాసాస్పదముగ నున్నది» అనునది విమర్శింపఁ బడును. ఆధారములన నెవ్వి? గ్రంథములా? శాసనములా? గ్రంథము లన్నచోఁ బద్మనాయకచరిత్రాదులు పుష్కలముగఁ గలవు. శాసనము లన్నచో నవిలేకయున్న వెన్నియో ప్రసిద్ధకవినిబంధములు నమ్మఁబడును. ఎవ్వియైనను శాసనములే కావలయుననియున్నచో యత్నింతము. అనపోతానాయనియొక్క అయ్యనవ్రోలిశాసనమున

« తస్య గోత్రాణ్యనేకాని ప్రసిద్ధాన్యాంధ్రమండలే
రేచర్లగోత్రం తే ష్వేకం కాకతీయనృపార్చితమ్ ''

అని వ్రాయఁబడిన కాకతీయనృపార్చిత మ్మనునది కాకతిరాజపూజిత అనుబిరుదమునకు మాఱుగా శ్లోకమునఁ జేర్పఁబడినది. ఇందు 77 గోత్రముల వెలమలలో రేచర్లగోత్రము పూజింపఁబడిన దనఁగాఁ బ్రసాదాదిత్యునిచరిత్రమే కదా విషయ మగుచున్నది. కాన నీశాసనము పైచరిత్రమున కాధార మని యెంచఁదగి యున్నది. ప్రసాదాదిత్యనాయఁడే యీబిరుదము నార్జించినాఁడా? యని యొకవేళ నందురేమో. ఎల్లక్కశాసనమున చేతిరెడ్డి బిరుదములలో నిది లేక పోవుటయు ననపోతానాయని యయ్యనవ్రోలుశాసనములో సోమకులపరశురామాదిస్వకీయబిరుదములనడుమ వ్రాయక వంశబిరుదముగా వ్రాయుటయు వంశచరిత్రములలోఁ బ్రసాదాదిత్యనాయఁ డార్జించినట్లు వ్రాయుటయు మున్నగువానిచే నాతండే యీబిరుదము నార్జించినవాఁడని యొప్పవలసి యున్నది. కాన నీయాక్షేపము రాదు.

ఇదియే ప్రత్యుత్థానాది సకలగౌరవమునకు బోధకము. గణపతి వలన శ్వేతచ్ఛత్రధ్వజముల నీతఁ డార్జించినాఁడు కావుననే యీకుటుంబమువారు వెలిగొడుగురాయవిభుఁ డను బిరుదమును వహించుచున్నారు.

ఇదియే మాచెర్లలో వెలుగోటితిమ్మానాయనిభార్య లింగాంబిక దాన శాసనమున "శ్వేతచ్ఛత్రాధీశ్వర రేచర్లగోత్ర పవిత్రులైన" అని వ్రాయఁబడినది. ఇట్లు కాకతి రాజపూజిత శ్వేతచ్ఛత్రాధీశ్వర అను బిరుదములకు శాసనప్రమాణములు చూపఁబడెను. ఈ శ్వేతచ్ఛత్రబిరుదవిషయము వెలుగోటివారివంశచరిత్రమున 23—24 తరములవారిచరిత్రములలోఁ జూడఁదగి యున్నది. 76 గోత్రములవారు వీరికి మ్రొక్కులిడుట ప్రసాదాదిత్యుఁ డార్జించినది మొదలిప్పటివఱకు వీరి కుటుంబమర్యాదగా నుండిన దను విషయము 24 తరమువారి చరిత్రమునఁ దెలియనగు. అందు బంగారుయాచమనాయనిగారి పట్టాభిషేక కాలమునఁ గాళహస్తి ప్రభు వైన బహాదర్ వేంకటప్పనాయఁడుగారు మొదలగు 76 గోత్రములవారు గణపతి యొసంగినకులమర్యాదప్రకారము బంగారుయాచమనాయనిగారికి మ్రొక్కులిడి నిలిచి యుండి రనియు నప్పుడు బహాదరు వేంకటప్పనాయఁడుగారికి మాత్రము పట్టాభిషేకమండపమున నాగ్నేయభాగమునఁ గూర్చుండుమర్యాద నిచ్చి రనియుఁ బరంపరగా వంశచరిత్రములందు వ్రాయఁబడుచున్నది. ఇట్లు వంశావళులయందును జరిత్రగ్రంథములందును శిలాశాసనములందును గానవచ్చుచున్న ప్రసాదాదిత్యనాయని గౌరవవృత్తాంతము నిరాధారమై పరిహాసాస్పద మని రావుగారు వ్రాయుటయే నిరాధారమై పరిహాసాస్పద మగుచున్నది.

"సీ. ఏపున నోరుగల్లు నేలురుద్రుని చేత
నందెయుఁ బెండెంబు నందినాఁడు.

అనుపద్యము నెత్తి "అందెయుఁ బెండెంబు గణపతిదేవునివలనఁ బొందె నని పైని చెప్పినదానికి విరుద్ధముగ రుద్రదేవివలనఁ బొందెనని చెప్పఁబడినది" అని వ్రాసినారు.

పైని గణపతి యందెయుఁ బెండెంబు నొసంగె నని వ్రాయఁ బడలేదు. "కాలిపెండేర మనుబిరుదాభరణమును" అనుదానికే యాయర్థ మన్నచో దాని కాయర్థము కాదు. అగు నని యను కొన్నను రుద్రదేవివలన బిరుదముల నొందుట పై బిరుదముల కెట్లు విరుద్ధము. ఒకతూరి బహుమతిగా నొకరిచే నొసంగఁబడినయది మఱి యొకరిచేతఁగాని వారిచేతనేగాని మరల నొసంగఁబడుట విరుద్ధం బెటులగునో తోఁపదు. రుద్రదేవి గణపతిదేవుఁ డిచ్చినదానికన్న వేఱు విధమై యతిశయమైన యందె నిచ్చి యుండిన నుండవచ్చును గదా !

ఒకవేళ నీప్రసాదాదిత్యుఁడు గణపతికాలముననే యున్నవాఁ డైనచో నపు డిది విరుద్ధం బగును. అట్లు కాక యీతండు రుద్రదేవి కాలమునఁ గూడ నున్నవాఁడు. ఈవిషయము రావుగారు గూడ వ్రాసియున్నారు. కావున వారియాక్షేపమున కవకాశము లేదు.

"వెలుగోటివారివంశచరిత్రమునందు గణపతిచక్రవర్తిచేతనర్ధాసనమును బొంది 76 పద్మనాయకులచేతఁ బ్రణామంబులు పొందె నని చెప్పియుండఁగా రావువంశీయులచరిత్రములో

"సీ. భూరిజయుం డయి యోరుగంటికి రాఁగ
రుద్రమూర్తి ప్రతాపరుద్రవిభుఁడు
ఎదురుగా వచ్చియు హితుఁడవు నీ వంచు
ఘనతఁ బ్రసాదిత్యుఁ గౌఁగిలించి

అని చెప్పఁబడి యుండుటచేత రుద్రవిభుఁ డనఁగా రుద్రదేవి యని యర్థము చేసికొనవలసినపక్షమున రుద్రదేవి యంతటిచక్రవర్తిని యెదురుగా వచ్చి ప్రసాదాదిత్యుని గౌఁగిలించుకొన్న దని చెప్పవలసి వచ్చును గదా! అది యెంతయసహ్యాకరముగ నుండఁగలదో వేఱుగఁ జెప్ప నక్కఱ లేదు" అని వ్రాసినారు.

ఈపద్యములో రుద్రదేవినిబోధించుపద మున్నచో ననహ్యార్థ మగు ననుట తగును. అది లేదు. "ప్రతాపరుద్రవిభుఁడు" అనునది రుద్రదేవిని బోధింపదు. వెనుకటిపద్యమున "ఏపున నోర్గల్లు నేలు రుద్రునిచేత" అని రుద్రపదము మాత్రమే యుండుటను బట్టియుఁ బ్రసాదాదిత్యుండు ప్రతాపరుద్రద్వయకాలమున లేక రుద్రదేవికాలమున నుండుటను బట్టియు రుద్రదేవియందు రుద్రుఁ డనుప్రయోగము ప్రసిద్ధ మగుటనుబట్టియు నారుద్రపదము రుద్రదేవీబోధకమని వ్రాయఁబడి యుండెను. అందువలన నిట వారు చూపినయసహ్యార్థప్రసక్తిలేదు. ప్రాచీనులు కాలవిచారము చేయక యిట్లు వ్రాసియుందురని యెంచి వెలుగోటివారి వంశచరిత్ర కారు లాసీసము నెత్తికొన్నవారు కారు. వారు పిల్లలమఱ్ఱి బేతిరెడ్డి 1208 సంవత్సరమున గణపతిరాజ్య ప్రారంభ కాలమునను దత్పుత్రు లగుప్రసాదాదిత్యాదులు తద్రాజ్య మధ్యకాలమునను రుద్రాంబికారాజ్యకాలములోఁ గొంతవఱకును నుండినవా రని సిద్ధాంతముఁ జేసియున్నారు. తద్గ్రంథోపోద్ఘాతము 43 వ పేజీలో నీవిషయము తెలియ నగు. ఇట్లు వారు సిద్ధాయించి యుండఁగా "వెలుగోటివారి వంశచరిత్ర కారు లాప్రతాపరుద్రునికి బదులు గణపతిదేవుఁడని మార్చిరి. అట్టిమార్పు చేయుటకుఁ బ్రమాణ మేమియుఁ జూపినవారు కారు. కనుకఁ బ్రసాదాదిత్యనాయఁడు మొదటిప్రతాపరుద్రునికాలమున నుండెనో రుద్రదేవికాలమున నుండెనో యెవ్వరికిని దెలియదు." అని రావుగారు వ్రాయుట యవిచారమూలమని యేర్పడుచున్నది. వారు పైయుపోద్ఘాతమునఁ బ్రసాదాదిత్యుఁడు గణపతిరుద్రాంబికలకాలములలో నుండెననియు నందుకుఁ బేతినాయనికాలమును బోధించు నెల్లూరుశాసనము చరిత్రములు ప్రమాణము లనియు స్పష్టముగ వ్రాసియుండఁగాఁ బ్రమాణ మేమియుఁ జూపినవారు కా రనియు నెవ్వరికిని దెలియ దనియు వ్రాయుట యంతగాక యిఁక నేమి యగును?

ఇదిగాక "అది కాలనిర్ణయమున కడ్డము వచ్చునని వెలుగోటివారి వంశచరిత్రకారులు" అని వ్రాయుటచే వారికిఁ గాలనిర్ణయ ప్రబలప్రమాణ మెద్దియో దొరకియుండి యది యడ్డము వచ్చునని ప్రతాపరుద్రపదము ప్రథమప్రతాపరుద్రపరము కాదని వారు తలంచి యుండినట్లు రావుగారే వివరించియు "నెవ్వరికిని దెలియ" దని వ్రాయుట వింతగా నున్నది. తెలియకుండినచోఁ బ్రతాపరుద్రునకు బదులుగా గణపతిదేవు నేలమార్తురు ?

ఇదిగాక తర్వాతి గ్రంథములో "గణపతిదేవుఁడు పాండ్యులతోఁ జేసినయుద్ధములో పితఁడు నీతనితమ్ముఁడు రుద్రనాయఁడు" అని మొదలుగా వ్రాయుటచేతను రుద్రాంబకాకాలములో నీతఁ డుండినట్లు వ్రాయుట చేతను ప్రసాదాదిత్యుఁడు గణపతిరుద్రాంబికలకాలములలో నుండె నని రావుగారికిఁ దెలిసి యున్నట్లే కదా! వెలుగోటివారి వంశచరిత్రకారులకుఁ దెలిసియున్నట్లిదివఱకే స్పష్టము. ఇట్లుండ నెవరికిఁ దెలియ దనువ్రాఁత మిక్కిలి యవిచారమూలమని తేటపడక పోదు. ఇంతకుఁ బై చరిత్రకారు లీపద్యమునెత్తికొనకయేయుండ నిదంతయు నకాండతాండవముతక్క వేఱు కాదు.

ఇఁక రుద్రనాయునిఁ గూర్చి వ్రాయుచున్నారు. "రుద్రనాయఁడు ప్రసిద్ధుఁ డైనవీరశిఖామణియై యుండవలయును. ఇతనికి రాయపితామహాంక మనుబిరుదము ... పాండ్యగజకేసరి కాకతిరాజ్యప్రతిష్ఠాపనాచార్య బిరుదములు కలవని యీక్రిందిపద్యములోఁ జెప్పఁబడినది. "వాలనివిక్రమస్ఫురణ...మెచ్చగ౯." కాకతిరాజ్యప్రతిష్ఠాపనాచార్యులైనవా రొకరుద్రనాయఁడు మాత్రమే కాక యనేకులు గలరు" అని.

ఇట రాయపితామహాంక మనుబిరుదము అని వ్రాసినరావుగారి కంకపదము గూడ బిరుదఘటక మని బోధపడినయట్లున్నది.

ఈబిరుదము గలవా రనేకు లున్నా రనుదానికి వెనుక దామా నాయని ప్రస్తావమున సరియైన సమాధానము వ్రాయఁబడియెను. మఱియు « పద్మనాయకవీరు లనేకులు గణపతిచక్రవర్తికి విశ్వాసపాత్రులై భృత్యులుగనుండి యుద్ధములం దాఱితేఱి రణశూరులై కాకతిరాజ్య ప్రతిష్ఠాపకు లన్నఖ్యాతిని సంపాదించి రనుటకు సందియము లేదుగాని తక్కిన శాఖలలోనిమహావీరులైన సైన్యాధిపతులకంటె వీరే యగ్రగణ్యు లని కాకతీయచక్రవర్తు లందఱను విడిచి పెట్టి వీరలకే యర్ధాసనములిచ్చి సన్మానించి రనుట యెంతమాత్రము విశ్వసింపఁ దగినదిగాదు" అని వ్రాసినదియు దీనిచేతనే దత్తోత్తరంబు గాకపోదు.

ఇదిగాక ప్రసాదాదిత్యనాయని చరితము సీమూపురియం దన్వయించి వ్రాయుట కొంత చూచినను గారణము గానరాదు. గణపతి యర్ధాసనమిచ్చి సన్మానించుట యాతనినే కదా! తక్కినయుద్ధుల నట్లు గణపతి గౌరవించె నని యిదివఱకుఁ జరిత్రకారు లెవ్వరును వ్రాయ లేదు. పై పద్యములలో వీరలను గణపతి గౌరవించినట్లు లేదు. చర్వితచర్వణప్రాయంబై నిస్సారమగు తక్కిన కోలాహలం బంతయు వెనుక వ్రాయఁబడిన గ్రంథముచేతనే నిరస్తంబగుటచే నింతట విరమించుచున్నాఁడను.

శ్లో. « ప్రసభం పరకల్పితాసదర్థ
ప్రకటాహంకృతిమార్జనైకదీక్షః
అయ మస్తు ముదే సదా బుధానాం
కలితః కేవలమేవ కౌతుకేన »

ఇది పదియవప్రకరణముయొక్క విమర్శము.

# ఆక్షేపసమాధాన సంగ్రహము.

(1) ఆక్షేపము. వెలమశబ్దము వెల్లాళ్ళశబ్దము మొదలగువానినుండి పుట్టెను, నీరుగట్టెడువారు మున్నగు నీచులను బోధించును.

సమాధానము. ఆ శబ్ద మెన్నింటివలనఁ బుట్టినను నెన్నియర్థములను బోధించినను వర్మశబ్దభవమై పద్మనాయకబోధక మగుటకు బాధకము లేదు. 161—163

(2) ఆ. కమ్మవారివలె వెలమవారును మిశ్రజాతివారు. గొల్లజాతివారియుఁ బల్లెజాతివారియు సమ్మేళనమున వీరు పుట్టినారు.

స. దీనికిఁ బ్రమాణములు చూపినవారు కారు. పేరులేనిచరిత్రములు మహాకవి గ్రంథశాసనములకు నుద్ధరమై నిలువఁజాలవు. 163—173

(3) ఆ. పల్లవులు రెడ్లను విరోధులై వర్మాంతనామము గలవా రని చెప్పఁబడి యుండుటచేత వారే యీపద్మనాయకులు. వీరును రెడ్లను విరోధు లయి వర్మశబ్దభవ మగువెలమశబ్దము వహించుచున్నారు.

స. ఈప్రత్యభిజ్ఞ నిరాధారంబై నిలువంజాలదు. 173—176

(4) ఆ. ఓకశాసనములో వెలమనూళ్లు అని తెలికతెగలో నొక తెగవారుండి రని చెప్పుటచే వెలమలు వారిలోను జేరియున్నారు.

స. వెలమనూళ్లు అనుశబ్దములో నున్నవెలమ అనునక్షర సామ్యమునుబట్టి యందుఁ గూడ వెలమ లున్నారని యెంచుట సరిగాదు. వెనుక వెలమపదము వర్మశబ్దమునుండియు వెల్లాళ్ళశబ్దమునుండియు నిష్పన్న మైన దని వ్రాసిన దసంగతం బగును. 176—178

(5) ఆ. పద్మనాయకులు కేవలము వెలమలలోనుండి పుట్టినవారుగాఁ గనుపట్టరు. వెలుగోటివారి రావువారి వంశచరిత్రములలో నేవులమువా రనియుఁ జెప్పుటకు వీలులేక అని వ్రాయఁబడినది.

స. దీనియర్థము రావుగారికి బోధపడ లేదు. దీనిపూర్వోత్తర సందర్భములు చూడక యిట్లు వ్రాసినారు. 178—181

(6) ఆ. రావువంశీయచరిత్రకారునకుఁ గూడ సంశయముతోఁచి స్పష్టముగఁ జెప్పఁ జాలక అనుమానింపఁ బడుదురు అని వ్రాసి యున్నాఁడు.

స. దీనియర్థము రావుగారికి బొత్తిగఁ దెలియలేదు. తెలిసియున్న నిట ననుమానపదము సంశయార్థకమని యెంచరు. 181—198

(7) ఆ. పద్మనాయకచరిత్రములోనిపద్యములవలన నీపద్మనాయకులు పలుతెగలలో నుండి యేర్పడినవా రని స్పష్టపడఁ గలదు.

స. ఆపద్యములు పద్మనాయకులనిందకై ప్రవర్తించినవి కావు. కొండవీటిదండకవిలెలో వెలమలు నీచకులమువా రని యారెడ్లు వ్రాయించినందునకు వారే నీచకులమువారని చెప్పుటకై ప్రవర్తించినవి. 198—205

(8) ఆ. పద్మనాయకచరిత్రకారుఁడు వీరికులము పవిత్ర మని తరువాతిగ్రంథమున వ్రాయుట స్వవచో వ్యాహతము.

స. వాస్తవమగు పైసమన్వయమును బట్టి వ్యాహతిదోషము కాదు. ప్రబలప్రమాణసంవాదముచే నిదియే గ్రాహ్యము. 205—208

(9) ఆ. విష్ణుపాదమునందు జనించుటచేత వీరికిఁ బద్మజులనియుఁ బద్మనాయకులనియు పేరువచ్చిన దనుటతగదు. తక్కినశూద్రులయం దాపదములేదు.

స పద్మజశబ్దము యోగరూఢము. పద్మనాయకశబ్దార్థ మిటఁ జెప్పలేదు. పద్ముఁడు నాయకుఁడుగలవా రని తదర్థము. 208—2.2

(10) ఆ. ఎంతమందబుద్ధికైనను పద్మనాయకుల మన్నతోడనే పద్ముఁడు నాయకుఁడుగాఁ గలనానాజాతిసమూహ మని యర్థము కొట్టపోదు.

స. కులపదమునకర్థము వీరు పరిశీలించినవారుకారు. 212—214

(11) ఆ. పద్మనాయకులలో సుప్రసిద్ధులైనరేచర్లవారు చతుర్థకులజుల మని చెప్పుకొని యుండఁగా వెలుగోటివారు రావువారు క్షత్రియులమని చెప్పుకొన్నారు.

స. పైవారు శూద్రులలో సత్యుత్తముల మనియే వ్రాయించినారు. తమపూర్వులేనాఁడో క్షత్రియులుగా నుండి రని యూహించుట దీనికి విరుద్ధము కాదు. 214—216

(12) ఆ. కాకతివారితో సపంక్తిభోజనమువలనఁ దమకు గౌరవము గలిగిన దని పద్మనాయకులు చెప్పుకొనుటతగదు. వారు క్షత్రియులు కారు. చతుర్థులు.

స. రాజాధిరాజు లేకులమువారలైనను వారితోసపంక్తిభోజన మొక గౌరవము. కాకతివారు క్షత్రియులేకాని చతుర్థకుల సంభవులు కారు. 216—227

(13) ఆ. పద్మనాయకచరిత్రమున రెడ్డిసంతతికి మాతొడ్డి అనుపద్యమునుబట్టి వీరురెడ్లతోఁ గలహించివలమును సంపాదించుకొన్నవారని తేటపడఁగలదు. బ్రహ్మనాయఁడు నిమ్నజాతివారితోఁగలసి భుజించినాఁడు.

స. కొందఱురెడ్లు మేము పద్మమవెలమల మని చెప్పుకొనుచుండఁగాకతీశ్వరునొద్దఁ బద్మనాయకులు తామే పద్మవెలమలని తీర్మానము నొందినవిషయము గ్రంథకారుఁ డట్లు వర్ణించినాఁడు. బ్రహ్మనాయఁడు మతవ్యాప్తికై వారితోఁగలిసి భుజించినాఁడు. 228—233

(18) ఆ. క్షత్రియులమని చెప్పుకొనెడిరాచవారును గొల్లసవతితల్లులబిడ్డలని చెప్పఁబడి యుండఁగా బద్మనాయకు లధికులమని చెప్పుకొనుట సరిగాదు.

స. వా రట్లుచెప్పుకొన్నారని యితరు లెవ్వరు నధికులమని చెప్పుకొనఁగూడదా? పద్మనాయకులు శూద్రులలో నధికులమని చెప్పుకొన్నారు. సైంహాయులకన్న నధికుల మనిచెప్పుకొనలేదు. 233—235

(14) ఆ. పద్మనాయకులలో వల్లవాదిత్యా, వల్లవత్రినేత్రా అనుబిరుదములు కలవారు వల్లవులు. గోసంగివైరితలగుండుగండా అనుబిరుదము గలవారు గోసంగులు. రెడ్డినాయకచ్ఛాళ్ళా అనుబిరుదము గలవారు రెడ్లకుఁ బ్రబలవైరులు. వీరిలో ననేకులు మాతంగులు గోసంగులు సెఱమన్నెలు సుఱమన్నెలు గలరు.

స. ఇది స్వకపోలకల్పితమే కాని వేఱుగాదు. 235—240

(15) ఆ. దామానాయక ప్రభృతులచరిత్రములు సందర్భానుసారముగ రచియింపఁ బడలేదు. వీరలనుగూర్చి శాసనాదిప్రమాణములులేవు. పైవారు ప్రకటించిన గ్రంథములే యాధారములుగా నున్నవి.

స. వీరివిషయ మాఱవప్రకరణమున వ్రాయఁదగి యుండఁగా తావుగా రిటఁ దెచ్చి వ్రాయుటయే యసందర్భము గాని పై వారిచరిత్రము లసందర్భములు గావు. శాసనములు లేనిచరిత్రము లప్రమాణము లన్నచోఁ బల్నాటివీరచరిత్రాదు లడుగుఁ బట్టును. వారు ప్రకటించినశాసనగ్రంథాదు లవిశ్వసనీయము లన్నచోఁ గృష్ణరాయఁడు క్షత్రియుఁ డని తాము చేసినసిద్ధాంతము మూలఁబడును. 240—253

ఇది యాక్షేపసమాధానసంగ్రహము.

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
T HYDERABAD (A. P.)

Cl. No. 954.84 Acc. No. 29292
Sa15A DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |